


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 161

సోమవారం 1-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




## 'సులువుగా పాయింట్లు ఇచ్చాం'

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. 'సెమీఫైనల్లో ఆద్యంతం ఒకే రకమైన దూకుడును కనబర్చలేకపోయాం. నిర్ణాయక మూడో గేమ్‌లో ప్రత్యర్థి జోడీకి సులువుగా పాయింట్లు ఇచ్చాం' అని సాత్విక్–చిరాగ్ ద్వయం వ్యాఖ్యానించింది.

-12లో



మంచిమాట

# పరోపకారం.. మానవత్వపు మధుర గీతం

**నిజమైన ఆనందం ఎక్కడ లభిస్తుంది? తరచుగా అది మన కోసం కాకుండా, ఇతరుల కోసం మనం చేసిన చిన్న ప్రయత్నాల్లోనే దాగి ఉంటుంది. పరోపకారం అనేది కేవలం ఒక సహాయం కాదు, అది మన ఆత్మను ఉద్దీపన చేసే, సంతోషాన్ని అనంతంగా విస్తరించే ఒక అద్భుతమైన మార్గం. ఇతరుల ముఖాలపై చిరునవ్వులు చూడటం ద్వారా లభించే తృప్తికి ఏదీ సాటి రాదు.**

పరోపకారాయ ఫలంతి వృక్షాః పరోపకారాయ దుహంతి గావః
పరోపకారాయ వహంతి నద్యః పరోపకారార్థమిదం శరీరమ్

వృక్షాలు పరోపకారం కోసమే ఫలాలనిస్తాయి. ఆవులు పరోపకారం కోసమే పాలిస్తాయి. నదులు పరోపకారం కోసమే ప్రవహిస్తాయి. ఈ శరీరం కూడా పరోపకారం కోసమే ఉద్దేశించబడింది. ఈ శ్లోకం పరోపకార సార్వత్రిక స్వభావాన్ని, మానవ జీవితపు అంతిమ లక్ష్యాన్ని స్పష్టం చేస్తుంది.

పరోపకారం అంటే నిస్వార్థంగా ఇతరులకు సాయం చేయడం, వారి శ్రేయస్సును కోరడం. సనాతన ధర్మంలో దీనికి అత్యంత ఉన్నత స్థానం ఉంది. 'పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనమ్' అంటే పరోపకారమే పుణ్యం, ఇతరులను బాధించడం పాపం అనే సూక్తి దీని ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలలో పరోపకారం దైవత్వానికి దగ్గరైన లక్షణంగా వర్ణించబడింది. మహాభారతంలోని కర్ణుడు తన దాన గుణంతో, పరోపకారంతో చిరస్మరణీయుడిగా నిలిచాడు. తన ప్రాణాలకు ముప్పు అని తెలిసినా కవచకుండలాలను ఇంద్రుడికి దానం చేసి, త్యాగానికి, నిస్వార్థ సేవకు నిదర్శనంగా నిలిచాడు. అలాగే, మహారాజు శిబి తన ఆశ్రయం కోరిన పావురాన్ని రక్షించడానికి తన శరీర మాంసాన్ని ఇవ్వడానికి సిద్ధపడి, పరోపకారం పరాకాష్ఠను చాటాడు.

అయం నిజః పరో వేతి గణనా లఘుచేతసామ్
ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్

'ఇది నాది, అది పరాయిది' అని సంకుచిత మనస్తత్వం కలవారు ఆలోచిస్తారు. గొప్ప మనసున్న వారికి ఈ ప్రపంచమంతా ఒక కుటుంబం లాంటిది. ఈ శ్లోకం పరోపకారి విశాల దృక్పథాన్ని, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని తెలియజేస్తుంది.

యథా కనకమాలిన్యం హితం హి వినివృత్తయే
తథైవ చేతసో మాలిన్యం పరోపకృతి నిర్మలమ్

బంగారం మాలిన్యాన్ని తొలగించడానికి అగ్ని ఎలా ఉపకరిస్తుందో, మనసులోని మాలిన్యాన్ని తొలగించడానికి పరోపకారం అలా నిర్మలం చేస్తుంది. ఈ శ్లోకం పరోపకారం ఆత్మశుద్ధికి, అంతర్గత పవిత్రతకు మార్గమని స్పష్టం చేస్తుంది.

పరోపకారం కేవలం ఇతరులకు చేసే సాయం మాత్రమే కాదు, అది మన ఆత్మను శుద్ధి చేసి, జీవితానికి సరికొత్త అర్థాన్నిచ్చే ఒక దివ్యమైన అనుభవం. మనమందించే ప్రతి చిన్న సహాయం ఒక అలలా విస్తరించి, సమాజంలో సానుకూల మార్పునకు నాంది పలుకుతుంది. ఈ నిస్వార్థ సేవ ద్వారా మనం వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ అద్భుతమైన సంతృప్తిని పొందగలం. పరోపకారాన్ని మన దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే, ప్రతి అడుగులోనూ ఆనందాన్ని పంచుకుంటూ, ఒక మెరుగైన ప్రపంచాన్ని నిర్మించగలం.

– కె. భాస్కర్ గుప్తా
వ్యక్తిత్వ వికాస నిపుణులు

**నేటి ఆధునిక సమాజంలో కూడా పరోపకార విలువ అపారం. నిస్వార్థ సేవకు అనేక రూపాలున్నాయి: ఒక యువతకు సరైన మార్గదర్శనం చేయడం, సాంకేతిక నైపుణ్యాలను ఉచితంగా పంచుకోవడం, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవడం, లేదా కష్టాల్లో ఉన్న వారికి నైతికంగా, ఆర్థికంగా అండగా నిలబడటం. ఇటువంటి నిస్వార్థ సేవ ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వర్ధిల్లుతాయి. పరోపకారం చేసేవారిలో సానుకూల దృక్పథం, అపారమైన మానసిక సంతృప్తి పెరుగుతాయి.**

బౌద్ధవాణి

# ధర్మనిరతి అంటే అది!



**పూ**ర్వం కాశీరాజ్యంలోని ఒక అడవిలో ధర్మనిరతుడు అనే భిక్షువు ఉండేవాడు. ఆ అడవిలో ఒక పెద్ద కొలను ఉంది. దాన్నిండా తామరపూలు. లేత పరిమళాలు వెదజల్లుతూ ఉంటాయి. ఆ సరోవరం దాపునే ధర్మనిరతుని నివాసం.

ఆ సరోవరానికి ఒక కాపలాదారు ఉన్నాడు. ఒకరోజున ఉదయాన్నే ధర్మనిరతుడు లేచి కొలనులో స్నానం చేసి, గాలివాలుకు పోయి నిలబడ్డాడు. పూలపరిమళాలు పీలుస్తూ తన్మయుడవుతున్నాడు. అంతలో అతన్ని కాపలాదారు ''స్వామీ! దొంగతనం తప్పా? ఒప్పా?'' అడిగాడు.

''నాయనా! దొంగతనమే కాదు, ఒకరు ఇవ్వకుండా మనది కానిది ఏది తీసుకున్నా తప్పే. అదీ దొంగతనం కిందే లెక్క'' అన్నాడు చిరునవ్వుతో. ''అయితే... మీరు దొంగే!'' అన్నాడు కాపలాదారు. ''నేనా? నేనేమీ దొంగిలించలేదే''అన్నాడు భిక్షువు. ''ఇదిగో... ఈ పూలపరిమళాలు ఆఘ్రాణించారు కదా! ఇది గంధచౌర్యమే కదా. తమరు నా కొలనులోని సువాసనల్ని దొంగిలించినట్లే కదా'' అన్నాడు.

భిక్షువు అతనితో అలా మాట్లాడుతూ ఉండగానే, కొలను ఆవలిగట్టున ఒక వ్యక్తి వచ్చి కొలనులో దిగి కొన్ని తామరపూలు తెంపుకుని వెళ్లిపోయాడు. అతణ్ణి కాపలాదారు చూశాడు. కానీ, అతణ్ణి ఏమీ అనలేదు. కనీసం కేకవేసి మందలించలేదు. అప్పుడు భిక్షువు– ''బాగుందయ్యా! వాసన చూసిన నన్ను తప్పు పట్టావు. పూలు తెంపుకుపోతున్న వాణ్ణి పన్నెత్తి చూడలేదు''అని అడిగాడు. ''స్వామీ! అతను లోభి. ధూర్తుడు. అజ్ఞాని. కానీ, తమరు జ్ఞానులు. ప్రబోధకులు. స్వచ్ఛమైన కర్మలు ఆచరించేవారు. దోషం ఎంచలేని దొడ్డవారు. అతను పెద్ద తప్పు చేసినా చిన్నగానే కనిపిస్తుంది. మీలాంటి వారు కంట్లో నలుసంత తప్పు చేసినా కారుమేఘమంతగా అందరికీ కనిపిస్తుంది కదా!'' అన్నాడు. భిక్షువు మౌనం వహించాడు. ధార్మికులు జీవితంలో ఎంత జాగరూకులై ఉండాలో బుద్ధుడు చెప్పిన సందేశాత్మక కథ ఇది.

– డా. బొర్రా గోవర్ధన్

**అమృత బిందువులు**

మనలో ఎవరైనా మంచివాడు ఎదుగుతుంటే ఎదగడానికి సహకరిద్దాం. ఎందుకంటే,.. వాడి మార్గంలో కాని, వాడి నీడలో కానీ పదిమంది ఎదుగుతారు. అలాగే... మనలో ఎవడైనా మంచి వాడు పడిపోతుంటే అడ్డుకుని నిలబెడదాం. లేకుంటే వాణ్ణి నమ్ముకున్న పదిమంది కష్టాల పాలవుతారు.

చెట్టునీడ

# హితవాక్యం



**అ**వతలి వారు ఎంత చిన్నవారైనా సరే, మన హితవు కోరి మంచి మాట చెబుతుంటే వినాలి కానీ పెడచెవిన వేయరాదు. అలా వేస్తే ఎంతటివాడికైనా నష్టం తప్పదు. అందుకు పది తలల రావణుడే ఉదాహరణ. ఏదో ఒక విధంగా మాయ చేసి, సీతాపహరణకు సాయం చేయవలసిందిగా తనను కోరిన రావణుడితో చెప్పాడు మారీచుడు... ''వద్దు, నీకేం లోటు, ఇంతమంది భార్యలున్నారు. కాంచనలంక ఉంది, భటులున్నారు. రాముడి జోలికి వెళ్ళకు. వెళ్ళావా, అన్నీపోతాయి. రాముడికి అపచారం చెయ్యకు...'' అన్నాడు.

అన్నీ విన్న రావణుడు ''నువ్వు చెప్పేది అయిపోయిందా. అయితే విను. నువ్వు చచ్చిపోవడానికి ఎలాగూ సిద్ధం. నామాట వింటే రాముడి చేతిలో చచ్చిపోతావు. వినకపోతే నా చేతిలో చస్తావు. ఎలా చచ్చిపోతావో చెప్పు'' అన్నాడు. ఫలితం..? పదితలలున్న రావణాసురుడు చివరకు ఏమయిపోయాడు? వినని తలలు తెగిపడిపోయాయి. సీతమ్మ ఎప్పుడో చెప్పింది... ''నీకు తెలియదా, చెప్పే వాళ్ళులేరా.. చెబితే వినవా, మాట్లాడకూడనిది మాట్లాడుతున్నావు రావణా, దీని పర్యవసానం ఏమిటో నీవు చచ్చాకే నీకు తెలుస్తుంది.'' అని హెచ్చరించింది.

చివరకు రావణుడు చచ్చిపడిపోయి ఉంటే మండోదరి వచ్చింది. భర్తను చంపినందుకు రాముడిని తిట్టడానికి వచ్చిందనుకున్నారంతా. కానీ, ఆమె వచ్చి రావణాసురుడి శవాన్ని చూసి ''ఓరి దుర్మార్గుడా! అన్యకాంతను తీసుకొచ్చావు. వినాశనాన్ని కొని తెచ్చుకున్నావు. లోకాలన్నిటిని గెలవగలిగిన కొడుకుని కన్నాను. నీ కామానికి చంపేసావు, నేను చచ్చిపోతే కాల్చడానికి కొడుకును మిగల్చకుండా చచ్చిన ధూర్తుడా, నీ ఇంద్రియాలకి, నీ కామానికి చచ్చిపోయావు కదా'' అంది. అంత వేదం చదువుకున్నాడు, కాంచన లంకాధిపత్యం వహించాడు. పుష్పకవిమానంలో తిరిగాడు... చివరకు ఏమయింది.. మంచి మాట వినలేదు, వెళ్ళిపోయాడు. రావణుడంతటి వాడికే చేటు తప్పలేదంటే, సామాన్యులమైన మనమెంత? అమ్మో, నాన్నో, కూతురో కొడుకో, భార్యో భర్తో, చివరకు మన కింద జీతానికి పని చేసే పనివాడే మంచి కోరి చెబితే వినాలి. కనీసం వీరు ఇలా ఎందుకు చెబుతున్నారు అని ఆలోచించాలి. లేదంటే మన అనాలోచిత నిర్ణయం వల్ల కలిగే చెడు పర్యవసానాలను మనమే కాదు, మన వాళ్లందరూ అనుభవించవలసి వస్తుంది.

– డి.వి.ఆర్.

సాక్షి సినిమా



● నాని

# ప్యారడైజ్‌కి హాలీవుడ్ కనెక్షన్!

**హా**లీవుడ్ రేంజ్‌లో 'ది ప్యారడైజ్' సినిమా రూపొందుతోంది. 'దసరా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. తాజాగా ప్రముఖ హాలీవుడ్ ఏజెన్సీ 'కనెక్ట్ మాబ్ సీన్' ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ క్రియేటివ్ కంటెంట్ హెడ్ అలెగ్జాండ్రా ఈ. విస్కొంటిని 'ది ప్యారడైజ్' టీమ్‌ని కలిసి, ఈ సినిమాతో కొలాబరేట్ కావడానికి చర్చలు జరిపారు. అలాగే ఈ సినిమా ఇంటర్‌నేషనల్ వెర్షన్‌ను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి ఓ హాలీవుడ్ నటుడితో కూడా ఈ చిత్రం యూనిట్ చర్చలు జరుపుతోంది. ఇక ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రం వచ్చే ఏడాది మార్చి 26న విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్... ఇలా మొత్తం ఎనిమిది భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

# అనుష్క విశ్వరూపం చూస్తారు

**– దర్శకుడు జాగర్లమూడి క్రిష్**



● రాజీవ్, జగపతి బాబు, క్రిష్

''అరుంధతి, సరోజ, దేవసేన, భాగమతి... ఇలా ఎన్నో ఐకానిక్ క్యారెక్టర్స్‌ను అనుష్క చేసింది. 'ఘాటీ' చిత్రంలో శీలావతి పాత్రలో అనుష్క నట విశ్వరూపాన్ని చూపించాం'' అని అన్నారు దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. అనుష్కా శెట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఘాటీ'. ఈ చిత్రంలో విక్రమ్ ప్రభు, చైతన్యా రావు, జగపతిబాబు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో క్రిష్ మాట్లాడుతూ– ''నేను, స్వీటీ (అనుష్క) గతంలో 'వేదం' సినిమా చేశాం. ఆ సినిమా నుంచి అనుష్క స్టార్‌డమ్ ఎన్నో రెట్లు పెరిగింది. ఇక 'ఘాటీ' కథ చెప్పగానే అడ్వెంచరస్‌తో కూడుకున్న ఈ సినిమా తప్పకుండా చేద్దామని అనుష్క చెప్పింది. తూర్పు కనుమలు, ఆ పర్వత శ్రేణులు, అక్కడ ఉన్న ఒక తీవ్రమైన భావోద్వేగాలు, చాలా గట్టి మనుషులు, గొప్ప మనస్తత్వాలు... ఇవన్నీ కలగలిపి ఒక మంచి కథ చెప్పడానికి మాకు ఆస్కారం దొరికింది. రచయిత చింతకింది శ్రీనివాసరావుగారు ఈ 'ఘాటీ' ప్రపంచం గురించి చెప్పగానే చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. కని, వినని పాత్రలను 'ఘాటీ'లో చూస్తారు'' అని చెప్పారు. ''అనుష్క స్వీటీ అని మనందరికీ తెలుసు. కానీ ఈ 'ఘాటీ' చిత్రంలో ఆమెను వేరుగా చూస్తారు. ఈ చిత్రంలో నేను పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించాను'' అని జగపతి బాబు తెలిపారు. ''ఘాటీ' చిత్రంలో అనుష్కను రియల్ క్వీన్‌గా చూస్తారు'' అని పేర్కొన్నారు రాజీవ్ రెడ్డి. నటులు విక్రమ్ ప్రభు, చైతన్యా రావు పాల్గొన్నారు.

# ప్రతి ప్రేమికుడు ఓ విలన్!



● టైగర్ ష్రాఫ్

బాలీవుడ్ 'భాగీ' ఫ్రాంచైజీలో రూపొందిన తాజా చిత్రం 'భాగీ 4'. 'భాగీ' ఫ్రాంచైజీ తొలి మూడు భాగాల్లో హీరోగా నటించిన టైగర్ ష్రాఫ్ 'భాగీ 4'లోనూ హీరోగా నటించారు. సోనమ్ బజ్వా, హర్నాజ్ సంధు హీరోయిన్లుగా, సంజయ్ దత్ విలన్‌గా చేశారు. తెలుగులో 'భీమా' సినిమా తెరకెక్కించిన కన్నడ దర్శకుడు ఎ. హర్ష దర్శకత్వంలో సాజిద్ నడియాద్‌వాలా ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు కథ–స్క్రీన్‌ప్లే అందించారు. ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'భాగీ 4' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో యాక్షన్ మోతాదు ఎక్కువగానే ఉందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. 'లవ్‌స్టోరీలు చాలా విని ఉంటారు. చదివి ఉంటారు. కానీ ఈ తరహా యాక్షన్ ప్యాక్డ్ లవ్‌స్టోరీ సినిమాను లైఫ్‌లో తొలి సారి చూడబోతున్నారు, ఐ లవ్ యూ రోనీ (టైగర్ ష్రాఫ్ పాత్ర పేరు), నేను ముందే చెప్పాను... మీరు ఏదైతే నాకు టార్చర్ అనుకుంటారో అది నాకు వార్మప్‌లాంటిది, గెట్ రెడీ టు ఫైట్, ప్రతి ప్రేమికుడు ఓ విలన్' అని అర్థం వచ్చే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

'గామా' (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్స్) ఫిఫ్త్ ఎడిషన్ దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో జరిగింది. 'గామా' చైర్మన్ కేసరి త్రిమూర్తులు, సీఈఓ సౌరభ్ కేసరి ఆధ్వర్యంలో ఈ అవార్డు వేడుక జరిగింది. జ్యూరీ చైర్ పర్సన్స్ దర్శకులు ఎ. కోదండ రామిరెడ్డి, బి. గోపాల్, సంగీత దర్శకుడు కోటి విజేతలకు అవార్డులను అందజేశారు. ఉత్తమ చిత్రంగా 'పుష్ప ది రూల్'కు అవార్డు రాగా, ఈ చిత్రకథానాయకుడు అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడు అవార్డు దక్కింది. ఇదే చిత్రానికిగానూ దేవిశ్రీ ప్రసాద్ ఉత్తమ సంగీతదర్శకుడి అవార్డు అందుకోగా, బెస్ట్ యాక్టర్ క్రిటిక్ అవార్డును తేజ సజ్జా అందుకున్నారు. 'లక్కీ భాస్కర్'కిగాను మీనాక్షీ చౌదరికి ఉత్తమ హీరోయిన్ అవార్డు దక్కింది. నటుడు బ్రహ్మానందం స్పెషల్ అవార్డు, నిర్మాత అశ్వనీదత్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.



# కొక్కొరొకో ప్రారంభం



● రమేశ్ వర్మ

**కొ**త్తవారిని ప్రోత్సహించేందుకు దర్శకుడు రమేశ్ వర్మ 'ఆర్‌వీ ఫిల్మ్ హౌస్' బ్యానర్‌ను స్థాపించారు. ఈ ప్రొడక్షన్ హౌస్‌లోని తొలి సినిమా 'కొక్కొరొకో' ఆదివారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కూరపాటి శిరీష కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత రేఖా వర్మ క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్న శ్రీనివాస్ వసంతలకు స్క్రిప్టును అందించారు రమేశ్ వర్మ. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ సోదరుడు, గాయకుడు జీవీ సాగర్ ఈ సినిమాకు సంభాషణలు రాస్తారు. 'రాక్షసుడు' తర్వాత సాగర్ రచయితగా చేస్తున్న రెండో చిత్రం ఇది. ''ఈ చిత్రానికి రమేశ్ వర్మ కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఓ చక్కటి ఆంథాలజీగా మంచి ఎమోషన్స్‌తో 'కొక్కొరొకో' చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సంకీర్తన్.



● బలగం జగదీష్, వరుణ్ సందేశ్, రాజేంద్ర ప్రసాద్, మధులిక, ఆర్యన్

# కానిస్టేబుల్ సందేశం

''**కా**నిస్టేబుల్' సినిమా కంటెంట్ నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉంది. వరుణ్ సందేశ్ తన పాత్రలో ఒదిగిపోయి ఉంటాడని భావిస్తున్నాను'' అని అన్నారు రాజేంద్రప్రసాద్. వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో 'బలగం' జగదీష్ నిర్మించిన థ్రిల్లర్ చిత్రం 'కానిస్టేబుల్'. ఆదివారం హైదరాబాద్‌లో చిత్రయూనిట్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేసి, మాట్లాడారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– ''దర్శకుడు ఆర్యన్ ఈ సినిమా కథ చెప్పినప్పుడు కానిస్టేబుల్ క్యారెక్టర్‌ను ఊహించుకుని, చేయగలననే నమ్మకం ఏర్పడిన తర్వాతే ఈ సినిమా చేశాను'' అని చెప్పారు. ''ఒక వ్యక్తికి అవమానం జరిగినప్పుడు దాని ప్రభావం ఎలా ఉంటుందనే అంశానికి సందేశాన్ని మిళితం చేసి, ఈ చిత్రం చేశాం'' అని పేర్కొన్నారు 'బలగం' జగదీష్. ''ఈ చిత్రంలో నాలుగు పాటలు ఉండగా, ఒక పాటను చంద్రబోస్‌గారు, మరో పాటను గద్దర్ నర్సన్న పాడారు. ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే సినిమా ఇది'' అని చెప్పారు ఆర్యన్ సుభాన్. ''మన భద్రత కోసం పోలీస్‌వారు అహర్నిశలూ ఎంతో శ్రమ పడుతున్నారు. ఇలాంటి అంశాలతో తీసిన ఈ సినిమా విజయం సాధించాలి'' అని అన్నారు తెలంగాణ కల్చరల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నటుడు శివారెడ్డి. ఈ కార్యక్రమంలో ముగ్గురు కానిస్టేబుల్స్‌ను యూనిట్ సత్కరించింది.

# పవర్‌ఫుల్ స్టోరీతో...



● చంద్రహాస్, సందీప్ కిషన్

**చం**ద్రహాస్ హీరోగా జైరామ్ చిటికెల దర్శకత్వంలో పీవీకే ప్రొడక్షన్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను హీరో సందీప్ కిషన్ రిలీజ్ చేశారు. ఐదు రూపాయల నాణెం, ఆ నాణెం చుట్టూ బుల్లెట్లతో ఈ పోస్టర్‌ని డిజైన్ చేశారు. ''దేశభక్తి అంశాలతో పవర్‌ఫుల్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. చంద్రహాస్ బర్త్ డే సెప్టెంబర్ 17న ఈ మూవీ టైటిల్, గ్లింప్స్ రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ
ఇది చూడొచ్చు


# ఇది మామూలు సినిమా కాదు

**ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం మారీశన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.**

**పి**ట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు కొన్ని సినిమాలు వాటి పోస్టర్లు, ప్రోమోలకు మించి ఉంటాయి. కొన్నాళ్ళ క్రితం ఏదైనా సినిమా చూసేటపుడు ఆ సినిమాలో వచ్చే తరువాత సన్నివేశాన్ని ప్రేక్షకులు కాస్తంత ఊహించగలిగారు. ఆపై కాలంలో దాదాపుగా సినిమా మొత్తాన్ని ఊహించగలుగుతున్నారు. కానీ నేటి ప్రేక్షకులు సినిమా పోస్టర్, ప్రోమోలను బట్టి పూర్తి కథను అంచనా వేయగలుగుతున్నారు. అయితే కొంతమంది దర్శకుల ఆలోచనలను మాత్రం ప్రేక్షకులు ఇంకా అందుకోలేకపోతున్నారు. ఆ కోవకు చెందినదే 'మారీశన్'. ఈ సినిమాకు కృష్ణమూర్తి కథ అందించగా సుదీష్ శంకర్ దర్శకత్వం వహించారు. ప్రముఖ తమిళ కమెడియన్ వడివేలు, ప్రముఖ మలయాళ నటుడు ఫాహద్ ఫాజిల్ ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించారు. నిజానికి ఈ సినిమా మొత్తం వీరిద్దరి పాత్రలపైనే నడుస్తుంది. రెండంటే రెండే పాత్రలతో రెండున్నర గంటల పైన నిడివితో ప్రేక్షకులను మెప్పించడం నిజంగా అభినందనీయం. అంతలా ఏముందీ కథలో ఓసారి చూద్దాం. దయాళన్ ఓ దొంగ. చాలాసార్లు దొంగతనం చేసి జైలుకి వెళుతున్నా తీరు మార్చుకోని మొండి దొంగ దయ. ఓ రోజు అలవాటుగా దయ ఓ ఇంట్లో దొంగతనం చేస్తుండగా చైన్‌తో కట్టిపడేసున్న వేలాయుధం పిళ్ళైని కలుస్తాడు. అదే సమయంలో పిళ్ళైకి అల్జీమర్స్ వ్యాధి ఉందని గ్రహిస్తాడు దయ. మొదట పిళ్ళైని చూసిన దయ కాస్త కంగారు పడినా పిళ్ళై దగ్గర ఉన్న డబ్బు కోసం తనని విడిపిస్తాడు. తన బావమరిదిని కలవడానికి తిరువన్నామలై వెళ్ళాలని చెప్పడంతో పిళ్ళైని తాను తీసుకెళతానని నమ్మిస్తాడు దయ. అలా వాళ్ళిద్దరి ప్రయాణం ప్రారంభమవుతుంది. ఆ ప్రయాణం ఎన్నో అనూహ్య మలుపులతో ఆద్యంతం ఆసక్తిని రేపుతుంది. ముందు చెప్పుకున్నట్టు ఈ సినిమా చూస్తున్న ప్రేక్షకులు సినిమా కథ కాదు కదా... తరువాత సన్నివేశాన్ని కూడా అంచనా వేయలేరు. తెలుగు వాళ్ళకి ఫీల్ గుడ్ సినిమాలతో పరిచయమున్న సూపర్ హిట్ సంస్థ సూపర్ గుడ్ ఫిల్మ్స్ నుండి చాలాకాలం తర్వాత వచ్చిన ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. వాచ్ ఇట్... ఎందుకంటే ఇది మామూలు సినిమా అయితే కాదు.

– హరికృష్ణ ఇంటూరు




'నా అక్కలూ..చెల్లెళ్లు..
తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే
నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 161

సోమవారం 1-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**భారత్‌కు రెండో విజయం**

ఆసియా కప్ హాకీ టోర్నీలో జపాన్‌తో మ్యాచ్‌లో భారత్ 3-2తో గెలుపు - 12లో



**ప్రతీ లావాదేవీపై 'ఐ'టీ!**

పెట్టుబడులు, భారీ నగదు జమలు. పన్ను ఎగ్గొడితే జరిమానా, జైలు శిక్ష -13లో



**స్వదేశీ వస్తువులనే వాడండి**

ఈ పండుగల సీజన్‌లో ప్రజలందరూ దేశంలో తయారైనవే ఉపయోగించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

వివరాలు 6లో ▸



**అమెరికాకు సేవలు బంద్**

అమెరికా కస్టమ్స్‌శాఖ ప్రకటించిన నిబంధనల్లో స్పష్టత లేకపోవడంతో అన్ని పోస్టల్ సేవలను ఇండియా పోస్ట్ నిలిపివేసింది.


వివరాలు 6లో ▸



**శునకాల కేసుతో ఫేమస్ అయ్యా**

వీధి శునకాల కేసుతో ప్రపంచవ్యాప్తంగా తనకు గుర్తింపు వచ్చిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ అన్నారు.

వివరాలు 6లో ▸



**'ఎడ్యుకేట్ గాళ్స్'కు 'మెగసెసే'**

బాలికల విద్యకోసం పనిచేస్తున్న ప్రముఖ ఎన్జీవో 'ఎడ్యుకేట్ గాళ్స్' ప్రతిష్టాత్మక రామన్ మెగసెసే-2025 అవార్డును గెలుచుకుంది.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### కమల రథ సారథిగా శివరాజ్ సింగ్ చౌహాన్?



బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి జేపీ నడ్డాకు వారసుడిగా రాజకీయ వర్గాల్లో శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు బలంగా వినిపిస్తోంది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దల్లో ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం.

- వివరాలు 6లో▶

### రెండ్రోజులపాటు వర్షాలు



రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నందున వచ్చే రెండ్రోజులపాటు పలు ప్రాంతాల్లో ఉరుములు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వివరించింది.

- వివరాలు 14లో▶

### పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ఏపీకే ఫైల్స్



సైబర్ నేరగాళ్లు ఎవరినీ వదలడం లేదు. తాజాగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తమ మోసాలకు అనుగుణంగా మార్చుకున్నారు. రైతులే లక్ష్యంగా ఈ తరహా కొత్త మోసానికి తెరతీశారు.

- వివరాలు 14లో▶

### ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అడ్డదారులు



ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకున్నాడు. ఆ డబ్బు సంపాదించేందుకు చెన్నూర్ ఎస్‌బీఐలో క్యాషియర్‌గా పని చేస్తున్న రవీందర్ 402 గోల్డ్‌లోన్లకు సంబంధించిన 25.17కిలోల బంగారం, రూ.1.10 కోట్ల నగదు చోరీ చేశాడు.

- వివరాలు 5లో▶



# కాళేశ్వరంపై సీబీఐ

**ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై సమగ్ర విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం**

**అసెంబ్లీలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ అనంతరం సీఎం రేవంత్ ప్రకటన**

- కమిషన్లు దండుకునేందుకు తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని ఆరోపణ
- బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రాజెక్టు కూలిందని వెల్లడి..
- కేసీఆర్, హరీశ్, ఈటల సహా అధికారులే బాధ్యులని స్పష్టీకరణ
- కేసీఆర్ దోపిడీ దొంగగా మారి రూ. లక్ష కోట్ల తెలంగాణ సొత్తు దోచుకున్నారని ధ్వజం
- కేసీఆర్, ఆయన కుటుంబానికి ఫాంహౌస్‌లు, మీడియా సంస్థలు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీత
- అర్ధరాత్రి 1:40 గంటల వరకు నివేదికపై కొనసాగిన చర్చ



ఆదివారం అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలు, ప్రజాధనం దుర్వినియోగం, అవినీతి ఆరోపణలపై విచారణను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో అంతర్‌రాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు పాలుపంచుకున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, ఫైనాన్సింగ్‌లో వ్యాప్కోస్ వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ వంటి ఆర్థిక సంస్థలు పాలుపంచుకున్నందున సీబీఐకి విచారణ అప్పగించడం సముచితమని తమ ప్రభుత్వం భావిస్తుందన్నారు. శాసనసభలో ఆదివారం జరిగిన 'కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిషన్ నివేదిక'పై జరిగిన సుమారు తొమ్మిదిన్నర గంటలపాటు జరిగిన సుదీర్ఘ చర్చకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. ఆదివారం అర్ధరాత్రి 1:40 గంటల వరకు సాగిన

మిగతా 2వ పేజీలో ▶



తియాంజిన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ కరచాలనం

# బంధం బలోపేతమే లక్ష్యం..

- పరస్పర విశ్వాసం, గౌరవంతో సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుందాం
- ద్వైపాక్షిక ఒప్పందాలను మరింత ముందుకు తీసుకెళ్దాం
- మన సహకారం ఇరుదేశాల 280 కోట్ల ప్రజల సంక్షేమంపై ఆధారపడింది.. తియాంజిన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీలో ప్రధాని వ్యాఖ్య
- భారత్, చైనా వాణిజ్యంసహా కీలక ద్వైపాక్షికాంశాలపై ఇరునేతల సుదీర్ఘ మంతనాలు
- షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర భేటీని సభ్యదేశాల అగ్రనేతలకు విందుతో ఆరంభించిన జిన్‌పింగ్
- నేడు పుతిన్‌తోనూ విడిగా సమావేశంకానున్న మోదీ

- వివరాలు 6లో▶

# నీటి లభ్యత కోసమే మేడిగడ్డకు..

- సీడబ్ల్యూసీ, నిపుణుల కమిటీ, రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీలన్నీ అదే చెప్పాయి
- మహారాష్ట్ర ప్రభుత్వం కూడా తుమ్మిడిహెట్టికి ఒప్పుకోలేదు
- పోలవరం 10 సార్లు కూలితే ఎన్డీఎస్‌ఏ ఎందుకు రాలేదు
- మేడిగడ్డలో కూలిన చోట మరమ్మతులు చేస్తే సరిపోతుంది

శాసనసభలో మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కొనసాగించేందుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంతో కృషి చేశామని.. మహారాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీడబ్ల్యూసీ, నిపుణుల కమిటీ, ఇతర సంస్థలన్నీ ఆ ప్రాజెక్టుకు ఒప్పుకోకపోవడం వల్లే దానిని మేడిగడ్డకు మార్చామని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో ఆదివారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు గల కారణాలను వివరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలుమార్లు హరీశ్‌రావుకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు అడ్డు తగిలారు. ఒక సమయంలో హరీశ్‌రావుకు స్పీకర్ మైక్ కట్ చేసి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మాట్లాడే అవకాశం ఇవ్వడంతో బీఆర్‌ఎస్ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యంతో

మిగతా 2వ పేజీలో ▶

**పీసీ ఘోష్ కమిషన్ నివేదిక చెత్త**

అసెంబ్లీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్‌ఎస్ 2 లో



కేసముద్రంలో యూరియా టోకెన్ల కోసం ఆదివారం రాత్రి చీకట్లో పడిగాపులు పడుతున్న రైతులు

# కొందరికే యూరియా

**దొరకని చోట తప్పని ఘర్షణలు..వాగ్వాదాలు.. ఆందోళనలు**

చిన్నశంకరంపేట/మిరుదొడ్డి/దోమకొండ/కేసముద్రం

యూరియా కష్టాలు రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్నిచోట్ల ఘర్షణలకు కూడా దారి తీస్తున్నాయి. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం జంగరాయి సహకార సంఘం వద్ద యూరియా కోసం ఆదివారం తెల్లవారుజాము నుంచే రైతులు క్యూలైన్‌లో చెప్పులు పెట్టి పడిగాపులు కాశారు. యూరియా పంపిణీ సందర్భంగా ఒక బస్తా నాదంటే నాదని ఇద్దరు రైతులు కొట్టుకున్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న మరికొందరు రైతులు వారిని సముదాయించారు. చివరకు కొట్టుకున్న ఇద్దరు రైతులకు యూరియా దొరకలేదు.

➤ సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలోని రైతువేదిక వద్దకు చుట్టు పక్క గ్రామాలకు చెందిన రైతులు శనివారం అర్ధరాత్రి నుంచే క్యూ కట్టి ఆదివారం తెల్లవారుజాము వరకు జాగారం చేశారు. అయితే యూరియా

మిగతా 5వ పేజీలో ▶

వాస్తవాలు చెప్పేందుకే

## ఘోష్ కమిషన్

- దాని ఏర్పాటు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశంలేదు
- రీ డిజైన్ పేరుతో ప్రాజెక్టుల అంచనాలు పెంచారు
- కాళేశ్వరంపై చర్చలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



## కాళేశ్వరం మానవ విపత్తు

- ఆ ప్రాజెక్టుతో ప్రజలపై రూ.1.47 లక్షల కోట్ల భారం
- తుమ్మిడిహెట్టి వద్ద రూ.38 వేల కోట్లతోనే పూర్తయ్యేది..
- మేడిగడ్డ బరాజ్ కుంగటంతో రూ.24 వేల కోట్ల నష్టం
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



- వివరాలు 2లో

## కాళేశ్వరం నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే



- ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకునే స్వేచ్ఛ సర్కారుకు ఉంది
- రాజకీయ కార్యనిర్వాహకుడిగా కాకుండా పాలనాధికారిగా వ్యవహరించారు
- అసెంబ్లీలో జస్టిస్ ఘోష్ నివేదిక

5 లో

ఇదండీ సంగతి



ఎన్నయినా చెప్పండి! సారుకు ఈ విషయంలో వచ్చినంత పేరు.. ఇంకెవరికీ రాలేదు!!

# కల్వకుండా చేసే కుటుంబమది!

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్ దుఃఖంతో ఉన్నారని గంగుల చెప్పకనే చెప్పారు**

- ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా గవర్నర్‌తో మాజీ ఆర్థిక మంత్రి లాబీయింగ్
- రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతోనే బీసీ కులగణనకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు
- కేసీఆర్ తెచ్చిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణలే గుదిబండ
- మున్సిపల్ చట్టసవరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబం రాష్ట్రంలో వివిధ సామాజికవర్గాలు సుహృద్భావంతో కలిసిపోకుండా అడ్డుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించటం కల్వకుంట్ల కుటుంబానికి ఇష్టంలేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం గరిష్ట పరిమితిని ఎత్తివేసేందుకు ప్రతిపాదించిన మున్సిపల్ చట్ట సవరణ బిల్లుపై ఆదివారం శాసనసభలో జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ చేసిన విమర్శలకు సీఎం రేవంత్ ఘాటుగా సమాధానమిచ్చారు. 'అది కల్వకుంట్ల కాదు.. ఎవరినీ కల్వకుండ చూసే కుటుంబం. బీసీలు, ఓసీలు కలవొద్దు.. ఎస్సీలు, ఎస్టీలు కలవొద్దు.. హిందువులు, ముస్లింలు కలవకుండా చూసే కుటుంబం అది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే సంతోషంగా ఉండే వారిలో మొదటి వరుసలో తాను ఉంటానని గంగుల కమలాకర్ అన్నారు. కానీ వాళ్ల నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సంతోషంగా ఉంటారని చెప్పలేదు. వాళ్ల నాయకులు కడుపునిండా విషం పెట్టుకుని ఉన్నారని చెప్పకనే చెప్పారు' అని దుయ్యబట్టారు.

**చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం..**

హైకోర్టు ఆదేశాలను అనుసరించే రాష్ట్రంలో కుల గణన నిర్వహించామని సీఎం తెలిపారు. 'బీసీల గణన బాధ్యతను తొలుత రాష్ట్ర బీసీ కమిషన్‌కు అప్పగించగా, డెడికేటెడ్

మిగతా 3వ పేజీలో ▶

## 50% సీలింగ్ ఎత్తివేతకు ఓకే

- పురపాలికలు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం
- అశాస్త్రీయంగా ఉన్న బిల్లులు కోర్టుల్లో నిలబడవన్న బీఆర్‌ఎస్ సభ్యుడు గంగుల
- అపశకునం పలకొద్దని కౌంటర్ ఇచ్చిన మంత్రి పొన్నం..

3 లో

# డిక్లరేషన్ కాదు.. డెడికేషన్ కావాలి

**స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే రిజర్వేషన్ బిల్లు**

- ఆర్డినెన్స్‌నే ఆమోదించని గవర్నర్.. బిల్లును ఓకే చేస్తారా?
- ప్రధాని, రాహుల్‌గాంధీ అరగంట చర్చిస్తే రిజర్వేషన్లు వస్తాయి
- శాసనసభలో మున్సిపల్ చట్టసవరణ బిల్లుపై చర్చలో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ చట్ట సవరణ బిల్లును ప్రతిపాదించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నిజంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనుకుంటే కావాల్సింది డిక్లరేషన్లు కాదని, డెడికేషన్ అని అన్నారు. శాసనసభలో ఆదివారం పంచాయతీరాజ్, పురపాలక చట్ట సవరణ బిల్లులపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, ప్రధానమంత్రి అరగంటపాటు మాట్లాడుకుంటే అనుకున్న తరహాలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయొచ్చు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు నిజంగా న్యాయం చేయొచ్చు. అసెంబ్లీలో ఎన్ని గంటలు చర్చించినా ఉపయోగం ఉండదు. నిజంగా బీసీలకు న్యాయం చేయాలంటే ఈ చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి. ఈ విషయం

మిగతా 3వ పేజీలో ▶

# కాళేశ్వరంపై సీబీఐ

▶ మొదటి పేజీ తరువాయి


శాసనసభ చర్చలో సీఎం రేవంత్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు.

**లోతైన దర్యాప్తు అవసరం..**

'తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్ (సీఓఐ)ను నియమించింది. విచారణ కమిషన్ తన నివేదికను ఈ ఏడాది జూలై 31న ప్రభుత్వానికి సమర్పించింది. గత నెల 4న జరిగిన మంత్రిమండలి సమావేశం ఈ నివేదికను ఆమోదించింది. తదుపరి చర్చ జరిపేందుకు అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కేబినెట్ చేసిన తీర్మానం ప్రకారం ఈ నివేదికపై శాసనసభలో చర్చ జరిగింది. పీసీ ఘోష్ విచారణ కమిషన్ నివేదికలో క్రిమినల్ చర్యలకు అర్హమైన అనేక లోపాలు, అవకతవకలను గుర్తించింది. నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల వంటి అంశాలను ప్రస్తావించింది. మూడు బ్యారేజీల నిర్మాణంలో తప్పు జరిగిందని.. అసలు ప్రణాళిక లేదని కమిషన్ తేల్చి చెప్పింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్ లోపాలు కారణమని తేలింది. నాణ్యత, నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల నిర్మాణంలో లోపాలు ఏర్పడ్డాయని ఎన్‌డీఎస్‌ఏ గుర్తించింది. ఈ అంశాలన్నింటిపై లోతుగా, మరింత సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరాన్ని ఎన్‌డీఎస్‌ఏ విచారణ కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**కాంట్రాక్టర్ల కోసమే మేడిగడ్డకు మార్పు**

'కేసీఆర్ ఆదేశాల మేరకే మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణానికి వ్యాప్కోస్ నివేదిక ఇచ్చింది. లిఫ్టులు, పంపుల సంఖ్య పెరగడంతోనే ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగింది. కాంట్రాక్టర్ల కమీషన్లకు తలొగ్గి నిర్మాణ లోపాలపై కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మేడిగడ్డ కుప్పకూలింది. దుర్మార్గంగా ఆలోచించి దోపిడీ దొంగగా మారి తెలంగాణ సొత్తు లక్షల కోట్ల రూపాయలు కేసీఆర్ దోచుకున్నాడు. కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి వందల ఎకరాలు, ఫామ్‌హౌస్‌లు, మీడియా సంస్థలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలి? కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 85,449 కోట్లు అప్పు తీసుకున్నారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ఊరుపేరు మార్చి రూ. 1.50 లక్షల కోట్ల భారాన్ని తెలంగాణపై మోపారు. తెచ్చిన రుణంలో ఇప్పటివరకు అసలు, వడ్డీ కలుపుకుని రూ. 49,835 కోట్లు బ్యాంకులకు అప్పు చెల్లించాం. అసంపూర్తిగా మిగిలి ఉన్న ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలంటే ఇంకా రూ. 47 వేల కోట్లు అవసరం ఉంది. లోపభూయిష్ట నిర్ణయాలతో ఆర్థికభారం మోపిన కేసీఆర్, హరీశ్‌రావును శిక్షించాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం పూర్తిచేయాల్సిన ప్రాణహిత ప్రాజెక్టు ఉసురు తీసి ఉరి వేసింది కేసీఆర్ కాదా? కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా తెచ్చిన అప్పులను రీ–స్ట్రక్చర్ చేసి వడ్డీ భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. నేను ఢిల్లీకి సర్కస్ చూడటానికి వెళ్లడం లేదు. ఇప్పటివరకు ప్రధాని మోదీని కలిసి రూ. 26,400 కోట్ల రుణం రీ–స్ట్రక్చర్ చేసి ఏటా రూ. 4 వేల కోట్లు ఆదా చేస్తున్నాం. రుణాలు రీ–స్ట్రక్చర్ అయితే ప్రతి నెలా రూ. వేయి కోట్లు ఆదా అవుతాయి. నాకు ప్రధాని మోదీ బడే భాయ్. జెండా, ఎజెండా వేరైనా అనుమతులు, నిధులు తెచ్చుకునే బాధ్యతపై నాపై ఉంది. మోదీని కలిసేందుకు నాకు భేషజాలు లేవు' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.


సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

# రూ.లక్ష కోట్లు కొల్లగొట్టేందుకే..

**కాళేశ్వరంపై చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

సాక్షి, హైదరాబాద్: రూ. లక్ష కోట్లు కొల్లగొట్టాలనే ఉద్దేశంతోనే గత పాలకులు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరానికి మార్చి తుమ్మిడిహెట్టికి బదులు మేడిగడ్డలో ప్రాజెక్టు నిర్మించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై శాసనసభలో అంతకుముందు చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు మాట్లాడుతుండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలగజేసుకొని సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. 2009, 2014లలో ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతిచ్చాక మళ్లీ నీటి లభ్యత గురించి కేంద్రాన్ని అడగడటమంటే వారి ఉద్దేశం ఏమిటో తెలుస్తుందన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టుకు నీటి లభ్యత ఉందని అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతితో పాటు కేంద్ర జల సంఘం రాసిన లేఖలను పట్టించుకోకుండా మేడిగడ్డలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ అసంపూర్తి సమాచారంతో హరీశ్‌రావు తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

**హరీశ్ చెప్పేవన్నీ అబద్ధాలే..**

ప్రాణహిత–చేవెళ్లలో నీరు అందుబాటులో ఉన్నందునే హైడ్రాలజీ అనుమతులు ఇస్తున్నామని అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతి 2014 అక్టోబర్ 24న స్పష్టంగా చెప్పారని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 205 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని లేఖ రాస్తే అక్కడ ప్రాజెక్టు నిర్మించకూడదనే ఉద్దేశంతోనే హరీశ్‌రావు పునఃపరిశీలించాలని మళ్లీ లేఖ రాశారని సీఎం చెప్పారు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచి ధ్రువీకరణ పత్రం తీసుకున్నాక.. ఎమ్మెల్యేను అయ్యానో లేదో మరోసారి పరిశీలించాలని అడిగినట్లుగా హరీశ్ వ్యవహరించిన ఉందని ఎద్దేవా చేశారు. తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టును మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించిందని హరీశ్‌రావు అబద్ధాలు చెబుతున్నారని సీఎం విమర్శించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం జరిపిన చర్చలన్నీ ప్రాజెక్టును 148 మీటర్ల ఎత్తులో నిర్మించాలా లేక 152 మీటర్ల ఎత్తులోనా అనే అంశంపైనే జరిగాయని రేవంత్ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే పుణేకు చెందిన ఓ సంస్థను కన్సల్టెన్సీగా తీసుకొని చర్చించారన్నారు. 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మిస్తే 160 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని తేల్చారని.. అయితే ఆ కన్సల్టెన్సీ నివేదికలు, కేంద్రం లేఖలను పక్కనబెట్టి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించారని రేవంత్ విమర్శించారు. నిజాంకన్నా శ్రీమంతుడు కావాలనే దురాశతోనే అనంతరాములు కమిటీని కేసీఆర్ ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. 2015 జనవరి 21న రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లతో కమిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అప్పటికే కేసీఆర్, హరీశ్‌రావు మేడిగడ్డ ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోవడంతోపాటు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంలో బ్యారేజీలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారని రేవంత్ ఆరోపించారు. చివరకు రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ల నివేదికను కూడా కనిపించకుండా చేశారని ఆరోపించారు. సిగరెట్ ప్యాకెట్‌పై ఆరోగ్యానికి హానికరమనే నినాదం రాసి ఉన్నట్లుగానే కొత్తగా ఏ ప్రాజెక్టుకు అనుమతిచ్చినా సీడబ్ల్యూసీ నీటి లభ్యతపై హెచ్చరికలు జారీ చేస్తుందని.. తుమ్మడిహెట్టితోపాటు మేడిగడ్డ విషయంలోనూ అదే రకమైన హెచ్చరికలు చేసిందన్నారు. కానీ తుమ్మడిహెట్టి హెచ్చరిక పేరుతో ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చిన కేసీఆర్, హరీశ్‌రావు.. మేడిగడ్డపై సీడబ్ల్యూసీ ఇచ్చిన హెచ్చరికను మాత్రం పట్టించుకోలేదని రేవంత్ మండిపడ్డారు.

**పీసీ ఘోష్‌పై విషం చిమ్ముతున్నారు**

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి నీరు అందుబాటులో ఉందని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2009 జూలై 18న అనుమతి ఇచ్చిందని.. కానీ ఈ రికార్డులను కావాలనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొక్కిపెట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సీడబ్ల్యూసీ హైడ్రాలజీ సౌత్ డైరెక్టరేట్ కూడా 236 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని చెప్పినట్లు తెలిపారు. ఇవన్నీ పట్టించుకోకుండా ప్రాజెక్టు ప్రాంతాన్ని మార్చి ఇప్పుడేమో ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై విచారణ జరిపి నివేదిక ఇచ్చిన జస్టిస్ పీసీ ఘోష్‌ను బీఆర్ఎస్ నేతలు వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని సీఎం ధ్వజమెత్తారు. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో వాస్తవాలను బయటపెట్టారనే ఆయనపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. హరీశ్‌రావు తప్పు చేశారని నివేదికలోని పేజీ నంబర్ 98లో స్పష్టంగా పీసీ ఘోష్ పొందుపరిచారని రేవంత్ తెలిపారు. హరీశ్‌రావు వాస్తవాలను దాచిపెట్టి తప్పుడు వివరాలను ప్రస్తావిస్తున్నారని విమర్శించారు.

# నీటి లభ్యత కోసమే మేడిగడ్డకు..

▶ మొదటి పేజీ తరువాయి

హరీశ్‌రావుకు స్పీకర్ కొంత సమయం ఇచ్చారు.

**తుమ్మిడిహెట్టి వద్ద ఉపయోగం లేదంటేనే..**

నీటి లభ్యత లేకపోవడం, మహారాష్ట్ర ఒప్పుకోకపోవడం, చాప్రాల్ అభయారణ్యం ఉండటం వంటి కారణాలతోనే తమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు ముందుకు సాగలేదని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ స్వయంగా మహారాష్ట్ర సీఎంను కలిసినా ఫలితం లేకపోయిందని చెప్పారు. అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతి రాసిన లేఖలోని మూడో పేజీలో తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. 2009 నుంచి 2014 వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద తట్టెడు మట్టి కూడా ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. 'తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చినప్పుడు నీళ్ల ప్రవాహం ఎలా పెరిగింది అని మంత్రి జూపల్లి అంటున్నారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు 116 కిలోమీటర్ల దూరం ఉండగా, మధ్యలో మహారాష్ట్రలోని 16 వాగులు, తెలంగాణలోని 8 వాగుల నీళ్లు కలుస్తాయి. మేడిగడ్డ దగ్గర అదనంగా 120 టీఎంసీల నీటి లభ్యత ఉంటుంది. మా సూచన మేరకే అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కట్టి మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తెచ్చారని రిటైర్డ్ ఇంజినీర్లు కమిషన్‌కు స్పష్టంగా చెప్పారు. కానీ కమిషన్ వారి రిపోర్ట్‌ను పట్టించుకోలేదు' అని హరీశ్‌రావు వివరించారు.

**పోలవరం కూలితే ఎన్‌డీఎస్ఏ ఎందుకు రాలేదు?**

'డీపీఆర్ లేకుండా టెండర్లు పిలుస్తారా అంటున్నారు. ప్రాణహితకు డీపీఆర్ 2009లో వస్తే, 28 ప్యాకేజీలకు టెండర్లు, మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చింది మీరు (కాంగ్రెస్ ప్రభుత్వం). నారాయణపేట లిఫ్టు ఇరిగేషన్‌కు డీపీఆర్ లేకుండా టెండర్లు పిలిచింది మీరు కాదా? జలయజ్ఞంలో ఎన్నో ప్రాజెక్టులకు డీపీఆర్‌లు లేకుండానే టెండర్లు పిలిచారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎన్‌డీఎస్ఏ గురించి గొప్పగా చెపుతున్నారు. దేశం మొత్తానికి ఒక నీతి, కాళేశ్వరానికి ఒక నీతి ఉంటదా? గోదావరి నదిపై కట్టిన పోలవరం 10 సార్లు కూలింది. ఎందుకు ఒక్కసారి కూడా ఎన్‌డీఎస్ఏ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు? ఎన్‌డీఎస్ఏ చైర్మన్‌గా పనిచేసిన చంద్రశేఖర్ అయ్యర్ పోలవరం ప్రాజెక్టు సీఈఓగా ఉన్న సమయంలోనే అది 5 సార్లు కూలింది. ఆయన ఇచ్చే రిపోర్టుకు ఇక విశ్వసనీయత ఏముంటది? ఎస్ఎల్బీసీ, సుంకిశాల కూలాయి. వట్టెం మునిగింది, పెద్దవాగు కొట్టుకుపోయింది. అయినా వీటి మీద ఎన్‌డీఎస్ఏ రాదు, కమిషన్లు వేయరు. ఎన్‌డీఎస్ఏ తన రిపోర్టులో మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాకు నిర్మించి ఆపరేషన్‌లోకి తేవాలి అని సూచిస్తే ఈ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు?' అని ప్రశ్నించారు.

**మేడిగడ్డలో మరమ్మతు చేస్తే సరిపోతుంది**

మేడిగడ్డ బరాజ్‌లోని ఏడో బ్లాకులో మూడు పిల్లర్లు కుంగటం తప్ప వ్యవస్థ అంతా అద్భుతంగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. ఏడు బ్లాకుల్లో ఒక బ్లాకు మొత్తం తీసినా రూ.300 నుంచి రూ. రూ.4 వందల కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. అది కూడా చేయకుండా ఎందుకు రాజకీయ రాద్ధాంతం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ఒకవైపు కాళేశ్వరం కూలిందని చెబుతూ.. మరోవైపు హైదరాబాద్‌కు కాళేశ్వరం నీళ్లు తెస్తామని రూ.7,000 కోట్లతో టెండర్లు వేశారని, కాళేశ్వరం కూలిపోతే హైదరాబాద్‌కు కాళేశ్వరం నీళ్లు ఎక్కడికెళ్లి వస్తాయి?' అని ప్రశ్నించారు.

# ఈ నివేదిక కోర్టులో నిలబడదు

**కాళేశ్వరం కమిషన్ ఇచ్చింది డొల్ల, చెత్త నివేదిక**

- లఘు చర్చలో హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరం కమిషన్ నివేదిక న్యాయస్థానం ముందు నిలబడదు. ఇది డొల్ల రిపోర్టు, చెత్త రిపోర్టు' అని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఆదివారం అసెంబ్లీలో పీసీ ఘోష్ విచారణ కమిషన్ నివేదికపై జరిగిన లఘు చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తమ హక్కులను కాపాడాలని, కాళేశ్వరం నివేదికను తిరస్కరించాలని కోరుతూ తాము కోర్టుకు వెళ్లామే తప్ప, అసెంబ్లీలో చర్చించవద్దని కోర్టుకు వెళ్లలేదన్నారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్–1952లోని 8బీ, 8సీ నిబంధనలు పాటించకుండా నిబంధనలు అనుసరించలేదనే కోర్టును ఆశ్రయించామన్నారు. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేస్తే తామెక్కడ సుప్రీంకోర్టులో విచారణ కమిషన్‌ను రద్దు చేయిస్తమోనని కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసిందని హరీశ్ విమర్శించారు. కమిషన్ నివేదిక ఏ విధంగానూ నిలబడేది కాదని.. కొట్టుకుపోతుందని, ఏ క్షణామైనా స్టే వస్తుందనే ఆదరాబాదరాగా ఆదివారం అసెంబ్లీలో చర్చకు పెట్టారన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రాథమిక నివేదిక, పార్లమెంట్ ఎన్నికలకు ముందు మధ్యంతర నివేదిక, బీఆర్ఎస్ రజతోత్సవ సభ సమయంలో తుది నివేదిక. ఇప్పుడు స్థానికసంస్థల ఎన్నికల ముందు ఘోష్ కమిషన్ రిపోర్టు. ప్రభుత్వం నడుపుతున్నారా? సర్కస్ డ్రామా కంపెనీ నడుపుతున్నారా?' అని హరీశ్ ప్రశ్నించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ చట్టబద్ధంగా విధివిధానాలను పాటిస్తూ జరిగిందా లేదా అనే దానిపై చర్చించాల్సి ఉందన్నారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ , ప్రణబ్ ముఖర్జీ, ఎల్‌కే అద్వానీ, కిరణ్ బేడీ, జయలలిత తదితరులపై విచారణ కమిషన్‌లు 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వకుండా నివేదికలు ఇవ్వగా అవి న్యాయస్థానాలముందు నిలబడలేదని హరీశ్ గుర్తుచేశారు. ఆ నివేదికలన్నీ చిత్తు కాగితాలతో సమానమని పేర్కొన్నారు. ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా అప్పటి చీఫ్ జస్టిస్ షా కమిషన్, జస్టిస్ లిబరహాన్ కమిషన్ నివేదికలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జాతీయ పార్టీలు ఆందోళన చేయలేదా? అని ప్రశ్నించారు.

# కాళేశ్వరం.. మనిషి సృష్టించిన విపత్తు!

**ఆ ప్రాజెక్టుతో ప్రజలపై రూ.1.47 లక్షల కోట్ల భారం**

- తుమ్మిడిహెట్టి వద్ద రూ.38 వేల కోట్లతోనే పూర్తయ్యేది
- మేడిగడ్డ బరాజ్ కుంగటంతో రూ.20 వేల కోట్ల నష్టం
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి వద్ద రూ.38 వేల కోట్లతో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయకుండా, కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర ప్రజలపై రూ.1.47 లక్షల కోట్ల భారం మోపారని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ వంటి మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుతో రూ.24 వేల కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఇది అత్యంత దురదృష్టకరమైనదని, మనిషి సృష్టించిన విపత్తు అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై ఆదివారం శాసనసభలో ఉత్తమ్ స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోయడానికే ఏటా రూ.9,735 కోట్ల కరెంట్ బిల్లు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు.

**నాటి సీఎం, మంత్రులదే బాధ్యత**

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం వాప్కోస్ సంస్థ 2015 ఏప్రిల్ 1న సమర్పించిన డీపీఆర్‌లో మేడిగడ్డ బరాజ్ నిర్మాణం గురించి ఎలాంటి ప్రస్తావన లేదని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మేడిగడ్డ బరాజ్‌కు పరిపాలనా అనుమతి కోసం ఇచ్చిన జీఓ 231తో గత ప్రభుత్వం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద మూడు బరాజ్‌లు నిర్మించిందని చెప్పారు. దీనివల్ల ప్రాజెక్టు వ్యయం రూ.38,500 కోట్ల నుంచి రూ.80 వేల కోట్లకు పెరిగిందని వెల్లడించారు. కాగ్ అంచనాల ప్రకారం ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి రూ.1.47 లక్షల కోట్ల వ్యయం అవుతుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన తప్పులు, లోపాలకు అప్పటి సీఎం, నీటిపారుదల, ఆర్థిక శాఖల మంత్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఉత్తమ్ స్పష్టం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ప్రణాళిక, నిర్మాణంలో నిర్లక్ష్యం, లోపాలు ఉన్నాయని ఘోష్ కమిషన్ తన నివేదికలో పొందుపర్చిందని వివరించారు. జీఓ 28 ద్వారా ఏర్పడిన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికలో మేడిగడ్డ బరాజ్ నిర్మాణం అనుకూలం కాదని చెప్పినప్పటికీ వినకుండా నిర్మించారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పటం కూడా సరైన కారణం కాదని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ 2015, 2017లో ఇచ్చిన లేఖలలో నీటి లభ్యతపై చేసిన పరిశీలనలు ఒకేవిధంగా ఉన్నాయని తెలిపారు. రూ.లక్ష కోట్లతో ప్రాజెక్టు నిర్మించి, 2019–23ల మధ్య ఐదేళ్లలో ఎత్తిపోసింది 101 టీఎంసీలు మాత్రమేనన్నారు.

# వాస్తవాలు చెప్పేందుకే ఘోష్ కమిషన్

- దాని ఏర్పాటు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశంలేదు
- రీ డిజైన్ పేరుతో ప్రాజెక్టుల అంచనాలు పెంచారు
- కాళేశ్వరంపై చర్చలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ వేయడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శాసనసభకు స్పష్టం చేశారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు కూలిపోతే వాస్తవాలను ప్రజలకు వివరించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. కమిషన్ నివేదికను చెత్త అంటూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై భట్టి మండిపడ్డారు. ఘోష్ నివేదికపై శాసనసభలో ఆదివారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. వాస్తవాలు బయటకు రాకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల కోరిక మేరకు ఈ వ్యవహారంలో ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. అవాస్తవాలతో హరీశ్‌రావు సభను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలైనా నీళ్లు అందిస్తున్నాయని, కాళేశ్వరం ఎందుకు కూలిపోయిందని ప్రశ్నించారు.

**ప్రాణహితను పూర్తిచేస్తే సమస్య తీరేది..:** దివంగత ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో చేపట్టిన ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టును కొనసాగించి ఉంటే రాష్ట్రంలో తాగు, సాగు నీటి సమస్య తీరేదని భట్టి పేర్కొన్నారు. ఆ ప్రాజెక్టుకు 2007లోనే అనుమతి వచ్చిందని, 2009లో మొదలు పెట్టారని గుర్తు చేశారు. రూ.38 వేల కోట్లతో 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు, ఏడు జిల్లాలతోపాటు హైదరాబాద్‌కు 30 టీఎంసీల తాగునీరు అందేదని తెలిపారు. ప్రణహిత – చేవెళ్ల కోసం అప్పటికే రూ.11,680 కోట్లు ఖర్చుపెట్టారని, మరో రూ.27,500 కోట్లు ఖర్చు పెడితే 16.40 ఎకరాలకు సాగునీరు అందేదని అన్నారు. రూ.లక్ష కోట్లకు అంచనాలు పెంచి కాళేశ్వరం ప్రాజెక్టును ఎవరి కోసం కట్టారని ప్రశ్నించారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరు ఉండకూడదనే పాణహితను పక్కన పెట్టి, కాళేశ్వరాన్ని ముందుకు తెచ్చారని ఆరోపించారు. అన్ని ప్రాజెక్టుల్లోనూ రీ డిజైనింగ్ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని విమర్శించారు.

**కాళేశ్వరంలాగే హరీశ్‌రావు**

బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు కాళేశ్వరరావు అనే పేరుందని, ఆ ప్రాజెక్టులాగే ఆయన కూడా నిలబడలేకపోతున్నారని భట్టి విక్రమార్క చలోక్తి విసిరారు. జస్టిస్ పీసీ ఘోష్‌పై విమర్శలు చేయటం సరికాదని హితవు పలికారు. సీఎం కేసీఆర్ సభకు వచ్చి మాట్లాడితే హుందాగా ఉండేదని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు పదేళ్లు సభలో మైక్ ఇవ్వకపోయినా సభ నుంచి బయటకు వెళ్లలేదని తెలిపారు.

# మమ్మల్ని సలహాలు అడుగుతారేంటి?

**రాష్ట్ర ప్రభుత్వంపై ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అసహనం**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రతిపక్ష సభ్యులను అడగడం ఏమిటని మజ్లిస్‌పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ప్రభుత్వం జారీ చేస్తున్న జీవోలు, తీసుకుంటున్న నిర్ణయాలన్నీ ప్రతిపక్షాలను అడిగే చేస్తోందా? అని నిలదీశారు. అధికారంలో ఉన్నవారు నిర్ణయాలు ఎలా తీసుకోవాలో నేర్చుకోవాలని సలహా ఇచ్చారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై సభలో జరిగిన చర్చలో అక్బరుద్దీన్ మాట్లాడారు. ఏడాదిన్నరపాటు విచారణ జరిపిన కమిషన్ ఒక్కటంటే ఒక్క సిఫారసు చేయకుండా ఇచ్చిన నివేదిక ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణంలో బడా కాంట్రాక్టర్లు ఉన్నా ఒక్కరి పేరును కూడా కమిషన్ ఎందుకు నివేదికలో ప్రస్తావించలేదని అడిగారు. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకోవాల్సిందేనని అక్బరుద్దీన్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏం చేస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని అడిగారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఆ ప్రాజెక్టును ఎలా ఉపయోగించుకుంటారో వెల్లడించాలన్నారు. ఈ ప్రాజెక్టును గుదిబండలా మార్చొద్దని హితవు పలికారు. ఈ ప్రాజెక్టు అంత నాసిరకమైనది ఏమి కాదని.. ఇప్పటివరకు 10 లక్షల క్యూసెక్కుల నీరు వస్తున్నా.. తట్టుకొని నిలబడిందని చెప్పారు. అయితే అలా అని నిర్మాణ లోపాలు లేవని తాను చెప్పడంలేదన్నారు. ఘోష్ కమిషన్‌కు అన్ని రకాల పత్రాలను ప్రభుత్వం అందించలేదని అక్బరుద్దీన్ ఆరోపించారు.

# నివేదిక చదవకుండా నిందలొద్దు

**అక్బరుద్దీన్ విమర్శలపై సీఎం రేవంత్‌రెడ్డి**

సాక్షి, హైదరాబాద్: పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ప్రతి శాసనసభ్యుడి నుంచి సూచనలు తీసుకోవడానికే నివేదికను సభ ముందుకు తెచ్చినట్లు సీఎంరేవంత్‌రెడ్డి తెలిపారు. సభ్యులు లేవనెత్తే ప్రతి ప్రశ్నకు సభానాయకుడిగా తప్పకుండా బదులిస్తానని చెప్పారు. కమిషన్ నివేదికపై చర్చలో భాగంగా అక్బరుద్దీన్ ఒవైసీ లేవనెత్తిన అంశాలకు సీఎం రేవంత్ బదులిచ్చారు. నివేదికను పూర్తిస్థాయిలో చదివి, అర్థం చేసుకోకుండా ప్రభుత్వంపై నిందలు మోపేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని హితువు పలికారు. ఘోష్ కమిషన్‌ను కేవలం విచారణ కోసమే ఏర్పాటు చేశామని.. తీర్పు ఇచ్చేందుకు కాదని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించేందుకే కమిషన్ నివేదికను సభ ముందు ఉంచిందని చెప్పారు. సభ్యుల సూచనల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

# మామ చెప్పాడు.. అల్లుడు చేశాడు

**సీకెంట్ ఫైల్స్‌తో కట్టడమే కొంప ముంచింది**

- గూగుల్ మ్యాప్స్ చూసి కాళేశ్వరంకు ప్లాన్ చేశారు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌లను కాంక్రీట్‌తో కాకుండా సీకెంట్ ఫైల్స్‌గా నిర్మించడమే కొంప ముంచిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మామ చెప్పాడు, అల్లుడు చేశాడు అని కేసీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో ఆదివారం పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడుతున్నప్పుడు పొంగులేటి పలుమార్లు కల్పించుకుని మాట్లాడారు. 'గూగుల్ మ్యాప్‌ను ముందు పెట్టుకుని ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దేశంలో సీకెంట్ ఫైల్స్‌తో కాళేశ్వరం తప్ప ఏ ప్రాజెక్టు నిర్మాణం జరగలేదు. డయాఫ్రం వాల్‌కు 30 శాతం ఖర్చయ్యేదాన్ని వంద శాతం ఖర్చుతో సీకెంట్ ఫైల్‌కు వెళ్లారు. దీనిపై అధికారులకు గానీ, నవయుగ, ఎల్‌అండ్‌టీ, ఆఫ్కాన్స్ సంస్థలకు గానీ ఎలాంటి అనుభవం లేదు. మహా అనుభవజ్ఞులైన హరీశ్‌రావు సీకెంట్ ఫైల్స్‌కు కింగ్ పిన్. డయాఫ్రం వాల్ కాంక్రీట్‌తో కాకుండా సికెంట్ ఫైల్స్ వాల్ టెక్నాలజీతో కట్టడం వల్లే మేడిగడ్డ బరాజ్ కూలింది. మేడిగడ్డలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఉన్న బావి సైజులో రంధ్రం పడింది. ఒకే టెక్నాలజీతో కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయి. రూ.లక్ష కోట్లు గోదావరిలో కొట్టుకుపోవడానికి ఈ సీకెంట్ ఫైల్సే కారణం' అని ధ్వజమెత్తారు.

**12 రోజుల్లోనే రూ.లక్షన్నర కోట్ల ప్రాజెక్టుకు ఆమోదం**

బీఆర్ఎస్ ప్రభుత్వం 25 రోజుల్లో మూడు నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి నిర్ణయం తీసుకుందని పొంగులేటి విమర్శించారు. 'రాజీవ్ సాగర్ – ఇందిరా సాగర్ నిర్మాణ వ్యయం రూ.18 వేల కోట్లకు పెంచారు. తుమ్మిడి హెట్టికి బదులు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి రూ.లక్ష కోట్లు దోచుకోవా లని పథకం వేశారు. కేవలం ఒక ఆపరేటర్‌ను పిలిచి గూగుల్ మ్యాప్ సాయంతో ప్రాజెక్టు నిర్మాణానికి కేసీఆర్ పథకం వేశారు. ఏం తొందర వచ్చిందని అప్పటికే రూ.11 వేల కోట్లు ఖర్చు పెట్టిన ప్రాణహిత ప్రాజెక్టును వదిలేసి మేడిగడ్డ కట్టాలనుకున్నారు? కమీషన్ల కోసమే కదా?' అని నిలదీశారు.

## కక్ష సాధించే ఉద్దేశం లేదు: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తమ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై కక్ష సాధింపులకు పాల్పడడం లేదని, అలా చేయాలనుకుంటే అధికారంలోకి వచ్చిన రెండో రోజు నుంచే చేసేవాళ్లమని శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శాసనసభలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పిసి ఘోష్ కమిషన్‌ను పీసీసీ కమిషన్ అని బీఆర్ఎస్ నేతలు అనడాన్ని ఆయన ఖండించారు. 'బీఆర్ఎస్ నేతలు కోర్టులో వ్యాజ్యాలు వేశారు. మీ వాదనలు హైకోర్టు ముందు ఉన్నాయి. మీకు ఇంకా కోర్టు నుంచి రిలీఫ్ రాలేదు. దాని గురించి హైకోర్టు తేలుస్తుంది' అని పేర్కొన్నారు.



# పీసీ ఘోష్ కమిషన్ నివేదిక చెత్త

**అసెంబ్లీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ సభ్యులు**

- కమిషన్ నివేదికను గన్‌పార్కు వద్ద చెత్తబుట్టలో వేసి నిరసన
- కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్ర : కేటీఆర్
- లెక్కపెట్టి వడ్డీతో సహా చెల్లిస్తాం: హరీశ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికను చెత్తగా బీఆర్ఎస్ అభివర్ణించింది. అసెంబ్లీలో మాజీమంత్రి హరీశ్‌రావు ప్రసంగాన్ని ప్రభుత్వం అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వచ్చారు. సభలో నిరసన తెలుపుతున్న సభ్యులను ప్రభుత్వం మహిళా మార్షల్స్‌తో అడ్డుకునే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. గన్‌పార్కులోని తెలంగాణ అమరుల స్తూపం వద్ద పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను చించి చెత్తబుట్టలో వేసి నిరసన తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై మాట్లాడేందుకు సమయం ఇవ్వకుండా ప్రభుత్వం తమ గొంతు నొక్కే ప్రయత్నం చేసిందని ఆరోపించారు.

**భట్టి నిరూపిస్తే రాజీనామా చేస్తా: హరీశ్**

'రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, కుట్రలు, అక్రమ కేసులను లెక్కపెట్టి వడ్డీతో సహా చెల్లిస్తాం. ప్రభుత్వం వేసిన విచారణ కమిషన్ నివేదిక కోర్టులో నిలబడదు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలోని డొల్లతనాన్ని వివరించే ప్రయత్నం చేస్తే సీఎం సహా మంత్రులు 33 సార్లు నా ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు రాలేదని చెబుతున్న మంత్రులు క్షేత్రస్థాయికి వస్తే వాస్తవాలు చూపిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే హైదరాబాద్‌కు గోదావరి జలాలు వచ్చాయి. పంచాయతీ ఎన్నికలకు వెళ్లేందుకు బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, కమిషన్ నివేదికలతో కేసీఆర్‌ను వేధించేందుకు కుట్రలు పన్నారు. కాళేశ్వరంలో కుంగిన మూడు పిల్లర్లను మరమ్మతు చేసి నీరివ్వకుండా బురద రాజకీయాలు చేస్తున్నారు. ఎన్ని కుట్రలు చేసి కేసీఆర్ ఇమేజ్‌ను దెబ్బతీయాలని చూసినా తెలంగాణ ప్రజలు నమ్మరు. బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు తెలంగాణ ప్రయోజనాలకు గండికొట్టొద్దు. మేడిగడ్డను వద్దనుకుంటే గోదావరి నీళ్లను బనకచర్లకు తరలించినట్లే. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకూ నీళ్లు రాలేదని చెబుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దాన్ని రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా' అని హరీశ్‌రావు సవాల్ విసిరారు.

**అసెంబ్లీలో మా గొంతు నొక్కారు: కేటీఆర్**

'అసెంబ్లీలో మా పార్టీ గొంతు నొక్కి ఎన్ని కుట్రలు చేసినా కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకుంటాం. ప్రాజెక్టు కోసం ప్రజాఉద్యమం చేసేందుకు అవసరమైన కార్యాచరణపై పార్టీలో చర్చించి నిర్ణయిస్తాం. కాళేశ్వరంపై జరుగుతున్న కుట్రను ప్రజల్లో ఎండగడతాం. ప్రాజెక్టును కూల్చి ఇబ్బంది పెట్టే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. గతంలో జరిగిన ప్రమాదం కూడా కాంగ్రెస్ నాయకత్వమే కుట్ర చేసి మేడిగడ్డ బ్యారేజీ నష్టానికి కారణమైందన్న ఆరోపణలు ఉన్నాయి. అదే తీరుగా ఈరోజు కాళేశ్వరాన్ని పూర్తిగా, శాశ్వతంగా పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్‌ను బద్నాం చేయాలనే కుట్రతోనే కాంగ్రెస్ ఈ నివేదికను రూపొందించింది. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులకు రూ. 350 కోట్లే ఖర్చవుతాయి. ఎక్కడ ప్రమాదాలు జరిగినా ఎన్‌డీఎస్ఏ విచారణ చేపట్టదు. కానీ తెలంగాణలో జరిగిన చిన్న ప్రమాదాన్ని పెద్దగా చేసి చూపించే కుట్ర చేస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి చేస్తున్న కాళేశ్వరంపై కుట్రను ఎండగడతాం. పీసీ ఘోష్ రూపొందించిన చెత్త నివేదికపై న్యాయపోరాటం కొనసాగిస్తాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు.


నివేదికను చెత్తబుట్టలో వేస్తున్న కేటీఆర్, సబిత, సునీత, చిత్రంలో హరీశ్, జగదీశ్‌రెడ్డి, గంగుల తదితరులు

## మరికొంత సమయమివ్వండి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ముగ్గురు ఎమ్మెల్యేల విజ్ఞప్తి!

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న తమకు అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన నోటీసులకు సమాధానమిచ్చేందుకు మరికొంత గడువు కావాలని ముగ్గురు ఎమ్మెల్యేలు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. స్పీకర్ కార్యాలయం నుంచి తమకు అందిన నోటీసులపై సమాధానమిచ్చేందుకు 10 రోజులు గడువివ్వాలని ఈ సందర్భంగా వారు స్పీకర్‌ను కోరినట్టు తెలుస్తోంది.

## బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్

- కాళేశ్వరం అవినీతి ప్రస్తావనేది
- బీజేపీ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: జస్టిస్ ఘోష్ నివేదికను ప్రభుత్వం శాసనసభ ముందు పెట్టడం ఓ రాజకీయ డ్రామా అని బీజేపీ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి దుయ్యబట్టారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రూ. కోట్ల అవినీతి జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఆ విషయంపై ఎందుకు విచారణ జరిపించడం లేదన్నారు. కమిషన్ సూచించిన అంశాల్లోనూ అవినీతి ప్రస్తావన లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేయమని సీఎం అన్నప్పుడే ఇది కంటి తుడుపు నివేదికని తేలిపోయిందన్నారు. ప్రస్తుతమున్న సీఎస్ రామకృష్ణారావు అప్పట్లో కీలకమైన పదవిలో ఉన్నారని, ఆయనతోపాటు అనేక మంది ఐఏఎస్‌లను తప్పించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. రూ. లక్ష కోట్ల అవి నీతి అని చెప్పి, కాళేశ్వరంలోని కేవలం మూడు బరాజ్‌లపై, రూ.7 వేల కోట్ల నిర్మాణ పనులపైనే కమిషన్ వేయడంలో ఉద్దేశమేంటన్నారు.

# 50% సీలింగ్ ఎత్తివేతకు సభ ఓకే

**పురపాలికలు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం**



- అశాస్త్రీయంగా ఉన్న బిల్లులు కోర్టుల్లో నిలబడవన్న బీఆర్‌ఎస్ సభ్యుడు గంగుల
- అపశకునం పలకొద్దని కౌంటర్ ఇచ్చిన మంత్రి పొన్నం.. ఇరువురి మధ్య వాగ్వాదం
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై చర్చకు బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ డిమాండ్
- బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఎంఐఎం



సాక్షి, హైదరాబాద్: పురపాలక, పంచాయతీరాజ్ ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50 శాతం గరిష్ట పరిమితిని ఎత్తేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తెలంగాణ పురపాలికల చట్టం -2019 సవరణ బిల్లుతోపాటు పంచాయతీరాజ్ చట్టం -2018 సవరణ బిల్లును రాష్ట్ర శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పురపాలికల బిల్లును, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క పంచాయతీరాజ్ బిల్లును సభలో ప్రవేశపెట్టి వాటి ఉద్దేశాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలనే లక్ష్యంతో ఈ బిల్లును తీసుకొచ్చామన్నారు. 'జనాభా, రాజకీయ వెనుకబాటుతనంపై నిర్ధారిత గణాంకాల ఆధారంగా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు సీట్లు, పదవుల కేటాయింపుల్లో రిజర్వేషన్లను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటించాలి'అనే నిబంధనను ఈ బిల్లుల ద్వారా ప్రభుత్వం రెండు చట్టాల్లో చేర్చడానికి ప్రతిపాదించింది. ఈ బిల్లులపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది.

### అపశకునం మాట్లాడతారా?: గంగులపై మంత్రి పొన్నం ధ్వజం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సభలో భేదాభిప్రాయాలకు తావులేకుండా పార్టీలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించాలని పురపాలికల బిల్లుపై చర్చ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. చట్టాలపై న్యాయస్థానాలు సమీక్షించేటప్పుడు మూడ్ ఆఫ్ ద హౌస్‌ను పరిగణనలోకి తీసుకుంటాయన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకాలేదని ఆరోపించారు. అందుకు పొన్నం స్పందిస్తూ గత పదేళ్ల అధికారంలో ఉండి బీసీలకు ఎవరేం చేశారో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని బదులిచ్చారు. బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్ష, ప్రతిపక్ష నేత పదవులన్నీ కేసీఆర్ కుటుంబమే అట్టిపెట్టుకొని బీసీలకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. బిల్లుపై ఏమైనా సలహాలుంటే స్పీకర్‌ను గంగుల వ్యక్తిగతంగా కలిసి తెలియజేయాలి తప్ప సభలో ప్రస్తావించి వాటి ఆధారంగా బిల్లులను కోర్టుల్లో సవాల్ చేయాలని సంకేతాలిస్తున్నట్లు గంగుల మాటలు ఉన్నాయన్నారు. బీసీలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తుంటే గంగుల అపశకునం మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

### గంగుల వర్సెస్ పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవగాహన లేదని గంగుల కమలాకర్ వ్యాఖ్యానించగా ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు వద్దని బీఆర్‌ఎస్ చెబితే బిల్లును వెనక్కి తీసుకుంటామన్నారు. గంగులతో పోలిస్తే తాను ఎక్కువ చదువుకున్నానని.. ఆకారంలో పెద్దగా ఉండటంతోనే తనకంటే ఎక్కువ అవగాహన ఉన్నట్లు గంగుల భావిస్తున్నారని మంత్రి పొన్నం మండిపడ్డారు. అయితే తనను బాడీ షేమింగ్ చేశారని గంగుల అభ్యంతరం తెలపగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కల్పించుకొని మంత్రిపై తొలుత చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని గంగులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ జోక్యం చేసుకొని ఇరువురు బీసీ నేతలు పరస్పరం అవమానించుకొని ఇతరుల దృష్టిలో పలుచన కావొద్దని సూచించారు.

### కోర్టుల్లో బిల్లులు నిలబడవు...

అనంతరం గంగుల మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి ప్రతిపాదించిన బిల్లులు ఆమోదం పొంది అమల్లోకి వస్తే ఆనందించే వారిలో ముందుంటానన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీఆర్‌ఎస్ కోరుకుంటోందని చెప్పారు. ప్రభుత్వం అశాస్త్రీయంగా బీసీ రిజర్వేషన్ల పెంపునకు చర్యలు తీసుకుందని.. ఇది న్యాయస్థానాల్లో నిలబడవని తేల్చిచెప్పారు. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా డెడికేటెడ్ కమిషన్ వేయాలని జీవో 18పై రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. బిహార్‌లో బీసీ రిజర్వేషన్ల పెంపు విఫలమైందని.. అలా కావొద్దనే తాను ప్రభుత్వానికి సూచనలు చేస్తున్నానన్నారు. బీసీలపట్ల చిత్తశుద్ధి ఉంటే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం -1992 కింద డెడికేటెడ్ కమిషన్ వేసి మళ్లీ బీసీ గణన చేపట్టాలని సూచించారు.

### గవర్నర్ దగ్గరకు అఖిలపక్షం: పొన్నం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించాలని కోరుతూ అన్ని పార్టీల నేతలతో సోమవారం రాష్ట్ర గవర్నర్‌ను కలుస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. గతంలో పంపిన ఆర్డినెన్స్ ఆమోదం కోసం రాష్ట్రపతి, ప్రధానమంత్రిని కలవాలని అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వడం లేదని, ఈ నేపథ్యంలో గవర్నర్‌ను కలిసి పరిస్థితిని వివరిస్తామని తెలిపారు. ఈ అంశంపై తమ ఆలోచనను తాము చెపుతామని, ఏం నిర్ణయం తీసుకుంటారనేది గవర్నర్ ఇష్టమని అన్నారు. ఆదివారం అసెంబ్లీ లాబీలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30వ తేదీలోగా ఎన్నికలు నిర్వహిస్తామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని స్పష్టంచేశారు. కాగా, గవర్నర్ వద్దకు అఖిలపక్ష నేతలను ఆహ్వానించేందుకు మంత్రి పొన్నం అసెంబ్లీ లాబీలోని పలు పార్టీల కార్యాలయాలకు వెళ్లారు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ ఫ్లోర్ లీడర్లు, ఎమ్మెల్యేలను కలిసి ప్రభుత్వ పక్షాన లేఖను అందజేశారు.

### కామారెడ్డి డిక్లరేషన్‌పై చర్చ జరగాలి: పాయల్ శంకర్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బిల్లులపై బీసీలకు ఉన్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలన్నారు. న్యాయ సమీక్షకు నిలబడేలా చట్టాలను రూపొందించాలన్నారు. రాజ్యాంగంలోని షెడ్యూల్-9లో చేర్చడం ద్వారా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. లక్ష కోట్లను బీసీలకు బడ్జెట్‌లో కేటాయిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 22 నెలలైన నేపథ్యంలో ఇప్పటికే రూ. 40 వేల కోట్లను కేటాయించాల్సి ఉందన్నారు. కాగా, బీసీల రిజర్వేషన్ల పెంపు బిల్లుకు సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ఎంఐఎం సభ్యుడు మాజిద్ హుస్సేన్ తెలిపారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా అసెంబ్లీలో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం చరిత్రాత్మకమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బిల్లుల ఆమోదానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు, బిల్లుకు మద్దతు తెలిపిన ప్రతిపక్ష పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. జనాభా వాటా ప్రకారం బీసీలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలన్న రాహుల్‌గాంధీ ఆశయాలను నెరవేర్చే క్రమంలో మంచి పరిణామం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా బీసీలకు రిజర్వేషన్లు అమలయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని మహేశ్‌గౌడ్ వెల్లడించారు.

**పదేళ్ల పాటు కేసీఆర్ బీసీలను అణగదొక్కారు**

రాష్ట్రంలోని బలహీన వర్గాలను పదేళ్ల పాటు బీఆర్‌ఎస్, కేసీఆర్‌లు అణగదొక్కారని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. బీసీలను అణగదొక్కి ఆ వర్గాలకు రిజర్వేషన్లను కేసీఆర్ కుదిస్తే కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఆఫీస్‌బేరర్లు, కార్పొరేషన్ల చైర్మన్లతో ఆయన జూమ్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. జూమ్ సమావేశంలో భాగంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్న విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రాజకీయంగా, న్యాయపరంగా ఎన్ని అడ్డంకులు వచ్చినా బీసీలకు రిజర్వేషన్ల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని, పనితనాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీని హీరోగా నిలబెట్టాలని పార్టీ నేతలకు మహేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు.



# కల్వకుండా చేసే కుటుంబమది!

▶ మొదటి పేజీ తరువాయి

కమిషన్ ద్వారా ఆ ప్రక్రియ చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్య హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. పిటిషన్ విచారించిన హైకోర్టు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. మరుక్షణమే డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి కుల గణన నిర్వహించాం. ఎలాంటి అడ్డంకులు రాకూడదనే అధికారుల కమిటీని, మంత్రులను ఇతర రాష్ట్రాలకు పంపి సమాచారాన్ని సేకరించాం. న్యాయపరంగా ఎదుర్కొన్న సమస్యలను పరిశీలించిన తరువాతనే డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాం. ఈ ప్రక్రియను 2024 ఫిబ్రవరి 4న ప్రారంభించి 2025 ఫిబ్రవరి 4న పూర్తిచేశాం. 365 రోజుల్లోనే పకడ్బందీగా చట్టాన్ని చేసి స్థానిక సంస్థల్లో బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. మంత్రివర్గ తీర్మానం చేసి శాసనసభలో ఆమోదించుకుని.. విద్య, ఉద్యోగ రంగాల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించిన రెండు వేర్వేరు బిల్లులను గవర్నర్‌కు పంపించాం. గవర్నర్ వాటిని ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించారు. 5 నెలలుగా ఆ బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది'అని సీఎం గుర్తు చేశారు.

**ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా లాబీయింగ్**

'స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండాలని గత ప్రభుత్వం 2018, 2019లో తీసుకొచ్చిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలు గుదిబండగా మారాయి. అందుకే ఆర్డినెన్స్ తీసుకొచ్చి రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని గవర్నర్‌కు పంపించాం. ఒకప్పుడు ఓ రాష్ట్రానికి ఆయన (గవర్నర్) ఆర్థిక మంత్రి. ఒకప్పుడు ఈ రాష్ట్రానికి ఆర్థిక మంత్రి (ఈటల రాజేందర్)గా పనిచేసిన ఆయనతో మిత్రుత్వం ఉంది. రాష్ట్రపతికి పంపించాలని తెరవెనుక లాబీయింగ్ చేస్తే ఈ ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి వద్దకు పోయింది. ఆర్డినెన్స్ ఆమోదం పొందలేదు కాబట్టి అత్యవసరంగా ఆ బిల్లును సభలో ఆమోదించుకుందాం అంటే ఏదేదో మాట్లాడుతున్నారు. బీసీ కమిషన్‌కు ఇచ్చిన జీఓనైనా, డెడికేటెడ్ కమిషన్‌కు ఇచ్చిన జీఓనైనాం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆకాంక్షతోనే ఇచ్చాం'అని సీఎం స్పష్టం చేశారు.

**ఐదుసార్లు కోరినా ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు..**

పెండింగ్ బిల్లులపై సంప్రదించేందుకు ఐదుసార్లు ప్రధానికి లేఖ రాసినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకే ప్రధాని, కేంద్రంపై ఒత్తిడితెచ్చేందుకు జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించినట్లు వెల్లడించారు. బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు, గంగుల కమలాకర్ అటువైపు కన్నెత్తి చూడలేదని.. అంటే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి వాళ్ల పార్టీ నాయకుడు సిద్ధంగా లేరని అర్థమవుతోందని ఆరోపించారు. బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ తన పలుకుబడితో ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరారు. 'రాహుల్‌గాంధీ ధర్నాకు రాలేదని గంగుల అన్నారు. రాహుల్‌గాంధీ చెప్పకపోతే ఇంత ముఖ్యమైన పని నేను చేస్తానా? రాహుల్ గాంధీకి తెలియకుండా ఏదీచేయను. వందేళ్లుగా చేయని పనిని మేంచేస్తే.. కేసీఆర్ సభకు వచ్చి మమ్మల్ని అభినందించి ఉంటే పెద్దరికం పెరిగి ఉండేది. వారేమో రారుం..వచ్చిన వాళ్లు ఇలా ఉన్నారు'అని సీఎం మండిపడ్డారు.

## వాయిదా తీర్మానాల తిరస్కరణ

సాక్షి, హైదరాబాద్: కొమురంభీమ్ జిల్లాలోని ప్రాంతాలను పులుల సంరక్షణ ప్రాంతంగా నిర్ధారిస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై చర్చించాలని బీజేపీ సభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు ఇచ్చిన వాయిదా తీర్మానాలను, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అదనంగా యూరియా పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీపీఐ సభ్యుడు కూనంనేని ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు. బీసీ రిజర్వేషన్లపై చర్చలో బీఆర్‌ఎస్ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

**మాజీ ఎమ్మెల్యేల మృతి పట్ల అసెంబ్లీ సంతాపం**

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతి పట్ల ఆదివారం శాసనసభ సంతాప తీర్మానం ఆమోదించింది. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

# డిక్లరేషన్ కాదు.. డెడికేషన్ కావాలి

▶ మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రికి, మంత్రులకు తెలుసు. తెలిసి కూడా చేయలేదు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో దీనిపై ఐదు నాలుకలు, ఐదు స్వరాలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగబద్ధంగా సాధిస్తామని ఒకసారి, ఆర్డినెన్స్ ద్వారా అని ఇంకోసారి, పార్టీ పరంగా అని మరోసారి, రాహుల్‌గాంధీ ప్రధాని అయిన తర్వాత అని ఓసారి, ఇప్పుడేమో బిల్లు తెచ్చి చేస్తామని అంటున్నారు. ఇదంతా బీసీలు గమనించటం లేదనుకుంటున్నారా?'అని ధ్వజమెత్తారు. రిజర్వేషన్లకు 50 శాతం సీలింగ్ గత ప్రభుత్వంలో పెట్టారంటూ మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఉమ్మడి రాష్ట్రంలోనే ఆ చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. 'స్థానిక సంస్థల్లో బీసీలకు 37 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంపిన బిల్లే రాష్ట్రపతి వద్ద ఇంకా పెండింగులో ఉంది. దాన్ని వెనక్కి తెప్పించి ఇప్పుడు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను పంపాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో పంపిన ఆర్డినెన్స్‌పైనే సంతకం చేయని గవర్నర్, ఇప్పుడు బిల్లుపై సంతకం చేస్తారని ఎలా భావిస్తున్నారు? జిత్నీ ఆబాదీ ఉత్నా హఖ్, జిత్నీ భాగేదారీ ఉత్నీ హిస్సేదారీ'అని చెప్పే రాహుల్‌గాంధీ బీసీల రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడటం లేదు'అని కేటీఆర్ నిలదీశారు.

**ఆర్థికంగా ఎదిగినప్పుడే న్యాయం..**

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వేలో బీసీల జనాభా 6 శాతం తగ్గిందని తేలినా దానిపై సమీక్షించలేదని కేటీఆర్ విమర్శించారు. బీసీ సబ్ ప్లాన్ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. 'రాజకీయాల్లో అవకాశాలు ఇవ్వడంతోనే సామాజిక న్యాయం జరగదు. ఆర్థికంగా కూడా ఎదగాల్సి ఉంటుంది. ఎలాంటి లొసుగులు లేకుండా చట్టాలను చేస్తే ఏ న్యాయవ్యవస్థ కూడా అడ్డుపడదు. భావ సారూప్యత లేకపోయినా ధ్యేయ సారూప్యతతో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలనే విషయంలో మేము చిత్తశుద్ధి, నిజాయితీగా ప్రభుత్వాన్ని సమర్థిస్తున్నాం. మా ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన వెంటనే ప్రస్తుత ముఖ్యమంత్రి సన్నిహితుడైన గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి హైకోర్టుకు వెళ్లి దాన్ని అడ్డుకున్నారు'అని కేటీఆర్ విమర్శించారు. న్యాయ సమీక్షకు నిలబడని జీఓలతో బీసీల జీవితాలు ఎలా మారుస్తారో ప్రభుత్వమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి దగ్గరికి రాష్ట్రం నుంచి అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలని సూచించారు. రిజర్వేషన్ల సాధనకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేయాలని కోరారు.

# ప్రతికూల మాటలొద్దు

**రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా బీఆర్‌ఎస్ కలిసి రావాలి: మంత్రి శ్రీధర్‌బాబు**



సాక్షి, హైదరాబాద్: 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోంది. ఆ క్రమంలోనే ఇప్పుడు సభలో బిల్లు పెట్టాం. కానీ, అపశకునాలు పలుకుతూ బీఆర్‌ఎస్ నేతలు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆర్డినెన్సుపై గవర్నర్ సంతకం చేయనప్పటికీ, ఇప్పుడు మూడ్ ఆఫ్ ది హౌస్‌ను గుర్తించి ఆయన ఈ బిల్లుపై సంతకం చేస్తారన్న ఆశాభావంతో ఉన్నాం. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నేతలు వ్యతిరేకించటం మానేసి కలిసి రావాలని కోరుతున్నా'అని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై చర్చలో భాగంగా ప్రభుత్వ తీరును ఎండగడుతూ మాట్లాడిన బీఆర్‌ఎస్ సభ్యుడు కేటీఆర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్ ఇచ్చారు. శాసనసభ సమావేశాల నిర్వహణ నుంచి ప్రభుత్వం పారిపోతోందంటూ తప్పుడు ప్రచారం తగదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వరదలు, వినాయకుడి నిమజ్జన వేడుకలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సభ సమయాన్ని నిర్ణయించిందని, బీఆర్‌ఎస్ పారిపోయినట్టు తమ ప్రభుత్వం పారిపోవటం లేదని, తాము అందుబాటులోనే ఉంటామని, అంశాలపై చర్చకు సిద్ధమని చెప్పారు.

### గవర్నర్‌ను కలుద్దాం రండి: పొన్నం


బీసీ రిజర్వేషన్ల బిల్లుపై సంతకం చేసేలా గవర్నర్‌ను కలిసి విన్నవిద్దామని, అన్ని పార్టీల నుంచి ప్రతినిధులు వస్తే రాజ్‌భవన్‌కు రేపే వెళ్లి ఆయన్ను కలుద్దామని, మూడ్ ఆఫ్ ది హౌస్‌ను ఆయనకు వివరిద్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. లొసుగులు ఉంటే కోర్టులకు వెళ్లొచ్చని, కోర్టులకు వెళ్లొద్దని తాము అనటం లేదని, కోర్టులపై తమకు అపార గౌరవం ఉందని పేర్కొన్నారు. పరిస్థితి చూస్తుంటే.. బీఆర్‌ఎస్ సభ్యుల మాటలు వింటుంటే కోర్టులకు వెళ్లేలా పురిగొల్పుతున్నట్టు ఉందని, వారే కోర్టును ఆశ్రయించి బిల్లును నిలిపేసేలా ఉన్నారని ఎద్దేవా చేశారు. గతంలో గోపాల్‌రెడ్డి అనే కాంగ్రెస్ నేత కోర్టుకు వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు, భవిష్యత్‌లో వారే వార్తల్లో వ్యక్తులుగా మారే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. తమిళనాడు తరహాలో ఈ బిల్లు సాకారమవుతుందన్న ఆశ తమకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

### తెలంగాణతో పేగు బంధం తెంచుకుంది మీరే: ఆది శ్రీనివాస్



రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండానే, ఇక్కడ అమలవుతున్నట్టు బిహార్‌లో ఎన్నికల వేళ పత్రికల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలతో ప్రకటనలు కనిపిస్తున్నాయని, తెలంగాణ నిధులను బిహార్‌లో ఖర్చు చేస్తున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు చీఫ్‌విప్ ఆది శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. టీఆర్‌ఎస్ పేరును బీఆర్‌ఎస్‌గా మార్చి తెలంగాణతో పేగుబంధం తెంచుకుంది కేటీఆర్ పార్టీనేనని, గతంలో పంజాబ్‌లో చెక్కులు పంచిన చరిత్ర బీఆర్‌ఎస్‌దని, భారత రాష్ట్ర సమితి పేరుతో తెలంగాణ నిధులను దేశమంతా దోచిపెట్టింది ఆ పార్టీనేనని పేర్కొన్నారు.

### డొంకతిరుగుడు మాటలెందుకు: కూనంనేని



బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్‌ఎస్ సభ్యులవి డొంకతిరుగుడు మాటలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. వారి మాటలు ప్రజలు వింటే.. ఎమ్మెల్యేలంటే ఇలా అబద్ధాలు చెప్పాలని, మాట మార్చాలని అనుకునే ప్రమాదం ఉందని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు సంపూర్ణ మద్దతు అని చెబుతూనే, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చనిదే అవ్వదు అని, కేంద్రమే చేయాలని అంటున్నారని కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. కేంద్రం చేయాలంటే మన వద్ద నుంచి బిల్లు వెళ్లాలి కదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు అమలులోకి తేకుండా బీసీలకు అన్యాయం చేస్తున్నారని అంటున్న బీజేపీ నేతలు, బిల్లుకు కేంద్రంలో ఆమోదం ఎవరు తెలపలేదో చెప్పాలని, వారి మాటలు చూస్తుంటే అలనాటి సినిమాల్లో నాగభూషణం లాంటి వారు పోషించిన పాత్రల డైలాగులు గుర్తుకొస్తున్నాయన్నారు.



"చరిత్రను చూస్తే... తండ్రిని జైల్లో పెట్టిన సమ్రాట్టున్నారు. రాజ్యాధికారం కోసం అన్నల్ని చంపిన సోదరుడున్నాడు... ఔరంగజేబు. అలాంటి దురదృష్టకరమైన విధానం (వెన్నుపోటు) మళ్లీ ఇన్ని వందల ఏళ్ల తర్వాత తెలుగు జాతి చరిత్రలో తిరిగి జరిగింది.

– ఎన్టీఆర్



సాక్షి
సోమవారం, 1 సెప్టెంబర్ 2025

# తొలి ఉపాధ్యాయుడు

ఆ సాయంత్రం ఎవరో అపరిచితుడు ఇంటి తలుపు ముందుకు వచ్చాడు. 'నాన్నగారు ఉన్నారా?' అని అడిగాడు. 'లేరండీ... బయటకు వెళ్లారు' అని చెప్పాడు ఇంటి బాలుడు. ఆ బాలుడి నాన్న ఆ చిన్న ఊరికి పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్‌గా ఎన్నికై ఉన్నాడు. 'ఈ కానుక ఇక్కడ పెట్టి వెళ్లనా?' అని అడిగాడా అపరిచితుడు. అందుకు కనీసం తల్లి అనుమతి కావాలని బాలుడు తల్లిని అడిగాడు. ఆమె ఆ సమయానికి ప్రార్థనలో ఉండి బదులు ఇవ్వలేదు. 'సరే... పెట్టి వెళ్లండి' అన్నాడా బాలుడు. కాసేపటికి తండ్రి వచ్చాడు. కానుకను చూశాడు. 'ఎవరిచ్చారు ఇది' అని బాలుడిని అడుగుతూ కానుక తెరిచి చూశాడు. అందులో ఖరీదైన ధోతి, మిఠాయిలు, పండ్లు ఉన్నాయి. చిన్నచీటీ కూడా ఉంది ఆయన పేరున, కానుకిచ్చిన వ్యక్తి సంతకంతో. అందాక ఆ బాలుడు ఎన్నడూ చూడనంత కోపం వచ్చింది తండ్రికి. 'ఎవరు తీసుకోమన్నారు నిన్ను' గద్దించి అడిగేసరికి బాలుడు భయంతో ఏడుపు అందుకున్నాడు. 'నిన్నూ'... ఒక దెబ్బ వేశాడు. తల్లి కొడుకును పొదువుకుంది. తండ్రి కళ్లల్లో సిగ్గుతో, అవమానంతో కన్నీరు ఉబికింది.

'చూడు... ఇది కానుక. నా నుంచి ప్రయోజనం పొందడానికి ఇచ్చి వెళ్లింది. నేను పదవిలో ఉండగా తరతమ భేదం లేకుండా చేయవలసిన సాయం అందరికీ చేస్తాను. ఇలా కానుక తీసుకుంటే చేయకూడని సాయం కూడా చేయాల్సి రావచ్చు. మన ధర్మంలో కానుకలు నిషిద్ధం. మనుస్మృతిలో కూడా కానుకలు మనిషిలోని దైవిక కాంతిని హరిస్తాయి అని ఉంది. కాబట్టి ఇలాంటి తప్పు జీవితంలో చేయకు' అని కొట్టిన చేత్తోనే దగ్గరికి తీసుకున్నాడు. అబ్దుల్ కలామ్ అనే ఆ బాలుడు తర్వాత పెరిగి పెద్దవాడై భారతదేశానికి రాష్ట్రపతి అయ్యాడు. తండ్రి నేర్పిన పాఠాన్ని పొల్లుపోకుండా పాటించినందువల్ల రాష్ట్రపతి భవన్‌ను వీడి వచ్చే సమయానికి ఆయన వద్ద ఉన్నవి కేవలం రెండు చిన్న సూట్‌కేసులలో పట్టే దుస్తులు. తన సొంత బంధువులు రాష్ట్రపతి భవన్‌కు వస్తే వారి ఆతిథ్యానికి ఎంతయ్యిందో లెక్కవేసి అక్షరాలా 3,52,000 రూపాయలు చెల్లించిన ఆ ఉన్నతుడు నేడు జాతి గౌరవం అందుకుంటున్నాడు. తండ్రి పాఠాలు సరిగా చేరితే పిల్లలు ఇలా ఉంటారు.

ఐ.ఐ.టి.లో టాపర్‌గా వచ్చిన విదార్థిని 'నీకు ర్యాంక్ రావడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంత?' అనడిగితే 'చాలా ఉంది. నాన్న నన్ను విద్యార్థిలా పెంచాడు... అమ్మ కొడుకులా పెంచింది.. రెండూ మేలు చేశాయి' అన్నాడు. ఇల్లు అనే పాఠశాలలో తొలి ఉపాధ్యాయుడు తండ్రి. లాలనతో నిండిన తల్లి పాఠాలతో పాటు చూపులతోనే దండించగల తండ్రి పాఠాలు ఉంటేనే బాల్య, కౌమార సమయాల్లో లోకరీతులకు కొట్టుకుపోని విలువలను పాదుకొల్పవచ్చు. తండ్రి పిల్లల క్షేమం కోరతాడు, భవిష్యత్తుకై ఆరాటపడతాడు, అందుకై ఆర్థిక వనరుల కోసం రేయింబవళ్లు కష్టపడతాడు. నిజమే. కాని ఈ క్రమంలో అతడు తన 'టీచరు పోస్టు'ను, బోధనా బాధ్యతను విస్మరించజాలడు. 'నా పిల్లలకు ఏమి ఇస్తున్నాను' అనే తపనలో 'ఏమి' అనే ప్రశ్నకు జవాబు ఆర్థికమే కానక్కర లేదు. వాత్సల్యమే కానక్కర్లేదు. వారసత్వమే కానక్కర్లేదు. నేర్పవలసిన పాఠాలు ఉంటాయి, ఇంట్లోని ఈ కొడుకు/కూతురు సమాజంలో పౌరులవుతారు. ఎలాంటి పౌరులవుతారనే స్పృహ ప్రతి తండ్రికీ ముఖ్యం. 'ఇలా పెంచి వదిలారా' అనే మాట ఎందుకు రావాలి?

చైనాలో 'యెన్ చువాన్ షెన్ జియొవ్' అనే సంప్రదాయం ఉంది. తండ్రి తన చర్యలు, ప్రవర్తన, పాటించే విలువల ద్వారా పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలని దాని అర్థం. 'నువ్వు ఏమిటో అదే నీ పిల్లలు' అని తాత్పర్యం. ప్రతి ఆఫ్రికా తండ్రి పిల్లలకు బోధించే తొలిమాట 'నీ పై నువ్వు ఆధారపడు' అని. ప్రాదేశిక, సామాజిక, రాజకీయ కారణాల రీత్యా తండ్రులు చెప్పాల్సిన పాఠాలు స్వల్ప తేడాతో ఉంటాయిగానీ అన్నింటి అంతిమ లక్ష్యం విలువలతో కూడిన వ్యక్తిత్వమే. ఈ సిలబస్‌ను తండ్రులు పక్కనో గట్టునో పెట్టడం, సిలబస్ పూర్తి చేయడానికి సమయం లేదని వంక చెప్పడం ఒక సంగతి. అసలు సిలబసే లేదనుకోవడం మరో సంగతి.

సెప్టెంబర్ 5–'టీచర్స్ డే' అంటే అందరూ బడిలో ఉండే టీచర్స్ వైపు చూస్తారు. ఈ టీచర్స్ డే నాడు ఇంట్లోని తొలి ఉపాధ్యాయుడికి మొదటి శుభాకాంక్షలు చెప్పాలి. పిల్లలు ఆశీస్సులు తీసుకోవాలి. వారి సమగ్ర వ్యక్తిత్వాన్ని బేరీజు వేస్తూ ప్రతి తండ్రి తనకు తాను మార్కులు వేసుకోవాలి. ర్యాంకులు అక్కర్లేదు. పాసైతే చాలు. హ్యాపీ టీచర్స్ డే.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.నవమి రా.11.19 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** జ్యేష్ఠ సా.6.03 వరకు తదుపరి మూల, **వర్జ్యం:** రా.2.41 నుండి 4.25 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.45 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.21 నుండి 10.06 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

## సోషల్ టాక్

### కోట



మీరొక నిర్మాణ కార్మికుడిని, ఏం చేస్తున్నావు అని అడిగితే, అతను ఇటుకలు మోస్తున్నాను అని చెప్పవచ్చు. మరొకరు గోడ కడుతున్నాను అనొచ్చు. కానీ వారిలో ఒకరు కోట కడుతున్నా అంటారు. కార్మికులకు ఉండాల్సిన దృక్పథం ఇదే!

– సంజీవ్ పురి, 'ఐటీసీ' చైర్మన్

### స్వయంకృషి



భవిష్యత్తు కోసం వేచి ఉండకండి. స్వయంగా మీ చేతులతో దానిని నిర్మించుకోండి. మన భవిష్యత్తుకు మనమే చివరి రక్షకుల మన్నట్లుగా ముందుకు సాగండి. మన 'విధి'కి మనమే విధాతలం.

– కిమ్ జోంగ్ ఉన్, ఉత్తర కొరియా సుప్రీం లీడర్

### క్షమాగుణం



విద్యార్థులు అనేక విషయాలను అధ్యయనం చేసినప్పటికీ వాటన్నిటి జ్ఞాన సారం ఒక్కటే! అలాగే సకల సద్గుణాల సారాంశం ఒక్కటే... క్షమాగుణాన్ని కలిగి ఉండటం. క్షమ జీవితాన్ని సరళం చేస్తుంది. విధేయపరుస్తుంది.

– ముని ప్రణమ్య సాగర్, ఆధ్యాత్మిక గురువు

### విధ్వంసం



మనం ప్రకృతి నుండి దూరం అవుతున్న కొద్దీ, మనల్ని మనం పర్యావరణంలో ఒక భాగంగా చూసుకోవటం తగ్గుతుంది. చివరికి ఆ 'మరుపు' మనల్ని విధ్వంసం వైపు నడిపిస్తుంది. ముందు తరాలు కూర్చోవలసిన కొమ్మను మనం నరకటం అది.

– వివేక్ భట్టాచార్య, 'ఐఐఎం' ప్రొఫెసర్

### తొలిసారి



టాప్ ప్లేయర్స్‌ని ఓడించటం ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. వారు అజేయులు కాదని, వారిని మనం ఓడించగలమని గ్రహిస్తాం. మనం ఆ మొదటి విజయాన్ని పొందే వరకు, అగ్రశ్రేణి ఆటగాళ్లు వేరే ప్రపంచంలో ఉన్నట్లుగా మనకు అనిపిస్తూ ఉంటుంది.

– ఆర్. ప్రజ్ఞానంద, చెస్ గ్రాండ్ మాస్టర్

### తప్పేం కాదు



కొంతమంది నాకు మితి మీరిన ఆత్మవిశ్వాసం అంటారు. కావచ్చు. నేనే కాదు, మీరూ అలానే ఉండాలి. మీ సామర్థ్యంపై ఎవరికీ నమ్మకం లేనప్పుడు మీపై మీరు నమ్మకం ఉంచాలి. అది మిమ్మల్ని అప్పటికప్పుడు విజేతను చేస్తుంది.

– వీనస్ విలియమ్స్, టెన్నిస్ క్రీడాకారిణి

# చరిత్ర చెప్పని కథ

సందర్భం



నందమూరి లక్ష్మీపార్వతి

భారతదేశ రాజకీయ చరిత్రలో అత్యంత విషాద దినంగా సెప్టెంబరు 1 మిగిలిపోతుంది. ప్రజాస్వామ్యానికి పెను మచ్చగా చంద్రబాబు సొంత మామని దించివేసి తనది కాని పార్టీకి అధ్యక్షుడైన రోజు ఇది. ముఖ్యమంత్రి పదవికి తనను తానే ప్రకటించుకున్న రోజు. 1995 సెప్టెంబరు 1ని 'చీకటి దినం' (బ్లాక్ డే)గా ఎన్టీఆర్ గారు ప్రకటించారు. ఈ ద్రోహాన్ని చూస్తే రాజకీయాలే సిగ్గుపడతాయి.

చంద్రబాబు ఏ కాంగ్రెసు పార్టీ అండ చూసుకుని 1982లో ఎన్టీఆర్‌ను ఓడిస్తానని శపథం చేశాడో మళ్ళీ అదే కాంగ్రెసు పెద్దల ప్రలోభాలకు తలొగ్గి వైస్రాయి హోటల్ డ్రామా నడిపించి భారత ప్రధాని కాబోయే వ్యక్తిని అడ్డుకున్నాడు. ఇతడికి రాజకీయ గురువు రామోజీరావు గారనే విషయం అందరికీ తెలుసు.

ఎన్టీఆర్ పదవిలో ఉంటే 1996 పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆయనెక్కడ ప్రధాని అవుతారోనని వెరచిన కాంగ్రెసు పెద్దలు వ్యూహం పన్నారు. అందులో భాగంగానే... ఎన్టీఆర్ తన ప్రభుత్వాన్ని డిజాల్వ్ చెయ్యమని అడిగినా, వాళ్ళ మనిషి అయిన గవర్నర్ కృష్ణకాంత్ దానికి అంగీకరించ లేదు. అదే సమయంలో ఫోర్జరీ సంతకాలతో చంద్రబాబు ఎమ్మెల్యేలు పంపిన లేఖను అంగీకరించారు. చంద్రబాబుతో పాటు మంత్రులుగా ఉన్న మాధవరెడ్డి, దేవేంద్ర గౌడ్, అశోక గజపతిరాజు, కోటగిరి విద్యాధరరావులను ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగానే పార్టీ నుండి సస్పెండ్ చేస్తే... ఆ చంద్రబాబు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశానికి ఎలా అధ్యక్షుడవుతాడు? పైగా నిస్సిగ్గుగా ఆగస్టు 27న పార్టీ నుండి ఎన్టీఆర్‌ను సస్పెండ్ చేశాడు. 40 మంది ఎమ్మెల్యేలతో వెళ్లిన దగ్గుబాటి వెంకటేశ్వరరావును ఉప ముఖ్యమంత్రిని చేస్తానని నమ్మబలికి ఆయనను తాను ముఖ్యమంత్రి అయ్యాక, తీరా బయటకు పంపేశాడు.

ఆగస్టు 26న వైస్రాయి హోటల్ దగ్గరకు వెళ్ళిన ఎన్టీఆర్ మీద చెప్పులేసి అవమానించటమనేది ఆయన్ని బతికుండగానే చంపేయటమే!

చంద్రబాబు కుట్రల గురించి ఎన్టీఆర్ అప్పట్లో 'వార్త' పేపరుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టంగా చంద్రబాబు పార్టీని అక్రమంగా లాక్కున్నాడనీ, ఇలాంటి విశ్వాస ఘాతకు డిని చరిత్ర క్షమించదనీ అన్నారు. ఇలాంటి ఘాతుకాల పరంపర చంద్రబాబు జీవితంలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అతని అబద్ధాలను పెంచి పోషించి ప్రజల మెదళ్ళలోకి బలవంతంగా ఎక్కించటానికి పెంపుడు కుక్కల్లా పచ్చమీడియా పనిచేస్తూనే ఉంది.

ఆనాడూ, ఈనాడూ ఎన్టీఆర్ మీదా, లక్ష్మీపార్వతి మీదా వేయించిన కార్టూన్లు చూస్తే 'ఈనాడు' ఒక విష పత్రిక అనిపించక మానదు. కేవలం అధికారం కోసం ఒకరు, అధికారాన్ని నడిపించే రిమోట్ కోసం మరొకరు ఎన్టీఆర్‌ను దారుణంగా చంపేశారు. చరిత్రనే తల్లకిందులుగా చేసే రాతలు రాశారు. నిజానికి ఎన్టీఆర్ ప్రధానమంత్రి అవ్వకూడదనే కుట్రకు వీళ్ళు ఆజ్యం పోశారు. ఎందుకంటే ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఒక నెలకో, రెండు నెలలకో వాజ్‌పేయి ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. '1996 పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఎన్టీఆర్ ప్రైమ్ మినిస్టర్ క్యాండిడేట్‌గా నిలబడితే మా మద్దతు ఇస్తాము' అనేది ఆ ప్రకటన. దీంతో కాంగ్రెసు వాళ్ళతోపాటు రామోజీకీ కన్నెర్ర అయ్యింది. తన చేతిలో కీలుబొమ్మలా ఆడే చంద్ర బాబును తెచ్చుకుంటే తాము ఆడింది ఆటగా, పాడింది పాటగా ప్రభుత్వాన్ని నడిపించవచ్చనే దుష్ట పన్నాగానికి తెరతీశారు.

ఇన్ని అవమానాల మధ్య కూడా ఎన్టీఆర్ తలవంచలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో చంద్రబాబును ఓడించి అండమాన్ జైలుకు పంపిస్తానని ప్రతిజ్ఞ చేశారు. అతని కుట్రలను, కుయుక్తులను 'జామాతా దశమగ్రహం' అనే ఆడియో కాసెట్ ద్వారా బయటపెట్టారు. ఒక ఇంటర్వ్యూలో విలేఖరి ఎన్టీఆర్‌ను 'మీ అల్లుడి గురించీ, అతని మోసాన్ని గురించీ మీరు తెలుసుకోలేక పోయారు. అతడి అవినీతిని గురించి ఇప్పుడు చెబుతున్నారు. ఇన్నేళ్ళలో మీకు తెలియదా' అని అడిగారు.

అందుకు ఎన్టీఆర్ స్పందిస్తూ 'అతడొక మేకవన్నె పులి. వెనక గోతులు తీసేవాడిని, వెనక నుండి పొడిచేవాడిని తొందరగా గుర్తించలేం. అందులో అల్లుడి రూపంలో, నా ఇంట్లోనే ఉన్నాడాయె!. ఎలా గుర్తించగలం? తెలుసుకునేసరికి చాలా ఆలస్యమయ్యింది' అన్నారు. కాళిదాసు చెప్పినట్లు– '**విష వృక్షోఽపి సంవర్ధ్య స్వయం / ఛేత్తుం అసాంప్రతమ్**' – విత్తనం నాటేటప్పుడు తెలియదు. అది చెట్టయ్యాక చేదు ఫలాలనిస్తుందని! అయినా మమకారంతో ఆ చెట్టును నరకలేము కదా! అతని దుర్మార్గాలు కొంత తెలిసినా చంద్రబాబు పట్ల నా ఉదాసీన వైఖరి ఇలాంటిదే' అన్నారు.

చంద్రబాబు దుర్మార్గాలకు పరాకాష్ఠ (1996 జనవరి 17) ఎన్టీఆర్ పార్టీ డబ్బు మీద స్టే ఆర్డర్ తెచ్చి ఆయనకు రూపాయి కూడా అందకుండా చెయ్యటం! పర్యవసానం 'సింహగర్జన' ద్వారా తన గర్జనను వినిపించి అల్లుడి దుశ్చర్యలనూ, దుర్మార్గాలనూ ప్రజల్లోకెళ్లి ఎండగట్టాలనుకున్న ఎన్టీఆర్ అదే రోజు రాత్రి మరణించారు. అలా చీకటి భూతాలకు బలి సమర్పించినట్లయ్యింది. ఆయన మరణం అరాచక శక్తులకు మరింత ఊతమిచ్చింది. ఎన్టీఆర్ పోరాటం మధ్యలోనే ముగిసిపోయింది. ఆయన ప్రాణాలు తీసిన చంద్రబాబు మాత్రం ఇప్పటికీ అవే అబద్ధాలను, దుర్మార్గాలను పచ్చ మీడియా అండగా కొనసాగిస్తూనే ఉన్నాడు.

వ్యాసకర్త ఎన్టీఆర్ సతీమణి

"ఈ వెన్నుపోటు జరిగింది నాకొక్కడికి మాత్రమే కాదు. ప్రజలకు! మీకు, మీరు వేసిన ఓటుకు! మీరు నమ్మిన ప్రజాస్వామ్యానికి, మీరు విశ్వసించిన ఆశయాలకు, ఆదర్శాలకు ఇది వెన్నుపోటు! ఇది సిగ్గు చేటు. క్షమించరాని నేరం" అన్నారు ఎన్టీఆర్. ఆయన్ని వెన్నుపోటు పొడిచి 1995 సెప్టెంబర్ 1న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యి నేటికి 30 ఏళ్లు.





వైస్రాయ్ హోటల్ వెలుపల ఆవేదనాపూరిత ప్రసంగం చేస్తూ ఎన్టీఆర్ (వాహనంపై లక్ష్మీపార్వతి)



# విధానాలకు వెన్నుపోటు

విశ్లేషణ



టంకశాల అశోక్

తెలుగుదేశం పార్టీ రాజకీయాలలో 1995 ఆగస్టు సంక్షోభాన్ని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు చంద్రబాబు చేసిన ద్రోహం అనే కోణం నుంచి చర్చించడం జరుగుతూ వస్తున్నదే. ఆ పరిణామాలు మొత్తం దేశం దృష్టిని ఆకర్షించాయి. అయితే ఇందులో రెండవ కోణం కూడా ఉంది. అది ఎందువల్లనో చర్చలోకి రావటం లేదు.

ఢిల్లీ స్థాయిలో గానీ, దేశవ్యాప్తంగా పరిశీలకుల దృష్టిలో గానీ ఎన్టీఆర్ ఒక సాధారణ ప్రాంతీయ పార్టీ నాయకునిగా మిగలలేదు. మొదటి నుంచి కాంగ్రెస్ పలుకుబడిలో ఉండిన ఒక రాష్ట్రంలో ఆ పార్టీకి ప్రత్యామ్నాయాన్ని మొదటిసారిగా సృష్టించి స్థిరపరచటం, తద్వారా రెండు పార్టీల వ్యవస్థను సుస్థిరపరచటం వాటిలో మొదటిది. 1980ల నాటికి కాంగ్రెస్ గణనీయంగా బలహీనపడుతూ దేశమంతటా ప్రాంతీయ శక్తులు బలపడుతున్న దశలో ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్‌ని ఆ వరసలోకి తేవటం అందరి దృష్టినీ ఆకర్షించింది.

తర్వాత, ఒక సినిమా నాయకుని పరిపాలన ఏ విధంగా ఉండగలదనే సందేహాలు కలుగుతుండగా ఆయన సంక్షేమ రాజ్యం, అప్పటికి 30 ఏళ్లకు పైగా సంక్షేమ రాజ్యాన్ని నడుపుతున్నట్లు చెప్పుకునే కాంగ్రెస్‌ను మించి ప్రజల ఆమోదాన్ని పొందటం, అందుకు ఆధారప్రాయమైన పథకాలు, అవి లోపరహితంగా అమలు కావటం, పేదలు చిరకాలపు దారిద్ర్య రేఖ నుంచి క్రమంగా బయటపడుతుండిన సూచనలు పరిశీలకుల దృష్టిని ఆకర్షించాయి.

మరో అంశం రాష్ట్రాల హక్కులకు సంబంధించిన ఫెడరలిస్ట్ వైఖరి. బలమైన ఫెడరలిస్ట్ వైఖరి తీసుకుంటూ 'కేంద్రం మిథ్య' అనే సాహసోపేతమైన ప్రకటనతో దేశంలోని ఫెడరలిస్టులందరినీ ఉలికిపడజేశారు. కాంగ్రెస్ అయితే ఆయనపై 'దేశద్రోహి' అనే ముద్ర వేసేవరకు వెళ్లింది. అయినా జంకలేదు. ఆయన రాజకీయాలలో కొనసాగి ఉంటే కాంగ్రెస్ అనుసరిస్తుండిన యూనిటరిజానికి వ్యతిరేకంగా ఫెడరలిస్టు రాజకీయాలు మరెంతో బలపడి ఉండేవి. కాకతాళీయంగా ఇందుకు కొనసాగింపుగా ఎన్టీఆర్ అధ్యక్షునిగా, వీపీ సింగ్ కన్వీనర్‌గా 1989లో 'నేషనల్ ఫ్రంట్' ఏర్పడి కేంద్రంలో అధికారానికి కూడా వచ్చింది. ఫ్రంట్ మేనిఫెస్టోలో రాష్ట్రాల హక్కుల అంశాలు అనేకం ఉన్నాయి. అదే క్రమంలో ఒక ఆసక్తికరమైన అంశం... పరమ సాంప్రదాయికుడు కావటమే గాక కాషాయ వస్త్రధారిగా మారి విమర్శలను ఎదుర్కొన్న ఎన్టీఆర్, అప్పటి 'జనసంఘ్' పట్ల వీపీ సింగ్‌తో పాటు పూర్తి వ్యతిరేక వైఖరి తీసుకుని తనను తాను సెక్యులర్ వాదిగా ప్రకటించుకోవటం!

ఇవన్నీ ఎన్టీఆర్ వారసత్వంగా మిగిలి తెలుగువారి చరిత్రలోనే గాక దేశ చరిత్రలోనే మిగిలిపోయాయి. కాగా, ఈయనను దారుణమైన రీతిలో పడగొట్టి అధికారాన్ని చేజిక్కించుకున్న చంద్రబాబు విధానాలు ఏ విధంగా ఉండవచ్చునని అందరూ ఉత్సుకతతో ఎదురుచూశారు. చంద్రబాబు అధికార గ్రహణ చేయడానికి మించి ఎన్టీఆర్ ఘనమైన వారసత్వానికి గ్రహణం కూడా పట్టిస్తున్నట్లు అందరికీ త్వరలోనే అర్థమైంది. ఇండియా వంటి వర్ధమాన దేశంలో సామాన్య ప్రజల కన్నా ధనిక వర్గాల ప్రయోజనాలు ముఖ్యమని భావించిన చంద్రబాబు, మొదటి నుంచే ఆర్థిక సంస్కరణలకు పెద్ద పీట వేశారు. కనీసం ఆ సిద్ధాంతం చెప్పే పెర్కొలేషన్ థియరీని అయినా పాటించక, ఎన్టీఆర్ సంక్షేమ పథకాలకు ఒక్కటొక్కటిగా మంగళం పాడారు. సెక్యులరిజాన్ని వదిలేసి, అధికారం కోసం అవసరమైనప్పుడల్లా బీజేపీతో చేరుతూ అవకాశవాదిగా మారారు. ఫెడరలిస్ట్ శక్తులతో మైత్రి కూడా అదే విధమైన అవకాశవాదంగా మారింది.

ఈ విషయాలన్నింటినీ గమనించినపుడు, చరిత్రలో ఎన్టీఆర్, చంద్రబాబుల స్థానాలు ఏ విధంగా మిగిలేదీ ఎవరైనా ఊహించగలరు. ఈ విధంగా 1995 నాటి సంక్షోభమన్నది కేవలం అధికార రాజకీయాల సంక్షోభ చరిత్రగా కాక, అంతకు మించి విధానపరమైన సంక్షోభంగా కూడా మిగులుతున్నది. దేశ రాజకీయాలకు చంద్రబాబు కాంట్రిబ్యూషన్ అది.

ఒక మహానుభావుని ఆదర్శ రాజకీయాలు గాలిలో కలిసి, మరొక తరహా మహానుభావుని అధికార రాజకీయం రాజ్యమేలటం ఆ విధంగా మొదలైంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

# వెన్నుపోటు అన్న పదమే వినబడకుండా...

కథనం



దేవులపల్లి అమర్

నారా చంద్రబాబు నాయుడు రాజకీయ లక్ష్యం ముఖ్యమంత్రి కావడం. అందు కోసం ఆయన విద్యార్థి దశ నుంచే కలలు కనేవారు. చివరకు, ఇరవై మూడేళ్లుగా తాను కంటున్న కలలు నెరవేరే అవకాశం ఆసన్నమైంది. నమ్మిన మామగారికి వెన్నుపోటు పొడిచి, అధికారాన్ని కైవసం చేసుకునేందుకు 1995 ఆగస్టు నెల చివరి తొమ్మిది రోజుల్లో అనూహ్యమైన విధంగా వ్యూహాలు పన్నారు. పార్టీలోని సీనియర్ నాయకులను ఉచ్చులోకి లాగారు. వామపక్షాలకు సైతం ఎరవేసి, తన వైపు తిప్పుకున్నారు. ఒక్క చుక్క రక్తం చిందకుండా, ఎక్కడా నిరసన ధ్వనులు వినబడకుండా, 'వెన్నుపోటు' అనే పదమే మీడియాలో కనబడకుండా పావులు కదిపి, తన మామగారిని పదవి నుంచి దింపి, తాను అందలం అందుకున్నారు.


**1995 ఆగస్టు 31 (గురువారం)**

ఎన్టీఆర్ ఆగస్టు 31న విశ్వాస పరీక్ష ఎదుర్కోకుండానే రాజీనామా చేశారు. ఆ రోజు ఉదయం ఆయన ఆదేశాల మేరకు సీఎం కార్యదర్శి జయప్రకాశ్ నారాయణ్ గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. గవర్నర్ ఉదయం 11 గంటలకు రమ్మన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లేందుకు ఇంకా సమయం ఉండటంతో ఎన్టీఆర్ తన నివాసంలో బుచ్చయ్య చౌదరి, దేవినేని నెహ్రూ వంటి వారితో ముచ్చటిస్తున్నారు. వారితో మాట్లాడుతూనే ఎన్టీఆర్ అకస్మాత్తుగా కళ్లు తిరిగి పడిపోయారు. ఆయనను వెంటనే దగ్గరలోని మెడిసిటీ ఆస్పత్రికి తరలించారు.

తనను ఆస్పత్రిలో కలుసుకోవలసిందిగా ముఖ్యమంత్రి చేసిన అభ్యర్థనను గవర్నర్‌కు చీఫ్ సెక్రటరీ రాజాజీ తెలియజేశారు. అందుకు అంగీకరించిన గవర్నర్ కృష్ణకాంత్ ఆస్పత్రికి వెళ్లి, ఎన్టీఆర్‌ను పరామర్శించారు. ఎన్టీఆర్ ఆయనకు రాజీనామా లేఖ అందించారు. (అయితే తాను గవర్నర్‌కు రాజీనామా లేఖ ఇవ్వలేదనీ, మంచంపై ఉన్న తన చేతిలోంచి గవర్నరే లేఖను తీసుకున్నారనీ ఆ తర్వాత ఎన్టీఆర్ చెప్పారు. అయితే ఆయన మాటలను న్యాయస్థానం, ప్రజలు విశ్వసించలేదు.)

కీలకమైన విశ్వాస తీర్మానం రోజున ఎన్టీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన అభిమానులనూ, మద్దతుదారులను విషాదంలో ముంచెత్తివేసింది. ధైర్యమే ఊపిరిగా, పోరాటమే నైజంగా తల ఎత్తుకుని బతికిన ఎన్టీఆర్ చివరకు ఇలా అస్త్రసన్యాసం చేశారు.

ఆ మరుసటి రోజు, అంటే 1995 సెప్టెంబర్ 1న చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ 13వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు మరో 11 మంది మంత్రులుగా పదవులు చేపట్టారు. వీరిలో హరికృష్ణ కూడా ఒకరు. (అప్పటికి శాసనసభలోగానీ, శాసన పరిషత్తులో గానీ ఆయన సభ్యుడు కారు. నిబంధనల ప్రకారం మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లోగా చట్టసభకు ఎన్నిక కావాలి. అయితే హరికృష్ణ మంత్రివర్గంలో కొనసాగడం ఇష్టం లేని



పిలిచి పిల్లనిచ్చి, పార్టీలో పదవులిచ్చి, వెన్నుతట్టి ప్రోత్సహిస్తే, అధికార దాహంతో అల్లుడు తనకే వెన్నుపోటు పొడవడాన్ని ఏడు పదుల వయసులో ఆ వృద్ధ నేత తట్టుకోలేక పోయారు.

చంద్రబాబు 'ఏరు దాటేదాకా ఓడ మల్లన్న... ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా వ్యూహాత్మకంగా వ్యవహరించి, హరికృష్ణ పోటీ చేసేందుకు వీలులేని పరిస్థితులు సృష్టించారు. దీంతో హరికృష్ణ మంత్రి పదవి ఊడిపోయింది.)

పత్రికాధిపతి రామోజీరావు తన సతీమణితో కలసి ఆగస్టు 31వ తేదీ సాయంత్రం ఎన్టీఆర్ దంపతులను కలసి పరామర్శించారు. ఎప్పుడూ తెరవెనుకనే ఉండి కథ నడిపించే రామోజీరావు ఈసారి తెర ముందుకు రావడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. తననూ, తన భార్యనూ కించపరుస్తూ 'ఈనాడు'లో కార్టూన్లు వేయించినా, తన ప్రతిష్ఠను మంట కలుపుతూ వార్తా కథనాలు ప్రచురించినా, అవేవీ మనసులో పెట్టుకోకుండా, రామోజీ దంపతులను ఎన్టీఆర్ సాదరంగా ఆహ్వానించారు.

ఇంత జరిగినా ఎన్టీఆర్ తన బాధను బయటకు కనిపించనివ్వలేదు. రోజులాగే మరునాడు తెల్లవారుజామునే లేచి దైనందిన కార్యక్రమాలు ముగించుకుని, తనను కలవడానికి వచ్చిన ప్రిన్సిపల్ సెక్రటరీ సీఎస్ రావు, సెక్రటరీ జయప్రకాశ్ నారాయణ్‌లతో సమావేశమయ్యారు. ఆ రోజు సెప్టెంబర్ 1. అప్పటికి ఆయనే ఆపద్ధర్మ ముఖ్యమంత్రి. అది ఎన్టీఆర్‌కు ముఖ్యమంత్రిగా చివరి రోజు.

**అసెంబ్లీని గవర్నర్ రద్దు చేసి ఉండాల్సింది: పాల్కీవాలా**

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటును సవాలు చేస్తూ హైకోర్టులో దాఖలైన ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని పురస్కరించుకుని ప్రముఖ న్యాయవాది నానీ పాల్కీవాలా... ఎన్టీరామారావుకు ఓ లేఖ రాశారు. అప్పటికి ఎన్టీఆర్ రాజీనామా చేసి రెండు వారాలైంది. ప్రభుత్వం ఏర్పాటుకు ఎవరినైనా ఆహ్వానించే అధికారం గవర్నర్‌కు ఉన్నా, అప్పటికే చంద్రబాబును తెలుగుదేశం పార్టీ నుంచి అధ్యక్ష హోదాలో ఉన్న ఎన్టీఆర్ బహిష్కరించినందు వల్ల, అదే పార్టీ పేరిట ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ చంద్రబాబును ఆహ్వానించటం చట్టరీత్యా తప్పని పాల్కీవాలా అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ రద్దుకు ఎన్టీఆర్ మంత్రివర్గం చేసిన సిఫారసును గవర్నర్ ఆమోదించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందంతా ఒక ప్రహసనం, ఒక మోసమని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కాశ్యప్ అభిప్రాయపడ్డారు. ఆయన 'ది హిందూ' దినపత్రికలో 1995 సెప్టెంబర్ 4న రాసిన ఒక వ్యాసంలో బ్రిటిష్ పార్లమెంటరీ రాజకీయ సూత్రాలనే మనం పాటిస్తున్నట్లయితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సిఫారసు మేరకు గవర్నర్ కచ్చితంగా అసెంబ్లీని రద్దు చేసి ఉండాల్సిందని పేర్కొన్నారు.

'ది హిందూ' దినపత్రిక 1995 సెప్టెంబర్ 1న రాసిన సంపాదకీయంలో... తెలుగుదేశం పార్టీలో మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు చంద్రబాబుకి ఉన్నప్పటికీ, అంతకు ఏడాది ముందు 1994లో జరిగిన ఎన్నికల్లో ఎన్టీఆర్ అఖండ విజయం సాధించారన్న సంగతిని ప్రముఖంగా ప్రస్తావించింది.

**ఆగస్టు సంక్షోభం... ఉపసంహారం**

ఎన్టీఆర్ జీవిత చరమాంకం ఎన్నో ఒడుదొడుకులకు లోనైంది. పిలిచి పిల్లనిచ్చి, పార్టీలో పదవులిచ్చి, వెన్నుతట్టి ప్రోత్సహిస్తే, అధికార దాహంతో అల్లుడు తనకే వెన్నుపోటు పొడవడాన్ని ఆ వృద్ధ నేత తట్టుకోలేకపోయారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి జవజీవాలు ఊది, అఖండ విజయంతో అధికారంలోకి తీసుకువస్తే, చివరకు ఆయనను పదవీచ్యుతుణ్ణి చేసిన ఉదంతం పార్టీలో ఎంతో మంది నాయకులను, కార్యకర్తలను కన్నీరు పెట్టించింది. ఇక లక్షలాది అభిమానుల సంగతి వేరే చెప్పాలా?

(స్వీయ రచన 'మూడు దారులు' నుంచి...)

# కాళేశ్వరం నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే!

## ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకునే స్వేచ్ఛ సర్కారుకు ఉంది

- రాజకీయ కార్యనిర్వాహకుడిగా కాకుండా పాలనాఅధికారిగా వ్యవహరించారు
- మంత్రివర్గ ఆమోదం లేకుండానే బరాజ్‌ల నిర్మాణానికి అనుమతులు
- దురుద్దేశంతో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు
- నీటి నిల్వకు వాడడంతోనే బరాజ్‌ల వైఫల్యం
- జస్టిస్ పీసీ ఘోష్ నివేదికలో స్పష్టీకరణ.. నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సర్కారు


మేడిగడ్డ బరాజ్ (ఫైల్)

**సాక్షి, హైదరాబాద్:** ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు రీఇంజనీరింగ్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టాలని, అందులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించాలని తీసుకున్న నిర్ణయం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరిదేనని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ తేల్చి చెప్పింది. 'ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు రీఇంజనీరింగ్‌ను సాకుగా చూపి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలన్న ఆలోచన ఆయనదే. ప్రాజెక్టు అంకురార్పణ దశ నుంచి ప్రతి నిర్ణయాన్ని ఆయనే స్వయంగా తీసుకున్నారు. డీపీఆర్‌ల తయారీ వ్యాప్కోస్‌కు అప్పగింత, తుది డీపీఆర్ అందకముందే అంచనాలను తయారు చేసి ఆమోదించడం, బరాజ్‌లలో నీరు నిల్వ చేయాలని ఆదేశించడం, కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించేలా నిబంధనలు మార్చాలని ఆదేశించడం వెనక ఆయన నిర్ణయాలే ఉన్నాయి. మూడు బరాజ్‌ల నిర్మాణానికి ప్రణాళికలు, నిర్మాణం, నిర్వహణలో నాటి సీఎం సూక్ష్మంగా భాగస్వాములయ్యారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్ మార్చాలనే నిర్ణయం ఆయనదే. రాజకీయ కార్యనిర్వాహకుడిగా వ్యవహరించాల్సిన నాటి సీఎం.. పాలనాఅధికారిగా వ్యవహరించి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం కలిగించారు. చట్ట ప్రకారం ప్రభుత్వం ఆయనపై తగిన చర్యలు తీసుకునే స్వేచ్ఛ సర్కారుకు ఉంది'అని కమిషన్ సిఫారసు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను ఆదివారం శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నివేదిక 665 పేజీలతో 3 సంపుటిలుగా ఉంది. నాటి ఆర్థిక మంత్రి (ఈటల) తన బాధ్యతలను ఆదమరిచి నాటి సీఎం కోరికలు తీర్చుకునేందుకు సహకరించారని తప్పుబట్టింది.

### నివేదికలోని ముఖ్యాంశాలు

**మంత్రివర్గ ఆమోదం లేకుండానే :** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణానికి 2016, మార్చి 1న మూడు జీవోలు (నెం.231, 232, 233) జారీ చేశారు. ఆ తర్వాతి దశలోనూ మంత్రివర్గం నుంచి ర్యాటిఫికేషన్ పొందలేదు. నాటి సీఎం(కేసీఆర్), మాజీ నీటిపారుదల మంత్రి (హరీశ్) మాత్రమే ఆమోదించారు. ప్రభుత్వ బిజినెస్ రూల్స్‌లోని నిబంధనలను ఉల్లంఘిస్తూ పరిపాలనపర అనుమతుల జారీ చేశారు.


జస్టిస్ పీసీ ఘోష్

- టర్న్ కీ విధానంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలని వ్యాప్కోస్ చేసిన సిఫారసులను కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కెఐపీసీఎల్) విస్మరించింది. ప్రాజెక్టు రూపకల్పన, మదింపు, ఆమోదించడం, నిధుల విడుదల, అమలు బాధ్యత, నిర్వహణ, పర్యవేక్షణ, మూల్యాంకనానికి కేఐపీసీఎల్‌ను ఏర్పాటు చేయగా, ఈ ప్రక్రియల్లో కేఐపీసీఎల్‌ను ప్రభుత్వం భాగస్వామ్యం చేయలేదు. కేవలం నిధుల సేకరణ, బ్యాంకులు, ఆర్థిక సంస్థ నుంచి రుణాల సమీకరణ, నిర్మాణ సంస్థలకు బిల్లుల చెల్లింపులకే కేఐపీసీఎల్‌ను సర్కారు పరిమితం చేసింది.
- ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు అనేక మార్పులు చేసి కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చారని నీటిపారుదల శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి ఎస్కే జోషి చెప్పారు. నాటి సీఎం అధ్యక్షతన నిపుణులతో నిర్వహించిన చాలా సమావేశాల్లో కట్టడాల రకం, వాటి సామర్థ్యం, లొకేషన్, ప్లాన్ అలైన్‌మెంట్‌కు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి గూగుల్ మ్యాప్‌లను విస్తృతంగా వినియోగించారు. '2015, ఫిబ్రవరి 4న మహారాష్ట్ర, ఏపీతో జరిగిన భేటీలో తుమ్మిడిహెట్టి బరాజ్ ఎత్తు తగ్గించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. 2016, ఆగస్టు 23న జరిగిన భేటీలో.. మేడిగడ్డ బరాజ్ ఎత్తు పెంపుపై వాస్తవ ముంపు మేరకు అంతర్రాష్ట్ర బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుందని నిర్ణయించారు.
- 2016, మార్చి 1న మూడు బరాజ్‌ల నిర్మాణానికి జీవోలు జారీ అయ్యాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌ల నిర్మాణానికి హైపవర్ కమిటీ సిఫార్సు చేయలేదు.
- తుమ్మిడిహెట్టి, మేడిగడ్డ వద్ద బరాజ్‌ల నిర్మాణంతో లాభనష్టాలను నిపుణుల కమిటీ అధ్యయనం చేసింది. మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణం సరికాదని, ఆర్థికంగా ప్రయోజనకరం కాదని సూచించింది. ప్రాణహిత నదిపై వేమనపల్లి వద్ద నిర్మాణం చేపట్టాలని ప్రత్యామ్నాయం చూపింది. ఈ నివేదికను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోగా, కోల్డ్ స్టోరేజీలో పెట్టింది. ఇది ఇప్పటివరకు బహిర్గతం చేయలేదు.
- 2016, మార్చి 7న జీవో నంబర్ 655 ప్రకారం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ కూడా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌లకు ప్రతిపాదించలేదు.
- 2015, ఏప్రిల్ 13న మేడిగడ్డ నుంచి మిడ్ మానేర్ వరకు డీపీఆర్ రూపొందించే బాధ్యతను వాప్కోస్‌కు అప్పగిస్తూ రూ.5.94కోట్లతో పరిపాలన అనుమతులు జారీ చేశారు. ఈ నోట్ ఫైల్‌ను నాటి సీఎం, నీటి పారుదల మంత్రి ఆమోదించారు. అదే ఏడాది జూన్ 3న దీన్ని కేబినెట్ ఆమోదించింది. మంత్రివర్గ ఆమోదం లేకుండానే 2016 జనవరిలో అంచనాలను రూ.6.77 కోట్లు పెంచారు.
- ఎల్లంపల్లి–మేడిగడ్డ మధ్య రెండు బరాజ్‌ల నిర్మాణానికి డీపీఆర్ తయారీ కోసం 2016 మార్చిలో రూ.12.96 కోట్లతో వ్యాప్కోస్‌కు పనులు అప్పగిస్తూ పరిపాలన అనుమతులిచ్చారు. వాప్కోస్ డీపీఆర్ సమర్పించిందా? లేదా? అన్నది ఇప్పటికీ స్పష్టత లేదు.
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, 3 విద్యుత్ కేంద్రాలకు సంబంధించి డీపీఆర్‌లోని కొంత భాగాన్ని జనవరి, 2016లో.. మార్చి 27న తుది డీపీఆర్ సమర్పించింది.
- కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదించడానికి ముందే మూడు బరాజ్‌ల నిర్మాణానికి 2016 మార్చిలో పరిపాలనా పరమైన అనుమతులు జారీ చేసి తర్వాతి జూలై/ఆగస్టు నెలల్లో కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేసుకున్నారు. 2017 ఫిబ్రవరిలో డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి పంపించారు.
- ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు నీటిలభ్యతపై 2015లో, కాళేశ్వరం ప్రాజెక్టుకు నీటిలభ్యత విషయంలో 2017లో సీడబ్ల్యూసీ రాసిన లేఖల్లో అంశాలు ఒకేలా ఉన్నాయి. 2015లో సీడబ్ల్యూసీ రాసిన లేఖ ఆధారంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం సాధ్యం కాదని భావనకు వస్తే.. 2017లో రాసిన లేఖ ఆధారంగా మేడిగడ్డ బరాజ్ నిర్మాణం సైతం సాధ్యం కాదు.
- 2018, మే 1 నాటికి సీడబ్ల్యూసీ కాళేశ్వరం ప్రాజెక్టు ఆర్థిక వ్యయాన్ని ఆమోదించకుండా అధ్యయనం జరుపుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం 2018, మార్చిలో ప్రాజెక్టు అంచనాలను రూ.30,623.72 కోట్ల నుంచి రూ.80,190.46 కోట్లకు పెంచేసింది.
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందే సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్‌తో అధ్యయనం జరిపించాల్సి ఉండగా, పనులు తుదిదశలో ఉన్నప్పుడు జరపాల్సిన అవసరం లేదని ఈ విభాగ డైరెక్టర్ 2018, మే 21న లేఖ రాశారు.
- సీడబ్ల్యూసీ నుంచి అవసరమైన అనుమతులు పొందకుండానే, ప్రాజెక్టు డీపీఆర్ పరిశీలనకు దరఖాస్తు చేసుకోకుండానే 2016, మార్చి 1న పరిపాలన అనుమతులు మంజూరు చేయడమే కాకుండా ఒప్పందాలు కుదుర్చుకున్నారు.
- సవరించిన పరిపాలన అనుమతులపై సీఎం, మంత్రి ముందు నోట్‌ఫైల్ ఉంచడానికి ముందే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ 2018, మే 19న ఆమోదం తెలిపారు. అత్యవసర దృష్ట్యా ఆదేశాలు జారీ చేయవచ్చన్నారు. అదే నెల 27న కేబినెట్ ఆమోదం తెలిపింది. స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ ముందస్తు ఆమోదం లేకుండా అంచనాలు పెంచి అక్రమాలకు పాల్పడ్డారు.
- నిర్దేశిత గడువుతో పోల్చితే మేడిగడ్డ నిర్మాణానికి 6 రెట్లు, అన్నారానికి 5 రెట్లు, సుందిళ్లకు 8 రెట్లు సమయం ఇచ్చారు. సైట్ అప్పగింత, డిజైన్ల కారణంగానే ఆలస్యం జరిగిందని కాంట్రాక్ట్ సంస్థల వాదనకు అధికారులు అంగీకారం తెలిపారు. ఒప్పందంలోని క్లాజ్ 26, 31లను అధికారులు ఉల్లంఘించారు. ఆలస్యమైనా ఎలాంటి జరిమానా విధించలేదు. 2017, మార్చి వరకు నిర్మాణ స్థలాన్ని అప్పగించలేదు.
- ఫీల్డ్ అధ్యయనాలు, పరిశోధనలు చేపట్టకుండానే బరాజ్‌ల డిజైన్లను సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ తయారు చేసింది. డిజైన్ల తయారీకి ముందు కనీసం 3డీ, 2డీ మోడల్ స్టడీస్ కూడా నిర్వహించలేదు.
- బరాజ్‌ల పేరుతో నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లు/డ్యామ్స్‌గా నిర్మించారు. నీటిని మళ్లించేందుకు వినియోగించే బరాజ్‌లను నీటిని నిల్వ చేసే అవసరాలకు వాడినట్టు అధికారులు అంగీకరించారు. కాని వాటిని రిజర్వాయర్లు/డ్యామ్‌లుగా డిజైన్ చేయలేదు. ఈ కారణంతోనే అవి విఫలమయ్యాయి.
- క్వాలిటీకి సంబంధించి కమిషన్‌కు సమర్పించిన రిజిస్టర్లు, పుస్తకాల్లో కొన్ని అదనంగా పేజీలు పిన్ చేయడం, కొన్ని టై చేయడం చేశారు. పేజీల సంఖ్య క్రమానుగుణంగానే లేదు.
- 2019, ఆగస్టు 6న మేడిగడ్డ 'కంప్లీషన్ సర్టిఫికెట్' జారీ చేయమని ఏజెన్సీ కోరడం..సర్టిఫికెట్ అధికారులు జారీ చేయడం తప్పు. బాధ్యతాలోపం కాలాన్ని ఏజెన్సీ తప్పుగా ప్రస్తావించింది. ఒప్పందం ముగిసిపోయినట్టు ఎలాంటి సర్టిఫికెట్ జారీ కానందున మేడిగడ్డ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కానట్టే లెక్క. దీని కారణంగా లోపాలకు బాధ్యతాకాలం, ఆపరేషన్, నిర్వహణ కాలం నిర్ధారించలేదు.
- అధికారులు, ఏజెన్సీలు ఒకరితో ఒకరు కుమ్మక్కై దురుద్దేశంతో చెడు మార్గంలో అక్రమ లబ్ధి పొందేందుకు పనిచేశారు. తద్వారా మేడిగడ్డ నిర్మాణానికి ప్రజాధనం భారీగా ఖర్చు చేశారు.
- డీపీఆర్ తయారీని వాప్కోస్‌కు అప్పగిస్తూ జీవో జారీకి సంబంధించి నోట్‌ఫైల్‌పై నీటి పారుదల మంత్రి , ముఖ్యమంత్రి సంతకాలున్నాయి. జీవో జారీ చేసిన తర్వాత కేబినెట్ ఆమోదించింది.
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు పరిపాలన అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయగా, నోట్ ఫైల్‌పై వీరి సంతకాలు మాత్రమే ఉన్నాయి. ఆర్థికమంత్రి సంతకం లేదు.
- పరిపాలన అనుమతి (2016, మార్చి 1) తర్వాతే కేబినెట్ సబ్ కమిటీ (2016, మార్చి 15) ఏర్పాటైంది. 3సార్లు భేటీ అయ్యి నివేదిక అందజేసింది.

### కాళేశ్వరం బాధ్యులు వీరే !

- మాజీ సీఎం నుంచి ఏఈ వరకు...
- సీఎస్ రామకృష్ణారావు తన బాధ్యతలను విస్మరించినట్టు ఆక్షేపణ
- నివేదికలో బాధ్యుల పేర్లను ప్రస్తావించిన జస్టిస్ ఘోష్ కమిషన్

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యుడని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ పేర్కొంది. బరాజ్‌ల ప్లానింగ్, నిర్మాణం, పనుల పూర్తి, నిర్వహణ, పర్యవేక్షణలో జరిగిన అవకతవకల్లో ఆయన పాత్ర ఉందని వెల్లడించింది. బరాజ్‌ల నిర్మాణంలో వివిధ రకాల అవకతవకలకు సంబంధిత వ్యక్తులను బాధ్యులుగా తేల్చుతూ నివేదికలో వారి పేర్లను ప్రస్తావించింది. మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావుతోపాటు మాజీ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషీ, నాటి సీఎం కేసీఆర్ అదనపు కార్యదర్శి స్మితాసబర్వాల్, నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్, కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ ఈఎన్సీ హరిరామ్‌లకు సైతం ఈ అవకతవకల్లో పాత్ర ఉందని వెల్లడించింది. సైట్ పరిశోధనలు, డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ, పర్యవేక్షణలో తప్పిదాలతోపాటు కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) ముసుగులో జరిగిన ఆర్థిక అవకతవలకు వీరంతా బాధ్యులని నిర్ధారించింది. మోడల్ స్టడీస్ లేకుండానే డిజైన్ల తయారీ చేసినందుకుగాను సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) నాటి చీఫ్ ఇంజనీర్, తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబ్ సీఈ, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ, ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలు, ఏఈలు బాధ్యులని కమిషన్ పేర్కొంది. కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించేందుకుగాను మేడిగడ్డ పూర్తికాక ముందే పూర్తయినట్టు కాంట్రాక్టర్లకు సర్టిఫికెట్ ఇచ్చిన ఎస్ఈ, ఈఈలపై చర్యలు తీసుకోవాలని కోరింది. బరాజ్‌ల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా విస్మరించిన మాజీ ఈఎన్సీ (ఓఅండ్ ఎం) బి.నాగేంద్రరావు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా సేకరించిన రుణాలతో రాష్ట్రంపై పడనున్న భారాన్ని నాటి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, నాటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌లు అత్యంత తేలిగ్గా తీసుకొని నిర్లక్ష్యంగా వ్యవహరించారని కమిషన్ ఆక్షేపించింది.

**నివేదిక తొక్కిపెట్టిన జోషి.. విఫలమైన స్మిత**

మేడిగడ్డ బరాజ్‌ను వ్యతిరేకిస్తూ నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను నీటిపారుదల శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి ఎస్కే జోషి తొక్కిపెట్టారని కమిషన్ తప్పుబట్టింది. నాటి సీఎం సహాయ కార్యదర్శి స్మితసభర్వాల్ బరాజ్‌ల నిర్ణయాలకు సంబంధించిన కీలకమైన ఫైళ్లను కేబినెట్ ముందు ఉంచడంలో విఫలమై బిజినెస్ రూల్స్‌ను ఉల్లంఘించారని ఆక్షేపించింది.

## సిరిసిల్ల వరద బాధితులకు రూ.10 లక్షల సాయం

- కేంద్ర మంత్రి బండి సంజయ్



**సిరిసిల్లటౌన్:** అకాల వర్షాలు, వరదలతో నష్టపోయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బాధితులను ఆదుకోవాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఇచ్చిన పిలుపునకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. బాధితులను ఆదుకునేందుకు రూ.10 లక్షల సాయం అందజేయనున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఎంపీ లాడ్స్ నిధుల నుంచి ఈ మొత్తాన్ని రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు త్వరలోనే అందజేయనున్నట్లు ప్రకటించారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వర్షాలతో రైతులకు భారీగా పంట నష్టం సంభవించిందని, పలువురు నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ లాడ్స్ నిధుల మొత్తాన్ని బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్ ద్వారా ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

# కొందరికే యూరియా



సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో శనివారం అర్ధరాత్రి నుంచే జాగారం చేస్తున్న రైతులు

▶ మొదటి పేజీ తరువాయి

లారీ రాలేదని అధికారులు చెప్పడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. • కామారెడ్డి జిల్లా దోమకొండలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద రైతులు యూరియా కోసం ఆందోళన చేశారు. కొందరికి యూరియా దొరకపోవడంతో వ్యవసాయాధికారులు, సింగిల్‌విండో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. • మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైతు వేదిక వద్ద ఆదివారం అర్ధరాత్రి యూరియా టోకెన్ల కోసం రైతులు బారులుదీరారు. సోమవారం యూరియా బస్తాలు పంపిణీ చేయనుండగా, అధికారులు ముందస్తుగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి క్యూలో నిల్చున్నారు.


దోమకొండ సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

## చేయూత పింఛన్ల పెంపు హామీని సీఎం నిలబెట్టుకోవాలి

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ**



**సూర్యాపేట/కోదాడరూరల్:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేయూత పింఛన్లు పెంచుతామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. ఆదివారం సూర్యాపేట, కోదాడలో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేలకు పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి రెండేళ్లు కావొస్తున్నా నేటికీ అమలు చేయకపోవడం వారిని మోసం చేయడమేనన్నారు. పింఛన్లు పెంచలేని సీఎం రేవంత్‌రెడ్డి గద్దె దిగాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు. పింఛన్లు పెంచకపోతే సెప్టెంబర్‌లో లక్షలాది మంది పింఛన్‌దారులతో హైదరాబాద్‌లో మహాగర్జన సభను ఏర్పాటు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ కూడా గత ఎన్నికల్లో పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఒకరు ప్రతిపక్షంలో మరొకరు అధికార పక్షంలో ఉన్నా.. ప్రభుత్వం ఎందుకు పింఛన్లు పెంచ లేదు.. ప్రతి పక్షం ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఈ సమావేశాల్లో వీహెచ్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు, జాతీయకోర్ కమిటీ వైస్‌చైర్మన్ అందె రాంబాబు ఎమ్మార్పీఎస్ ఏపీ అధ్యక్షుడు రుద్ర సురేష్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డలో ఏడీసీపీ సర్వే

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌లో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకు ఆదివారం అధికారులు ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరంట్ ప్రొఫైలర్) పరీక్షలు చేశారు. పుణేకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ సీనియర్ సైంటిస్టు డాక్టర్ సంపత్ శ్రీకాంత్, సైంటిస్టు ఎం.నాగరాజు ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు. మేడిగడ్డ వద్ద బోటుకు ప్రత్యేక యంత్రాన్ని అమర్చి నీటి ప్రమాణ తీవ్రత అంచనా వేశారు. ప్రస్తుతం బరాజ్ నుంచి 8.19 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వెళుతోంది. సోమవారం అన్నారం బరాజ్‌లో వీరు పరీక్షలు చేయనున్నారు. ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, ఇంజనీర్లు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు.

## వృద్ధురాలు బావిలో పడిందని..

- నీరంతా మోటార్లతో తోడిన అధికారులు
- చివరికి పత్తి చేనులో కనిపించిన వైనం


రాజ్యలక్ష్మిని చేనులోనుంచి తీసుకొస్తున్న మహిళలు

**దుగ్గొండి:** ఓ వృద్ధురాలు బావిలో పడిందని భావించి.. అధికారులు భారీ మోటార్ల సాయంతో నీటిని తోడేశారు. చివరికి వృద్ధురాలు పత్తి చేనులో కనిపించింది. ఈ సంఘటన ఆదివారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలో జరిగింది. దుగ్గొండికి చెందిన మాడిశెట్టి రాజ్యలక్ష్మి అనే 75 ఏళ్ల వృద్ధురాలు ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఉదయం ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల అంతటా వెదికారు. ఓ వ్యవసాయ బావి వద్ద వృద్ధురాలి చీర, బావిలోకి జారిన గుర్తులు కనిపించాయి. దీంతో ఆమె బావిలోనే పడిందని భావించిన కుటుంబ సభ్యులు అధికారుల సాయంతో ఐదు విద్యుత్ మోటార్లు, ఫైరింజన్‌తో నీటినంతా తోడేశారు. సాయంత్రం వరకు వృద్ధురాలికోసం గాలిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో గాలింపు చర్యలను చూడడానికి అక్కడికి వెళ్లిన కొందరు యువకులు.. మూత్ర విసర్జన కోసం సమీపంలోని పత్తి చేను లోపలికి వెళ్లారు. అక్కడ పత్తి మొక్కల మధ్య రాజ్యలక్ష్మి నిద్రపోతూ కనిపించింది. ఇది గమనించిన యువకులు వృద్ధురాలిని నిద్రలేపి చేనులో నుంచి బయటికి తీసుకొచ్చారు. రాజ్యలక్ష్మికి మతిమరుపు సమస్య ఉన్నట్టు తెలుస్తోంది. పోలీసులు, అగ్నిమాపక, గ్రామ పంచాయతీ సిబ్బంది దాదాపు 100 మంది వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రమించారు.

## కళ్లల్లో కారం చల్లి.. మెడకు విద్యుత్ వైరు బిగించి..

- తాగి కొడుతున్న భర్తను హతమార్చిన భార్య
- వికారాబాద్ జిల్లాలో ఘటన


కుమార్ మృతదేహం పక్కన భార్య రేణుక

**మోమిన్‌పేట:** రోజూ మద్యం తాగి తనను కొడుతుండటంతో భరించలేని భార్య.. భర్తను హతమార్చింది. వికారాబాద్ జిల్లాలో ఆదివారం ఈ ఘటన జరిగింది. బంట్వారం మండలం రోంపల్లి గ్రామానికి చెందిన కురువ కుమార్ (35)తో మోమిన్‌పేట మండలం కేసారం గ్రామానికి చెందిన కడిచర్ల రేణుకకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. కుమార్ కేసారంలోని ఓ వెంచర్‌లో నాలుగేళ్లుగా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే కుమార్ ఆదివారం ఉదయం తాగి ఇంటికి వచ్చాడు. అంతేకాక వెంట తెచ్చుకున్న మద్యం మళ్లీ తాగుతుండగా దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో 'నిన్ను చంపుతాను'అంటూ పైకి లేవబోయిన భర్తను.. భార్య రేణుక వెనుకకు నెట్టి, కళ్లల్లో కారంపొడి చల్లింది. అంతటితో ఆగక కింద పడిన భర్త మెడకు విద్యుత్ తీగను బిగించి హత్య చేసింది. విషయం తెలుసుకున్న మోమిన్‌పేట ఎస్‌ఐ అరవింద్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. తానే కుమార్‌ను హత్య చేసినట్లు రేణుక ఒప్పుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అడ్డదారులు

- ఎస్‌బీఐ బ్యాంకుకే కన్నం వేసిన క్యాషియర్
- సహకరించిన మేనేజర్..మరో 42 మంది
- 25.17 కిలోల బంగారం, రూ.1.10 కోట్ల నగదు చోరీ
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా వెల్లడి

**గోదావరిఖని/చెన్నూర్:** ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకున్నాడు. ఒకసారికాదు.. అనేకసార్లు అదే ఆట ఆడి డబ్బు పోగొట్టుకున్నాడు. ఆ డబ్బు సంపాదించేందుకు మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్‌బీఐలో క్యాషియర్‌గా పనిచేస్తున్న నరిగె రవీందర్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కోసం 402 గోల్డ్‌లోన్లకు సంబంధించిన 25.17కిలోల బంగారం, రూ.1.10 కోట్ల నగదు చోరీ చేశాడు. రీజియన్ మేనేజర్ రితేశ్‌కుమార్‌గుప్తా ఆగస్టు 23న ఇచ్చిన ఫిర్యాదుతో చోరీ విషయం వెలుగుచూసింది. రంగంలోకి దిగిన పోలీసులు వారంలో రోజుల్లోనే కేసు ఛేదించారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చోరీపై పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదివారం తన కార్యాలయంలో ఆ వివరాలు వెల్లడించారు.75 శాతం బంగారం రికవరీ చేశారు. ప్రధాన నిందితుడు బ్యాంకు క్యాషియర్ నరిగె రవీందర్..బ్యాంక్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌లతో కలిసి ఈ మోసానికి పాల్పడ్డాడు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కేసు విచారణ జరిపి ఛేదించారు.


రికవరీ చేసిన ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ

### రూ.40 లక్షల నష్టాన్ని పూడ్చుకునేందుకు..

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌తో రూ.40 లక్షలు కోల్పోయిన రవీందర్.. ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు అదే బెట్టింగ్‌పై దృష్టి సారించాడు. దీనికి బ్రాంచ్ మేనేజర్ మనోహర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సందీప్‌తో కలిసి బంగారం, నగదుకు పక్కా ప్రణాళిక వేశాడు.

### పదినెలలుగా.. పకడ్బందీగా..

ఏడాది క్రితం చెన్నూర్ బ్రాంచ్–2 ఎస్‌బీఐ క్యాషియర్‌గా బదిలీపై వెళ్లిన రవీందర్.. బ్యాంక్‌లో కుదువ పెట్టిన బంగారాన్ని తీసి వేరే బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందాడు. ఆ సొమ్మును బెట్టింగ్‌కు వెచ్చించాడు. గతేడాది అక్టోబర్ నుంచి గోల్డ్‌లోన్ చెస్ట్ నుంచి బంగారం తీసి తన స్నేహితులకు ఇచ్చి, ఆ బంగారాన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టాడు. ఆ డబ్బును తమ బ్యాంకు ఖాతాల్లో జమచేసిన స్నేహితులకు కొంత కమీషన్ కూడా ముట్టజెప్పేవాడు. ఇలా 10 ప్రైవేట్ గోల్డ్ లెండింగ్ కంపెనీలు (ఎస్‌ఏఫ్‌సీ, ఇండెల్‌మనీ, ముత్తూట్‌ఫైనాన్స్, గోదావరి అర్బన్, మణప్పురం, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, ముత్తూట్ మినీ) 44 మంది పేర్లపై 142 గోల్డ్‌లోన్లు తీసుకున్నాడు.

### బంగారం లేకుండానే.. గోల్డ్‌లోన్‌లు..

నరిగె రవీందర్ బంగారం లేకుండానే గోల్డ్ లోన్‌లు తీసుకున్నాడు. తన భార్య, బావమరిది, స్నేహితుల పేర్లతో 42 గోల్డ్‌లోన్లు మంజూరు చేసి 4.14 కిలోల బంగారం పేరుతో రూ.1.58 కోట్లు కాజేశాడు. ఏటీఎంలలో నగదు రీఫిల్ చేసే సమయంలో కూడా డబ్బు అపహరించేవాడు. ఈ కేసులో 15.23 కిలోల బంగారం రికవరీ చేశారు. గోల్డ్‌లోన్ మేనేజర్ల పాత్రపై విచారణ జరుగుతోంది.

### 15.237 కిలోల బంగారం రికవరీ

చోరీ కేసులో ప్రధాన నిందితుడు రవీందర్, మేనేజర్ మనోహర్‌తోపాటు మరో 42 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వీరి నుంచి 15.237 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.61 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

### 44 మంది నిందితుల అరెస్ట్..

ప్రధాన నిందితుడు నరిగె రవీందర్, బ్యాంకు మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, లక్కాకుల సందీప్, ఎస్‌బీఎఫ్‌సీ సేల్స్ మేనేజర్ కొంగొంటి భీరేష్, కస్టమర్ రిలేషన్ మేనేజర్ కోదాటి రాజశేఖర్, సేల్స్ ఆఫీసర్ బొల్లి కిషన్‌కుమార్‌తోపాటు మరో 38మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు, రూరల్ సీఐ బన్సీలాల్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ తదితరులను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

# బంధం బలోపేతమే లక్ష్యం

## పరస్పర విశ్వాసం, గౌరవంతో సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవాలని నిర్ణయం

- ద్వైపాక్షిక ఒప్పందాలను మరింత ముందుకు తీసుకెళ్దాం
- మన సహకారం ఇరుదేశాల 280 కోట్ల ప్రజల సంక్షేమంపై ఆధారపడింది
- తియాంజిన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీలో ప్రధాని వ్యాఖ్య
- భారత్, చైనా వాణిజ్యం సహా కీలక ద్వైపాక్షికాంశాలపై ఇరునేతల సుదీర్ఘ మంతనాలు
- నేడు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ విడిగా సమావేశంకానున్న మోదీ



ద్వైపాక్షిక భేటీలో పలు అంశాలపై చర్చిస్తున్న మోదీ, జిన్‌పింగ్, ఇరుదేశాల ఉన్నతాధికారులు

**తియాంజిన్:** గల్వాన్ ఘటన తర్వాత ఉద్రిక్తతకు నిలయంగా మారిన సరిహద్దు సమస్యను పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వంతో పరిష్కరించుకునేందుకు భారత్, చైనా ముందుకొచ్చాయి. షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు సన్నాహక భేటీలో భాగంగా భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తియాంజిన్ తీరనగరంలో దాదాపు 60 నిమిషాలపాటు జరిగిన ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు. ''భారత్, చైనా ద్వైపాక్షిక ఒప్పందాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇరువురం కంకణబద్ధమయ్యాం. సమష్టిగా వాణిజ్యం, పెట్టుబడులను మరింతగా విస్తరించి అంతర్జాతీయ వాణిజ్య సుస్థిరతలో మన రెండు ఆర్థికవ్యవస్థలు ఎంతటి కీలకమో చాటి చెబుదాం. సరిహద్దు వెంట ఉద్రిక్తత పొడచూపినా సరే ప్రస్తుతం శాంతి, సుస్థిరత కొనసాగడం సంతోషదాయకం. సరిహద్దు వివాదాల పరిష్కారంలో మన ఇరుదేశాల ప్రతినిధి బృందాలు ఉమ్మడి నిర్ణయంతో ముందుకు వెళ్తున్నాయి. భారత్, చైనా మధ్య నేరుగా విమానసర్వీసులను సైతం పునరుద్ధరించాం. మన ద్వైపాక్షిక సహకారం అనేది ఇరుదేశాల్లోని 280 కోట్ల మంది ప్రజల సంక్షేమంతో ముడిపడి ఉంది. పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వంతో మన బంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్దాం. షాంఘై సహకార సంస్థకు అధ్యక్ష బాధ్యతలు అద్భుతంగా పోషిస్తున్న మీకు నా అభినందనలు. కజాన్ నగరంలో మన చివరి భేటీ ఇరుదేశాల ద్వైపాక్షిక బంధంలో పురోగతికి బాటలువేసింది''అని జిన్‌పింగ్‌తో మోదీ అన్నారు. భారతీయ ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకంగా 50% టారిఫ్‌ల భారం మోపిన వేళ ఎస్‌సీఓ వేదికగా భారత్, చైనా మైత్రీబంధం బలపడటం వేగంగా మారుతున్న అంతర్జాతీయ పరిణామాలకు దర్పణం పట్టింది. దాదాపు ఏడేళ్ల తర్వాత మోదీ చైనాలో పర్యటించడం విశేషం. భేటీ తర్వాత మోదీ చైనా కమ్యూనిస్ట్‌పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కాయ్‌క్వీని కలిశారు. జిన్‌పింగ్‌తో ఉమ్మడి నిర్ణయం పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చేలా సాయపడాలని కాయ్‌క్వీని మోదీ కోరారు.

### ఎన్నెన్నో అంశాల్లో ఏకతాటి మీదకు

ద్వైపాక్షిక వాణిజ్యం మొదలు పెట్టుబడులు, వాణిజ్య లోటు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలు, ఉగ్రవాదం వంటి కీలక అంశాలపై మోదీ, జిన్‌పింగ్ చర్చలు జరిపారు. భేటీ వివరాలను తర్వాత భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలోపేర్కొంది. ''భారత్, చైనాలు రెండూ అభివృద్ధి భాగస్వాములేనని మోదీ, జిన్‌పింగ్ పునరుద్ఘాటించారు. విబేధాలు వివాదాలుగా మారొద్దని ఇరునేతలు అభిలషించారు. నేరుగా విమాన సర్వీసులు మొదలు వీసా జారీ వంటి ఇతరత్రా సదుపాయాల ద్వారా ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధబాంధవ్యాల పెంపును ఇరునేతలు ఆశిస్తున్నారు. వాణిజ్య బంధం పెంపు, వాణిజ్యలోటు తగ్గింపునకు రాజకీయ వ్యూహాత్మక మార్గంలో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని ఇరునేతలు గుర్తించారు. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అనేది ఇరు దేశాలకు ఉంది. ఇందులో మూడో దేశం జోక్యాన్ని అస్సలు అనుమతించకూడదని ఇరునేతలు నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా భారత్‌లో వచ్చే ఏడాది జరగబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు విచ్చేయాలని జిన్‌పింగ్‌ను మోదీ సాదరంగా ఆహ్వానించారు. ఆహ్వానించినందుకు మోదీకి జిన్‌పింగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భారత బ్రిక్స్ సారథ్యానికి జిన్‌పింగ్ మద్దతు ప్రకటించారు'' అని భారత విదేశాంగ శాఖ తెలిపింది.

### ఏనుగు, డ్రాగన్ డ్యాన్స్: జిన్‌పింగ్

తియాంజిన్‌లో మోదీ, జిన్‌పింగ్ కరచాలనం ట్రంప్‌కు కంటగింపుగా మారింది. ఇరుగుపొరుగు వైరిదేశాలు టారిఫ్‌ల మోత కారణంగా మళ్లీ సత్సంబంధాల దిశగా అడుగులేస్తూ.. సుంకాల సుత్తితో మోదినంత మాత్రాన అంతా అయిపోలేదని పరోక్ష హెచ్చరికలు చేశాయి. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడారు. ''చైనాకు భారత్ చక్కని మిత్రదేశంగా మారుతోంది. ఇరుదేశాల బంధాన్ని వ్యూహాత్మకంగా దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా కొనసాగించాలి. చైనా, భారత్ బంధాన్ని కేవలం సరిహద్దు అంశం నిర్ణయించకూడదు. సరిహద్దు కోణంలో బంధాన్ని చూడకూడదు. ఆసియాలోని రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలు పరస్పర వాగ్దానాలతో ముందుకు సాగాలి. అక్కడ విరోధానికి తావివ్వకూడదు. ప్రపంచం ఇప్పుడు శతాబ్దానికొకసారి సంభవించే కీలక మలుపులో ఉంది. అంతర్జాతీయ పరిణామాలు వేగం పుంజుకున్నాయి. తూర్పున ఉన్న చైనా, భారత్ ప్రాచీన నాగరికతతో భాసిల్లింది. మనవి ప్రపంచంలోనే అత్యధిక జనాభా దేశాలు. దక్షిణ ధ్రువ ప్రపంచంలో మనమే పాత సభ్యులం. ఈ తరుణంలో పొరుగు దేశాలమైనం మనం మిత్రులుగా మెలగాలని నిర్ణయించుకోవడం సరైన ఎంపిక. డ్రాగన్(చైనా), ఏనుగు(భారత్) కలిసి నృత్యం చేయాల్సిన సమయం వచ్చింది. ఎదుటి దేశాన్ని మన అభివృద్ధికి అవకాశంగా భావించాలి. అంతేగానీ ప్రమాదకారిగా భావించకూడదు. బహుళధ్రువ ప్రపంచం కోసం పాటుపడదాం. అంతర్జాతీయ సంస్థల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా చేద్దాం. ఆసియాసహా ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపనకు మనవంతు కృషిచేద్దాం ''అని మోదీతో జిన్‌పింగ్ అన్నారు.

## మోదీ, జిన్‌పింగ్ భేటీ 'పది'నిసలు

1. రష్యాలో బ్రిక్స్ సదస్సు తర్వాత తొలిసారిగా భేటీ అయిన మోదీ, జిన్‌పింగ్‌లు ఇక మీదటైనా ద్వైపాక్షిక ఒప్పందాల్లో పురోగతిని సాధించాలని నిర్ణయించారు
2. భారత్, చైనా మధ్య నేరుగా పౌరవిమానయాన సర్వీసులను విస్తరించాలని నిర్ణయించారు
3. కైలాస్ మానససరోవర్ యాత్ర కోసం భారతీయులకు యాత్రా వీసాలు ఇచ్చేందుకు చైనా ముందుకొచ్చింది
4. పరస్పర వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని గౌరవించుకుంటూనే మూడో దేశం జోక్యాన్ని ఏమాత్రం సహించకూడదని నిర్ణయించుకున్నారు
5. సరిహద్దు వెంట బలగాల ఉపసంహరణతో శాంతి స్థాపన సాధ్యమైందని నేతలు పునరుద్ఘాటించారు
6. భారత్, చైనా ఎప్పటికీ మిత్రులుగా, మంచి పొరుగుదేశాలుగా మెలగాలని జిన్‌పింగ్ అభిలషించారు
7. ఇరుదేశాల బంధాన్ని కేవలం సరిహద్దు వివాదం కోణంలో చూసే ధోరణిని విడనాడాలని నిర్ణయించుకున్నారు. వాణిజ్య, పెట్టుబడుల బంధాన్ని బలోపేతం చేయాలని కోరుకున్నారు
8. చైనా కంపెనీలకు భారత్‌లో అవకాశం ఇవ్వడం ద్వారా భారత్‌లో విద్యుత్‌వాహన రంగం సైతం వేగంగా విస్తరిస్తుందని ఇరునేతలు ఆశించారు
9. ఇటీవల చర్చల నిర్ణయాలకు అనుగుణంగా మూడు సరిహద్దుల గుండా సరకు రవాణా, వాణిజ్యానికి ద్వారాలు తెరవాలని మోదీ, జిన్‌పింగ్ నిర్ణయించారు
10. అధిక టారిఫ్‌లతో చెడిన అమెరికా బంధానికి బదులు పరస్పర బంధాన్ని బలపర్చుకుని అంతర్జాతీయంగా వాణిజ్యరంగంలో ఎదగాలని ఇరునేతలు కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు

### గ్రూప్ ఫొటోలో జిన్‌పింగ్, పుతిన్ పక్కపక్కనే

ద్వైపాక్షిక భేటీ తర్వాత జిన్‌పింగ్ షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) విందు కోసం సభ్యదేశాల అగ్రనేతలను ఆహ్వానించారు. ఇందుకోసం తొలుత ఒక్కో నేతలను వేదిక మీదకు ఆహ్వానించి విడివిడిగా ఫొటో దిగారు. తర్వాత నేతలందరితో కలిసి సతీసమేతంగా గ్రూప్ ఫొటో దిగారు. ఇందులో జిన్‌పింగ్, ఆయన భార్య పెంగ్ లియువాన్ ముందు వరసలో మధ్యలో నిల్చున్నారు. జిన్‌పింగ్‌కు కుడివైపు రష్యా అధ్యక్షుడు పుతిన్ నిల్చున్నారు. మరో ఇద్దరు నేతల తర్వాత ప్రధాని మోదీ సైతం ముందు వరసలో నిల్చుని గ్రూప్ ఫొటోకు పోజిచ్చారు. టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజ్జు, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు ముందు వరసలో నిల్చున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాక్ అగ్రనేతలు ఇలా ఒక అంతర్జాతీయ వేదికపై కనిపించడం ఇదే తొలిసారి. కజకిస్తాన్, కిర్గిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఇరాన్, బెలారస్‌సహా పలు దేశాల అగ్రనేతలు పర్యవేక్షక, దౌత్య భాగస్వామి, అతిథులుగా ఎస్‌సీఓ విందులో పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి, ఆసియాన్ వంటి సంస్థలు సైతం ఎస్‌సీఓ చర్చల్లో పాల్గొననున్నాయి.

### జిన్‌పింగ్ మెచ్చిన కారు మోదీ కోసం



రెండ్రోజుల పర్యటన నిమిత్తం చైనాకు విచ్చేసిన ప్రధాని మోదీ అక్కడ ఎక్కడికి వెళ్లాలన్నా ప్రభుత్వ వాహనంలోనే వెళ్లాల్సి ఉంటుంది. అందుకోసం మోదీ కోసం ప్రత్యేకంగా హాంగ్‌క్వీ కారును తెప్పించారు. ఈ మోడల్ కారు అంటే జిన్‌పింగ్‌కు మహా ఇష్టం. 2019లో మహాబలిపురంలో జిన్‌పింగ్ పర్యటించినప్పుడ ఇదే యాంగ్‌క్వీ ఎల్5 కారులో కలియతిరిగారు. ఈ కారును రెడ్‌ఫ్లాగ్ అని కూడా పిలుస్తారు. మేడిన్ ఇండియాలాగే ఈ కారు మేడిన్ చైనా అన్నమాట. కమ్యూనిస్ట్ పార్టీ చైనా అగ్రనేతల పర్యటన కోసం 1958లో చైనా ప్రభుత్వరంగ ఫస్ట్ ఆటోమోటివ్ వర్క్స్ సంస్థ ఈ మోడల్ కారును తొలిసారిగా రూపొందించింది. ఇక తియాంజిన్‌లో ఉన్నంతసేపూ పుతిన్ రష్యా తయారీ ఆరస్ మోడల్‌కారులో తిరగనున్నారు. పాతతరం మోడల్‌లో ఈ కారు ఉంటుంది. రష్యాకు చెందిన ఆరస్ మోటార్స్ సంస్థ ఈ కారును తయారుచేసింది. చైనా తయారీ నంబర్‌ప్లేట్‌ను తగిలించి పుతిన్ ఈ కారులో ప్రయాణిస్తున్నారు.

### జిన్‌పింగ్ నోట పంచశీల మాట

భారత్, చైనాల మధ్య శాంతి, సుస్థిరతలు పరిఢవిల్లాలంటే దశాబ్దాలనాటి 'పంచశీల'ఒడంబడిక సూత్రాలను అవలంభిస్తే సబబుగా ఉంటుందని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. మోదీతో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన సందర్భంగా జిన్‌పింగ్ తన మనసులో మాట బయటపెట్టారు. ఈ నేపథ్యంలో ఆనాటి పంచశీల ఒడంబడిక అంశం మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ పంచశీల సూత్రాల ఉనికికి గతంలో ఎన్నో ఒప్పందాల సందర్భంగా భారత్, చైనా గుర్తించాయి. ''పంచశీల సూత్రాలను 70 ఏళ్ల క్రితం నాటి చైనా, భారత్ దిగ్గజ నాయకులు రూపొందించారు. ఇవే సూత్రాలు ఇప్పుడూ అనుసరణీయమే''అని జిన్‌పింగ్ అన్నారు.

**ఏమిటీ పంచశీల ఒప్పందం?**

1954 ఏప్రిల్ 29వ తేదీన భారత్, చైనా అనుసరించాల్సిన విధానాలను ఐదు సూత్రాల నియమావళిగా రూపొందించారు. వీటిని పంచశీల సూత్రాలు అంటారు. అవి..

1. తోటి దేశ ప్రాదేశిక సమగ్రత, సారభౌమత్వాన్ని పూర్తిస్థాయిలో గౌరవించడం
2. ఆ దేశంపై దురాక్రమణకు పాల్పడకపోవడం
3. ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం
4. ఇరుదేశాల మధ్య సమానత్వం, ఉమ్మడి ప్రయోజనాల కోసం కృషిచేయడం
5. శాంతియుత సహజీవనానికి బాటలు వేయడం

### ఆంక్షలపై పోరాడుతాం: పుతిన్



పుతిన్, జిన్‌పింగ్

ట్రంప్ విధించిన వివక్షాపూరిత ఆంక్షలపై చైనా, రష్యా పోరాడుతున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. ఎస్‌సీఓ సదస్సు కోసం తియాంజిన్ సిటీకొచ్చిన ఆయన చైనా అధికారిక వార్తాసంస్థ జిన్‌హువాతో మాట్లాడారు. ''అంతర్జాతీయ సవాళ్లను బ్రిక్స్ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా కీలక మౌలికసదుపాయాల ప్రాజెక్టుల నిర్వహణకు చైనా, రష్యా అదనపు వనరుల సమీకరణలో తలమునకలయ్యాయి. సామాజికఆర్థికాభివృద్ధికి అవరోధంగా మారినఅమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు చైనా, రష్యా సమష్టిగా పోరాడుతున్నాయి''అని పుతిన్ అన్నారు.

# స్వదేశీ వస్తువులనే వాడండి

## 'స్వదేశీ' అని సగర్వంగా చెప్పుకోండి

- ప్రతిభావంతుల కోసం 'ప్రతిభా సేతు'
- 125వ మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

**సాక్షి, న్యూఢిల్లీ:** రాబోయేది పండుగల కాలమని, ఈ సీజన్‌లో ప్రజలందరూ స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బహుమతులు, దుస్తులు, అలంకరణలు జీవితంలో ప్రతీది మనదేశంలో తయారైందే ఉపయోగించాలని, ఇది స్వదేశీ అని సగర్వంగా చెప్పుకోవాలని సూచించారు. అదే ఆత్మనిర్భర్ భారత్‌కు దారి తీస్తుందని ఉద్ఘాటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై 50 శాతం సుంకం విధించడంతో అమెరికాతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో దేశం స్వావలంబన చెందాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి 125వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ మాట్లాడారు. వివిధ ప్రాంతాలు గణేష్ చతుర్థి, ఆ తరువాత దుర్గా నవరాత్రులు, దీపావళి పండుగలు వరుసగా వస్తున్నందున పండుగల సమయంలో ప్రజలు స్వదేశీ ఉత్పత్తుల గురించి ఎప్పటికీ మరచిపోకూడదన్నారు. రామాయణం, భారతీయ సంస్కృతి పట్ల ప్రేమ ఇప్పుడు ప్రపంచంలోని ప్రతి మూలకు చేరుకోవడం చూస్తుంటే గర్వంగా ఉందన్నారు.

### ప్రకృతి వైపరీత్యాల విధ్వంసంపై విచారం..

ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు చేపట్టిన భద్రతా దళాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానికులు చూపిన ధైర్యాన్ని అభినందించారు. 'వంతెనలు కూలినా, కొండచరియలు విరిగిపడినా, మనుషుల ప్రాణాలను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ చేసిన కృషి దేశానికి గర్వకారణం'అని కొనియాడారు. ప్రకృతి వైపరీత్యాలు సృష్టించిన విధ్వంసంపై ప్రధాని విచారం వ్యక్తం చేశారు.

### పటేల్ వల్లే హైదరాబాద్ విమోచన..

'భారత సమగ్రతను కాపాడటంలో సర్దార్ వల్లభ భాయ్ పటేల్ పాత్ర చిరస్మరణీయం. 1948లో ఆయనే చూపిన దూరదృష్టి, ధైర్యసాహసాల వలననే హైదరాబాద్ విమోచన సాధ్యమైంది. సెప్టెంబర్ 17వ తేదీ హైదరాబాద్ విమోచన దినోత్సవం మనకు చరిత్రలోని ఒక మహత్తర గాథను గుర్తు చేస్తుంది. అది కేవలం ఒక ప్రాంత విమోచన కాదు, దేశ సమగ్రతకు బలమైన పునాది.

### ప్రతిభా సేతుతో వందలాది మందికి ఉపాధి

యూపీఎస్సీలో ఎంపిక కాని ప్రతిభావంతుల కోసం రూపొందించిన 'ప్రతిభా సేతు పోర్టల్'గురించి ప్రధాని ప్రస్తావించారు. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటికే వందలాది మంది ఉపాధి పొందారన్నారు. మధ్యప్రదేశ్ యువకులు ఫుట్‌బాల్ ఆడుతున్న దృశ్యం జర్మన్ కోచ్ దృష్టిని ఆకర్షించడం, వారికి జర్మనీలో శిక్షణ కల్పించడానికి ముందుకు రావడాన్ని ప్రధాని ఉదహరించారు. కొంతమంది ఆటగాళ్లు త్వరలో శిక్షణ కోసం జర్మనీకి వెళతారని ప్రధాని తెలిపారు. సైనికుల గాథలను సేకరించి, అమరవీరుల కుటుంబాలతో సంబంధాలు కొనసాగిస్తున్న సమాజసేవకుడు జితేంద్ర సింగ్ రాథోడ్ సేవలను ప్రధాని ప్రశంసించారు. బీహార్‌కు చెందిన 'సోలార్ దీదీ' దేవకి సోలార్ పంపుల ద్వారా గ్రామానికి నీరు అందజేసి రైతుల ఆదాయాన్ని పెంచిన కృషిని గుర్తుచేశారు.

### విశ్వకర్మ సోదరులకూ వందనం

'సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి. ఆ రోజును మన విశ్వకర్మ సోదరులకు అంకితం చేశాం. వడ్రంగులు, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరులు, శిల్పులు - ఈ సంప్రదాయ వృత్తులు భారతీయ నాగరికతకు, సాంస్కృతిక వారసత్వానికి పునాదులు. ఒక తరం నుండి మరొక తరానికి నైపుణ్యాన్ని అందిస్తూ, జ్ఞానాన్ని కాపాడుతూ వస్తున్నారు. వీరిని ఆదుకోవడానికి ప్రభుత్వం 'విశ్వకర్మ యోజన'ను ప్రారంభించింది'అని మోదీ తెలిపారు.

# సారథిగా శివరాజ్ సింగ్ చౌహాన్?

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దల్లో కుదిరిన ఏకాభిప్రాయం
- త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం



**సాక్షి, న్యూఢిల్లీ:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్ష పదవికి వారసుడి ఎంపికపై సస్పెన్స్ నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా పదవీ కాలం ముగియనుండటంతో నూతన అధ్యక్షుడి ఎంపిక కోసం పార్టీ అధిష్టానం కసరత్తును వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీలో అంతర్గతంగా, రాజకీయ వర్గాల్లో శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న ఆయన.. ముఖ్యమంత్రిగా మధ్యప్రదేశ్‌ను సుదీర్ఘకాలం పాలించిన అనుభవం ఉంది. ఆయన నిష్కళంక ప్రజా సేవ, సున్నితమైన ఇమేజ్, రాజకీయ అనుభవం ఈ పదవికి పోటీలో అగ్రస్థానంలో నిలబెట్టాయి.

**ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం – విశ్వాసానికి ముద్ర**

బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి పలు పేర్లు వినిపిస్తున్నా, వాస్తవానికి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముందంజలో ఉన్నారు. 18 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన అనుభవం, ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం, మోదీ విశ్వాసం, ఓబీసీ నేపథ్యం ఇవన్నీ ఆయనకు అనుకూలంగా ఉన్నాయి. శివరాజ్ రాజకీయ ప్రయాణం ఆర్ఎస్ఎస్‌తోనే ప్రారంభమైంది. క్రమశిక్షణకు మారుపేరైన ఆయన క్రమంగా బీజేపీలో ఎదిగారు. పార్టీ జాతీయ రాజకీయాల్లో కీలక నిర్ణయాలను ప్రభావితం చేసే ఆర్ఎస్ఎస్ మద్దతు శివరాజ్‌కు ప్లస్ పాయింట్. ఇటీవల ఆయన గ్వాలియర్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో సుమారు 45 నిమిషాల పాటు భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలాన్నిస్తోంది. అయితే ఈ భేటీకి ముందు కానీ, ఆ తరువాత కానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా శివరాజ్ సింగ్ పార్టీ పట్ల తన నిబద్ధతను చాటారు.


**పార్టీలోనూ ప్రాధాన్యం**

1991లో మొదటిసారి లోక్‌సభకు ఎన్నికైన శివరాజ్ ఇప్పటివరకు ఆరు సార్లు ఎంపీగా గెలిచారు. 2024లో మరోసారి విజయంతో లోక్‌సభకు చేరి, కేంద్ర మంత్రివర్గంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖలను చేపట్టారు. గ్రామీణ భారత ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించడం, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆయన మంత్రిత్వ పనితీరులో ప్రధాన అంశాలు. 2024లో మోదీ కేబినెట్ ప్రమాణ స్వీకార వేడుకలో శివరాజ్ ఐదవ స్థానంలో ప్రమాణం చేయడం గమనార్హం. 2005 నుంచి 2023 వరకు 18 సంవత్సరాల పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొనసాగడం ఆయన పరిపాలనా నైపుణ్యానికి నిదర్శనం. మధ్యలో 2018లో ఓటమి ఎదురైనా, 2020లో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవడంతో ఆయన రాజకీయ సామర్థ్యమేంటో తెలిసొచ్చింది.

శివరాజ్ ఓబీసీ వర్గానికి చెందినవారు. రాబోయే రోజుల్లో బీజేపీ మరింత విస్తరించడానికి ఈ వర్గంపై దృష్టి పెట్టాల ని భావిస్తోంది. ఆయన అధ్యక్షుడిగా వస్తే, పార్టీకి సామాజికంగానూ అదనపు బలం చేకూరుస్తుంది. 'బీజేపీకి ప్రస్తుతం ప్రజలతో మమేకమయ్యే, కేడర్‌ను ఉత్సాహపరిచే, అలాగే జాతీయ స్థాయిలో అంగీకారం ఉన్న నాయకుడు కావాలి. ఈ మూడు లక్షణాలు శివరాజ్‌లో ఉన్నాయి. ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ విశ్వాసం ఉండటం వల్ల ఆయనే తదు పరి అధ్యక్షుడయ్యే అవకాశం ఎక్కువ'అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే ఆర్ఎస్ఎస్, బీజేపీ పెద్దల్లో శివరాజ్ సింగ్ చౌహాన్ పేరుపై ఏకాభిప్రాయం వచ్చిందని... త్వరలోనే పార్టీ అధిష్టానం ఆయన పేరును నూతన అధ్యక్షుడిగా ప్రకటి ంచే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.

# వీధి శునకాల కేసుతో ఫేమస్ అయ్యా

## సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్



**తిరువనంతపురం:** వీధి శునకాల కేసుతో తనకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ అన్నారు. ఈ దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా తాను తెలిసేలా చేసిన వీధి శునకాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శనివారం తిరువనంతపురంలో 'మానవ-వన్యప్రాణుల సంఘర్షణ'పై జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నేను చేస్తున్న పనికి న్యాయవాద సమాజంలో చాలా కాలంగా గుర్తింపు పొందాను. కానీ మొత్తం పౌర సమాజానికి నేను తెలిసేలా చేసిన వీధి కుక్కలకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. శునకాల ప్రేమికుల నుంచే కాకుండా, శునకాలు కూడా నన్ను ఆశీర్వదిస్తున్నాయని మెసేజ్‌స్ వస్తున్నాయి.'అని నాథ్ అన్నారు. ఈ కేసును తనకు అప్పగించిన భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ విషయం నాకు కేటాయించినందుకు సీజేఐకి కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఇటీవల, మేం 'లా ఆసియా పోలా సమ్మిట్'ఉండగా.. వీధి కుక్కల విషయం గురించి ప్రశ్నలు అడగడం ప్రారంభించారు. భారత్ బయట కూడా ప్రజలు నన్ను గుర్తించినందుకు సంతోషంగా ఉంది. ఈ గుర్తింపు ఇచ్చినందుకు నేను వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను'అని ఆయన అన్నారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి తరలించిన వీధి కుక్కల విడుదలను నిషేధిస్తూ ఆగస్టు 11న ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. వీధి కుక్కలను ఆశ్రయాల్లో ఉంచాలన్న తీర్పు అమానవీయమైనదని, ఆచరణ సాధ్యం కానిదని నిరసనకారులు పేర్కొన్నారు. దీంతో సీజేఐ కేసును జస్టిస్ విక్రమ్ నాథ్‌కు అప్పగించారు. మునుపటి ఆదేశాన్ని నాథ్ నాయకత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆగస్టు 22న నిలిపివేసింది. టీకాలు వేసి, స్టెరిలైజ్ చేసిన తర్వాత కుక్కలను వాటి స్థావరాల్లో వాటిని వదిలేయాలని న్యాయమూర్తి నాథ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత సీజేఐ బీఆర్ గవాయ్ తర్వాత బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్ అనంతరం.. అనంతరం 2027లో విక్రమ్ నాథ్ సీజేఐ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

# లక్ష కోట్లతో జలాంతర్గామి డీల్

**న్యూఢిల్లీ:** పెద్దసంఖ్యలో యుద్ధనౌకలు, జలాంతర్గాములతో భారత్‌కు పక్కలో బల్లెంలో తయారైన చైనాకు సాటిగా ఎదిగేందుకు భారత్ మరో అడుగు ముందుకేస్తోంది. అత్యంత శక్తివంతమైన రెండు జలాంతర్గాముల తయారీ, కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకునేందుకు భారత్ సమాయత్తమైంది. ప్రభుత్వ రంగ మజగావ్ డాక్ లిమిటెడ్, ఫ్రాన్స్ రక్షణరంగ దిగ్గజం నావల్ గ్రూప్‌లో కలిసి మూడు స్కార్పియన్ శ్రేణి జలాంతర్గాములను భారత్ తయారుచేయనుంది. రూ.36,000 కోట్ల విలువైన ఈ ఒప్పందానికి రెండేళ్ల క్రితమే రక్షణశాఖ ఆమోదం తెలిపినా సాంకేతిక, వాణిజ్యపర అంశాల్లో స్పష్టతలేక ఇన్నాళ్లు చర్చల దశలోనే ఈ ఒప్పందం తచ్చాడుతోంది. దీనికి తోడు మరో రూ.65,000 కోట్లతో ఆరు డీజిల్-ఎలక్ట్రిక్ నిఘా జలాంతర్గాములను సమీకరించుకోవాలని భారత రక్షణశాఖ తలపోస్తోంది. మొత్తంగా రూ.1 లక్ష కోట్ల భారీ ప్రాజెక్టులపై కదలిక వచ్చిందని సంబంధిత విశ్వసనీయ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. డీజిల్-ఎలక్ట్రిక్ జలాంతర్గాముల ప్రాజెక్ట్‌కు సైతం రక్షణశాఖ 2021లో ఆమోదం తెలిపినా అది కార్యరూపం దాల్చలేదు.

# 'ఎడ్యుకేట్ గాళ్స్'కు 'మెగసెసే' అవార్డు

**మనీలా:** మనదేశంలో బాలికల విద్య కోసం పనిచేస్తున్న ప్రముఖ ఎన్జీవో 'ఎడ్యుకేట్ గాళ్స్'ప్రతిష్టాత్మక రామన్ మెగసెసే-2025 అవార్డును గెలుచుకుంది. ఈ పురస్కారాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సంస్థగా రికార్డు సృష్టించింది. 'ఎడ్యుకేట్ గాళ్స్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని బాలికలు, యువతులకు విద్యనందిస్తోంది. వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి సామర్థ్యాన్ని, ధైర్యాన్ని నింపుతోంది. ఎంతో నిబద్ధత, అంకితభావంతో ఈ పని చేస్తున్న సఫీనా హుస్సేన్ ఆసియాలో అత్యున్నత గౌరవానికి ఎంపికైంది'రామన్ మెగసెసే అవార్డ్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన మాల్దీవులకు చెందిన షాహినా అలీ, ఫిలిప్పీన్స్‌కు చెందిన ఫ్లావియానో ఆంటోనియో ఎల్ విల్లానుయేవా కూడా ఈ అవార్డును దక్కించుకున్నారు. నవంబర్ 7న మనీలాలోని మెట్రోపాలిటన్ థియేటర్‌లో జరిగే అవార్డు ప్రదానోత్సవ వేడుకలు జరుగుతాయి. ఈ అవార్డు ఎడ్యుకేట్ గాళ్స్‌కే కాదు.. మొత్తం దేశానికే చారిత్రాత్మకమైనదని సంస్థ వ్యవస్థాపకురాలు సఫీనా హుస్సేన్ అన్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ గ్రాడ్యుయేట్ అయిన సఫీనా హుస్సేన్ 2007లో ఎడ్యుకేట్ గాళ్స్‌ను స్థాపించారు. అప్పటివరకూ శాన్‌ఫ్రాన్సిస్కోలో పనిచేసిన ఆమె..మహిళల నిరక్షరాస్యతపై పనిచేయాలని భారత్‌కు తిరిగొచ్చారు. రాజస్థాన్‌లో తన సేవను ప్రారంభించారు. చదువుకోని లేదా బడి బయట ఉన్న బాలికలను తరగతి గదిలోకి తీసుకొచ్చారు. లక్షలాది మంది యువతులకు ఉన్నత విద్యతోపాటు, ఉపాధి కల్పించే విద్యనందించేందుకు కృషి చేస్తున్నారు.

ఆసియా నోబెల్‌గా పిలుచుకునే రామన్ మెగసెసే అవార్డు ప్రజలకు నిస్వార్థ సేవలందించిన, సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తులు, సంస్థలకు అందజేస్తారు. ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రామన్ మెగసెసే జ్ఞాపకార్థం 1957లో అవార్డును నెలకొల్పారు. రామన్ మెగసెసే పతకం, ప్రశంసా పత్రంతోపాటు నగదు బహుమతిని అందజేస్తారు. భారత్ నుంచి గతంలో రామన్ మెగసెసే అవార్డును గెలుచుకున్న వారిలో మదర్ థెరిసా (1962), జయప్రకాష్ నారాయణ్ (1965), చిత్రనిర్మాత సత్యజిత్ రే (1967), జర్నలిస్ట్ రవీష్ కుమార్ (2019), పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ (2018), అరవింద్ కేజ్రీవాల్ (2006), ఆర్టీఐ కార్యకర్త అరుణా రాయ్ (2000), కిరణ్ బేడి (1994) జర్నలిస్ట్ అరుణ్ శౌరి (1982) ఉన్నారు.

# అమెరికాకు అన్ని రకాల పోస్టల్ సేవలు బంద్

**న్యూఢిల్లీ:** అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ప్రకటించిన నిబంధనల్లో స్పష్టత లేకపోవడంతో అన్ని రకాల పోస్టల్ సేవలను నిలిపివేస్తున్నట్లు ఇండియా పోస్ట్ ప్రకటించింది. 100 డాలర్లకంటే ఎక్కువ విలువైన బహుమతులను అమెరికా భూభాగంలోకి డెలివరీ చేసేందుకు తొలుత ఇండియాపోస్ట్ తాత్కాలిక విరామం ఇవ్వగా తాజాగా అన్ని కేటగిరీల పార్శిళ్లను అమెరికాకు డెలివరీ చేయడం ఆపేసింది. ''ఆగస్ట్ 22న జారీచేసిన బహిరంగ నోటీస్ ప్రకారమే అమెరికాకు పార్శిళ్ల డెలివరీను ఆపేశాం. అయితే అమెరికా కస్టమ్స్ శాఖ విడుదలచేసిన తాజా నిబంధనల్లో స్పష్టత కొరవడింది. ఇలాంటి అస్పష్ట పరిస్థితుల్లో అమెరికాకు లేఖలు, డాక్యుమెంట్లు, బహుమతుల వంటి ఎలాంటి వస్తువులను పంపడం సమర్థనీయం కాదు. అందుకే అన్నిరకాల పార్శిళ్లను అమెరికాకు పంపడం నిలిపేస్తున్నాం. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. అమెరికా విభాగాల స్పందనకు అనుగుణంగా వీలైనంత వరకు త్వరగా సేవల పునరుద్ధరణకు కట్టుబడిఉన్నాం''అని ఇండియాపోస్ట్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



**ట్రిపుల్ ఆర్‌పై రూట్‌మ్యాప్**
రీజనల్ రింగ్ రోడ్డు వల్ల ప్రభావితం కానున్న వివిధ జిల్లాల్లోని మండలాలు, గ్రామాలకు చెందిన భూములు, సర్వే నంబర్ల వివరాలను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో ప్రకటించారు. -8లో



**సాంఘిక నృత్యం.. కోలాటం..**
కోల అంటే కర్రపుల్ల.. ఆట అంటే నృత్యం.. ఈ రెండింటినీ కలిపేదే కోలాటం.. పండగ వేళ సరదాగా ఆడే సాంఘిక నృత్యం.. - సిటీప్లస్‌లో

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
29.0/23.0
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురవొచ్చు. గరిష్టంగా 29, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## 'మన్‌కీ బాత్'కు దేశవ్యాప్తంగా విశేష స్పందన

**రహమత్‌నగర్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బోరబండ డివిజన్ సైట్–3లో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన 125 మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రత్యక్షంగా తిలకించారు. అనంతరం మాట్లాడుతూ మన్‌కీబాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ తన ప్రసంగాలతో ప్రజలకు చైతన్యవంతులను చేయడమే కాకుండా, దేశాభివృద్ధిలో వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. సెప్టెంబర్–17న తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారన్నారు. ప్రధాని మోదీ మాతృ మూర్తిపై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహాగణపతికి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు



ఖైరతాబాద్ మహాగణపతికి పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ఖైరతాబాద్:** ఖైరతాబాద్‌లో కొలువు దీరిన శ్రీ విశ్వ శాంతి మహాశక్తి గణపతిని ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దర్శించుకున్నారు. ఖైరతాబాద్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 26 కిలోల లడ్డూను కేంద్ర మంత్రి స్వయంగా తలపై పెట్టుకొని మహాగణపతికి సమర్పించారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ స్వదేశీ టెక్నాలజీతో ఆపరేషన్ సిందూర్‌తో విజయం సాధించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్, రాంమ్మోహన్ రావు, వీణామాధురి పాల్గొన్నారు.

## 17న తెలంగాణ విమోచన దినోత్సవం


**లాలాపేట:** మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం దేశ ఔన్నత్యాన్ని పెంపొందించేలా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామ్‌చందర్‌రావు అన్నారు. ఆదివారం 125వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని తార్నాకలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడులను పరేడ్ గ్రౌండ్‌లో భారత ప్రభుత్వం అధికారికంగా పెద్ద ఎత్తున నిర్వహించనుందన్నారు. ఆ కార్యక్రమానికి దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, దత్తాత్రేయ, మధుసూదనాచారి, నారాయణ

**హిమాయత్‌నగర్:** స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు సాధించిన స్ఫూర్తితోనే చట్టసభల్లో 50 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమిస్తామని ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఇదే చివరి పోరాటమని, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీసుకువచ్చిన బిల్లును ఎవరైనా వ్యతిరేకిస్తే సహించబోమన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ అధ్యక్షతన ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన 'బీసీల యుద్ధభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కోర్టుకు ఎవరూ వెళ్లరాదని, ఎవరైనా వెళితే పోరాడి విజయం సాధిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు మానుకోపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ దోపిడీ, అన్యాయం, అణిచివేతకు గురైన బీసీలు రాజ్యాధికారం సాధించాలని, ఇది సాధ్యం కావాలంటే బీసీలంతా ఐక్యంగా ఉండి బీసీలకే ఓట్లు వేయాలని సూచించారు. నాయకులు నీల వెంకటేష్, కోల జనార్దన్, పి.సుధాకర్, వేముల రామకృష్ణ, భరత్ గౌడ్, విజయ్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.









ఖైరతాబాద్ మహా గణపతిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం సెలవు రోజు కావడం, వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో ఆ ప్రాంతం భక్త జనసంద్రంగా మారింది. సాయంత్రం పూట చిరుజల్లులు కురిసినా భక్తులు తడుస్తూనే వినాయకుడిని దర్శించుకున్నారు. ఒక్కరోజే దాదాపు 5 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.
– సాక్షి, సిటీబ్యూరో



# ఏకదంతం జనసంద్రం

ఆర్టీఏలో ఏళ్లకు ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది రవాణాశాఖ పౌరసేవలను ప్రభావితం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులపైన కూడా పెత్తనం కొనసాగిస్తూ దళారులు, ఏజెంట్లకు అండగా నిలుస్తున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా స్మార్ట్ కార్డుల అమ్మకాలు, సామర్థ్యం లేని వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ వంటి అక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. సాధారణంగా ప్రతి మూడేళ్లకు ఒకసారి ఒకచోట నుంచి మరోచోటుకు బదిలీ కావాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా కొందరు కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులు ఏడేళ్ల నుంచి పదేళ్లకు పైగా ఒకే కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆయా కార్యాలయాల్లో జరిగే అన్ని రకాల కార్యకలాపాల్లో హవా కొనసాగిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పలు ప్రాంతీయ రవాణా కార్యాయాల్లో కొంతమంది సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో

# పదేళ్లుగా.. తిష్ట

ఆర్టీఏ విధుల్లో వారిదే కీలక పెత్తనం

**దళారులు, ఏజెంట్లతో కుమ్మక్కు**
- ఆర్టీఏలో ఒకేచోట పాతుకుపోయిన సిబ్బంది
- కొన్నిచోట్ల హోంగార్డులదే హవా
- స్మార్ట్‌కార్డుల అమ్మకాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలకు అనుమతులు

సాధారణంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్ల స్మార్ట్ కార్డులను వాహనదారులకు స్పీడ్‌పోస్టు ద్వారా అందజేసేందుకు రవాణాశాఖ చర్యలు తీసుకుంది. కానీ కొంతమంది సిబ్బంది ఈ కార్డులపై చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. వాహనదారులకు పోస్టు చేయకుండా తమ వద్దే ఉంచుకొని దళారుల ద్వారా రూ.200 నుంచి రూ.300లకు ఒక కార్డు చొప్పున వాహన యజమానులకు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ఈ అమ్మకాలు వ్యవస్థీకృతమైన దందాగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మోటారు వాహన నిబంధనల అమలుపైన అధికారులు నిర్వహించే ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లోనూ కానిస్టేబుళ్లే ముందు వరుసలో ఉంటారు. పర్మిట్లు లేని వాహనాలు, ఫీజులు చెల్లించని వారి నుంచి వసూళ్లకు పాల్పడుతూ సదరు వాహనాలు అధికారులకు చిక్కకుండా ముందస్తు సమాచారం ఇస్తున్నట్లు కొందరు ఎంవీఐలే విస్మయం వ్యక్తం చేయడం గమనార్హం.



ఓవర్‌లోడ్ వాహనాలు, వివిధ రకాల నిబంధనలను ఉల్లంఘించి తిరిగే వాటిని ఇలా తప్పించడం వల్ల రవాణాశాఖకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతున్నట్లు పేర్కొన్నారు.

### కదిలించడం కష్టమే..

ఇలా సుమారు దశాబ్దకాలంగా ఒకేచోట పనిచేస్తున్న సిబ్బంది తమను బదిలీ చేయకుండా రాజకీయ పలుకుబడిని అస్త్రంగా వాడుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలు తమకు మద్దతుగా ఉన్నట్లు ఉన్నతాధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. విధి నిర్వహణలోనూ అధికార పార్టీని సాకుగా చూపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వారిని బదిలీ చేసేందుకు అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నారు. తాము ఫలానా పెద్ద నాయకుడికి చెందిన అనుచరులమని చెబుతారు. దీంతో వాళ్ల జోలికి వెళ్లడానికి కూడా అధికారులు సాహసించడం లేదు. వివిధ ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది బదిలీలు యదావిధిగా జరిగినప్పటికీ కొంతమంది మాత్రం తమ పలుకుబడిని ఉపయోగించి బదిలీలను అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



# నిమజ్జనం.. ఆన్‌లైన్!

ప్రతి గణేశ్ విగ్రహానికీ క్యూఆర్ కోడ్

- జియో ట్యాగింగ్ చేస్తున్న సిటీ పోలీసులు
- తనిఖీల నిర్వహణపై అధికారుల కన్ను
- నిమజ్జనం నేపథ్యంలోనూ పని సరళం

**సాక్షి, సిటీబ్యూరో:** సిటీలో ఏటా జరిగే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం నగర పోలీసులకు అత్యంత కీలకమైన ఘట్టాలు. మండపం ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడం నుంచి విగ్రహం నిమజ్జనం(విసర్జన్) అయ్యే వరకు నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే. గతంలో మాన్యువల్ జరిగే ఈ తంతును సిటీ కాప్స్ పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ చేశారు. ప్రతి వినాయక మండపానికీ ఓ ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ కేటాయించారు. దీంతో తనిఖీల నుంచి నిమజ్జనం వరకు ప్రతి అంశం జవాబుదారీగా ఉండనుంది. నగరంలోని విగ్రహాలన్నింటినీ జియో ట్యాగ్ చేశారు.

### రిజిస్ట్రేషన్ ఉన్నా లేకున్నా ఒకేలా..

నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏటా వేల వినాయక మండపాలు ఏర్పాటవుతుంటాయి. దీనికోసం నిర్ణీత సమయం ముందు నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుంది. వీటి ఆధారంగా పోలీసులు మండపాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో పాటు ప్రతి దానికీ ఓ నంబర్ కేటాయిస్తుంటారు. ఇలా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వాటి కంటే రెట్టింపు సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటవుతుంటాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు తమ పరిధిలో ఏర్పాటైన మండపాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నా లేకపోయినా సదరు విగ్రహాన్ని పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకుంటున్నారు. అది నిమజ్జనం అయ్యే వరకు పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశారు. దీని కోసం ప్రతి విగ్రహానికి ఓ క్యూఆర్ కోడ్ కేటాయిస్తున్నారు. దీన్ని నిర్వాహకులు తమ మండపాల్లో నిర్ణీత ప్రాంతంలో అతికిస్తున్నారు.

### అధికారిక యాప్‌లోనూ లింకు..

ఈ క్యూఆర్ కోడ్స్ ఆధారంగా ఆయా విగ్రహాలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఆ డేటాను పోలీసు అధికారిక యాప్ టీఎస్ కాప్‌లోకి లింకు ద్వారా




ఇస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి క్షేత్ర స్థాయిలో ఉండే పోలీసుల వరకు ఎవరైనా సరే తమ ప్రాంతంలో ఎన్ని మండపాలు ఉన్నాయి? ఎక్కడ ఉన్నాయి? ఎప్పుడు ఏర్పాటు అవుతాయి? నిమజ్జనం ఎప్పుడు? ఏ మార్గంలో వెళ్లి, ఎక్కడ నిమజ్జనం చేస్తారు? తదితర వివరాలను తమ ట్యాబ్స్, స్మార్ట్‌ఫోన్స్‌లో చూసుకునే అవకాశం ఏర్పడింది. క్యూఆర్ కోడ్ కేటాయింపులోనే అధికారులు పక్కాగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల వారీగా వేర్వేరుగా దీని కేటాయింపు జరుగుతోంది.

### కోడ్ స్కానింగ్‌తో తనిఖీలు

ఓ ప్రాంతంలో మండపం ఏర్పాటయినప్పటి నుంచి అందులోని విగ్రహం నిమజ్జనం అయ్యే వరకు ప్రతి దశలోనూ పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది. గస్తీ విధులు నిర్వర్తించే బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల సిబ్బంది నిత్యం ఆయా మండపాల వద్దకు వెళ్లి పరిస్థితుల్ని అంచనా వేయడంతో పాటు తనిఖీలు చేపడుతున్నారు. విగ్రహాలకు క్యూఆర్ కోడ్ కేటాయిస్తున్న నేపథ్యంలో గస్తీ సిబ్బంది తనిఖీ సందర్భంలో తమ ట్యాబ్స్ వినియోగించి మండపాల వద్దకు కోడ్‌ను స్కాన్ చేస్తున్నారు. దీంతో ఈ తనిఖీలు ఎలా సాగుతున్నాయన్నది ఉన్నతాధికారులకు ఈ యాప్ ద్వారానే తెలుస్తుంది.

### నిమజ్జనం సమయంలో స్పష్టత..

నిమజ్జనం రోజు ఊరేగింపు మార్గాల పర్యవేక్షణ, విగ్రహాలు ఏ మార్గాల్లో ఎన్ని ఉన్నాయనేది తెలుసుకోవడానికి విగ్రహాల జియో ట్యాగింగ్ ఉపకరించనుంది. గణేష్ ఉత్సవాల్లో నిమజ్జనం అత్యంత కీలకమైన ఘట్టం. నిర్ణీత సమయంలో ఊరేగింపు ప్రారంభం కావడం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి విగ్రహం కదలికల్నీ గమనిస్తుండాలి. క్యూఆర్ కోడ్‌తో కూడిన పత్రంతో వచ్చే విగ్రహాలను క్షేత్రస్థాయి సిబ్బంది ఎక్కడిక్కడ పర్యవేక్షిస్తారు. ఆ కోడ్‌ను తమ ట్యాబ్స్, ఫోన్లలో స్కానింగ్ చేస్తుంటారు. దీంతో ఏ విగ్రహం, ఏ సమయంలో, ఏ ప్రాంతంలో ఉంది? ఎప్పుడు నిమజ్జనం జరిగింది? ఇంకా ఎన్ని విగ్రహాలు నిమజ్జనం కావాల్సి ఉంది? అనే అంశాలు యాప్ ద్వారా సిబ్బంది, అధికారులకు తెలుస్తుంటాయి.

## అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు


**బంజారాహిల్స్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ, పీజీ కోర్సులు, బ్యాచిలర్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, మాస్టర్ లైఫ్ సైన్సెస్, డిప్లొమా వంటి సర్టిఫికెట్ కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశ గడువు సెప్టెంబర్ 12 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ విద్యార్థి సేవల విభాగ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో డిగ్రీలో చేరిన ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు లేదా అంతకు ముందు చేరిన డిగ్రీ/పీజీ విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేకపోయిన వారు కూడా సెప్టెంబర్ 12లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. 2016 నుంచి 2025 విద్యా సంవత్సరాల్లో ఆయా కోర్సుల్లో చేరి సకాలంలో ట్యూషన్ ఫీజు చెల్లించలేకపోయిన వారు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని సెప్టెంబర్ 12, 2025 తేదీ లోపు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు లేదా ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ప్రధాన పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. అభ్యర్థి ఎంపికపై దృష్టిసారిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న అవరోధాలను అధిగమించేందుకు సమాలోచనలు చేస్తున్నాయి. జూబ్లీహిల్స్ అంటే రిచ్ ఏరియా అని గుర్తింపు.. అక్కడ పాగా వేయాలని అధికార కాంగ్రెస్‌తో పాటు సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్‌ఎస్, గ్రేటర్‌లో తమ బలం నిరూపించుకోవాలని బీజేపీలు ఉప ఎన్నికకు సై అంటున్నాయి. ఈ క్రమంలోనే అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తున్నాయి. ఇక్కడ ఏ పార్టీ నుంచి ఎవరు సీటు దక్కించుకుంటారా అనేది రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయంగా ఆసక్తికరమైన అంశంగా మారింది.
– సాక్షి, సిటీబ్యూరో, శ్రీనగర్‌కాలనీ

# త్రిముఖం ఎవరికి సుముఖం?

మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- బలమైన అభ్యర్థి కోసం పార్టీల వెతుకులాట
- తెలుగు రాష్ట్రాల్లో జూబ్లీహిల్స్‌పై చర్చ




ఉప ఎన్నికల్లో దాదాపుగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన వ్యక్తులే గెలుపొందుతారనే వాదనలు ఉన్నాయి. మొన్న జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ ఇదే జరిగింది. అయితే గతంలో జరిగిన దుబ్బాక, ఇతర కొన్ని సంఘటనలు బలమైన అభ్యర్థి ఉంటే అధికార పార్టీకి చెక్ పెట్టడం పెద్ద కష్టం కాదని చెబుతున్నాయి. గతంలో ఇక్కడ నుంచి పోటీ చేసిన అజారుద్దీన్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇచ్చారు. దీంతో ఆయన రేసులో లేరనేది స్పష్టమైంది. ప్రస్తుతం నవీన్ యాదవ్ పేరు వినిపిస్తోంది. అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటాడని, గతంలో ఇక్కడ పోటీ చేసిన అనుభవం ఉండటం ఆయన సానుకూల అంశాలు. మరికొంత మంది నేతలు సైతం తమకే సీటు వస్తుందంటూ డివిజన్ నాయకులతో నిత్యం మంతనాలు సాగిస్తున్నారు. ఎంఐఎం కాంగ్రెస్‌కు సహకరిస్తుందని చర్చ సాగుతోంది.

### బీఆర్‌ఎస్ సానుభూతి పనిచేస్తుందా?

జూబ్లీహిల్స్ నుంచి హ్యాట్రిక్ విజయాలు సొంతం చేసుకున్న మాగంటి గోపీనాథ్ మరణానంతరం ఆయన కుటుంబ సభ్యులకు టికెట్ ఇస్తే ఎలా ఉంటుందనేది బీఆర్‌ఎస్ పరిశీలిస్తోంది. మాజీ ఎమ్మెల్యే మాగంటి సతీమణికి టికెట్ ఇస్తే సెంటిమెంట్ వర్క్అవుట్ అవుతుందని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఆమెకు దాదాపు టికెట్ ఖరారనే చర్చ కొనసాగుతున్న తరుణంలో గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ రేసులో నేనున్నానంటూ నియోజకవర్గంలో గట్టిగా తిరుగుతూ తన బలాన్ని కూడగట్టుకుంటున్నారు. కుటుంబంలో ఏం జరుగుతుందనేది పార్టీ అధిష్టానానికి వివరించినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌పై వ్యతిరేకత, మాగంటిపై సానుభూతి కలిసొస్తుందని బీఆర్‌ఎస్ నేతలు భావిస్తున్నారు.

### కూటమి కడతారా..

జీహెచ్‌ఎంసీ పరిధిలో బీజేపీ బలం పుంజుకుంటోందని ఆ పార్టీ నేతలు గట్టిగా నమ్ముతున్నారు. గతంలో ఊహించిన దానికి మించి 48 కార్పొరేటర్లను గెలుపొందడమే వారిలో ఆత్మవిశ్వాసానికి కారణంగా కనిపిస్తోంది. అయితే సరైన అభ్యర్థి కోసం పార్టీ నేతలు సమాలోచనలు చేస్తున్నారు. 2023 ఎన్నికల్లో పోటీ చేసిన దీపక్‌రెడ్డికి బదులు వేరే వ్యక్తిని నిలబెట్టాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఉంది. దీంతో టీడీపీ, జనసేనతో కలిసి బరిలోకి దిగాలని బీజేపీ భావిస్తోందని చర్చ జరుగుతోంది. సామాజిక వర్గాలను ప్రాధాన్యత క్రమంలో ఆలోచన చేయాలని నేతలు సూచిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే టీడీపీ నుంచి ఎన్టీఆర్ కుటుంబ సభ్యురాలు సుహాసిని పేరు తెరమీదకు తెస్తున్నారు. ఇదే పార్టీకి చెందిన మరో వ్యక్తి జీవీ నాయుడు టికెట్ ఆశిస్తున్నారన్న చర్చ సాగుతోంది. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మాధవీలత, కిలారి మనోహర్ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. వెంగళరావునగర్, రాజీవ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో షెటిలర్స్ అధికంగా ఉండటంతో కూటమిగా పోటీ చేస్తే గెలిచే అవకాశం ఎక్కువ ఉంటుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు.

## ఘనంగా శ్రీరాధాష్టమి వేడుకలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో ఆదివారం శ్రీరాధాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుని నిత్య సఖీమణి రాధారాణి దివ్య ఆవిర్భావ తిథి సందర్భంగా నగరంలోని అనేక మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వార్ల ఆశీస్సులు పొందారు. రాధాగోవిందులు ప్రత్యేక అలకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి చప్పన్ భోగ్ (56 విశేషమైన ఆహార పదార్థాలతో కూడిన నైవేద్యం) సమర్పించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ రాధాష్టమి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. రాధారాణి సమస్త జగత్తుకూ తల్లి వంటిదని, ఈ పవిత్రమైన రోజున భక్తులంతా తమమకు కృష్ణభక్తిని ప్రసాదించమని ఆ తల్లిని ప్రార్థిస్తారని వివరించారు.

## రీజనల్ రింగ్ రోడ్డుపై.. హెచ్‌ఎండీఏ రూట్‌మ్యాప్

**ప్రాథమిక నోటిఫికేషన్ వెల్లడి**

- సెప్టెంబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ఆ తరువాత తుది నోటిఫికేషన్



సాక్షి, సిటీబ్యూరో: ట్రిపుల్ ఆర్ మార్గంపైన హెచ్‌ఎండీఏ ప్రాథమిక నోటిఫికేషన్ వెలువరించింది. 100 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న రీజనల్ రింగ్ రోడ్డు వల్ల ప్రభావితం కానున్న వివిధ జిల్లాల్లోని మండలాలు, గ్రామాలకు చెందిన భూములు, వాటి సర్వే నంబర్ల వివరాలను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో ప్రకటించారు. ఈ ప్రాథమిక నోటిఫికేషన్‌పై సెప్టెంబర్ 15వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి తుది నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ట్రిపుల్ ఆర్ డిజిటల్ రూట్‌మ్యాప్‌తో పాటు గూగుల్ కోర్డినేట్స్ వివరాలను సైతం ఈ ప్రాథమిక ప్రకటనలో స్పష్టంగా తెలిపారు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధి పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో చేపట్టనున్న నిర్మాణాలు, లే అవుట్ల అభివృద్ధి, హైదరాబాద్ మహానగర విస్తరణను దృష్టిలో ఉంచుకొని ట్రిపుల్‌ఆర్ వల్ల కోల్పోనున్న భూముల వివరాలను వెలువరించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల లేఅవుట్లు, నిర్మాణాలు తదితర అనుమతులపై స్పష్టత ఉంటుందన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధి 7,257 చదరపు కిలో మీటర్ల నుంచి 10,472.723 చదరపు కిలో మీటర్లకు పెరిగిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి జిల్లాలతో పాటు కొత్తగా చేరిన నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌తో 11 జిల్లాల్లో 1355 గ్రామాలు, 104 మండలాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్ చుట్టూ చేపట్టనున్న 354 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే రెవెన్యూ గ్రామపంచాయతీలు, మండలాలు, జిల్లాల వివరాలను ఈ ప్రాథమిక నివేదికలో హెచ్‌ఎండీఏ అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న 8 జిల్లాలు.. మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట్, వికారాబాద్, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో 33 మండలాల్లో 163 గ్రామాల్లో ఉన్న భూములు రీజనల్ రింగ్ రోడ్డు వల్ల ప్రభావితం కానున్నాయి.

## బీఆర్‌టీయూతోనే కార్మికుల సంక్షేమం



రంగారెడ్డినగర్: కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసి వారి హక్కుల సాధనకు బీఆర్‌టీయూ ట్రేడ్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని మాజీ మంత్రి, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్‌లోని ఎంటీఏఆర్ పరిశ్రమకు చెందిన పలువురు బీఎంఎస్ నాయకులు బీఆర్‌టీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన యూనియన్‌లో చేరిన వెంకట రామయ్య, ప్రతాప్ రెడ్డి, యాదిరెడ్డి, నాంచారయ్య, శ్రీనివాస్, తారాకృష్ణ, జనార్దన్‌రెడ్డి, కృష్ణారెడ్డిలను కండువాలు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎంటీఏఆర్ పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి తాను 359 మంది కార్మికులను పర్మనెంట్ చేయడతో పాటు కార్మికులకు క్యాంటీన్‌ను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్మికులకు బేసిక్‌ను 30 శాతం నుండి 50 శాతానికి పెంచడం జరిగిందని, భవిష్యత్‌లో సైతం కార్మికుల సంక్షేమానికి ప్రాధర్యత ఇస్తూ వారికి న్యాయమైన వేతన ఒప్పందం, అలవెన్స్‌లు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మాయ రాజయ్య, సత్యప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, సమ్మయ్య, రాయుడు యాదవ్ పాల్గొన్నారు.

## అన్ని జోన్లలో దత్తత మేళాలు

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్
- నిస్సహాయ వీధి శునకాలకు చేయూత:
- జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇండి పప్పీ మేళా



దత్తత తీసుకున్న పప్పీలతో నగరవాసులు

బంజారాహిల్స్: కాసు బ్రహ్మానందరెడ్డి పార్కులో ఆదివారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండీ పప్పీ మేళాకు విశేష స్పందన లభించింది. 'బీ ఏ హీరో, అడాప్ట్, డోంట్ షాప్' అనే నినాదంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్.. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ఇండీ పప్పీ దత్తత మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ పూర్తి చేసుకుని పూర్తి ఆరోగ్యంతో ఉన్న 35 దేశీ కుక్క పిల్లలను జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం ప్రదర్శనకు ఉంచింది. అందులో 22 పప్పీలను జంతు ప్రేమికులు దత్తత తీసుకున్నారు. దత్తత అంటే కేవలం స్వీకరణ కాదు.. ఆత్మీయత, బాధ్యత, ప్రేమతో కూడిన బంధం అని కమిషనర్ కర్ణన్ పేర్కొన్నారు. షేక్‌పేటకు చెందిన చింతకుంట రాజుకు మొదటి పప్పీని అందజేసి అభినందించారు. దేశీ కుక్కల ప్రత్యేకతలను, విశేషాలను కమిషనర్ వివరించారు. వీటి సహజ శక్తి, తెలివితేటలు, తక్కువ నిర్వహణ అవసరం, స్థానిక వాతావరణానికి సులభంగా అలవాటు పడతాయనిన్నారు. వీధి కుక్కల సంఖ్యను తగ్గించడమే కాకుండా వాటికి సురక్షితమైన జీవితాన్ని కూడా కల్పించడమే లక్ష్యంగా ఈ మేళాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళా ద్వారా నగర ప్రజలు మానవత్వం చాటి, వీధి కుక్కలపై తమ ప్రేమను, బాధ్యతను ప్రదర్శించారని కొనియాడారు. ఈ కార్యక్రమం ద్వారా వీధి కుక్కల పట్ల అవగాహన పెరిగి, వాటిని దత్తత తీసుకోవడానికి ప్రజల ముందుకువస్తున్నారన్నారు. దత్తతకు ఎక్కువ మంది ముందుకు వస్తే వీధుల్లో కుక్కల సంచారం, బెడద ఉండదని, కుక్కకాటు ఘటనలు ఉండవన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని దత్తత మేళాలను అన్ని జోనల్ సర్కిళ్లలో విడతల వారీగా నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రకటించారు. జీహెచ్‌ఎంసీ ప్రత్యేకంగా చొరవ తీసుకుని కుక్క పిల్లల దత్తత మేళా ఏర్పాటు పట్ల మేళాలో జంతు ప్రేమికులు అభినందించారు. ఈ మేళాలు మిగతా పురపాలికలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ వీ సమ్మయ్య, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్, డిప్యూటీ డైరెక్టర్ చక్రపాణిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ వివేకానంద్, పీఆర్వో మామిండ్ల దశరథం, వెటర్నరీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల ఆటలు.. పెద్దల కసరత్తు

- బిజీ బిజీగా కేబీఆర్ పార్క్‌లో బాలల ఆటస్థలం, ఓపెన్ జిమ్
- ఎక్స్ లో అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి





బంజారాహిల్స్: కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) పార్క్‌లో ఏర్పాటు చేసిన బాలల ఆటస్థలం, ఓపెన్ జిమ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పిల్లలు కొత్తగా ఏర్పాటు చేసిన ఆటపరికరాలతో ఆనందంగా ఆడుతుండగా, అన్ని వయస్సుల వారు ఆధునిక వ్యాయామ సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ కుక్క పిల్లల దత్తత మేళాకు వచ్చిన జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి ఈ దృశ్యాలు కంటబడ్డాయి. వీటిని ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసి ప్రజా స్పందనపై సంతృప్తి, సంతోషం వ్యక్తం చేశారు. కేబీఆర్ పార్క్ వంటి పబ్లిక్ ప్రదేశాలు శారీరక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత, సామాజిక సమైక్యతకు ఎంతో అవసరం. పిల్లలు, పెద్దలు ఈ సదుపాయాలను చక్కగా వినియోగించుకుంటున్న దృశ్యాలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది,'' అని ఆయన ఎక్స్ లో పేర్కొన్నారు.

## దండుమైలారంలో దారుణం

**11 గుంటల భూమి కోసం నాలుగేళ్లుగా అన్నదమ్ముల మధ్య వివాదం**

- కత్తులు, గొడ్డళ్లతో పరస్పర దాడులు
- ఒకరి మృతి.. మరో మహిళ పరిస్థితి విషమం
- పలువురికి గాయాలు


హత్యకు గురైన బాల్‌రాజ్


బాల్‌రాజ్(ఫైల్)


చికిత్స పొందుతున్న మంజుల

ఇబ్రహీంపట్నం: భూ వివాదం ఒకరి ప్రాణాలు తీయగా.. మరో మహిళ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని దండుమైలారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గుడేటి జంగయ్యకు 156, 158, 159 సర్వేనెంబర్లలో 18.12 ఎకరాల భూమి ఉంది. నాలుగేళ్ల క్రితం జంగయ్య ఆయన నలుగురు కుమారులైన నర్సింహ, యాదయ్యకు 4.28 ఎకరాలు, మల్లయ్యకు 4.17 ఎకరాలు, జంగయ్యకు 4.18 ఎకరాల చొప్పున భూమిని పంచారు. మల్లయ్య, జంగయ్యలకు 11 గుంటల భూమి తక్కువగా రావడంతో నాటి నుంచి ఈ భూ పంచాయతీ కొనసాగుతూ వస్తోంది. పోలీస్ స్టేషన్‌లోనూ ఇరువర్గాల వారు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆర్డీఓ సదరు వివాదస్పద భూమిలోకి ఎవరూ వెళ్లొద్దని 145 ఆర్డర్ జారీ చేశారు. కాగా ఆదివారం నాట్లు వేస్తున్నట్లు తెలుసుకున్న మల్లయ్య, జంగయ్య వారసులు బాల్‌రాజ్(బాలయ్య), ధన్‌రాజ్, వెంకటరాజ్, పర్వతాలు, పావని, మంజుల అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో నర్సింహ, యాదయ్య వారసులు బాలరాజు, శ్రీశైలం, లింగస్వామి, యాదయ్య, ప్రసాద్, పద్మ, హర్షిత, పారిజాత తదితరులు గొడ్డళ్లు, కత్తులతో దాడికి దిగారు. బాల్‌రాజ్‌పై గొడ్డలితో దాడి చేస్తున్న క్రమంలో అతని మరదలు(తమ్ముడి భార్య) అడ్డుకునేందుకు యత్నించగా ఇరువురిపై వేటు వేశారు. బాల్‌రాజ్‌ను ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మంజుల తీవ్ర గాయాలతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మరో నలుగురు క్షతగాత్రులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైరి వర్గానికి చెందిన బాలరాజ్, శ్రీశైలం, లింగస్వామి, యాదయ్య, పారిజాత సైతం గాయాలతో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



## నేడు పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం

సాక్షి,సిటీ బ్యూరో : మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ (కేడీడబ్ల్యూఎస్పీ) పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మంగళవారం ఉదయం ఏడుగంటల వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జలమండలి వర్గాలు ప్రకటించాయి. ఫేజ్-3 మెయిన్ పంపింగ్‌కు సంబంధించి 1400 ఎంఎం డయా పైప్‌లైన్‌పైన పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, రాజేంద్రనగర్, అత్తాపూర్ మూసీ వంతెన ప్రాంతాల్లోని 300 ఎంఎం డయా స్కవర్ వాల్వ్ ఎక్స్‌టెన్షన్ పైప్‌లైన్‌లలో లీకేజీ పనులు , మైలార్‌దేవ్‌పల్లి ఫేజ్-3 పంప్ హౌస్‌లో పనిచేయని వాల్వ్‌లను మార్చడం వంటి మరమ్మతు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో 20 గంటల వరకు క్రిష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ ఫేజ్ - 3 రింగ్ మెయిన్ - 1 కింద ఉన్న రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు:**
షేక్‌పేట్ , జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, ప్రశాసన్‌నగర్, తట్టిఖానా,గచ్చిబౌలి, మాధాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్ రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపింది.

## సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ లో ఇద్దరికి ఉద్యోగోన్నతి

సాక్షి,సిటీ బ్యూరో: సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లకు రాష్ట్ర స్థాయి డిప్యూటీ డైరెక్టర్లుగా ఉద్యోగోన్నతి లభించింది. హెచ్‌ఎండీఏలో ఏడీగా పనిచేస్తున్న నరహరికి మల్టీజోన్- 2 డీడీగా, గచ్చిబౌలి తాలిమ్‌లో పనిచేస్తున్న ఏడీ ఎస్ సమీనా బేగంకు మల్టీజోన్-1 డీడీగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా టీజీఓఎస్ సహాయ కార్యదర్శి శ్రీరాం వారిని కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ల్యాండ్ సర్వేను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా పదోన్నతులు కల్పించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఏస్ రాజేష్, మహేందర్ రెడ్డి, మురళీ, భావ్య టీజీఓఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## క్వారీ గుంతలో పడి యువకుడి మృతి..

కుత్బుల్లాపూర్: క్వారీ గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం కొంపల్లి జయభేరి పార్కు ప్రాంతంలోని క్వారీ గుంతలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడిని హస్మత్‌పేట్‌కు చెందిన మహ్మద్ షాహిద్(17)గా గుర్తించారు. ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


## రాష్ట్రస్థాయి పోటీల్లో శంకర్‌పల్లి యువకుడి సత్తా


మెడల్ అందుకుంటున్న వరుణ్ గౌడ్

శంకర్‌పల్లి: డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో మండల పరిధిలోని కొండకల్ గ్రామానికి వరుణ్ గౌడ్ సత్తా చాటాడు. రెండు రోజుల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు వర్సిటీలో ప్రారంభమైన 11వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అండర్-18 డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో వరుణ్‌గౌడ్ సత్తా చాటి, రెండింటిలోనూ ద్వితీయ స్థానంలో నిలిచాడు. బాసర ట్రిపుల్ ఐటీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వరుణ్ గౌడ్ విజయాలపై తల్లిదండ్రులు కల్పన, లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు.

## రామానాయుడు ఫిలిం స్కూల్‌లో ప్రొఫెసర్‌కు వేధింపులు

**విద్యార్థి రిమాండ్**


నిందితుడు భరత్‌రెడ్డి

ఫిలింనగర్: రామానాయుడు ఫిలిం స్కూల్‌లో మహిళా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మహిళను వేధిస్తున్న విద్యార్థిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని రామానాయుడు స్టూడియో ఆవరణలోని రామానాయుడు ఫిలిం స్కూల్‌లో రెండేళ్లుగా ఓ మహిళ (34) ప్రొఫెసర్‌గా పని చేస్తోంది. గత ఏడాది ఆగస్టు నెలలో అనంతపురం జిల్లా, పెనుగొండ మండలం, సోమన్‌దేపల్లి దుర్గానగర్‌కు చెందిన ఎస్.భరత్‌రెడ్డి డైరెక్షన్ కోర్సులో చేరాడు. ఆ తర్వాత కొన్నాళ్లకే అతను ఆమెను కలిసి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. దీంతో ఆమె హద్దులు దాటవద్దని, మరోసారి ఇలాంటి ప్రపోజల్స్ చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. పలుమార్లు ఆమె వార్నింగ్ ఇచ్చినా భరత్‌రెడ్డి ఆమెను వెంటాడుతూనే ఉన్నాడు. ఆయన ప్రవర్తన కూడా సరిగ్గా లేకపోవడంతో పాటు బాధితురాలు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయడంతో అతడిని గత ఫిబ్రవరిలో స్కూల్ నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఆమెకు ఇన్‌స్టాగామ్‌లో మెసేజ్‌లు పెడుతూ ఫాలో అవుతూ వస్తున్నాడు. ఆమె ఎక్కడికి వెళ్లినా అయా స్థలాల ఇన్‌స్టాగామ్‌లో గుర్తిస్తూ అక్కడికి వెళ్తున్నాడు. ఈ నెల 22న ఆమె మూన్‌షైన్ పబ్‌కు వెళ్లగా ఆ విషయాన్ని ఇన్‌స్టాలో తెలుసుకున్న భరత్‌రెడ్డి అక్కడికి కూడా వెళ్లాడు. ఈ నెల 25న స్టూడియోలోని రైటర్స్ రూమ్‌లో కూర్చొని ఉండగా అక్కడికి వచ్చి ఆమెను అనుసరించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు భరత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**మరొకరికి గాయాలు**


వంశీ(ఫైల్)


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హస్తినాపురం: వేగంగా వెళుతున్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనక వచ్చిన ద్విచక్రవాహనం అదుపుతప్పి డీసీఎంను ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా, ఆరుట్ల గ్రామానికి చెందిన చీమర్ల వంశీ(20)తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి ఆదివారం తెల్లవారుజామున ఎఫ్‌జెడ్ బైక్‌పై ఇబ్రహీంపట్నం నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వచ్చారు. వారు టిఫిన్ చేసి ఇబ్రహీంపట్నం వైపు వెళుతుండగా లైఫ్‌కేర్ ఆసుపత్రి ఎదుట అతివేగంగా వస్తున్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకు వేయడంతో వెనక వస్తున్న బైక్ అదుపు తప్పి డీసీఎంను ఢీకొట్టింది. ఈ ఘటనలో వంశీ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న ప్రవీణ్‌కు గాయాలు కావడంతో సమీపంలోని లైఫ్‌కేర్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వంశీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలిచారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం..

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలంరాయిలో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలంరాయిలోని పబ్లిక్ టాయిలెట్స్ వద్ద ఫుట్‌పాత్‌పై సుమారు 25-30 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఉమేష్ అనే వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ సిబ్బంది 108 సిబ్బందితో కలిసి అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అయితే మృతుని వివరాలు తెలియరాలేదు. సంబంధీకులు ఎవరైనా బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణసింగ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైలు పట్టాల మధ్య గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురెళ్లి సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై స్కై బ్లూ కలర్ చొక్కా, ఆదేరంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు

## అదృశ్యమైన యువకుడు చెరువులో శవమై తేలాడు



సాహిద్ (ఫైల్)

అల్వాల్: అదృశ్యమైన యువకుడు చెరువులో శవమై తేలిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. హస్మత్‌పేట అంజయ్యనగర్‌కు చెందిన ఎండి.సాహిద్ (18) కూలీగా పనిచేస్తుంటాడు. ఈ నెల 29న రాత్రి నుంచి అతను కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పేట్‌బషీరాబాద్ పరిధిలోని చెరువులో అతడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాహుల్‌ది ఇజ్జత్ చోరీ యాత్ర: శిల్పారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తోంది ఓటు చోరీ యాత్ర కాదు.. ఇజ్జత్ చోరీ యాత్రని బీజేపీ తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి అన్నారు. ప్రధాని మోదీ తల్లిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎదుట రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానిని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన తల్లిపై దూషణలకు దిగుతున్నారని ఆరోపించారు. బీజేపీ నినాదం వసుధైక కుటుంబమని... రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శమన్నారు. బీహార్‌లో ఓటమి తప్పదనే భయంలో ఆ పార్టీ నేతలు ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి పార్టీ నేతలకు మహిళల హక్కులపై మాట్లాడే అర్హత లేదన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి


భరత్(ఫైల్)

చాంద్రాయణగుట్ట: వినాయక ఉత్సవాలకు సంబంధించిన బ్యానర్ సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..జంగమ్మెట్, రవీంద్రనాయక్ కాలనీకి చెందిన భరత్(33) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక హనుమాన్ దేవాలయంలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం బంజారా హోటల్ వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్ కిందికి జరిగినట్లు కనిపించడంతో భరత్ దానిని సరి చేస్తుండగా కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

**ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా**

బస్తీకి యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానికులు ఫలక్‌నుమా ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కరెంటు తీగల సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోనందునే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ సభావత్ గిరిధర్ నాయక్ డిమాండ్ చేశారు.

## నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

**రహమత్‌నగర్:** రహమత్‌నగర్ డివిజన్‌లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను సోమవారం మంత్రులు ప్రారంభిస్తారని కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ నేత తెలిపారు. రహమత్‌నగర్‌లో ఆయన ఆదివారం మాట్లాడుతూ... ఉదయం 9 గంటలకు రహమత్‌నగర్ డివిజన్‌లో పీస్సీఆర్ హిల్స్, కార్మికనగర్ ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్‌లు కార్పొరేషన్ చైర్మన్‌లతో కలిసి ప్రారంభిస్తారన్నారు.

## రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మ దహనం


దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

**రహమత్‌నగర్:** బీహార్ ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దివంగత మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం బస్ స్టాప్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం నీచంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ బేషరతుగా ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పాలన్నారు. నాయకులు కృష్ణమోహన్, శరణ్‌రెడ్డి, గంజి భాస్కర్, సూర్య కుమార్, సతీష్, అన్నపూర్ణ, సాయి, సుబ్బు, సోను, రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 23 వేలకు లడ్డూ వేలం


లడ్డూను దక్కించుకున్న సాయి మాన్విత్

**ఫిలింనగర్:** ఓ వైపు గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతుండగా మరో వైపు నిమజ్జనాలు కూడా అదే స్థాయిలో జోరుగా సాగుతున్నాయి. ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలోని పర్వతాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ వేలం ఆదివారం ఆలయంలో వేడుకగా సాగింది. పోటా పోటీగా జరిగిన ఈ లడ్డూ వేలంలో బస్తీకి చెందిన సాయి మాన్విత్ రూ. 23 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, శంకర్, సాయి రెడ్డి, తాటి రాములు తదితరులు లడ్డూను డప్పు చప్పుళ్ల మధ్య లడ్డూను దక్కించుకున్న కుటుంబానికి అందజేశారు.

# గణేశ్ మండపాల వద్ద.. పరిశుభ్రతే లక్ష్యంగా..!

- మండపాల నిర్వాహకులకు బ్లాక్ కవర్లు
- అన్నదాన సమయంలో వ్యర్థాల కోసమే...
- కవర్లలో వేయాలని నిర్వాహకులకు సూచన
- పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు
- ఒక్కో డివిజన్‌కు 200 కవర్ల అందజేత

**బంజారాహిల్స్:** వినాయక మండపాల వద్ద పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించడానికి, అన్నప్రసాద వితరణ జరిగినప్పుడు విస్తరాకులు, ఇతర వ్యర్థాలు రోడ్లపై పడేయకుండా చూడడానికి జీహెచ్‌ఎంసీ తగిన చర్యలకు శ్రీకారం చుట్టింది. వినాయక మండపాల వద్ద, పరిసరాలు, రహదారుల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ప్రతి మండపం వద్ద నిర్వాహకులకు నలుపు రంగు కవర్లు పంపిణీ చేస్తున్నారు.

◆ జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీహిల్స్ సర్కిల్, యూసుఫ్‌గూడ సర్కిళ్ల పరిధిలో ఆదివారం చాలా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే వ్యర్థాలతో పాటు విస్తరాకులు, ప్లాస్టిక్ గ్లాసులు, రోడ్లపై పడేయకుండా ఆదివారం తెల్లవారుజాము నుంచే అన్ని మండపాలకు జీహెచ్‌ఎంసీ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు బ్లాక్ కవర్లు పంపిణీ చేశారు. ఒక్కో మండప నిర్వాహకులకు 10–15 కవర్లు పంపిణీ చేశారు. ఆయా వార్డుల్లో ఎస్‌ఎఫ్‌ఏలు తమ పరిధిలోని మండపాలను గుర్తించి ప్రతి మండప నిర్వాహకునికి


మండపాల నిర్వాహకులకు బ్లాక్ కవర్లు అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఏలు

వీటిని అందజేశారు. ఒక్కో ఎస్‌ఎఫ్‌ఏ 200 కవర్లను ఆయా మండపాల్లో పంపిణీ చేయడం జరిగింది. మరో ఐదు రోజుల పాటు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఇందుకోసం ముందస్తుగానే బ్లాక్ కవర్లు అందజేశారు. అన్నదాన కార్యక్రమం తర్వాత విస్తరాకులు, భోజన వ్యర్థాలు, ప్లాస్టిక్ గ్లాసులలో కవర్లలో వేసి ఉంచితే తెల్లవారు స్వచ్ఛ ఆటోలు వచ్చి వీటిని తీసుకువెళ్తాయని సూచిస్తున్నారు.

◆ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 325 వినాయక మండపాలను ఏర్పాటుచేశారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో 378 విగ్రహాలు ఏర్పాటుచేశారు.

◆ యూసుఫ్‌గూడ సర్కిల్–19 పరిదిలో 496 విగ్రహాలు ఏర్పాటయ్యాయి. ఈ మండపాలన్నింటికీ ముందస్తుగానే బ్లాక్ కవర్లను పంపిణీ చేసినట్లు ఎస్‌ఎఫ్‌ఏలు తెలిపారు. దీని వల్ల పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఉంటుందని, ఎప్పటికప్పుడు చెత్తను ఈ కవర్లలో భద్రపరచడానికి అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. సోమవారం నుంచి కూడా ఎక్కడెక్కడ అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయో అక్కడ ఈ కవర్ల పంపిణీ చేస్తామని వివరించారు.


ఎన్‌బీటీనగర్‌లో పూజలు చేస్తున్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి


జవహర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ దేదీప్య విజయ్


శ్రీకృష్ణానగర్‌లో మాగంటి వజ్రనాథ్

## ప్రేరణ కలిగించేలా ప్రధాని సందేశం

**మాజీ ఎమ్మెల్యే చింతల**

**బంజారాహిల్స్:** ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఇచ్చిన సందేశం ప్రతి ఒక్కరిలో ప్రేరణ కలిగించేలా ఉందని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఫిలింనగర్‌లోని దీన్‌దయాల్‌నగర్ బస్తీలో పోలింగ్ బూత్ 179లో ఆయన బీజేపీ నేతలు కార్యకర్తలతో కలిసి ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. బీజేపీ అధికార ప్రతినిధి సారంగుల అమర్‌నాథ్,


దీన్‌దయాల్‌నగర్ బస్తీలో మన్‌కీ బాత్ వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు భీమయ్య, నేతలు ఆనంద్ సాగర్, మల్లేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## చందనం అలంకరణలో విజయగణపతి



**వెంకటేశ్వరకాలనీ:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న విజయగణపతి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామివారిని ఆదివారం అర్చకులు చందనం అలంకారంలో తీర్చిదిద్దారు. చందనం అలంకారంలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

**సాక్షి, సిటీబ్యూరో:** పర్యావరణ స్థిరత్వం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని మల్టీపర్పస్ అవేర్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. పచ్చదనాన్ని తద్వారా పర్యావరణాన్ని సంరక్షించుకుంటేనే మానవ మనుడగ పదికాలాల పాటు పచ్చగా ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం, కాలుష్య నివారణ కార్యక్రమాలు చేపట్టడం, భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమాచార సాంకేతిక సంస్థల ఉద్యోగులు, సత్వ కంపెనీ ప్రతినిధులు, ప్రోభి సమృద్ధి కృష్ణ, వలంటీర్లు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పర్యావరణ హిత జీవన విధానాలను ఆచరించేందుకు వారు ప్రతిజ్ఞ చేశారు.

## కాంగ్రెస్‌తోనే సమస్యల పరిష్కారం

**వెంగళరావునగర్:** జూబ్లీహిల్స్ నియోజకర్గంలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ వల్ల మాత్రమే సాధ్యం అవుతుందని యూసుఫ్‌గూడ మాజీ కార్పొరేటర్ జి.మురళీగౌడ్ తెలిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా ఆయా ఏరియాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## బీజేపీ బోరబండ డివిజన్ కార్యవర్గం

**రహమత్‌నగర్:** బీజేపీ బోరబండ డివిజన్ కార్యవర్గాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ ముదిరాజ్ ఆదివారం ప్ర కటించారు. ఉపాధ్యక్షులుగా ఉషా, చంద్రశేఖర్, కిరణ్, భాస్కర్, ప్రధాన కార్యదుర్శులుగా కృష్ణ, అనూప్ కుమార్, కార్యదర్శులుగా అమరావతి, శ్రీనివాస్ నాయక్, దుర్గా, విజయ్‌కుమార్, కోశాధికారిగా రాజశేఖర్‌లను నియమించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ... నూతనంగా నియమితులైన డివిజన్ కార్యవర్గ సభ్యులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.

## బ్యాంకు ఖాతాలోని నగదు మాయం

**వెంగళరావునగర్:** బ్యాంకు అకౌంట్‌లో ఉన్న నగదు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌లో నివసించే బి.బాలకిషన్ రిటైర్డ్ ఉద్యోగి. ఆగస్టు 26న ఆయన అకౌంట్ నుంచి రూ. 99,999 నగదు డెబిట్ అయినట్టుగా మెసేజ్ వచ్చింది. దాంతో హుటాహుటిన బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా ఆ నగదు డెబిట్ అయినట్టుగా అధికారులు తెలియజేశారు. దాంతో బాధితుడు ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అలరించిన చిన్నారుల ప్రదర్శనలు

**శ్రీనగర్‌కాలనీ:** వినాయక చవితి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌నగర్‌కాలనీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. గణనాథుని వద్ద పూర్ణాహుతి హోమంలో మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ పాల్గొన్నారు. అమీర్‌పేటలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.


పూర్ణాహుతి హోమంలో మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్

# ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాం

**ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్**

**బంజారాహిల్స్:** ఖైరతాబాద్‌తో పాటు పీపుల్స్ ప్లాజా, ఎన్టీఆర్ మార్గ్, లక్డీకాపూల్, ఖైరతాబాద్ గణనాథుడికి దారి తీసే మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ఎప్పటికప్పుడు వాహనాలను వివిధ దారుల్లోకి మళ్లిస్తున్నామని ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్ అన్నారు. ఆదివారం ఆయన సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌కుమార్‌తో కలిసి ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ కింద ట్రాఫిక్‌ను పరిశీలించారు. మెట్రో స్టేషన్ కింద వాహనాలను నిలపనివ్వడం లేదని మెట్రో దిగిన ప్రయాణీకులు నేరుగా ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకునేందుకు వీలుగా ఇప్పటికే బారికేడ్లు ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. ఈ బారికేడ్ల నిర్మాణం వల్ల భక్తులు రోడ్లపై నడిచే అవకాశం ఉండదని


ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ అదనపు కమిషనర్

వారు నేరుగా బారికేడ్ల ద్వారా ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకొని వెళ్తారని అన్నారు. భక్తులు కూడా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపవద్దని ఆయన కోరారు. అదనపు ట్రాఫిక్ పోలీసులతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ రద్దీని సమీక్షిస్తున్నామని ఆయన వెల్లడించారు.

## ఆలోచింపజేసిన 'రిస్తే–హమారీ దునియా'

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'రిస్తే–హమారీ దునియా' అనే థీమ్‌తో రెండో తరగతి విద్యార్థులు నిర్వహించిన ప్రతిభాదర్శన్ కార్యక్రమం ఆకట్టుకుంది. 'జగడపు చనువుల జాజార..' అంటూ చిన్నారులు చేసిన నృత్యం ఆధ్యాత్మిక శోభను నెలకొల్పింది. బంధాలు–అనుబంధాలను గురించి విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. విద్యార్థులు ప్రేమ, శ్రద్ధ, ఐక్యతతో ఈ కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మురళీముకుంద్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు వారి పిల్లలతో తరచూ మాట్లాడాలని, కుటుంబ సభ్యులందరితో పిల్లలు ఉత్సాహంగా గడపాలన్నారు. ప్రిన్సిపాల్ కాంచనపల్లి మాట్లాడుతూ... డబ్బుతో మన అవసరాలను తీర్చుకోవచ్చు కానీ, డబ్బే అన్నింటికీ మూలం కాదని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభాదర్శన్‌లో విద్యార్థులు



## ముందస్తు జాగ్రత్తలతో కేన్సర్‌కు చెక్

**వెంగళరావునగర్:** కేన్సర్ వచ్చిన తర్వాత ఆస్పత్రికి రావడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ఉత్తమమని.. అలా చేస్తే కేన్సర్ రాకుండా చేసుకోవచ్చని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వైద్యులు సూచించారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి గుడ్ సిటిజన్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో రెండు రోజుల పాటు ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, కిమ్స్ ఆస్పత్రుల సహకారంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరం ఆదివారంతో ముగిసింది. రోగులకు ఆర్థోపెడిక్ టెస్ట్, మోకాళ్ల టెస్ట్, బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్, సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్, హెచ్‌పీవీ టెస్ట్, కోలెరెక్టర్ కేన్సర్ స్క్రీనింగ్, లంగ్ కేన్సర్ స్క్రీనింగ్, ప్రొస్టేట్ కేన్సర్ స్క్రీనింగ్, స్కిన్ కేన్సర్ స్క్రీనింగ్ తదితర వైద్య పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ సురేందర్‌కుమార్, డాక్టర్ సుస్మితలు వైద్య పరీక్షలు నిర్వహించగా, రమణారెడ్డి, శ్రావణ్‌కుమార్, జానకమ్మ, సత్యవతి, సంతోషి, ప్రమీల, శ్రీదేవి, సుజాత వైద్యులకు సహకరించారు. ఆర్గనైజర్లు అయూబ్‌ఖాన్, లయన్స్ క్లబ్ జిల్లా నేతలు ఎం.రమాదేవి, సతీష్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా మద్దతివ్వాలి

**లిబర్టీ:** రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలు అయ్యేటట్లు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని రాష్ట్ర కమిటీ ప్రకటించిందన్నారు. అసెంబ్లీలో మాత్రమే బిల్లు పాస్ అయితే సరిపోదు పార్లమెంట్‌లో కూడా బీసీ బిల్లు పాస్ కావడానికి బీజేపీ నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టాన్ని చవిచూసిన కామారెడ్డి, మెదక్, నిర్మల్, సిరిసిల్ల జిల్లాల ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని... ఇల్లు ధ్వంసమైన వారికి రూ. 10 లక్షల సాయం అందజేయాలన్నారు. నేతలు యమునాగౌడ్, హేమా సుదర్శన్, జావేద్, షరీఫ్, దర్శనం రమేష్, విజయ్, నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ హైదర్, మంచిర్యాల కన్వీనర్ నయిమ్ పాషా, పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ ముక్తధీర్, షహబాజ్, అఫ్జల్ సలాం, రమ్యగౌడ్, సుధారాణి, కొడంగల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్

# అన్నదానాలు.. నిమజ్జనాలు..


జూబ్లీహిల్స్ గాయత్రీహిల్స్‌లో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి...

**బంజారాహిల్స్:** గణపతి నవరాత్రి ఉత్సవాలు అయిదో రోజు ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. ఆదివారం ఒక వైపు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానాలు ఏర్పాటు చేయగా, మరో వైపు కొన్ని గణనాథులు హుస్సేన్ సాగర్ వైపు పయనమయ్యాయి. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని గాయత్రీహిల్స్‌లో గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని గాయత్రీహిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవులు ప్రారంభించారు. బీజేఆర్‌నగర్ నగర్‌లో క్రేజీ బాయ్స్ ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో వినాయక నిమజ్జనంలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహారాష్ట్ర బ్యాండ్ స్థానికంగా ఉర్రూతలూగించింది. పెద్ద పెద్ద డప్పులతో కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.


జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో నిమజ్జన కోలాహలం..


వెంకటేశ్వరనగర్ బస్తీలో పరమేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...


జూబ్లీహిల్స్‌లో ఉర్రూతలూగించిన మహారాష్ట్ర బ్యాండ్...


దీన్‌దయాల్ నగర్ బస్తీలో వినాయక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల


సుఖ్‌దేవ్‌నగర్ బస్తీలో బంజారాహిల్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...


మధురానగర్‌లో అన్నదానం చేస్తున్న మాగంటి సునీత, దేదీప్య విజయ్


వెంకటగిరిలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్


ప్రేమ్‌నగర్ బస్తీలో నెమలిపై గణనాథుడి విభిన్న విగ్రహం

# సభలో కాళేశ్వరం కాక

- అసెంబ్లీలో పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై స్వల్పకాలిక చర్చ
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ వాగ్యుద్ధం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఖరిని తప్పుపట్టిన బీజేపీ ఎల్పీ నేత ఏలేటి
- ఏం చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం అడగడంపై అక్బరుద్దీన్ అభ్యంతరం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీ ఆదివారం అట్టుడుకింది. దేశంలోనే అతిపెద్ద మానవ తప్పిదానికి గత ప్రభుత్వం పాల్పడిందంటూ అధికార పక్షం బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించింది. బాధ్యుల నుంచి అవినీతి సొమ్మును కక్కిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నివేదికపై దాదాపు ఎనిమిదిన్నర గంటలకు పైగా వాడీవేడిగా చర్చ జరిగింది. సాయంత్రం 4.50 గంటలకు చర్చను సాగునీటి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. బీఆర్ఎస్‌పై ఆయన మాటల దాడి చేశారు. కాళేశ్వరం కోసం రూ.1.47 లక్షల కోట్లు ఖర్చు చేసి కనీసం రెండు లక్షల ఎకరాలకు కూడా నీరందించలేదని ఆరోపించారు.

**హరీశ్‌రావు కౌంటర్.. :** ప్రభుత్వ విమర్శలను బీఆర్ఎస్ పక్షాన మాజీ సాగునీటి శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దీటుగా తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. కమిషన్ ఏర్పాటు, నివేదికలో పేర్కొన్న అంశాలు, దేశవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరిగిన నష్టాలు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులు కూలిపోయిన ఉదంతాలు, మేడిగడ్డ, తుమ్మిడిహెట్టిల వద్ద నీటి లభ్యత తదితర అంశాలపై ఆయన కూలంకషంగా సభకు వివరించారు. అది కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ నివేదిక కాదని, చెత్త నివేదిక అని వ్యాఖ్యానించారు. నివేదికను అసెంబ్లీలో పెట్టవద్దని తాము కోర్టులను కోరలేదని తెలిపారు. హరీశ్‌రావుకు మంత్రులు పదేపదే అడ్డు తగిలి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.. హరీశ్‌రావు లేవనెత్తిన అంశాలకు సమాధానమిచ్చారు. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల అరుపులతో సభలో పలుమార్లు గందరగోళం నెలకొంది. హరీశ్‌రావు మాట్లాడే సమయం మించి పోయిందంటూ స్పీకర్ ఆయన మైక్‌ను కట్ చేయటంతో బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. పేపర్లు చించివేసి నిరసన తెలియజేశారు. అధికార పక్షం బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనపై మండిపడింది. బీఆర్ఎస్ నేతలు చెప్పాల్సిందంతా చెప్పి ఇప్పుడు తొండి చేస్తున్నారని మండిపడింది. కాసేపు సభలోని నాదాలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీ ఐ నేత కూనంనేని సాంబశివరావు చర్చలో పాల్గొన్నారు. కాళేశ్వరంలో అవకతవకలకు పాల్పడిన వారిపై ఏం చర్యలు తీసుకోవాలో చెప్పాలంటూ ప్రభుత్వం అడుగుతోందని అక్బరుద్దీన్ మండిపడ్డారు.

**సభకు హాజరుకాని కేసీఆర్.. కేరళకు సీఎం**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికపై చర్చకు ప్రతిపక్షనేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు హాజరు కాలేదు. కేసీఆర్ గైర్హాజరు అంశాన్ని మంత్రులు తమ ప్రసంగాల్లో పదే పదే ప్రస్తావించారు. కాగా ఆదివారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉదయం 10 గంటల సమయంలో కేరళలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్లారు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు సీఎం అసెంబ్లీకి చేరుకోగా 4.50కి పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ ప్రారంభమైంది.

## కగార్ పేరుతో జస్టిస్ సుదర్శన్ రెడ్డిని చంపుతారేమో!

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుపై కేసీఆర్ స్పష్టమైన ప్రకటన చేయాలి



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిపై నక్సలైట్ సానుభూతిపరుడిగా ముద్రవేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. ఆపరేషన్ కగార్ పేరుతో సుదర్శన్‌రెడ్డిని కూడా చంపుతారేమో అనే అనుమానం కలుగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్ షా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో 'బీసీల యుద్ధభేరి సభ' ముగిసిన తర్వాత నారాయణ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఏకగ్రీవ తీర్మానం చేయడం మంచి పరిణామని అన్నారు. లోపల కొంతమందికి ఇష్టం లేకపోయినా బహిరంగంగా మద్దతు తెలిపారని పేర్కొన్నారు. కానీ పవర్ ఫుల్ ముఖ్యమంత్రిగా పదేళ్లు పరిపాలన చేసిన కేసీఆర్.. అసెంబ్లీకి వచ్చి మద్దతు ఇస్తే బాగుండేదన్నారు. ఇంత మంచి చట్టం చేసినప్పుడు ఆయన అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్‌లో ఉండటం సరికాదన్నారు. తక్షణమే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వానికి మద్దతుపై కేసీఆర్ స్పష్టమైన ప్రకటన చేయాలని నారాయణ కోరారు.

## 'కాళేశ్వరం'తో ప్రజాధనం దుర్వినియోగం: పాల్వాయి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రజాధనం దుర్వినియోగమైందని సిర్పూర్-కాగజ్‌నగర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ వ్యాఖ్యానించారు. కుంభకోణాలకు పాల్పడే ముందు నాటి పాలకులు పర్యవసానాలు ఆలోచించలేదని విమర్శించారు. ఆదివారం అసెంబ్లీలో ఘోష్ కమిషన్ నివేదికపై చర్చలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్, హరీశ్‌రావును కమిషన్ అభిశంసించిందన్నారు. ప్రతి చిన్న విషయంలోనూ కేసీఆర్ తలదూర్చినందునే ప్రాజెక్టుకు విపత్కర పరిస్థితులు వచ్చినట్లు కమిషన్ నివేదిక స్పష్టం చేసిందని చెప్పారు. వ్యక్తుల ఇష్టాఇష్టాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు బలైందని ఆయన ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద నీ టి లభ్యత లేదనడం అవాస్తవమని... నీటి పారుదల శాఖ ఉద్దేశపూర్వకంగానే నాటి సీఎం కళ్లలో ఆనందం కోసం మేడిగడ్డ వద్ద సీకెంట్ పైల్స్ టెక్నాలజీని అనుసరించిందని పాల్వాయి ఆరోపించారు. ఈ ప్రాజెక్టుకు జరిగిన నష్టాన్ని ఎవరి నుంచి రాబట్టాలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ నిరవధిక వాయిదా

సాక్షి, హైదరాబాద్: రెండురోజుల పాటు కొనసాగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగి నిరవధికంగా వాయిదా పడ్డాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై స్వల్ప కాలిక చర్చ అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. తొలిరోజు శనివారం జరిగిన శాసనసభ భేటీలో దివంగత జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం తెలిపిన అనంతరం సభ వాయిదా పడిన విషయం తెలిసిందే. రెండో రోజు ఆదివారం ఉదయం 9 గంటలకు సభ ప్రారంభమైంది. 'తెలంగాణ పురపాలక సంఘాల (మూడో సవరణ) బిల్లు 2025', 'తెలంగాణ పంచాయతీరాజ్ (మూడో సవ రణ) బిల్లు 2025'ను ఆమోదించింది. మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ ఈ బిల్లులు ప్రతిపాదించారు. తెలంగాణ అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రీకరణ, క్రమబద్ధీకరణ) చట్టాన్ని రద్దు చేసే బిల్లు కూడా సభ ఆమోదం పొందింది. తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల (స్థాపన, క్రమబద్ధీకరణ) సవరణ ఆర్డినెన్స్, తెలంగాణ పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్, తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ ఆర్డినెన్స్ పత్రాలు సభలో పెట్టారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్, నిజాం షుగర్స్ లిమిటెడ్, తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ వార్షిక నివేదికలను సభకు సమర్పించారు. కాగా శనివారం ప్రారంభమైన శాసనమండలి సమావేశాలకు ఆదివారం విరామం ప్రకటించారు. తిరిగి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శాసనమండలి సమావేశంలో ఆదివారం శాసనసభ ఆమోదించిన సవరణ బిల్లులను చర్చించి ఆమోదిస్తారు. కాగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ రెండు కీలక బిల్లులు అసెంబ్లీలో పాస్ అయిన నేపథ్యంలో వాటిని ఆమోదించాలని కోరుతూ అఖిలపక్ష బృందం సోమవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలవనుంది.

## ప్రజలు మీకు శిక్ష వేశారు... అనుభవిస్తున్నారు



**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

సాక్షి,హైదరాబాద్: అసెంబ్లీలో చర్చ కోర్టు కేసుల గురించి కాదని హరీశ్‌రావు సబ్జెక్ట్‌ను పక్కదారి పట్టిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వల్ల ప్రజాధనం దుర్వినియోగంపై చర్చించాలన్నారు. 'మీరు చేసిన తప్పుల నుంచి బయట పడాలని చూస్తున్నారు. కమీషన్ల కోసం 3 లిఫ్టులతో నీళ్ల తెచ్చే పనిచేశారు..ఆ నీళ్ల మళ్లీ కిందకు వదిలేశారు'అని పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీలో పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై చర్చలో హరీశ్‌రావు ప్రసంగిస్తున్న సమయంలో వెంకట్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ బీఆర్ఎస్ పొరపాటునో, గ్రహపాటునో మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే పోలవరం వరకు ఇంకో మూడు లిఫ్టులు పెట్టి ఇంకో లక్ష కోట్లు దోచుకునే వారని వ్యాఖ్యానించారు. 'ప్రజలు ఇప్పటికే మీకు శిక్ష వేశారు. ఆ శిక్షను మీరు అనుభవిస్తున్నారు. మాది తప్పు అయ్యింది అని ఒప్పుకోండి. కాళేశ్వరం మీరే కట్టారు..మీరే కూలగొట్టారు. ఏది పడితే అది మాట్లాడొద్దు'అని హరీశ్‌రావుకు హితవు పలికారు. 'కాళేశ్వరంపై చర్చ జరుగుతుంటే ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ చర్చకు ఎందుకు రాలేదు. బీసీల కోసం ఇంత సీరియస్‌గా ఉంటే ఎందుకు రాలేదు. ఆయనకు బాధ్యత లేదా 'అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు స్పందిస్తూ మాట మార్చుడు కోమటిరెడ్డికి ఉంటది తప్ప తనకు కాదన్నారు. నాడు కాళేశ్వరంపై అసెంబ్లీలో కేసీఆర్ పీపీటీ ప్రజెంటేషన్ ఇస్తే ఇదే కోమటిరెడ్డి తమ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సరిగ్గా ప్రిపేర్ కాకుండా పోయిండని అన్నారన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్ హద్దు దాటుతున్నాడని ఉత్తమ్ తీవ్రంగా స్పందించారు. ప్రజాధనం రూ.లక్ష కోట్లు నాశనం చేసి ఇలాంటి మాటలు మాట్లాడడానికి సిగ్గుండాలని, ఇంకా పైకి నవ్వుతూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతివ్వండి

- వైఎస్ జగన్‌కు ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఫోన్
- ఇండియా కూటమి అభ్యర్థిని ప్రకటించక ముందే ఎన్డీఏ నేతలు తమతో మాట్లాడారన్న వైఎస్ జగన్
- ఎన్డీఏ అభ్యర్థన మేరకు ముందుగానే వారికి మాట ఇచ్చినట్లు వెల్లడి
- వ్యక్తిగతంగా సుదర్శన్‌రెడ్డి అంటే ఎంతో గౌరవం ఉందన్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఇండియా కూటమి తరఫున ఉప రాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదివారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. వైఎస్ జగన్ స్పందిస్తూ.. ఇండియా కూటమి అభ్యర్థిని ప్రకటించడానికి ముందే.. తమ అభ్యర్థికి మద్దతివ్వాలంటూ ఎన్డీఏ కోరిన విషయాన్ని గు ర్తు చేశారు. వారికి మద్దతిస్తానని మాట కూడా ఇచ్చినట్లు వైఎస్ జగన్ తెలిపారు. కాగా, వ్యక్తిగతంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అంటే అపారమైన గౌరవం ఉందని.. ఆయన సేవలు దేశానికి అవసరమని వైఎస్ జగన్ పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. కానీ ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆయనకు మద్దతు ఇవ్వలేకపోతున్నామని వైఎస్ జగన్ తెలిపారు.

## కాంగ్రెస్ ఎంపీలతో నేడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి భేటీ

హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎం



సాక్షి, హైదరాబాద్: ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు రాష్ట్రాల్లో పర్యటిస్తున్న ఆయన.. తెలంగాణ కాంగ్రెస్ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో సమావేశమయ్యేందుకు ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, సురేశ్‌షెట్కార్, బలరాంనాయక్, అనిల్‌కుమార్‌యాదవ్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎం.ఎ.ఫహీమ్‌లు స్వాగతం పలికారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్ ఎంపీలతో తాజ్ కృష్ణా హోటల్‌లో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు హాజరుకానున్నారు. అనంతరం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో కూడా పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

## ప్రతిపక్ష ఎమ్మెల్యేల మున్సిపాలిటీలకు నిధులివ్వటం లేదు

- బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు, బీజేపీ సభ్యుడు హరీశ్‌బాబు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్, బీజేపీ సభ్యులున్న నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఎస్‌డీఎఫ్, టీయూఎఫ్ఐడీసీ నిధులు విడుదల చేయకుండా నిలిపేస్తోందని బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు, బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలకు మాత్రం ఆ నిధులు విడుదలవుతున్నాయని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాలో ఆందోల్‌కు తప్ప మిగతా మున్సిపాలిటీలకు ఆ నిధులు ఆగిపోయాయని, పెద్ద పట్టణమైన సిద్దిపేటకు కూడా రావటం లేదని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి 22 నెలల్లో రూ. 22 కూడా రాలేదని ఆ మున్సిపాలిటీ చెత్తకుప్పగా మారిందన్నారు.

➢ గ్రామ పంచాయతీల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, అందుతున్న నిధులు నిర్వహణకే సరిపోతున్నాయని, అభివృద్ధి పనులకు నిధులు విడుదల కావటం లేదని బీఆర్ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

➢ మున్సిపాలిటీలుగా మారిన ప్రాంతాలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు అందటం లేదని, దీని కోసం ఆయా ప్రాంత ప్రజల ఉపాధికి కొత్త మార్గాలను అన్వేషించాలని బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ పేర్కొన్నారు.

**పార్టీలకతీతంగా వ్యవహరిస్తున్నాం: మంత్రి శ్రీధర్‌బాబు**



ప్రతిపక్ష సభ్యులున్న నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలకు కొన్ని రకాల నిధులు రాకుండా నిలిపేస్తున్నట్టు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా నిధులిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బిల్లుకు సంబంధం లేని విషయాలు సభలో ప్రస్తావించటం హరీశ్‌రావుకు అలవాటేనన్నారు. బీఆర్ఎస్ హయాంలో కొత్త కలెక్టరేట్ భవనాలు కట్టి బిల్లులు చెల్లించకుండా పేర్చారని, చాలా పనులకు బిల్లులు చెల్లించలేదని, ఇప్పుడు తాము ఆ బిల్లులు చెల్లిస్తున్నామని ఎదురుదాడికి దిగారు. ఏయే మున్సిపాలిటీలకు ఎన్ని నిధులు కేటాయించాలో పరిశీలించి విడుదల చేస్తున్నామని, నాటి ప్రభుత్వం కొన్ని మున్సిపాలిటీలకు నిధులు కేటాయించకపోవటాన్ని దృష్టిలో పెట్టుకొని ఇస్తున్నామన్నారు.

**నగర వార్తలు**

## రాష్ట్రంలో సైక్లింగ్‌ను ప్రోత్సహించాలి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ





'ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

గచ్చిబౌలి: పర్యావరణ హితానికి పచ్చని జీవన శైలికి సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, క్రీడల మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సైక్లింగ్‌ను తెలంగాణలో ప్రోత్సహించాలని ఆయన సూచించారు. భారత ప్రభుత్వం విస్తృతంగా చేపట్టిన 'సండేస్ ఆన్ సైక్లింగ్ అనే కార్యక్రమాన్ని జాతీయ ఫిట్‌నెస్ ఉద్యమంలా తెలంగాణలో నిర్వహించాలని ఆయన సూచించారు. 'ఫిట్‌నెస్ కీ డోస్ అర గంట రోజ్' అన్న నినాదాన్ని విద్యార్థులు, ఉద్యోగులు, ముఖ్యంగా యువకుల్లో స్వచ్ఛంధ సంస్థలు వివిధ వర్గాల ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర క్రీడల శాఖా మంత్రి వాకిటిశ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ జాతీయ క్రీడా దినోత్సవాన్ని 9 రోజులపాటు ఘనంగా నిర్వహించి దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడిందన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు.

**స్పోర్ట్స్ పల్స్ ప్రారంభం..**

తెలంగాణ క్రీడాకారులు సాధించిన విజయాలను, స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలను, సంక్షిప్తంగా సమాజానికి తెలియజేసే భావి క్రీడాకారులకు స్ఫూర్తిని కలిగించే విధంగా రూపొందించిన నెలవారి సంచిక స్పోర్ట్స్ పల్స్(క్రీడానాడి) బులెటిన్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు.

## అది జూబ్లీహిల్స్ సొసైటీ స్థలం కాదు




హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డు

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ సొసైటీ పరిధిలో ఆగస్టు 25వ తేదీన హైడ్రా స్వాధీనం చేసుకున్న 2000 గజాల స్థలం పూర్తిగా జీహెచ్ఎంసీకి చెందినదేనని, ఆ స్థలం తమది కాదని సొసైటీ వర్గాలు తెలిపాయి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సమీపంలోని సర్వే నెంబర్ 403 (1) 4.66 ఎకరాల స్థలాన్ని సొసైటీ 1991లోనే జీహెచ్ఎంసీకి అప్పగించిందని పేర్కొన్నారు. ఈ స్థలంలో జీహెచ్ఎంసీ ఒక పార్క్‌ను, టెన్నిస్‌కోర్టును, మున్సిపల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఖాళీగా ఉన్న కార్పొరేషన్‌కు చెందిన మిగతా 2000 గజాల స్థలాన్ని సత్యనారాయణ అనే వ్యక్తి 2002 నుంచి నర్సరీ నడుపుతున్నాడు. ఈ మేరకు హైకోర్టు నుంచి స్టే సైతం తెచ్చుకున్నాడు. సుదీర్ఘ కాలం తరువాత జీహెచ్ఎంసీ అధికారులు కళ్లు తెరిచి హైడ్రా సహకారంతో అతన్ని ఖాళీ చేయించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆ స్థలంలో ఇది జీహెచ్ఎంసీకి చెందిన స్థలమని స్పష్టంగా పేర్కొంటూ నలువైపులా హైడ్రా అధికారులు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంపైన సదరు సత్యనారాయణ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ అక్కడ కూడా అతనికి చుక్కెదురైంది. సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ స్థలంలో ప్రభుత్వం వెస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే యోచనలో ఉందని జూబ్లీహిల్స్ సొసైటీ వర్గాలు తెలిపాయి.

## 'ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తా'



చికితను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత కూడా ఎవ్వరూ సాధించని ఘనత పెద్దపల్లి జిల్లా, సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత సాధించింది. ఆగస్టు 25వ తేదీన కెనడా లోని విన్నిపెగ్‌లో జరిగిన ప్రపంచ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్స్ అండర్ 21 మహిళా విభాగంలో సౌత్ కొరియా క్రీడాకారిని ఓడించి బంగారు పతకం సాధించింది. చికితకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లారెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అరవింద్ కుమార్‌లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ .. ఆర్చరీ క్రీడలో భారతదేశానికి ఒక ఆణిముత్యం దొరికిందని, ఒక మారుమూల గ్రామం నుండి వచ్చి ఇప్పటివరకు ఎవ్వరూ సాధించని ఘనత చికిత సాధించిందని అభినందించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి)లో శిక్షణ పొందుతున్న చికిత 2028లో జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొని తప్పకుండా బంగారు పతకం సాధిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. చికిత మాట్లాడుతూ .. తన తండ్రి శ్రీనివాసరావుకు ఆర్చరీ అంటే ఎంతో ఇష్టమని తనకు రెండవ తరగతిలో చెప్పారని గుర్తు చేశారు. పతకం సాధించడంతో మానాన్న కోరిక తీర్చినట్లు అయ్యిందని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తానని, తెలంగాణకు మరిన్ని పతకాలు సాధిస్తానని ఆమె తెలిపింది.

## 'గెలిపిస్తే ఏడాదిలో లక్ష ఉద్యోగాలు ఇప్పిస్తా'

వెంగళరావునగర్: రానున్న ఉప ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీని గెలిపిస్తే ఏడాదిలో నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలను ఇప్పిస్తానని ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రంగా విమర్శలు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశం అల్లకల్లోలం అవుతోందని.. అభివృద్ధి అనేది ఎక్కడా కనిపించకపోగా మతతత్వం పెరిగిపోతుందని అన్నారు.

## రాష్ట్రంలో యూత్ కమిషన్ ఏర్పాటు చేయాలి



అభివాదం చేస్తున్న సమితి నాయకులు

పంజగుట్ట: తెలంగాణలో యువత అభివృద్ధి కోసం యూత్ కమిషన్ ఏర్పాటు చెయ్యాలని నవభారత్ నిర్మాణ సమితి డిమాండ్ చేసింది. యువత ప్రజా సమస్యలు తెలుసుకుని రాజకీయాల్లోకి రావాలని వారు కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేష్ బాలస్వామి, వ్యవస్థాపక సభ్యుడు పగడాల మహేష్ మాట్లాడారు. యువత వివక్ష, అణచివేతకు గురికాకుండా వారికి బాటసగా నిలిచేందుకే నవభారత్ నిర్మాణ సమితి ఏర్పాడిందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని అప్పుడే ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయన్నారు.

## నార్సింగిలో మూన్‌గ్లేడ్ ప్రాజెక్ట్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో మూన్‌గ్లేడ్ పేరుతో మరో లగ్జరీ ప్రాజెక్ట్ రానుంది. నార్సింగి ఔటర్ 18-ఏ వద్ద ఈ-ఇన్‌ఫ్రా, ఐరా రియల్టీ సంయుక్తంగా కలిసి హై రైజ్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనుంది. 14 ఎకరాల విస్తీర్ణంలో అల్ట్రా లగ్జరీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. రెండు బేస్‌మెంట్లు, స్టిల్ట్, 4 పోడియం లెవల్స్‌తో 40 అంతస్తులతో.. మొత్తం ఏడు టవర్లతో ఈ ప్రాజెక్ట్ ఉంటుంది. ఇందులో 1,400 చదరపు అడుగుల నుంచి 3,950 చ.అ. విస్తీర్ణంలో మొత్తం 2,489 త్రీ, ఫోర్ బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లు ఉంటాయి. వసతుల కోసం 1.35 లక్షల చ.అ. స్థలాన్ని కేవలం క్లబ్ హౌస్ కోసం కేటాయించారు. ఏడు అంతస్తుల ఈ క్లబ్ హౌస్‌లో స్విమ్మింగ్ పూల్స్, స్క్వాష్, బ్యాడ్మింటన్ కోర్ట్, కాఫీ షాప్, లైబ్రరీ వంటి అన్ని రకాల ఆధునిక వసతులు ఉంటాయి.

## అమెరికా వర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభం



మాట్లాడుతున్న సమంతా క్యామర్స్

పంజగుట్ట: అమెరికాలో టాప్ 10 యూనివర్సిటీల్లో ఒకటైన మిల్వాకి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఎమ్ఎస్ఓఈ)లో 2026 అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎమ్ఎస్ఓఈ సీనియర్ డైరెక్టర్ సమంతా క్యామర్స్ తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ యూనివర్సిటీలో ఇంటర్‌లో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వంద శాతం స్కాలర్‌షిప్స్ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. 2025 సంవత్సరానికి గాను విజయవాడకు చెందిన ఆదిత్యా మిరియాలకు 100 శాతం స్కాలర్‌షిప్, అకామిడేషన్, అన్ని వసతులు కల్పించారని పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీలో చదువుకుంటూనే ప్రతీ వారం 20 గంటలు ఉద్యోగం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. 12వ తరగతి విద్యార్థులు ఈ సంవత్సరమే అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ పీటర్ మర్గియు, ఇండియన్ డైరెక్టర్ యశ్వంత్ వర్మ పాల్గొన్నారు.

## యుద్ధ సంక్షోభంలో సానుభూతి కంటే సంఘీభావం ముఖ్యం



'సాక్ష్యం' కవితా సంపుటిని ఆవిష్కరించిన ప్రొ.హరగోపాల్

హిమాయత్‌నగర్: యుద్ధ సంక్షోభ కాలంలో సానుభూతి కంటే సంఘీభావం అత్యంత ముఖ్యమని మానవ హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. దొంతం చరణ్ రాసిన 'సాక్ష్యం' అనే కవితా సంపుటిని ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. మానవ హననం జరగని, హక్కులు కాలరాయబడని సమాజాన్ని కాంక్షించాలని, అందుకు మనమంతా సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. అధ్యక్షత వహించిన మహేష్ వేల్పుల మాట్లాడుతూ చరణ్ కవిత్వం సామాజిక స్పృహ కలదని అన్నారు. పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండకు బలవుతున్న పసిపిల్లల, తల్లుల ఘోషను తన గుండెకు హత్తుకున్నాడని అన్నారు. ఒక సున్నితమైన మనిషి బలమైన కవిత్వం రాశాడని అన్నారు. ప్రముఖ కవి, విశ్లేషకులు పుప్పాల శ్రీరామ్, రచయిత్రి తీగల లావణ్య, ప్రియాంక, అరుణ వక్తలుగా చరణ్ కవిత్వంపై ప్రసంగించారు.

## ఆదివాసీ తెగలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



అభివాదం చేస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు

పంజగుట్ట: ఎస్టీ వర్గీకరణ చేసి అత్యంత వెనకబడిన ఆదివాసీ తెగలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ ఆదివాసీలో అత్యంత వెనకబడిన తెగల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఆదివాసీలో అత్యంత వెనకబడిన (తోటి, కోలాం, చెంచు, కొండ రెడ్లు)కు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తోటి సంఘం ప్రతినిధి పురిశంగ వెంకటేష్, కోలాం సంఘం ప్రతినిధి టేకం భాస్కర్, భీం రావ్, చెంచు సంఘం ప్రతినిధి నిమ్మల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్నా ఇంకా మా తెగలు కనీస వసతులైన కూడు, గూడులేకుండా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. తమ నాలుగు తెగల జనాభా రాష్ట్రంలో లక్ష పది వేల మంది ఉంటారని, తాము కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తరించి ఉన్నామన్నారు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా తమ సమస్యలు ఎవ్వరూ తీర్చలేదని, తమ సమస్యలపై తామే పోరాడేందుకు ఐక్య వేదిక ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.

## వ్యాక్సిన్‌తో కుక్కల్లో రేబీస్ వ్యాధిని నివారించవచ్చు



శిబిరంలో ఓ పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ వైద్యుడు

నల్లకుంట: క్రమం తప్పకుండా కుక్కలకు వ్యాక్సిన్ చేయించడం ద్వారా వాటికి రేబీస్ వ్యాధి సోకకుండా నివారించవచ్చునని హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్ సంస్థ (హెచ్‌డబ్ల్యూఏ) లీగల్ కన్సల్టెంట్ శ్రేయా పరోప్కరి చెప్పారు. సిటీజన్స్ ఫర్ యానిమల్స్, మిషన్ రేబీస్, వరల్డ్ వైడ్ వెటర్నరీ సర్వీస్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన శ్రేయా పరోప్కరి మాట్లాడారు. ప్రతి ఏటా కుక్క కాటు కారణంగా దేశంలో వేలాది మంది రేబీస్ వ్యాధి సోకి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. నగరాన్ని రేబీస్ రహిత నగరంగా మార్చాలనే లక్ష్యంతో స్వచ్ఛందంగా ఈ రేబీస్ నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. సెప్టెంబర్ నెలాఖరు లోగా కనీసం 30 ప్రాంతాలలో క్యాంపులు ఏర్పాటుచేసి 1000కి పైగా వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు రేబీస్ నివారణ వ్యాక్సిన్ వేయాలనే లక్ష్యంతో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, సోమవారం, 1, సెప్టెంబర్‌, 2025

## కృతి సనన్‌తో.. యాక్టివ్ వేర్




స్పోర్ట్స్‌, అథ్లెయిజర్ ఫుట్‌వేర్ బ్రాండ్ క్యాంపస్ యాక్టివ్ వేర్ తమ మహిళా విభాగపు వస్త్ర శ్రేణికి జాతీయ అవార్డు గెలుచుకున్న నటి కృతి సనన్‌ను అంబాసిడర్‌గా ఎంపిక చేసింది. ఈ విషయాన్ని సంస్థ సీఈఓ నిఖిల్ అగర్వాల్ తెలిపారు. మహిళల విభాగంలో క్యాంపస్ కలెక్షన్ మరింతగా చేరువ చేయడానికి ఇది ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృతి సనన్ మాట్లాడుతూ క్యాంపస్ స్వదేశీ బ్రాండ్‌గా దేశ యువత ఆత్మ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. –సాక్షి, సిటీబ్యూరో

## చిన్నారుల.. హుషారు..

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల బ్రాండ్ శామ్‌సంగ్ కార్పొరేట్ ఉద్యోగుల చిన్నారుల కోసం సరికొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. 'కిడ్స్ డే ఎట్ శామ్‌సంగ్' పేరిట ఉద్యోగులు, తమ పిల్లలతో సహా భాగమయ్యేలా దీనిని డిజైన్ చేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించే ఈ వేడుక ద్వారా పలు ఆట పాటల పోటీలతో పాటు తమ ఉత్పత్తులను ఆస్వాదించే అవకాశాన్ని కూడా చిన్నారులకు అందిస్తామన్నారు. –సాక్షి, సిటీబ్యూరో



# సాంఘిక నృత్యం కోలాటం...

## నవరాత్రుల వేళ.. సాంస్కృతిక సందడి

కోల అంటే కర్రపుల్ల.. ఆట అంటే నృత్యం.. ఈ రెంటినీ కలిపేదే కోలాటం.. పల్లె, పట్టణంలో చిన్నా పెద్దా భేదం లేకుండా పండుగవేళ సరదాగా ఆడే సాంఘిక నృత్యమే కోలాటం. ఈ నృత్య సంప్రదాయం నేడు ఆధునిక పద్ధతులతో మరింత అబ్బురపరుస్తుంది. నవరాత్రుల్లో అందరినీ ఆకట్టుకునే నృత్యంగా గుర్తింపు తెచ్చుకుంది. మహిళలంతా ఒకే రంగు దుస్తుల్లో గుండ్రంగా తిరుగుతూ కోలాటం ఆడుతుంటే ఆ జోష్ మాటల్లో చెప్పలేం..నగరంలో గణనాథుని ఉత్సవాల నేపథ్యంలో ఇప్పటికే కోలాటాల సందడి షురూ అయ్యింది. సందర్భాన్నిబట్టి బాణీలు కట్టే ఈ సంప్రదాయ కళ.. నేడు ఆధ్యాత్మికతకు సంస్కృతిని జోడించి మరింత ఆకర్షణీయంగా అలరిస్తుంది.

– సనత్‌నగర్





- ఆకట్టుకునే బాణీలు, అబ్బురపరిచే నృత్యాలు
- ప్రత్యేక డ్రెస్ కోడ్‌లో మహిళల విన్యాసాలు
- గణనాథునికి వీడ్కోలు పలికేందుకు సన్నాహాలు
- నగరం అంతటా నిమజ్జనాల కోలాహలం..

వనితలు తాండవం ఆడుతూ తమ చేతుల్లోని రెండు కర్రలు కలుపుతూ చేసే ధ్వనులు వీక్షకులకు వీనుల విందు మాత్రమే కాదు.. ఆ కళారూపం నయనానందకరం. గణేశ నవరాత్రులు వచ్చాయంటే గల్లీగల్లీలోనూ సందడే.. మండపం తీర్చిదిద్దే దగ్గర నుంచి నిమజ్జన ఊరేగింపు వరకూ ఎందులోనూ రాజీపడకుండా ఉత్సవ నిర్వాహకుల మధ్య ఆధ్యాత్మిక పోటీ నెలకొనడం సహజమే. పాడ్‌బ్యాండ్, తీన్మార్ స్టెప్పులు, కళాకారుల వేషధారణలతో గణపయ్యను సాగనంపుతారు. అయితే గత కొన్నేళ్లుగా సంప్రదాయ కోలాట సందడి నగరంలో జోరుగా కనిపిస్తోంది. దీనికి ఆధ్యాత్మికతను మిళితం చేసి మానసికోల్లాసాన్ని అందించే కోలాటం కళలో శిక్షణకు ఎంతైనా ఖర్చు చేసేందుకు మహిళలు వెనుకాడడం లేదు.

### కాలనీల్లో బృందాలుగా..

గతంలో ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి నృత్యాలు చేసేవారు. కానీ ఇటీవల కాలంలో నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లో, కాలనీల్లో అక్కడి మహిళలే బృందాలుగా ఏర్పడి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ పొందుతున్నారు. తమ వినాయకుడి వద్ద తామే కోలాటం ప్రదర్శించేందుకు చిన్నారులు, మహిళలు ఉత్సాహం కనబరుస్తున్నారు. ఇందుకోసం నేర్పే గురువుల టైమ్‌స్లాట్స్ దొరకడంలేదంటే అతిశయోక్తి కాదు. నిజాంపేట ప్రాంతానికి చెందిన ఓ గురువు ఉదయం 5.30 గంటలకు కోలాట శిక్షణ తరగతులు ప్రారంభిస్తే అర్ధరాత్రి 12 గంటల వరకు 12 మండపాల వరకూ మహిళలకు శిక్షణ ఇస్తూనే ఉన్నారంటే అతిశయోక్తి కాదేమో. టైమ్ స్లాట్స్ కుదరక కొన్నిచోట్లకు అసిస్టెంట్స్‌ను పంపిస్తున్నారు. నిమజ్జన శోభాయాత్ర కోసం వేల రూపాయలు ఖర్చు చేసేందుకు వెనుకాడడం లేదు.

### పలువురికి హాబీగా..

కేవలం ఉత్సవ వేళ మాత్రమే నేర్చుకుని వదిలేయడం కాకుండా.. దీనిని ఓ హాబీగా మార్చుకుని కోలాటం వేస్తున్నారు. తద్వారా కాలనీలో జరిగే దసరా, శ్రీరామనవమి, కృష్ణాష్టమి, ఉగాది, న్యూయర్.. ఇలా ప్రతి ఈవెంట్‌లో కోలాటానికి షెడ్యూల్ ఉండాల్సిందే. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలు కోలాట సంస్కృతికి ఎర్ర తివాచీ పరుస్తున్నాయి. దీనికి తోడు కోలాటంలో ఆధ్యాత్మికత, మానసిక దృఢత్వం, ఫిట్‌నెస్ అంశాలు మిళితమై ఉన్నాయి. దీంతో మహిళల చేతుల్లోని కర్రలను లయబద్ధంగా ఆడించడానికి ఎంతో ఏకాగ్రత అవసరం. తద్వారా చిన్నారులకు ఏకాగ్రత కూడా పెరుగుతుందని పలువురు భావిస్తుండడం విశేషం. అంతేకాకుండా పొరుగువారితో స్నేహం కూడా పెంపొందుతుందని వీరు నమ్ముతున్నారు.

కోర్ సిటీ, శివారు ప్రాంతం అని తేడా లేకుండా కోలలు మార్మోగుతున్నాయి. గణేశుని శోభాయా

### డ్రెస్ కోడ్‌తో మరింత శోభ..

త్రలో ముందువరుసలో మహిళలు కోలాటం ఆడుతూ ఊరేగింపుకు ఆకర్షణగా నిలుస్తున్నారు. ఇందు కోసం మహిళలందరూ డ్రెస్‌కోడ్ పాటిస్తున్నారు. అప్పుడే ఆ కళకు మరింత వన్నె తీసుకురావచ్చని భావిస్తున్నారు. దీని కోసం ఆయా గ్రూపుల వారు తమ ప్రత్యేకతను చాటుకునేందుకు ఆకర్షణీయమైన వస్త్రాలను ఎంచుకుంటున్నారు.

### చిన్నారుల ఉత్సాహం..



కాలనీలో ఎప్పటి నుంచో చిన్నారులు ఉత్సాహంగా కోలాటం నేర్చుకుంటున్నారు. గణపతి నిమజ్జన ఊరేగింపులో అందరూ ఒకేరకమైన డ్రెస్ ధరించడం శోభాయాత్రకే ప్రత్యేక ఆకర్షణ. కోలాటం శిక్షణను ఇక మీదట కూడా కొనసాగిస్తాం. దీని ద్వారా పిల్లలకు ఏకాగ్రత పెరుగుతుంది.

– బుచ్చిబాబు, మోడల్‌కాలనీ ప్రధాన కార్యదర్శి

### కోలాటం నేర్చుకోవాలనే తాపత్రయం పెరిగింది



నేను సిటీకి వచ్చి ఏడేళ్లు. అప్పటి నుంచి కోలాటం నేర్పుతున్నాను. అప్పట్లో ఆదరణ అంతంతమాత్రంగా ఉండేది. రెండు మూడేళ్ల క్రితం వరకు కూడా అడపా దడపా వినాయక మండపాల వద్ద నేర్చుకునేందుకు ముందుకువచ్చేవారు. కానీ ఇప్పుడు కోలాటం నేర్చుకోవాలనే తాపత్రయం పెరిగింది. ఇప్పుడు తాను ఉదయం 5.30 గంటలకు శిక్షణ మొదలుపెడితే అర్ధరాత్రి 12 గంటల వరకు నేర్పుతున్నాను. నాకు సమయం లేక మరికొంతమంది వద్దకు నా అసిస్టెంట్‌ను పంపిస్తూ నేర్పిస్తున్నాను. ఫిట్‌నెస్ కూడా కోలాటం ఎంతగానో దోహదం చేస్తుంది.

– సాయిగణేష్, కోలాటం మాస్టర్

### ఐక్యత పెరిగేందుకు..



మాది కొత్తగా ఏర్పడిన గేటెడ్ కమ్యూనిటీ. సభ్యుల మధ్య పరిచయాలు, ఐక్యత పెరిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయి. కొందరు ప్రత్యేకంగా గ్రూప్ క్రియేట్ చేసుకుని కోలాటం నేర్చుకుంటున్నారు. మా ప్రయత్నం ఫలించింది. దీనిని కమ్యూనిటీలోని ప్రతి కార్యక్రమంలో ప్రదర్శిస్తున్నాం.

– రావూరి శ్రీవాణి, గోథిక్ పెంటగాన్ క్లాడ్స్ (గేటెడ్ కమ్యూనిటీ)

### ఫిట్‌నెస్‌పరంగానూ ఉపయోగం..



కోలాటం కేవలం ఒక వినోదాత్మక కళ మాత్రమే కాదు.. శారీరక, మానసిక దృఢత్వానికి కీలకం. 1300 ఫ్లాట్లు కలిగిన మా కమ్యూనిటీలో శ్రీరామనవమి, కృష్ణాష్టమి, గణపతి నవరాత్రులు ఇలా ఏ పండుగ వచ్చినా కోలాట ప్రదర్శన తప్పనిసరి. మాస్టర్స్ వద్ద మా సభ్యులు మెళకువలు నేర్చుకుంటున్నారు. మహిళల మధ్య బంధం బలపడుతోంది.

– దీప్తి, బ్రిగేడ్ సిటాడెల్ హైరైజ్ అపార్ట్‌మెంట్

# మర్రి.. డోంట్ వర్రీ..

- రెండు మర్రి చెట్లకు ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిలో పునరుజ్జీవం
- సెప్టెంబర్ 2, 2002న 'జాగృతి', 'నవజీవన్' పేర్లతో నామకరణం
- 23 ఏళ్ల క్రితమే ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సిబ్బంది ప్రయోగం

**సరిగ్గా 23 యేళ్ల కిందట ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ తల పెట్టిన ఓ సరికొత్త ప్రయోగం ఫలించింది.. ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిలో రెండు మర్రి చెట్లను నాటి పునరుజ్జీవం పోశారు. సెప్టెంబర్ 2, 2002న ట్రాన్స్‌లొకేట్ చేసిన ఈ జంట మర్రి చెట్లకు 'జాగృతి', 'నవజీవన్' అనే పేర్లతో నామకరణం చేశారు. ప్రస్తుతం ఇవి గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రెండువేలకు పైగా చెట్ల నడుమ ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.**

- రాయదుర్గం

నగర విస్తరణలో భాగంగా ప్రస్తుతం పలు చోట్ల చెట్లను కొట్టేయడం లేదంటే వాటిని ట్రాన్స్ లొకేషన్ పద్ధతిలో వేరే ప్రాంతాల్లో నాటడం తెలిసిందే.. కానీ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో 23 ఏళ్ల క్రితమమే ఈ పద్ధతిని అమలుచేశారు. అప్పట్లో క్యాంపస్ విస్తరణలో భాగంగా ఈ మర్రి చెట్లను తొలగించాలని నిర్ణయించారు. దీనిపై అప్పటి ప్రొఫెసర్లు, అధికారులు కలిసి వీటిని ఎలాగైనా క్యాంపస్‌లో మరో ప్రదేశంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిలో ఒకచెట్టును పరిపాలనా భవనం పక్కన(జాగృతి), మరో చెట్టును నీలగిరి భవన్ వద్ద (నవజీవన్) ఏర్పాటు చేశారు పేర్లతో నామకరణం చేశారు.



### రెండో సారి ట్రాన్స్‌లొకేషన్..

ఇదిలావుండగా నీలగిరి భవన విస్తరణలో దాన్ని మళ్లీ ట్రాన్స్‌లొకేషన్ పద్ధతి ద్వారానే క్యాంపస్‌లోని పలాష్ నివాస్ సర్కిల్ వద్దకు నవజీవన్‌ను తరలించారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని 66 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం దాదాపు 2వేల చెట్లు కొలువుదీరాయి. యేటా వనమహోత్సవం పేరిట మొక్కలు నాటుతుంటారు. అదేవిధంగా కొన్ని చెట్లను విద్యార్థులే తమ గుర్తు కోసం నాటి వాటికి పేర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు.



### సస్టైనబుల్ గ్రీన్ ఇనిషియేటివ్..

- వనమహోత్సవంలో భాగంగా సస్టైనబుల్ గ్రీన్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం కింద క్యాంపస్‌లో ఇటీవల 1,200 మొక్కలను నాటారు.
- వన్ ట్రీ ప్లాంటెడ్ యూఎస్ఏ, ఫెడెక్స్ కార్పొరేషన్ యూఎస్ఏ సంస్థల సహకారంతో క్యాంపస్‌లో ఇటీవలే వీటిని నాటడం విశేషం
- క్యాంపస్‌లో రేయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్, వైజస్ స్మార్ట్ స్ట్రీట్ లైటింగ్, ఇంటిలిజెంట్ మానిటరింగ్ సిస్టమ్స్, ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్, వాటర్, ఎలక్ట్రిసిటీ కన్జ్యూమ్ వంటి వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

# ఆకట్టుకున్న ఆరుషి ఎగ్జిబిషన్

### 25 వసంతాలను పురస్కరించుకుని సాలార్జంగ్ మ్యూజియంలో ఏర్పాటు

బహదూర్‌పురా : పాయల్ కపూర్ ఆఫ్ ఆరుషి ఆర్ట్ గ్యాలరీ 25 వసంతాలను పురస్కరించుకుని సాలార్జంగ్ మ్యూజియంలో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని ప్రముఖ చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్, నీలం కోతరి, నటుడు జగపతిబాబు, నీలం ప్రతాప్ రెడ్డి, ప్రయాగ్ శుక్లా, రూడీ రూమ్ శుక్లా అంజుపోదార్ ఆదివారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం చిత్రాకారుల ప్రతిభను అభినందించారు. ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో పలువురి చిత్రకారుల చిత్రాలకు సందర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. ఎంఎఫ్ హుస్సేన్, ఎస్‌హెచ్ రజా, కిషన్ కన్నా, రామ్ కుమార్, తయ్యబ్ మెహతా, భుపెన్ కక్కర్, స్వామినాథన్, జగ్రహస్సింగ్ షామ్, భట్టాచార్య లక్ష్మణ్ గౌడ్, సతీష్ గుజ్రాల్, సతీష్ గుప్తా, కేజీ సుబ్రహ్మణ్యం, మాను పరేఖ్, శోభ బుట్ట, శక్తి బురుమన్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా ఏర్పాటు చేసిన ప్రముఖ చిత్రాలను సందర్శించారు. సెప్టెంబర్ 13 వరకు ఉదయం 11 గంటల నుంచి 4.30 వరకూ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



# హ్యాక్ హా.. అప్‌డేట్ హా..?!

- కొన్ని ప్రముఖ బ్రాండ్ల మొబైల్స్‌లో సెట్టింగ్స్ చేంజ్..
- మొబైల్ సెట్టింగ్స్ మార్పులతో యూజర్ల కలకలం..
- హ్యాకింగ్ భయాలతో వినియోగదారుల బెంబేలు..




సాక్షి, సిటీ బ్యూరో: నా ఫోన్ హ్యాక్ అయిందా? అంటూ పలువురు మొబైల్ వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి కారణం కొన్ని ప్రముఖ బ్రాండ్ల మొబైల్స్‌లో వినియోగదారుల అనుమతి లేకుండానే ఆటోమెటిక్‌గా సెట్టింగ్స్ మారిపోవడమే. ఇదే అనేకమందిలో 'మన ఫోన్లు హ్యాక్ అయ్యాయా?' అనే ఆందోళనకు దారి తీస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో అంతకు ముందు మనం మాట్లాడిన విషయాలు యాడ్స్, పోస్టుల రూపంలో కనిపిస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఈ రకమైన మార్పులు మరింత గందరగోళాన్ని కలిగిస్తున్నాయి. అయితే ఇలాంటి సెట్టింగ్స్ మార్పులు హ్యాకింగ్ వల్ల మాత్రమే కాదని, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, కంపెనీ బగ్ ఫిక్స్‌లు లేదా డిఫాల్ట్ సిస్టమ్ సింక్ అయిన కారణంగా కూడా జరుగుతాయని సాంకేతిక నిపుణులు అంటున్నారు.

### అవగాహన తోనే..

ఈ ఆటోమెటిక్ మొబైల్ సెట్టింగ్స్ మార్పు చూడడానికి చిన్నదిగా కనిపిస్తున్నా.. నగరవాసుల్లో ముఖ్యంగా యువత, ఐటీ ఉద్యోగుల్లో ఆందోళనతో పాటు సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెరగడానికి దోహదం చేసింది. మన ప్రైవసీ, మన భద్రత, మన భవిష్యత్తును రక్షించుకోవడమేనని మరోసారి హెచ్చరించింది. కొన్నిసార్లు బ్రాండ్లు కొత్త ఫీచర్లను యూజర్లకు అందించడానికి ఆటోమెటిక్‌గా కొన్ని సెట్టింగ్స్ మార్చేస్తాయి. అయితే.. తమకు ముందస్తు నోటిఫికేషన్ రాకపోవడం వల్లే ఇది హ్యాకింగ్‌లా అనిపిస్తోందని వినియోగదారులు చెబుతున్నారు.

### లైఫ్ స్టైల్ మార్పులు..

నగరాల్లో జీవనశైలిలో ఉదయం అలారం మొదలు రాత్రి నిద్రపోయే వరకు.. చదువు, ఉద్యోగం, వినోదం, షాపింగ్ అన్నీ మొబైల్ ఆధారంగానే సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మొబైల్ సెట్టింగ్స్ ఇలా అనుకోకుండా మారిపోవడం నేరుగా వారి మానసిక ప్రశాంతతపై ప్రభావం చూపుతుంది. ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రాజెక్ట్ వర్క్‌పై ఆధారపడిన మొబైల్ వినియోగదారులు ఈ సెట్టింగ్స్ మారడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఫియర్ ఆఫ్ హ్యాకింగ్ (ఫోన్ సురక్షితమా? అనే అనుమానం) వల్ల యువతలో ఆందోళన పెరుగుతుంది. డిజిటల్ చర్యలపై నమ్మకం తగ్గిపోవడం వల్ల సోషల్ మీడియా, ఆన్‌లైన్ లావాదేవీల పట్ల జాగ్రత్త పెరుగుతుంది. టెక్నాలజీపై ఆధారపడే జీవనశైలి మరింత సెక్యూరిటీ–సెంట్రిక్‌గా మారే అవకాశం ఉంది.

### ఇలాంటివి కాకుండా ఉండాలంటే?

- మొబైల్‌లోని సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్‌ను మ్యాన్యువల్‌గా కంట్రోల్ చేయండి. ఆటోమేటిక్ అప్‌డేట్ ఆప్షన్‌ను ఆఫ్ చేసి, అవసరం అనిపించినప్పుడు మాత్రమే అప్‌డేట్ చేయడం మంచిది.
- ఎప్పటికప్పుడు యాప్‌లకు ఇచ్చే అనుమతులను జాగ్రత్తగా పరిశీలించండి. మైక్రోఫోన్, కెమెరా, లొకేషన్ యాక్సెస్ అవసరమైనప్పుడే ఆన్ చేయాలి, లేని పక్షంలో ఆఫ్‌లోనే ఉంచాలి.
- టూ–ఫాక్టర్ అథెంటికేషన్ ఉపయోగించడం ద్వారా అకౌంట్‌లు మరింత సురక్షితంగా ఉంటాయి.
- అనవసర యాప్‌లను తొలగించడం కూడా సెక్యూరిటీకి చాలా కీలకం.
- సెక్యూరిటీ సెట్టింగ్స్‌లో లాక్ స్క్రీన్, ఫింగర్ ప్రింట్, ఫేస్ ఐడీ వంటివి తప్పనిసరిగా ఉపయోగించాలి.

### బ్యాకప్ సెట్టింగ్స్ తప్పనిసరి..

ఇలాంటి మార్పులు మళ్లీ జరగకుండా ఉండేందుకు మొబైల్‌లో సిస్టమ్ సెట్టింగ్స్ బ్యాకప్ తీసుకోవడం మంచిదని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సెట్టింగ్స్ మారితే తిరిగి రీస్టోర్ చేసుకోవచ్చు. అలాగే వై–ఫై లేదా డేటా నెట్‌వర్క్ ద్వారా జరిగే రిమోట్ మార్పులు నివారించడానికి ప్రైవసీ సెట్టింగ్స్ కఠినంగా ఉంచాలి.







సౌమ్య

## ఏఎఫ్‌సీ మహిళల చాంపియన్స్‌ లీగ్‌కు ఈస్ట్‌ బెంగాల్‌ క్లబ్‌ అర్హత

దేశవాళీ ఫుట్‌బాల్‌లో మేటి జట్టు ఈస్ట్‌ బెంగాల్‌ ఫుట్‌బాల్‌ క్లబ్‌ మరో ఘనతను సాధించింది. తొలి ప్రయత్నంలోనే ఆసియా ఫుట్‌బాల్‌ సమాఖ్య (ఏఎఫ్‌సీ) మహిళల చాంపియన్స్‌ లీగ్‌ ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. భారత మహిళల లీగ్‌ చాంపియన్‌ హోదాలో ఆసియా చాంపియన్స్‌ లీగ్‌ ప్రిలిమినరీ టోర్నీలో ఈస్ట్‌ బెంగాల్‌ జట్టు పోటీపడే అవకాశాన్ని దక్కించుకుంది. కంబోడియాలో జరిగిన ఈ టోర్నీలో గ్రూప్‌ 'ఇ'లో బరిలోకి దిగిన ఈస్ట్‌ బెంగాల్‌ జట్టు నాలుగు పాయింట్లతో 'టాప్‌' ర్యాంక్‌లో నిలిచి ముందంజ వేసింది. కిచీ స్పోర్ట్స్‌ క్లబ్‌ (హాంకాంగ్‌)తో ఆదివారం జరిగిన చివరి లీగ్‌ మ్యాచ్‌ను ఈస్ట్‌ బెంగాల్‌ 1–1తో 'డ్రా' చేసుకుంది. ఈస్ట్‌ బెంగాల్‌ తరఫున సంగీత (11వ నిమిషంలో), కిచీ స్పోర్ట్స్‌ క్లబ్‌ తరఫున హో ముయ్‌ మె (59వ నిమిషంలో) ఒక్కో గోల్‌ చేశారు. తొలి మ్యాచ్‌లో ఈస్ట్‌ బెంగాల్‌ 1–0తో ఫ్నోమ్‌ పెన్‌ క్రౌన్‌ (కంబోడియా)పై గెలిచింది. ఈ రెండు మ్యాచ్‌ల్లో గోల్‌ చేయకపోయినా... తెలంగాణ అమ్మాయి, భారత జట్టు ఫార్వర్డ్‌ సౌమ్య గుగులోత్‌ ఈస్ట్‌ బెంగాల్‌ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. గత సీజన్‌కుగాను భారత 'ఉత్తమ మహిళా ఫుట్‌బాలర్‌'గా ఎంపికైన సౌమ్య దూకుడుగా ఆడి తమ జట్టుకు గోల్‌ అవకాశాలను సృష్టించింది. ఆసియాలోని 12 క్లబ్‌ జట్లు పోటీపడే చాంపియన్స్‌ లీగ్‌ అక్టోబర్‌ నుంచి వచ్చే ఏడాది మే వరకు మూడు అంచెల్లో జరుగుతుంది.



## క్వార్టర్స్‌లో జెస్సికా

న్యూయార్క్‌: యూఎస్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టెన్నిస్‌ టోర్నీ మహిళల సింగిల్స్‌ విభాగంలో గత ఏడాది రన్నరప్‌ జెస్సికా పెగూలా (అమెరికా) క్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో నాలుగో సీడ్‌ జెస్సికా 6–1, 6–2తో అమెరికాకే చెందిన ప్రపంచ 58వ ర్యాంకర్‌ ఆన్‌ లీపై గెలుపొందింది. కేవలం 54 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో జెస్సికా రెండు ఏస్‌లు సంధించి, ఒక డబుల్‌ ఫాల్ట్‌ చేసింది. నెట్‌ వద్దకు 15 సార్లు దూసుకొచ్చి 12 సార్లు పాయింట్లు గెలిచింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన జెస్సికా ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్‌ చేసింది. 12 విన్నర్స్‌ కొట్టిన ఆమె 12 అనవసర తప్పిదాలు చేసింది. మరోవైపు ప్రపంచ రెండో ర్యాంకర్‌ స్వియాటెక్‌ (పోలాండ్‌) ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ చేరింది. మూడో రౌండ్‌లో స్వియాటెక్‌ 7–6 (7/2), 6–4తో కలిన్‌స్కాయ (రష్యా)పై నెగ్గింది.

**జ్వెరెవ్‌కు చుక్కెదురు**

పురుషుల సింగిల్స్‌ విభాగంలో మూడో సీడ్‌ అలెగ్జాండర్‌ జ్వెరెవ్‌ (జర్మనీ) పోరాటం ముగిసింది. మూడో రౌండ్‌లో జ్వెరెవ్‌ 6–4, 6–7 (7/9), 4–6, 4–6తో ఫెలిక్స్‌ అలియాసిమ్‌ (కెనడా) చేతిలో ఓడిపోయాడు. డిఫెండింగ్‌ చాంపియన్, టాప్‌ సీడ్‌ యానిక్‌ సినెర్‌ (ఇటలీ), ఎనిమిదో సీడ్‌ డిమినార్‌ (ఆస్ట్రేలియా), పదో సీడ్‌ లొరెంజో ముసెట్టి (ఇటలీ) ప్రిక్వార్టర్‌ ఫైనల్లోకి అడుగు పెట్టారు. మూడో రౌండ్‌లో సినెర్‌ 5–7, 6–4, 6–3, 6–3తో షపోవలోవ్‌ (కెనడా)పై గెలిచాడు.

**యూకీ జోడీ బోణీ**

పురుషుల డబుల్స్‌ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్‌)–మైకేల్‌ వీనస్‌ (న్యూజిలాండ్‌) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో యూకీ–వీనస్‌ 6–0, 6–3తో గిరోన్‌–లెర్నర్‌ టియెన్‌ (అమెరికా)లపై గెలిచారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్‌ స్పోర్ట్స్‌ ఈ-పేపర్‌లో

## 'సులువుగా పాయింట్లు ఇచ్చాం'

**ప్రపంచ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ సెమీఫైనల్లో ఓటమిపై సాత్విక్‌–చిరాగ్‌ జోడీ**


కాంస్య పతకాలతో చిరాగ్‌ శెట్టి, సాత్విక్‌ సాయిరాజ్‌

పారిస్‌: ప్రపంచ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ సెమీఫైనల్లో ఆద్యంతం ఒకే రకమైన దూకుడును కనబర్చలేకపోయామని... నిర్ణాయక మూడో గేమ్‌లో ప్రత్యర్థి జోడీకి సులువుగా పాయింట్లు ఇచ్చామని... పురుషుల డబుల్స్‌ విభాగంలో కాంస్య పతకం సాధించిన సాత్విక్‌ సాయిరాజ్‌–చిరాగ్‌ శెట్టి (భారత్‌) జంట వివరించింది. ఈ మెగా ఈవెంట్‌ పురుషుల డబుల్స్‌ సెమీఫైనల్లో సాత్విక్‌–చిరాగ్‌ ద్వయం 67 నిమిషాల్లో 19–21, 21–18, 12–21తో చెన్‌ బో యాంగ్‌–లియు యి (చైనా) జంట చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ప్రపంచ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ చరిత్రలో సాత్విక్‌–చిరాగ్‌ జోడీకిది రెండో పతకం కావడం విశేషం. 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ ఈ జంట కాంస్య పతకాన్ని గెల్చుకుంది. 'సెమీఫైనల్లో శుభారంభం లభించలేదు. ఒక లయను దొరకబుచ్చుకోలేకపోయాం. మూడో గేమ్‌లో సులువుగా పాయింట్లు ఇచ్చేశాం. కీలకదశలో కాస్త చాకచక్యంగా ఆడాల్సింది. అయితే చైనా జోడీ అద్భుతంగా ఆడింది. మూడు గేముల్లోనూ ఆ జంట సర్వీస్‌ బాగా చేసింది' అని చిరాగ్‌ వ్యాఖ్యానించాడు. 'చైనా జోడీ పూర్తి విశ్వాసంతో ఆడింది. ఆరంభ మ్యాచ్‌ల్లో మేము ఇలాగే ఆడాం. చైనా ఆటగాళ్లు మ్యాచ్‌ను ఆద్యంతం ఆస్వాదించారు. తొలి గేమ్‌లో మేము 12–7తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ చైనా ద్వయం ఆందోళన చెందకుండా సహజశైలిలో ఆడి మాపై ఒత్తిడి పెంచింది. మ్యాచ్‌లో అడపాదడపా మేము మెరిపించాం. కీలక మ్యాచ్‌ల్లో ఆత్మవిశ్వాసం, మానసిక దృఢత్వం కూడా ముఖ్యం' అని సాత్విక్‌ తెలిపాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో షి యుకి (చైనా), మహిళల సింగిల్స్‌లో అకానె యామగుచి (జపాన్‌) విజేతలుగా నిలిచారు.

## భారత్‌కు రెండో విజయం

- జపాన్‌పై 3–2తో నెగ్గిన హర్మన్‌ప్రీత్‌ బృందం
- ఆసియా కప్‌ హాకీ టోర్నీ




రాజ్‌గిర్‌ (బిహార్‌): వరుసగా రెండో మ్యాచ్‌లోనూ భారత పురుషుల హాకీ జట్టుకు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైంది. భారీ విజయాలు సాధిస్తుందనుకున్న చోట భారత జట్టు మరోసారి గోల్‌ తేడాతోనే గట్టెక్కింది. ఆసియా కప్‌ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన పూల్‌ 'ఎ' రెండో లీగ్‌ మ్యాచ్‌లో టీమిండియా 3–2 గోల్స్‌ తేడాతో జపాన్‌ జట్టును ఓడించింది. వరుసగా రెండో విజయం నమోదు చేసుకున్న భారత జట్టు 'సూపర్‌–4' దశకు మరింత చేరువైంది. చైనాతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్‌ 4–3తో గెలిచింది. జపాన్‌తో జరిగిన పోరులో భారత్‌ తరఫున మన్‌దీప్‌ సింగ్‌ (4వ నిమిషంలో) ఒక గోల్‌ చేయగా... కెప్టెన్‌ హర్మన్‌ప్రీత్‌ సింగ్‌ (5వ నిమిషంలో, 46వ నిమిషంలో) రెండు గోల్స్‌ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. జపాన్‌ జట్టుకు కొసె కవాబె (38వ, 59వ నిమిషంలో) రెండు గోల్స్‌ అందించాడు. పూల్‌ 'ఎ'లో భారత్‌ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... చెరో మ్యాచ్‌లో గెలిచిన చైనా, జపాన్‌ మూడు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. నేడు జరిగే చివరిదైన మూడో లీగ్‌ మ్యాచ్‌లో కజకిస్తాన్‌తో భారత్‌ తలపడుతుంది. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో చైనా 13–1 గోల్స్‌ తేడాతో కజకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది.

## నీరజ్‌తోపాటు మరో ముగ్గురు...

**ప్రపంచ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ బరిలో నలుగురు భారత జావెలిన్‌ త్రోయర్లు**

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ జావెలిన్‌ త్రో విభాగంలో భారత్‌ నుంచి అత్యధికంగా నలుగురు త్రోయర్లు పాల్గొననున్నారు. టోక్యో వేదికగా ఈ నెల 13 నుంచి 21 వరకు జరగనున్న ఈ మెగా ఈవెంట్‌లో పాలొననున్న అన్నీ దేశాల్లోకెల్లా... భారత్‌ నుంచే అత్యధికంగా నలుగురు జావెలిన్‌ త్రోయర్లు పోటీ పడుతున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2024 పారిస్‌ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన నీరజ్‌ చోప్రా భారత బృందానికి నేతృత్వం వహించనున్నాడు. నీరజ్‌తో పాటు సచిన్‌ యాదవ్, యశ్‌వీర్‌ సింగ్, రోహిత్‌ యాదవ్‌ జావెలిన్‌ పోటీల్లో పాల్గొంటున్నారు. మొత్తంగా ఈ పోటీల్లో భారత్‌ నుంచి 19 మంది అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. ముందస్తు షెడ్యూల్‌ ప్రకారం రోహిత్‌ యాదవ్‌ ప్రపంచ చాంపియన్‌షిప్‌ పోటీలో లేకున్నా... పలువురు త్రోయర్లు తప్పుకోవడంతో ప్రపంచ అథ్లెటిక్స్‌ సమాఖ్య ర్యాంకింగ్స్‌ ఆధారంగా అతడికి ఆహ్వానం పంపింది. 2023లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌ పోటీలకు సైతం భారత్‌ నుంచి నలుగురు జావెలిన్‌ త్రోయర్లు అర్హత సాధించగా... గాయం కారణంగా రోహిత్‌ పోటీ నుంచి తప్పుకున్నాడు. బుడాపెస్ట్‌లో జరిగిన ఆ పోటీల్లో నీరజ్‌ విజేతగా నిలవగా... కిషోర్‌ జెనా, డీపీ మనూ వరుసగా ఐదో, ఆరో స్థానాలు దక్కించుకున్నారు. ప్రపంచ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో ఒకే విభాగంలో నలుగురు భారత అథ్లెట్లు పాల్గొననుండటం ఇదే తొలిసారి. డిఫెండింగ్‌ చాంపియన్‌గా నీరజ్‌ నేరుగా ఈ పోటీలకు అర్హత సాధించాడు. ఒక్కో దేశం నుంచి అత్యధికంగా ముగ్గురు అథ్లెట్లకు మాత్రమే అవకాశం ఉన్నప్పటికీ... నీరజ్‌కు నేరుగా వైల్డ్‌ కార్డ్‌ ఎంట్రీ దక్కడంతో నలుగురికి చాన్స్‌ లభించింది. ఈ పోటీల అర్హత మార్క్‌ 85.50 మీటర్లు కాగా... నీరజ్‌ అంతకంటే మెరుగైన త్రోతో ముందుండగా... మిగిలిన ముగ్గురు ర్యాంకింగ్స్‌ ఆధారంగా పోటీలో నిలిచారు. 2023 పోటీల్లో భారత్‌ నుంచి 28 మంది అథ్లెట్లు పాల్గొనగా... ఈసారి ఐదుగురు మహిళలు సహా మొత్తం 19 మంది అథ్లెట్లు పోటీలో ఉన్నారు. తెలంగాణ అథ్లెట్‌ అగసర నందిని, స్టీపుల్‌ చేజర్‌ అవినాశ్‌ గాయాలతో దూరమయ్యారు.




భారత అథ్లెటిక్స్‌ జట్టు: పురుషులు: నీరజ్‌ చోప్రా, సచిన్‌ యాదవ్, యశ్‌వీర్‌ సింగ్, రోహిత్‌ యాదవ్‌ (జావెలిన్‌ త్రో), మురళీ శ్రీశంకర్‌ (లాంగ్‌జంప్‌), గుల్‌వీర్‌ (5,000, 10,000 మీటర్లు), ప్రవీణ్, అబూబకర్‌ (ట్రిపుల్‌ జంప్‌), సర్వేశ్‌ (హైజంప్‌), అనిమేశ్‌ (200 మీటర్లు), తేజస్‌ (110 మీటర్ల హర్డిల్స్‌), సెర్విన్‌ (20 కి.మీ రేస్‌వాక్‌), రామ్‌బాబూ, సందీప్‌ (35 కి.మీ. రేస్‌వాక్‌). మహిళలు: పారుల్, అంకిత (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌), అన్ను రాణి (జావెలిన్‌ త్రో), ప్రియాంక (35 కి.మీ. రేస్‌వాక్‌), పూజ (800, 1500 మీ.)

## తమిళ్‌ తలైవాస్‌కు షాక్‌

**36-33తో గెలిచిన యు ముంబా**



విశాఖ స్పోర్ట్స్‌: ప్రొ కబడ్డీ లీగ్‌ 12వ సీజన్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో యు ముంబా ఆఖర్లో పుంజుకొని తమిళ్‌ తలైవాస్‌కు షాక్‌ ఇచ్చింది. మాజీ చాంపియన్‌ యు ముంబా 36–33 పాయింట్ల తేడాతో తలైవాస్‌ను ఓడించి ఈ లీగ్‌లో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. యు ముంబా రెయిడర్‌ అజిత్‌ చౌహాన్‌ 9, ఆల్‌రౌండర్‌ అనిల్‌ 8 పాయింట్లు సాధించారు. డిఫెండర్లలో లోకేశ్, రింకూ చెరో 4 పాయింట్లు స్కోరు చేశారు. తమిళ్‌ రెయిడర్‌ అర్జున్‌ దేశ్వాల్‌ 18 సార్లు కూతకెళ్లి 12 పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతా వారిలో కెప్టెన్‌ పవన్‌ సెహ్రావత్‌ 7, డిఫెండర్లు నితీశ్‌ కుమార్, హిమాన్షు చెరో 4 పాయింట్లు చేశారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్‌ చాంపియన్‌ హరియాణా స్టీలర్స్‌కు బెంగాల్‌ వారియర్స్‌ చేతిలో చుక్కెదురైంది. కెప్టెన్‌ దేవాంక్‌ (21) రెయిడింగ్‌లో చెలరేగడంతో 2019 చాంపియన్‌ బెంగాల్‌ 54–44తో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించింది. వారియర్స్‌ జట్టులో దేవాంక్‌తో పాటు మరో రెయిడర్‌ మన్‌ప్రీత్‌ (13) అదరగొట్టాడు. స్టీలర్స్‌ జట్టులో రెయిడర్లు శివమ్‌ పటారే (17), వినయ్‌ (13) రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో యూపీ యోధాస్, పుణేరి పల్టన్‌తో గుజరాత్‌ జెయింట్స్‌ తలపడతాయి.

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్‌ పాలిటీ » టెట్‌/డీఎస్సీ ప్రత్యేకం–తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ » బ్యాంక్‌ ఎగ్జామ్స్‌ ప్రత్యేకం–బ్యాంకింగ్‌ అవేర్‌నెస్‌

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఆర్‌ఆర్‌సీ–వెస్ట్‌ సెంట్రల్‌ రైల్వేలో 2,865 అప్రెంటిస్‌లు

రైల్వే రిక్రూట్‌మెంట్‌ సెల్‌(ఆర్‌ఆర్‌సీ)–వెస్ట్‌ సెంట్రల్‌ రైల్వేలోని వివిధ డివిజన్లలో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 2,865.
- **డివిజన్ల వారీగా ఖాళీలు:** జేబీపీ డివిజన్‌–1136, బీపీఎల్‌ డివిజన్‌–558, కోటా డివిజన్‌–865, సీఆర్‌డబ్ల్యూఎస్‌ బీపీఎల్‌ డివిజన్‌–136, డబ్ల్యూఆర్‌ఎస్‌ కోటా డివిజన్‌–151, హెచ్‌క్యూ/జేబీపీ–19.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా బోర్డు నుంచి పదో తరగతి, ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 20.08.2025 నాటికి 15 నుంచి 24 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 30.08.2025.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 29.09.2025
- **వెబ్‌సైట్‌:** wcr.indian-railways.gov.in

### ఐఆర్‌ఈఎల్‌(ఇండియా) లిమిటెడ్‌లో 41 అప్రెంటిస్‌లు

తమిళనాడు రాష్ట్రం మనవలకురిచి,కన్యాకుమారి జిల్లాలోని ది ఇండియన్‌ రేర్‌ ఎర్త్‌ లిమిటెడ్‌(ఐఆర్‌ఈఎల్‌)..గ్రాడ్యుయేట్,టెక్నీషియన్,ట్రేడ్‌ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 41.
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్‌ అప్రెంటిస్‌లు–04, టెక్నికల్‌ అప్రెంటిస్‌లు–04, ట్రేడ్‌ అప్రెంటిస్‌లు–33.
- **విభాగాలు:** ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్, వెల్డర్, ఎలక్ట్రానిక్‌/ఇన్‌స్ట్రుమెంట్‌ మెకానిక్, టర్నర్, ప్లంబర్, ఫిట్టర్, కార్పెంటర్, ల్యాబ్‌ అసిస్టెంట్, పీఏఎస్‌ఏఏ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీఎస్సీ, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చీఫ్‌ మేనేజర్‌–హెచ్‌ఆర్‌ఎం (లీగల్‌–ఈఆర్‌), ఐఆర్‌ఈఎల్‌ (ఇండియా) లిమిటెడ్, మనవలకురిచి, కన్యాకుమారి జిల్లా, తమిళనాడు–629252 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.09.2025.
- **వెబ్‌సైట్‌:** https://irel.co.in

### ఇస్రో–ఎన్‌ఆర్‌ఎస్‌సీ, హైదరాబాద్‌లో 96 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్‌ రిమోట్‌ సెన్సింగ్‌ సెంటర్‌ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ)లో 2025–26 సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 96.
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్‌ అప్రెంటిస్‌లు–11, డిప్లొమా అప్రెంటిస్‌లు–55, గ్రాడ్యుయేట్‌ అప్రెంటిస్‌లు(జనరల్‌ స్ట్రీమ్‌)–30.
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ ఇంజనీరింగ్, కంప్యూటర్‌ సైన్స్, ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ ఇంజనీరింగ్, సివిల్, మెకానిక్, లైబ్రరీ సైన్స్‌.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్‌/బీఈ, డిగ్రీ, డిప్లొమాలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **స్టైపెండ్‌:** నెలకు గ్రాడ్యుయేట్‌ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 11.09.2025
- **వెబ్‌సైట్‌:** https://www.nrsc.gov.in

### ఎయిమ్స్‌ నాగ్‌పూర్‌లో మెడికల్‌ ఆఫీసర్‌ పోస్టులు

ఆల్‌ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌(ఎయిమ్స్‌) నాగ్‌పూర్‌ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో డాక్టర్‌(మెడికల్‌ ఆఫీసర్‌) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో యూజీసీ గుర్తించిన సంస్థ నుంచి ఎంబీబీఎస్,ఎండీ(సైకియాట్రీ)లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 38ఏళ్ల నుంచి 45ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.60,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేది:** 08.09.2025.
- **వెబ్‌సైట్‌:** https://aiimsnagpur.edu.in

### ఆర్‌వీఎన్‌ఎల్‌లో మేనేజర్‌ పోస్టులు

రైల్‌ వికాస్‌ నిగమ్‌ లిమిటెడ్‌(ఆర్‌వీఎన్‌ఎల్‌) రెగ్యులర్‌ ప్రాతిపదికన సీనియర్‌ డిప్యూటీ జనరల్‌ మేనేజర్, మేనేజర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **పోస్టుల వివరాలు:** సీనియర్‌ డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌(ఫైనాన్స్‌)–2, మేనేజర్‌(ఫైనాన్స్‌)–3.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** సీనియర్‌ డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌కు 48 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు.
- **వేతనం:** నెలకు మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, సీనియర్‌ డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిస్పాచ్‌ సెక్షన్, గ్రౌండ్‌ ఫ్లోర్, అగస్ట్‌ క్రాంతి భవన్, బికాజి కామ ప్లేస్, ఆర్‌.కె.పురం, న్యూఢిల్లీ–110066 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 28.09.2025.
- **వెబ్‌సైట్‌:** https://rvnl.org

### ఎయిమ్స్‌ భువనేశ్వర్‌లో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టులు

ఆల్‌ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌ (ఎయిమ్స్‌), భువనేశ్వర్‌ తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **విభాగాలు:** మెడికల్‌ ఆంకాలజీ, సర్జికల్‌ ఆంకాలజీ, బర్న్స్‌ అండ్‌ ప్లాస్టిక్‌ సర్జరీ.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ, ఎండీ/ఎంఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.1,77,828.
- **వయసు:** 50 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 03.09.2025.
- **వెబ్‌సైట్‌:** https://aiimsbhubaneswar.nic.in

## లోకల్‌ బ్యాంక్‌ ఆఫీసర్‌ కొలువు

» పంజాబ్‌ అండ్‌ సింధ్‌ బ్యాంక్‌ నోటిఫికేషన్‌
» 750 లోకల్‌ బ్యాంక్‌ ఆఫీసర్‌ పోస్టుల భర్తీ
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
» తెలుగులో రాయడం, చదవడం, మాట్లాడాలి




**బ్యాంక్‌ ఉద్యోగమే లక్ష్యంగా డిగ్రీ పాసై ప్రిపేర్‌ అవుతున్న అభ్యర్థులకు శుభవార్త. మంచి వేతనంతో బ్యాంకింగ్‌ రంగంలో ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగార్థులకు సువర్ణావకాశం. దేశంలోని ప్రముఖ పబ్లిక్‌ సెక్టార్‌ బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్‌ అండ్‌ సింధ్‌ బ్యాంక్‌.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో 750 లోకల్‌ బ్యాంక్‌ ఆఫీసర్‌ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదలచేసింది. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు..**

పంజాబ్‌ అండ్, సింధ్‌ బ్యాంక్‌ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జూనియర్‌ మేనేజ్‌మెంట్‌ గ్రేడ్‌/స్కేల్‌–1(జేఎంజీఎస్‌–1) లోకల్‌ బ్యాంక్‌ ఆఫీసర్‌(ఎల్‌బీవో) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

#### రాష్ట్రాల వారీగా ఖాళీలు

తెలంగాణ–50, ఆంధ్రప్రదేశ్‌–80, కర్ణాటక–65, ఒడిశా–85, తమిళనాడు–85, పుదుచ్చేరి–05, ఛత్తీస్‌గఢ్‌–40, గుజరాత్‌–100, హిమాచల్‌ప్రదేశ్‌–30, జార్ఖండ్‌–35, పంజాబ్‌–60, అస్సాం–15, మహారాష్ట్ర–100 పోస్టులు.

#### అర్హత

గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పబ్లిక్‌ సెక్టార్‌ బ్యాంక్‌ లేదా రీజనల్‌ రూరల్‌ బ్యాంక్‌లో 18 నెలలు పనిచేసిన అనుభవం ఉండాలి.

#### వయసు

01.08.2025 నాటికి 20 నుంచి 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎక్స్‌ సర్వీస్‌మెన్‌ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు వయోసడలింపు ఉంటుంది.

#### వేతనం

ప్రారంభ వేతనం రూ.48,480. పే స్కేల్‌ రూ.48,480 నుంచి రూ.85,920 అదనంగా హెచ్‌ఆర్‌ఏ, డీఏ, మెడికల్, లీవ్‌ ట్రావెల్స్‌ అలవెన్స్‌ వంటి సదుపాయాలు లభిస్తాయి.

#### ఎంపిక విధానం

అభ్యర్థులను పలు దశలలో ఎంపికచేస్తారు. ఆన్‌లైన్‌ రాతపరీక్ష, పర్సనల్‌ ఇంటర్వ్యూ, ఫైనల్‌ మెరిట్‌ లిస్ట్, లోకల్‌ లాంగ్వేజ్‌ టెస్ట్‌(తమ ప్రాంత భాషపై అవగాహన పరీక్షిస్తారు) ఆధారంగా ఎంపికచేస్తారు. రాతపరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆన్‌లైన్‌ రాతపరీక్షకు 70%, పర్సనల్‌ ఇంటర్వ్యూకు 30% వెయిటేజీ కేటాయిస్తారు. తర్వాత ప్రాంతీయ భాషపై ఎంత పట్టు ఉందో పరీక్షిస్తారు. ఎంపికైన అభ్యర్థులు దేశవ్యాప్తంగా ఏ బ్రాంచ్‌లో పోస్టింగ్‌ ఇచ్చినా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలి.

#### పరీక్ష విధానం

మొత్తం 120 మార్కులకు 120 ప్రశ్నలతో పరీక్ష జరుగుతుంది. ఇంగ్లిష్‌ 30 ప్రశ్నలు– 30 మార్కులు, బ్యాంకింగ్‌ నాలెడ్జ్‌ 40 ప్రశ్నలు–40 మార్కులు, జనరల్‌ అవేర్‌నెస్‌/ఎకానమి 30 ప్రశ్నలు–30 మార్కులు, కంప్యూటర్‌ ఆప్టిట్యూడ్‌ 20 ప్రశ్నలు–20 మార్కుల సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌/హిందీలో ఉంటుంది.

### ప్రిపరేషన్‌ ఇలా

#### ఇంగ్లిష్‌ విభాగంలో స్కోర్‌ కోసం..

ఇడియమ్స్, సెంటెన్స్‌ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్‌ రీ అరేంజ్‌మెంట్, వన్‌ వర్డ్‌ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన పొందాలి. ఇంగ్లిష్‌ వొకాబ్యులరీపై నైపుణ్యం సాధించాలి. ఇంగ్లిష్‌ దినపత్రికలు చదవడం, వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణంపై దృష్టి పెట్టాలి.

#### బ్యాంకింగ్‌ నాలెడ్జ్‌ విభాగంలో..

బ్యాంకింగ్‌ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్‌ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్‌ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్‌ బ్యాంకు విధులపై అవగాహన ఏర్పరచుకోవాలి.

#### జనరల్‌ అవేర్‌నెస్‌/ఎకానమి విభాగంలో..

జనరల్‌ అవేర్‌నెస్‌లో కరెంట్‌ అఫైర్స్, స్టాక్‌ జనరల్‌ నాలెడ్జ్‌ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాల (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

#### కంప్యూటర్‌ ఆప్టిట్యూడ్‌ విభాగంలో..

కంప్యూటర్‌ ఆపరేషన్‌ సిస్టమ్స్, కంప్యూటర్‌ స్ట్రక్చర్, ఇంటర్నెట్‌ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్‌ షాట్‌ కట్స్, కంప్యూటర్‌ హార్డ్‌వేర్‌ సంబంధిత అంశాలు(సీపీయూ, మానిటర్,హార్డ్‌ డిస్క్‌ తదితర)గురించి తెలుసుకోవాలి.

#### దరఖాస్తు ఫీజు

జనరల్, ఓబీసీ,ఈడబ్ల్యూఎస్‌ అభ్యర్థులకు రూ.850.ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.100

#### దరఖాస్తు విధానం

అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ **https://punjabandsindbank.co.in/** లో దరఖాస్తు చేసుకోవాలి. రిక్రూట్‌మెంట్‌ సెక్షన్‌లోకి వెళ్లి **Local Bank Officer 2025 Notification** ఎంపికచేయాలి. కొత్తగా నమోదు చేసుకుని ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌ ఫారమ్‌ పూరించాలి. అవసరమైన డాక్యుమెంట్స్‌ (ఫోటో, సంతకం, సర్టిఫికేట్లు) అప్‌లోడ్‌ చేయాలి. తర్వాత ఫీజు ఆన్‌లైన్‌ ద్వారా చెల్లించాలి. సబ్‌మిట్‌ చేసిన తర్వాత అప్లికేషన్‌ ప్రింట్‌ అవుట్‌ తీసుకోవాలి.

#### ముఖ్యమైన సమాచారం

- ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది: 20.08.2025.
- ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది: 04.09.2025.
- ఆన్‌లైన్‌ పరీక్ష: అక్టోబర్‌ 2025.
- వెబ్‌సైట్‌: https://punjabandsindbank.co.in

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▽ 271 | నిఫ్టీ ▽ 74 |
| 79,810 | 24,427 |

| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 21,456 | ▽ | 249 |
| డోజోన్స్ | 45,545 | ▽ | 92 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 9,187 | ▽ | 29 |
| డాక్స్ | 23,902 | ▽ | 138 |
| షాంఘై | 3,858 | △ | 14 |
| నికాయ్ | 42,718 | ▽ | 110 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 86.35 | 89.35 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 116.28 | 12062 |
| € | యూరో | | 110.66 | 104.61 |
| ¥ | జపాన్ యెన్ (100) | | 48.00 | 70.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | | 55.19 | 59.03 |
| S$ | సింగపూర్ డాలర్ | | 66.29 | 70.00 |
| SAR | సౌదీ రియాల్ | | 22.63 | 24.13 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 23.12 | 23.14 |
| ¥ | చైనా యువాన్ | | 11.49 | 13.31 |

మల్టీ నేషనల్ బ్యాంక్ ఉద్యోగి ఒకరు తన ఆదాయపన్ను రిటర్నుల్లో వడ్డీ ఆదాయం కింద రూ.25,000 వచ్చినట్టు చూపించాడు. దీంతో ఆదాయపన్ను శాఖ మదింపు అధికారి (అసెసింగ్ ఆఫీసర్)కి సందేహం వచ్చి సంబంధిత ఐటీఆర్‌ను పరిశీలన కోసం తీసుకున్నారు. పన్ను చెల్లింపుదారు బ్యాంక్ లావాదేవీలను పరిశీలించగా, మరింత విలువైన సమాచారం లభించింది. దీంతో పెనాల్టీ విధించి, చెల్లించాలంటూ నోటీసు జారీ చేశారు.

ఒక వ్యాపారి స్థలం విక్రయించగా లాభం వచ్చింది. ఐటీఆర్‌లో వివరాలు వెల్లడించకుండా గోప్యంగా ఉంచాడు. ఎస్ఎఫ్‌టీ ద్వారా వచ్చిన సమాచారానికి, వ్యాపారి ఐటీఆర్‌లో వివరాలకు మధ్య తేడా ఉందని అసెసింగ్ ఆఫీసర్ గుర్తించారు. ఐటీఆర్ మదింపు అనంతరం, స్థలం విక్రయంపై మూలధన లాభాల పన్నుతోపాటు, పెనాల్టీ చెల్లించాలంటూ ఆదేశించారు. అంతేకాదు ఆదాయపన్ను చట్టం కింద చట్టపరమైన చర్యలు చేపట్టారు.

ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేయడమే కాదు.. చట్టంలోని నిబంధనలను అనుసరించి అన్ని ఆర్థిక వివరాలనూ వెల్లడించడం, పన్ను చెల్లించడం తప్పనిసరి. చెప్పకపోతే పన్ను అధికారులకు తెలియదులే! అన్న నిర్లక్ష్యం పనికిరాదు. అన్ని ముఖ్యమైన ఆర్థిక లావాదేవీల సమాచారం ఐటీ శాఖ గుప్పిట్లో ఉంటుంది. ఖరీదైన కొనుగోళ్లు, క్రెడిట్ కార్డు రుణాలు, ప్రాపర్టీ లావాదేవీలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, క్రిప్టోల్లో పెట్టుబడుల సమాచారం ఆదాయ పన్ను శాఖకు చేరుతుంది. ఏ చిన్న అంతరం ఉన్నా ఏఐ సాయంతో పన్ను అధికారులు సులభంగా గుర్తిస్తున్నారు. కనుక పన్ను చెల్లించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోవడం కష్టమే..!

\- సాక్షి, బిజినెస్ డెస్క్

# ప్రతీ లావాదేవీపై 'ఐ'టీ!

పెద్ద మొత్తంలో పెట్టుబడులు, భారీ నగదు జమలు ● ప్రాపర్టీ లావాదేవీల సమాచారం ఎస్ఎఫ్‌టీ రూపంలో ఐటీ శాఖకు చేరతాయ్ ● ఐటీఆర్‌లో వెల్లడించకపోతే నోటీసులు
పన్ను ఎగ్గొడితే భారీ జరిమానా, జైలు శిక్షలు ● ఏఐఎస్, ఫామ్ 26ఏఎస్ పరిశీలన తర్వాతే రిటర్నులు
2024-25 ఏడాదికి రిటర్నుల గడువు తేదీ సెప్టెంబర్ 15




అన్ని బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు, తపాలా శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ తదితర రిపోర్టింగ్ ఎంటీటీలు (ఆర్‌ఈలు) ఆదాయపన్ను శాఖ వద్ద 'స్పెసిఫైడ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్'ను (ఎస్ఎఫ్‌టీ) ఏటా దాఖలు చేయాల్సి ఉంటుంది. ప్రతీ పాన్‌పై చేసిన నిర్దేశిత ఆర్థిక లావాదేవీల వివరాలను ఎస్ఎఫ్‌టీలో వెల్లడించాలి. పన్ను ఎగవేతలను నివారించేందుకు ఆదాయపన్ను శాఖ ఎస్ఎఫ్‌టీలను పరిశీలిస్తుంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి తన వార్షిక ఆదాయం రూ.4.5 లక్షలేనంటూ సెక్షన్ 87ఏ కింద రిబేటును వినియోగించుకుని ఎలాంటి పన్ను లేకుండా రిటర్నులు దాఖలు చేశాడని అనుకుందాం. కానీ, అదే వ్యక్తి రూ.5 లక్షలు విలువ చేసే బంగారం కొనుగోలు చేసి ఉంటే ఆదాయపన్ను శాఖ వద్దనున్న రికార్డులు ఆ విషయాన్ని లేవనెత్తుతాయి. దాంతో వారి ఐటీఆర్‌లు స్క్రూటినీ (పరిశీలన)కి వెళతాయి. తనకు ఆదాయం రూ.6 లక్షలుగానే చూపించొచ్చు. తీరా చూస్తే బ్యాంక్ నుంచి ఉపసంహరణలు లేకపోవచ్చు. అలాంటప్పుడు ఆ వ్యక్తి జీవన అవసరాలకు కావాల్సిన సొమ్ము ఎక్కడి నుంచి వచ్చింది? ఇలాంటివన్నీ ఆదాయ పన్ను శాఖ అధికారులు సులభంగా పసిగట్టగలరు. కనుక ఎస్ఎఫ్‌టీ గురించి, ఏఐఎస్ గురించి ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాలి.

**ప్రతి సమాచారం రికార్డు అవుతుంది..**

స్పెసిఫైడ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ (ఎస్ఎఫ్‌టీ) ద్వారా బ్యాంక్‌లు, మ్యూచువల్ ఫండ్స్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తదితర సంస్థలు అందించే సమాచారం.. పాన్ నంబర్ వారీగా వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)లో నమోదవుతుంది. అన్ని ముఖ్య ఆర్థిక లావాదేవీల వివరాలు ప్రతీ పన్ను చెల్లింపుదారుడి ఏఐఎస్‌లో ఆటోమేటిక్‌గా రికార్డు అవుతాయని సింఘానియా అండ్ కో పార్ట్‌నర్ రికిత నయ్యర్ వెల్లడించారు. కనుక ఏఐఎస్‌ను ఒక్కసారి పరిశీలించుకున్న తర్వాత ఐటీఆర్ దాఖలు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల కచ్చితమైన సమాచారంతో ఐటీఆర్ నమోదు చేయడం సాధ్యపడుతుందని, తద్వారా ఐటీఆర్ వేగంగా ప్రాసెస్ అవుతుందని చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2024-25) పన్ను రిటర్నుల సమర్పణకు పొడిగించిన గడువు సెప్టెంబర్ 15వ తేదీతో ముగియనుంది.

### ఎస్ఎఫ్‌టీల్లోకి చేరే లావాదేవీలు..

- ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు అంతకుమించిన విలువపై బ్యాంక్ డ్రాఫ్టులు/ పే ఆర్డర్లు / బ్యాంకర్ చెక్కులకు నగదు చెల్లింపులు.
- బ్యాంక్‌లు, కోపరేటివ్ బ్యాంకుల నుంచి ప్రీ-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లను రూ.10 లక్షలు అంతకుమించి నగదు చెల్లించి కొనుగోలు చేయడం.
- ఒక వ్యక్తి కరెంట్ ఖాతాలో నగదు జమలు రూ.50 లక్షలు అంతకుమించి చేసినప్పుడు.
- ఒక వ్యక్తి కరెంట్ ఖాతా నుంచి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50 లక్షలు, అంతకుమించి నగదు ఉపసంహరణలు.
- కరెంట్, టైమ్ డిపాజిట్ కాకుండా ఇతర బ్యాంక్ ఖాతాల్లో ఒక వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు అంతకుమించి నగదు జమ చేయడం.
- వస్తువు లేదా సేవా విక్రయంపై ఒక వ్యక్తి రూ.2 లక్షలకు మించి నగదు చెల్లించడం. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 44ఏఈబీ కిందకు ట్యాక్స్ ఆడిట్ అవసరమైన వారికే ఈ నిబంధన
- ఒకటి లేదా ఒకటికి మించిన క్రెడిట్ కార్డులకు ఒక ఆర్థిక సంవత్సరంలో నగదు చెల్లింపులు రూ.లక్ష అంతకుమించి ఉంటే
- ఒకటి లేదా అంతకు మించిన క్రెడిట్ కార్డులకు డిజిటల్ చెల్లింపుల మొత్తం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు, అంతకు మించితే.
- ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు అంతకుమించిన మొత్తంతో టైమ్ డిపాజిట్ (రెన్యువల్ కాకుండా) చేయడం.
- బాండ్లు లేదా డిబెంచర్లపై మొత్తం మీద (ఒకటికి మించిన లావాదేవీలు కూడా) ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు అంతకుమించి ఇన్వెస్ట్ చేయడం.
- షేర్ల కొనుగోలు విలువ ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు (ఒక్క లావాదేవీ లేదా ఒకటికి మించిన లావాదేవీల మొత్తం), అంతకుమించినప్పుడు ఎస్ఎఫ్‌టీ ద్వారా బ్రోకర్లు ఐటీ శాఖకు ఫైల్ చేయాల్సిందే.
- షేర్ల బైబ్యాక్‌లో పాల్గొని విక్రయించిన మొత్తం రూ.10 లక్షలు అంతకుమించిన సందర్భాల్లో.
- మ్యూచువల్ ఫండ్స్‌లో యూనిట్లపై పెట్టుబడి రూ.10 లక్షలు అంతకుమించిన సందర్భాల్లో.
- స్థిరాస్తి కొనుగోలు లేదా విక్రయం విలువ (రిజిస్ట్రేషన్ వ్యాల్యూ/ప్రభుత్వ మార్కెట్ విలువ లేదా రికార్డు అయిన అసలు కొనుగోలు/విక్రయం విలువ) రూ.30 లక్షలు అంతకుమించిన సందర్భాల్లో రిజిస్ట్రార్ లేదా సబ్ రిజిస్ట్రార్ నివేదించాల్సి ఉంటుంది.
- ఫారీన్ కరెన్సీ కోసం రూ.10 లక్షలు అంతకుమించిన చెల్లింపులు చేసినప్పుడు.
- క్రెడిట్ లేదా డెబిట్ కార్డు లేదా ట్రావెలర్స్ చెక్కు లేదా డ్రాఫ్ట్ రూపంలో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు అంతకుమించి ఖర్చు చేసిన సందర్భాల్లో సమాచారం ఎస్ఎఫ్‌టీ రూపంలో ఐటీ శాఖకు వెళుతుంది.

ఇక్కడ చెప్పిన పరిమితులన్నీ ఒక ఆర్థిక సంవత్సరం మొత్తానికి కలిపి అమలవుతాయి. రిపోర్టింగ్ ఎంటిటీలు (బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు, మ్యూచువల్ ఫండ్స్ ట్రస్టీలు లేదా మ్యూచువల్ ఫండ్స్ రిజిస్ట్రార్ అండ్ షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్, రిజిస్ట్రార్ కార్యాలయాలు తదితర) ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత మే 31లోపు ఎస్ఎఫ్‌టీలను నమోదు చేయాల్సిందే.

\- సంజోలి మహేశ్వరి, నాంజియా అండ్ కో ఎల్ఎల్‌పీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు.

## ఐటీఆర్‌లో వెల్లడించకపోతే ఏమవుతుంది?

''పన్ను చెల్లింపుదారు ఆదాయపన్ను రిటర్నుల్లో (ఐటీఆర్) కీలక లావాదేవీల సమాచారాన్ని వెల్లడించనప్పుడు లేదా ఎస్ఎఫ్‌టీ, ఏఐఎస్‌లోని సమాచారంతో, ఐటీఆర్‌లోని వివరాలు సరిపోలనప్పుడు తదుపరి పలు పరిణామాలకు దారితీయవచ్చు'' అని సంజోలి మహేశ్వరి తెలిపారు.

**నోటీసులు:** ఏఐఎస్‌లో నమోదైన అధిక విలువ కలిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వివరణ కోరుతూ ఆదాయపన్ను శాఖ నోటీసు జారీ చేస్తుంది. ఐటీఆర్‌లో వెల్లడించిన లావాదేవీలు సరిగ్గానే ఉన్నాయా? అంటూ ధ్రువీకరించాలని కోరుతుంది. పూర్తి వివరాలు వెల్లడించకపోవడం లేదంటే పాక్షిక వివరాలతో సరిపెట్టినట్టయితే సవరించిన ఐటీఆర్‌లు దాఖలు చేయాలని కోరుతుంది.

**పరిశీలన:** ఐటీఆర్‌లో వెల్లడించిన ఆదాయానికి, ఎస్ఎఫ్‌టీలో లావాదేవీల సమాచారానికి మధ్య పొంతన లేనప్పుడు లేదా అసలు ఐటీఆర్ దాఖలు చేయనప్పుడు లేదంటే నోటీసుకు స్పందించనప్పుడు లేదా నోటీసుకు సరైన సమాధానం ఇవ్వనప్పుడు సంబంధిత పన్ను చెల్లింపుదారుడి ఐటీఆర్‌ను పూర్తి స్థాయి పరిశీలనను అసెసింగ్ ఆఫీసర్ చేపడతారు. నోటీసు జారీ చేసి సరైన సమాచారంతో రిటర్నులు దాఖలు చేయాలని పన్ను అధికారి కోరొచ్చు.




**పెనాల్టీలు:** నిబంధనల ప్రకారం ఐటీఆర్‌లు దాఖలు చేయకపోవడం లేదా పన్ను చెల్లించనట్టయితే.. జరిమానాతో సహా చెల్లించాలని ఆదేశాలు జారీ చేస్తారు. ఈ పెనాల్టీ అసలు పన్నుకు 50 శాతం నుంచి 200 శాతం వరకు ఉంటుంది. అంతేకాదు చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు. ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగ్గొట్టినట్టు గుర్తిస్తే జరిమానాకు అదనంగా జైలు శిక్ష కూడా పడుతుందని మహేశ్వరి తెలిపారు. ఎగవేసిన మొత్తం రూ.25 లక్షలకు పైన ఉంటే 6 నెలల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా చెల్లించాల్సి వస్తుందని.. తప్పుడు వివరాలతో లేదా వివరాలను రహస్యంగా ఉంచి వెల్లడించని సందర్భాల్లో 3 నెలల నుంచి 2 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించొచ్చని చెప్పారు. అయితే, నోటీసులకు సకాలంలో స్పందించి, వాస్తవ సమాచారంతో ఐటీఆర్‌లు దాఖలు చేసి, పన్ను చెల్లించడం ద్వారా ఈ ఇబ్బందులను అధిగమించొచ్చు.

## వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)

వేతనాలు, వడ్డీ ఆదాయం, డివిడెండ్‌లు, ఇల్లు/ప్లాంట్లు/మెషినరీలపై అద్దె ఆదాయం తదితర లావాదేవీల వివరాలతోపాటు.. టీడీఎస్, టీసీఎస్, జీఎస్‌టీ ఇతర పన్ను సంబంధిత వివరాలు, రెమిటెన్స్‌లు (విదేశీ చెల్లింపులు/స్వీకరణలు), షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, బాండ్లలో పెట్టుబడులు/ఉపసంహరణలు, ఆఫ్ మార్కెట్ కొనుగోళ్లు/విక్రయాలు, ప్రాపర్టీల క్రయ/విక్రయాలు ఇలా సమగ్ర సమాచార నివేదికగా ఏఐఎస్ ఉంటుంది. అంతేకాదు బంగారం, కార్లు తదితర అధిక విలువ కొనుగోళ్లు, కమీషన్ల ఆదాయం, విదేశీ పర్యటనలపై అధిక వ్యయాలు, జీవిత బీమా పాలసీల నుంచి అందుకున్న మొత్తం, లాటరీ/బెట్టింగ్‌ల్లో గెలుచుకుంటే, ఆయా వివరాలు కూడా ఇందులోకి చేరతాయి. దీన్ని రిటర్నుల దాఖలుకు ముందు ఒకసారి పరిశీలించుకుని, అందులోని వివరాలు/లావాదేవీలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిపై తమ అభిప్రాయాలను ఆదాయ పన్ను శాఖకు నివేదించొచ్చు. ఉదాహరణకు ఏదైనా పెట్టుబడి విషయంలో అసలు కంటే అధిక మొత్తం ఉన్నట్టు గుర్తించినట్టయితే ఇదే విషయాన్ని ఆదాయపన్ను శాఖ దృష్టికి తీసుకెళ్లొచ్చు. దాంతో అది సవరణకు గురవుతుంది. పన్ను చెల్లింపుదారుడికి సంబంధించి సమగ్రమైన ఆర్థిక సమాచార నివేదిక ఇది. పూర్తిగా పరిశీలించుకుని, నిబంధనల ప్రకారం ఆ వివరాలను ఐటీఆర్‌లో స్వచ్ఛందంగా వెల్లడించే దిశగా పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడమే దీని ఉద్దేశం.




### ఫారమ్ 26ఏఎస్

ఫారమ్ 26ఏఎస్ అన్నది పన్ను చెల్లింపుదారుడి ఆదాయంపై మినహాయించిన టీడీఎస్, వ్యయాలపై వసూలు చేసిన టీసీఎస్, ప్రాపర్టీ క్రయ/విక్రయాల వివరాలతో ఉంటుంది. ఏఐఎస్, ఫారమ్ 26ఏఎస్‌ను ఆదాయపన్ను ఈ-ఫైలింగ్ పోర్టల్ నుంచి పొందొచ్చు.

## వా టెక్ వాబాగ్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ. 1,458 **టార్గెట్:** రూ. 1,900

**ఎందుకంటే:** ప్రోత్సాహకర ఔట్‌లుక్ కారణంగా వాటర్ ప్రాజెక్టుల ఇంజినీరింగ్ దిగ్గజం వా టెక్ వాబాగ్‌కు రూ. 1,900 టార్గెట్ ధరతో కొనుగోలు రేటింగ్‌ను ప్రకటిస్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఆర్జనకు 26 రెట్లు అధిక పీఈతో టార్గెట్ ధరను నిర్ణయించాం. నిజానికి ఈ కౌంటర్ చరిత్రాత్మక సగటు పీఈ 18 మాత్రమే అయినప్పటికీ మెరుగుపడిన ఔట్‌లుక్‌ను పరిగణనలోకి తీసుకున్నాం. ఇందుకు పటిష్ట ఆర్డర్‌బుక్, బలపడుతున్న మార్జిన్లు, ఆకర్షణీయ రిటర్న్ రేషియోలు, అత్యుత్తమ నగదు సాధన(ఫ్రీ క్యాష్ ఫ్లో) తోడ్పాటునిస్తున్నాయి. దీంతో ఆర్థికంగా పటిష్ట నగదు నిల్వలు(క్యాష్‌రిచ్) కలిగిన కంపెనీగా నిలుస్తోంది. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో అతిపెద్ద కీలక ప్రాజెక్టులను ఎగ్జిక్యూట్ చేయడంలో కంపెనీకున్న అర్హతలు కంపెనీకి ప్రత్యేకతను కల్పిస్తున్నాయి. ప్రధానంగా మార్జిన్లు, క్యాష్ ఫ్లోకు ప్రాధాన్యతనిస్తూ ఎంపిక చేసిన ప్రాజెక్టులకే పోటీ పడుతోంది. తద్వారా 25-30 శాతం బిడ్డింగ్‌లను గెలుపొందుతోంది. గత కొన్నేళ్ల(2021-25) కాలాన్ని లెక్కలోకి తీసుకుంటే ఆదాయంలో 4 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా)లో 18 శాతం, నికర లాభాల్లో 28 శాతం వృద్ధిని అందుకోవడం దీన్ని ప్రతిబింబిస్తోంది. వెరసి కార్యకలాపాలలో మార్జిన్లు, నగదు ఆర్జనపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఈ బాటలో రానున్న కాలం(2025-28)లో మరింత అత్యుత్తమ పనితీరు ప్రదర్శించే వీలుంది. వార్షికంగా ఆదాయంలో 17 శాతం, ఇబిటాలో 18 శాతం, నికర లాభాల్లో 28 శాతం పురోగతిని సాధించే అవకాశముంది. గతేడాది(2024-25) ఆదాయంతో పోలిస్తే ప్రస్తుత ఆర్డర్‌బుక్ విలువ రూ. 13,700 కోట్లు నాలుగు రెట్లు అధికం. రూ. 20,000 కోట్ల విలువైన బిడ్స్‌కు పోటీపడుతున్న నేపథ్యంలో రానున్న మూడు, నాలుగేళ్లలో ఆదాయంలో 15-20% వృద్ధిని అందుకునే వీలుంది.



## ఫైన్ ఆర్గానిక్ ఇండస్ట్రీస్ | బ్రోకరేజ్: ఆనంద్ రాఠీ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ. 4,693 **టార్గెట్:** రూ. 6,400

**ఎందుకంటే:** స్పెషాలిటీ కెమికల్స్ దిగ్గజం ఫైన్ ఆర్గానిక్ ఇండస్ట్రీస్‌కు పూర్తి(100 శాతం) అనుబంధ సంస్థ అయిన ఫైన్ ఆర్గానిక్ అమెరికాస్ యూఎస్‌లోని సౌత్ కరోలినాలో 160 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. తద్వారా పూర్తిస్థాయి తయారీ ప్లాంటును ఏర్పాటు చేయాలని ప్రణాళికలు వేసింది. ఈ విస్తరణ కారణంగా యూఎస్‌లో కార్యకలాపాలు పటిష్టం చేసుకోవాలని భావిస్తోంది. ప్రస్తుత క్లయింట్లకు మరిన్ని సర్వీసులను అందించడంతోపాటు.. కొత్త వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోనుంది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)వరకూ అమ్మకాల పరిమాణం బలపడకపోవచ్చని అంచనాలున్నప్పటికీ ఎగుమతుల కోసం రూ. 750 కోట్లతో మహారాష్ట్రలో నెలకొల్పుతున్న సెజ్‌తోపాటు.. యూఎస్ సామర్థ్యం అందుబాటులోకి వస్తే ఆదాయం జోరందుకునే అవకాశముంది. అయితే యూఎస్ ప్లాంటు ఏర్పాటుపై ఎంతమేర పెట్టుబడులు వెచ్చించనున్నదీ కంపెనీ యాజమాన్యం వెల్లడించనప్పటికీ చెప్పుకోదగ్గ స్థాయిలో నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతమున్న మొత్తం యూనిట్లతో పోలిస్తే యూఎస్‌లో కొనుగోలు చేసిన భూమి 5 రెట్లు అధికంకావడం ఈ అంచనాలకు బలాన్నిస్తోంది. కాగా.. ఈ ప్లాంటును దశలవారీగా అభివృద్ధి చేసే అవకాశముంది. అయితే భారీస్థాయిలో తెరతీసే అవకాశమున్న ఈ ప్లాంటు ద్వారా కంపెనీ అమ్మకాలు మరింత జంప్ చేయనున్నట్లు భావిస్తున్నాం. ఇది దీర్ఘకాలంలో వృద్ధికి ఊతమివ్వనుంది. కంపెనీ భవిష్యత్ అవకాశాలు, పటిష్ట వ్యూహాత్మక చర్యలు, సెజ్‌సహా.. యూఎస్‌లో విస్తరణ తదితర అంశాలు కంపెనీ ఆర్జనకు జోష్‌నివ్వనున్నట్లు అంచనా వేస్తున్నాం. అ యితే జేఎన్‌పీఏ సెజ్ సమయానుగుణ ఎగ్జిక్యూషన్, యూఎస్ ప్లాంట్ విస్తరణ, ముడిసరుకుల ధరలు వంటి అంశాలు కీలక రిస్కులుగా పేర్కొనవచ్చు.



**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
జీఎస్‌టీ కౌన్సిల్‌పైనే కళ్లన్నీ | టాటా క్యాపిటల్ 2 బిలియన్ డాలర్ల ఐపీవో 22న

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 1-9-2025 | |
|---|---|
| విశాఖ | 565-00 |
| చిత్తూరు | 578-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 560-00 |
| విజయవాడ | 560-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 525-00 |
| వరంగల్ | 527-00 |
| రిటైల్ ధర | 5.85 |

**ఫండ్ ఆఫర్స్**

## బరోడా బిజినెస్ కాంగ్లోమెరేట్స్ ఫండ్

ప్రముఖ వ్యాపార సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దేశ వృద్ధి పథంలో భాగం కావాలనుకునే ఇన్వెస్టర్లను ఉద్దేశించి బరోడా బీఎన్‌పీ పారిబా మ్యూచువల్ ఫండ్.. బరోడా బిజినెస్ కాంగ్లోమెరేట్స్ ఫండ్‌ను ప్రారంభించింది. పలు రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కంపెనీల్లో ఈ పథకం పెట్టుబడులు పెడుతుంది. పెట్టుబడులకు రంగాల వారీ వైవిధ్యాన్ని పాటిస్తుంది. మొత్తం పెట్టుబడుల్లో 80 శాతాన్ని దేశీ దిగ్గజ కంపెనీలకే కేటాయిస్తుంది. స్థిరమైన వృద్ధి, ఆవిష్కరణలతో ముందుకు వెళ్లే వాటికి ప్రాధాన్యం ఇస్తుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, శుద్ధ ఇంధనాలు, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు తదితర రంగాల్లో ఎక్స్‌పోజర్ తీసుకుంటుంది. కనీసం నాలుగు వ్యాపార గ్రూపులను తక్కువ కాకుండా ఎంపిక చేసుకుంటుంది. సెప్టెంబర్ 2న ఈ పథకం పెట్టుబడులకు అందుబాటులోకి వస్తుంది. అదే నెల 15వ తేదీతో న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) ముగుస్తుంది.




## బంధన్ బీఎస్ఈ ఇండియా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్ 'బంధన్ బీఎస్ఈ ఇండియా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్' పేరుతో నూతన ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. సెప్టెంబర్ 3 నుంచి పెట్టుబడులను స్వీకరించనుంది. ఈ నెల 17వ తేదీ వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. బీఎస్ఈ ఇండియా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్‌లోని కంపెనీల్లో వెయిటేజీ ఆధారంగా ఈ పథకం పెట్టుబడులు పెడుతుంది. ప్యాసివ్ ఫండ్ కావడంతో సూచీ పోర్ట్‌ఫోలియో, రాబడులను ప్రతిఫలిస్తుంది. ఇండెక్స్‌లో మార్పులకు అనుగుణంగా తన పోర్ట్‌ఫోలియోని సైతం క్రమానుగతంగా మార్పులు చేస్తుంటుంది. ఈ పథకంలో సిప్ రూపంలో అయితే కనీసం రూ.100, లంప్‌సమ్ రూపంలో అయితే రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.




# పెట్టుబడులకు వైవిధ్యం అవసరం

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**నాకు రూ.4 లక్షలకు బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉంది. అదే బీమా సంస్థ నుంచి రూ.6 లక్షలకు సూపర్ టాపప్ ప్లాన్ కూడా ఉంది. ఇప్పుడు రూ.10 లక్షల డిడక్టబుల్‌తో రూ.40 లక్షల సూపర్ టాపప్ ప్లాన్‌ను మరో బీమా సంస్థ ఆఫర్ చేస్తోంది. తీసుకోవచ్చా?** – షావలి

టాపప్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ అనేది డిడక్టబుల్‌కు పైన ఉన్న మొత్తానికి బీమా కవరేజీని ఇస్తుంది. డిడక్టబుల్ అంటే, మొత్తం బిల్లులో అంతకు మించిన క్లెయిమ్‌కే చెల్లింపులు లభిస్తాయి. డిడక్టబుల్ మేర పాలసీదారు భరించాల్సి ఉంటుంది. సూపర్ టాపప్ ప్లాన్ తీసుకునేందుకు బేసిక్ కవరేజీ ఉండాల్సిన అవసరం లేదు. టాపప్ ప్లాన్‌లో డిడక్టబుల్ అనేది హాస్పిటల్‌లో చేరిన ప్రతి సందర్భంలోనూ అమలవుతుంది. అదే సూపర్ టాపప్ ప్లాన్‌లో ఒక ఏడాది మొత్తం మీద అయిన హాస్పిటల్ ఖర్చులకు డిడక్టబుల్ అమలవుతుంది. కనుక టాపప్ ప్లాన్లతో పోలిస్తే సూపర్ టాపప్ ప్లాన్ మరింత ప్రయోజనకరం. ఒకే సమయంలో రెండు సూపర్ టాపప్ ప్లాన్లను కలిగి ఉండే విషయంలో ఎలాంటి నియంత్రణలు లేవు. ప్రస్తుతం ఉన్న ప్లాన్‌లో లేని మెరుగైన సదుపాయాలను కొత్త సూపర్ టాపప్ ప్లాన్ ఆఫర్ చేస్తుంటే నిస్సందేహంగా తీసుకోవచ్చు. బేసిక్ పాలసీలో లేని రక్షణను సూపర్ టాపప్ ప్లాన్ ఇస్తుంటే తీసుకోవచ్చు. ఉదాహరణకు మీ ఆస్పత్రి బిల్లు రూ.18 లక్షలు అయిందనుకోండి. అప్పుడు బేసిక్ పాలసీ నుంచి రూ.4 లక్షలు, మొదటి సూపర్ టాపప్ నుంచి రూ.6 లక్షలు చెల్లింపులు లభిస్తాయి. అప్పుడు మరో రూ.8 లక్షలు మిగిలి ఉంటుంది. రెండో సూపర్ టాపప్ ప్లాన్ నుంచి రూ.8 లక్షలు క్లెయిమ్ చేసుకోవచ్చు. అయితే, ఎక్కువ సూపర్ టాపప్ ప్లాన్లు ఉంటే బీమా క్లెయిమ్ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుంది. ఒకటికి మించిన సంస్థల వద్ద క్లెయిమ్ దాఖలుకు శ్రమించాల్సి వస్తుంది. బేసిక్ పాలసీకి అదనంగా ఒక్క సూపర్ టాపప్ ప్లాన్‌ను కలిగి ఉండడమే సౌకర్యం.




**బంగారం, వెండి, ఈక్విటీలు, డెట్, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే మల్టీ అస్సెట్ ఫండ్స్‌తో ప్రయోజనాలు ఏమిటి?** – నగేష్ బంగారు

మల్టీ అస్సెట్ ఫండ్స్ కనీసం మూడు రకాల సాధనాల్లో (సాధారణంగా ఈక్విటీ, డెట్, గోల్డ్) పెట్టుబడులు పెడుతుంటాయి. ఈక్విటీ మార్కెట్ అస్థిరతల నేపథ్యంలో పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవాలి. 2008 నుంచి సెన్సెక్స్ పది దారుణ పతనాలను గమనించండి. ఆ సమయంలో ఈక్విటీలు ఒక నెలలో 22.5 శాతం మేర నష్టపోయాయి. అదే సమయంలో బంగారం ధరలు కూడా తగ్గాయి. కాకపోతే ఈక్విటీలతో పోల్చి చూస్తే బంగారంలో క్షీణత తక్కువ. పెట్టుబడుల విలువను రక్షించే స్థాయిలో ఈ వ్యత్యాసం లేదు. 2008, 2024 సంవత్సరాలు ఇందుకు మినహాయింపు. అప్పుడు ఈక్విటీలతో పోల్చితే బంగారం మెరుగ్గా పనిచేసింది. దీర్ఘకాలంలో ఈక్విటీలంత కాకపోయినా, కొంత వ్యత్యాసంతో బంగారం సైతం మెరుగైన రాబడులను ఇచ్చింది. కనుక మెరుగైన రాబడుల కోణంలో కాకుండా వైవిధ్యం కోసం మల్టీ అస్సెట్ ఫండ్స్‌లో కొంత మొత్తం ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

# 'ప్రొఫైల్' నకిలీ.. 'సైబర్' మకిలి

నకిలీ ప్రొఫైల్, సైబర్ వేధింపులు, ప్రొఫైల్ హ్యాకింగ్.. తీరు ఏదైనా సైబర్ నేరాల సంఖ్య భారత్‌లో ఏటా పెరుగుతూనే ఉంది. జనం డిజిటల్‌కు పెద్ద ఎత్తున మళ్లుతుండడం, అదే సమయంలో పూర్తిగా అవగాహన ఉండకపోవడం.. సైబర్ నేరగాళ్లకు కలిసి వస్తున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల వేదికగా నకిలీ ఆన్‌లైన్ ఖాతాలు తెరిచి చేస్తున్న మోసాలే ఎక్కువగా ఉంటున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



- ఆన్‌లైన్ మోసాల్లో ఇలాంటివే ఎక్కువ
- సైబర్ వేధింపులు, ప్రొఫైల్ హ్యాకింగ్ కూడా
- నాలుగేళ్లలో మూడురెట్లు పెరిగిన ఫిర్యాదులు
- ఎన్‌సీఆర్‌పీలో వెల్లువెత్తుతున్న కంప్లయింట్స్

ఇతర వ్యక్తులు, బ్రాండ్, సంస్థలా కనిపించడానికి నకిలీ ఆన్ లైన్ ఖాతా తెరిచి చేస్తున్న మోసాలు దేశంలో అధికంగా ఉంటున్నాయి. అక్రమంగా డబ్బు సంపాదించే లక్ష్యంతో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వివరాలను ఉపయోగించి సైబర్ నేరస్తులు ఇతరులను మోసం చేస్తున్నారు. గతేడాది ఇలాంటి ఘటనలు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఛిyటఛిటజీఝ్ఛ.జౌఠి.జీ) ద్వారా 39,846 నమోదయ్యాయి. నాలుగేళ్లలో ఈ తరహా మోసాలు మూడు రెట్లు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్‌సీఆర్‌పీ వేదిక ద్వారా సైబర్ వేధింపుల ఫిర్యాదులు మూడున్నర రెట్లు పెరిగి 39,077కు చేరాయి. ప్రొఫైల్ హ్యాకింగ్, గుర్తింపు చోరీ ఘటనలు మూడింతలకుపైగా అధికమై 38,295కు పెరిగాయి. ఆన్‌లైన్ జాబ్, మ్యాట్రిమోనియల్ మోసాలు కూడా పెరుగుతూ ఉన్నాయి.

## కేసులు ఎన్నోరెట్లు..

అధికారిక లెక్కల ప్రకారం గతేడాది దేశవ్యాప్తంగా 22 లక్షలకుపైగా సైబర్ సెక్యూరిటీ ఘటనలు నమోదు కావడం ఆందోళన కలిగించే అంశం. ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల ద్వారా మోసాలు 2020తో పోలిస్తే 2024 నాటికి దాదాపు మూడింతలయ్యాయి. మహిళలు, పిల్లలపై జరుగుతున్న సైబర్ నేరాల సంఖ్య రెండింతలకుపైగా పెరిగి గత ఏడాది 48,475కు చేరాయి. సైబర్ నేరస్తులు ఇతర దేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు వారు ఉపయోగించిన ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్‌లను బట్టి తెలుస్తోంది. సైబర్ క్రిమినల్స్ చాలా సందర్భాల్లో తప్పుడు లొకేషన్ , గుర్తింపుతో తప్పుదోవ పట్టిస్తున్నట్టు హోం మంత్రిత్వ శాఖ వర్గాలు గుర్తించాయి.

### కేటాయింపులు మూడింతలు..

పౌరులు, వ్యాపారాలు, ప్రభుత్వానికి సురక్షిత సైబర్‌స్పేస్‌ను నిర్మించడానికి నేషనల్ సైబర్ సెక్యూరిటీ పాలసీ (ఎన్‌సీఎస్‌పీ)ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే దేశంలోని సైబర్‌స్పేస్‌ను జల్లెడ పట్టేందుకు, సైబర్ భద్రతా ముప్పులను గుర్తించడానికి నేషనల్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీసీసీ) ఏర్పాటు చేసింది. డేటా సంరక్షణ కోసం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం–2023 తీసుకొచ్చింది. ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖ సైబర్ సెక్యూరిటీ మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులు 5 ఏళ్లలో మూడింతలకుపైగా పెరగడం గమనార్హం.

### మొత్తం సైబర్ నేరాలు

నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో నమోదైనవి

| | |
|---|---|
| 2021 | 4,52,429 |
| 2022 | 10,29,026 |
| 2023 | 15,96,493 |
| 2024 | 22,68,346 |
| 2025 | 12,47,393 |

(జూన్ 30 వరకు)

### 'ఆర్థిక' నేరాలు

| సంవత్సరం | ఫిర్యాదుల సంఖ్య (లక్షల్లో) |
|---|---|
| 2023 | 13.10 |
| 2024 | 19.19 |

### విచారణ నత్తనడక

| సంవత్సరం | మొత్తం కేసులు | చార్జీషీట్లు దాఖలైనవి | విచారణ పూరి | శిక్షపడ్డవి |
|---|---|---|---|---|
| 2020 | 50,035 | 14,176 | 1,626 | 1,110 |
| 2021 | 52,974 | 18,744 | 1,155 | 491 |
| 2022 | 65,893 | 18,925 | 2,402 | 1,118 |

### సైబర్ ఘటనలు

టాప్ - 5 రాష్ట్రాలు (తెలుగు రాష్ట్రాలు సహా)

| రాష్ట్రం | 2024 | 2025 |
|---|---|---|
| మహారాష్ట్ర | 3.03 లక్షలు | 1.60 లక్షలు |
| యూపీ | 3.01లక్షలు | 1.48 లక్షలు |
| కర్ణాటక | 1.69 లక్షలు | 1.03 లక్షలు |
| ఆంధ్రప్రదేశ్ | 75,781 | 32,062 |
| తెలంగాణ | 1.23 లక్షలు | 58,176 |

### నయా మోసాలు

ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్నవి

| సంవత్సరం | ఘటనల సంఖ్య |
|---|---|
| 2020 | 56,283 |
| 2021 | 72,301 |
| 2022 | 1,31,634 |
| 2023 | 1,41,264 |
| 2024 | 1,56,938 |

### 'సైబర్'కు నిధుల కవచం

సైబర్ సెక్యూరిటీ మౌలిక వసతులకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

| | |
|---|---|
| 2020-21 | 293 |
| 2021-22 | 411 |
| 2022-23 | 462 |
| 2023-24 | 580 |
| 2024-25 | 1,004 |

### ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న మోసాల్లో ప్రధానమైనవి

- నకిలీ ఆన్‌లైన్ ఖాతా
- సైబర్ వేధింపులు
- ప్రొఫైల్ హ్యాకింగ్, గుర్తింపు చోరీ
- వేషధారణ ద్వారా మోసాలు
- ఆన్‌లైన్ జాబ్ మోసాలు

## క్లుప్తంగా...

### హెచ్‌ఎంఎస్ అనుబంధ సంస్థ గౌరవ అధ్యక్షురాలిగా కవిత



శ్రీరాంపూర్/సాక్షి, హైదరాబాద్: హింద్ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్)కు సింగరేణిలో అనుబంధ సంస్థగా ఉన్న అఖిల భారత మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న యూనియన్ 26వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి హెచ్‌ఎంఎస్ నేత, మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ హాజరై మాట్లాడారు. పలు తీర్మానాలు చేసి వాటి సాధనకు కార్మికవర్గంతో కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. సింగరేణి జాగృతితో కలసి పని చేయడానికి ఇటీవల తీసుకున్న నిర్ణయం మేరకు ఈ సభలో జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హెచ్‌ఎంఎస్ అనుబంధ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, అమెరికా పర్యటనకు వెళ్లిన కవిత సోమవారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

### సీపీఎస్‌కు వ్యతిరేకంగా నేడు మహాధర్నా

**టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో సోమవారం చేపట్టిన మహాధర్నాకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలి వస్తున్నారని, అయితే అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతల సమస్య రాకుండా టీచర్లకు అవసరమైన సూచనలు ఇచ్చామని ఆయన చెప్పారు. ఈ విషయంలో రాష్ట్రవ్యాప్తంగా పదాధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్ రెడ్డితో కలసి శ్రీపాల్ రెడ్డి ఇందిరాపార్కు వద్ద మహాధర్నా జరిగే ప్రాంతాన్ని ఆదివారం సందర్శించారు. ఉదయం 10 గంటలకు మొదలయ్యే మహాధర్నా సాయంత్రం వరకూ జరుగుతుందని, అన్ని సంఘాల నేతలూ మద్దతు ఇచ్చేందుకు వస్తారని ఆయన తెలిపారు.

### రచయితగా మారిన ఐపీఎస్ 'కొత్తకోట'

**రిటైర్ అయిన శ్రీనివాస్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: సీనియర్ ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి రచయితగా మారారు. 'పుంజుతోక (కాక్‌టెయిల్ కవితలు)'పేరిట ఆయన 120 కవితల సంకలనాన్ని రాశారు. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ పోలీస్‌శాఖలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారంతో ఆయన సర్వీస్ పూర్తవడంతో పదవీ విరమణ పొందారు. ఐపీఎస్‌గా వివిధ హోదాల్లో ఉమ్మడి ఏపీతోపాటు తెలంగాణలోనూ వివిధ ప్రాంతాల్లో ఆయన పనిచేశారు. కొత్తకోట తనలోని కొత్తకోణాన్ని ఆవిష్కరిస్తూ రచయితగా మారారు. తాను రాసిన ఈ పుస్తకానికి సబంధించి ఒక వీడియోలో మాట్లాడుతూ, ఒక ఐపీఎస్‌గా అందరికీ పరిచయ మైన తాను ఒక రచయితగా తనను సాక్షాత్కరింపజేసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థి దశ నుంచి మొదలుకుని.. ఐపీఎస్ అధికారిగా 30 ఏళ్ల సర్వీస్‌లోని తన అనుభవాలను రంగరిస్తూ పుంజుతోక అనే పుస్తకరూపంలో అందరి ముందుకు వస్తున్నా.. అని పేర్కొన్నారు. ఇందులో సామాజిక, సంక్షేమ, ప్రకృతిపై ప్రేమకు సంబంధించిన అంశాలపై కవితలుంటాయన్నారు.

# కాంగ్రెస్‌కు యువకులే అంబాసిడర్లు

- యువత వారి భవిష్యత్తు కోసం పోరాడాలి
- 2029 రాహుల్ ప్రధానినామ సంవత్సరం కావాలి
- వచ్చే ఏడాది జరిగే కేరళ ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి
- కేరళలో ఎంపీ కేసీ వేణుగోపాల్ 'మెరిట్ అవార్డ్–2025'లో సీఎం రేవంత్ వ్యాఖ్యలు



విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో కేసీ వేణుగోపాల్

సాక్షి, హైదరాబాద్: 'దేశంలోని యువత హక్కులను బీజేపీ కొల్లగొడుతోంది. యువత హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పోరాడుతోంది. మీరే మా నమ్మకం. యువకులే కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్లు. మీ భవిష్యత్తుతోపాటు దేశం కోసం పోరాడండి'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పెద్ద ఉద్యమం జరుగుతోందన్నారు. ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడేందుకు.. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడాలని కోరారు. కేరళలోని అలెప్పి పట్టణంలో కాంగ్రెస్ ఎంపీ, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ ఆదివారం నిర్వహించిన 'ఎంపీ మెరిట్ అవార్డ్–2025'కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలువురు ప్రతిభావంతులైన టెన్త్, ప్లస్ టూ విద్యార్థులు, యువతకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ యువతలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు వారిలో స్ఫూర్తి నింపేందుకు ఈ అవార్డులు ఎంతో దోహదపడతాయన్నారు. 100 శాతం ఫలితాలు సాధించిన 150 పాఠశాలల్లోని 3,500 మంది విద్యార్థులకు అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. దేశంలో విద్యకు, కేరళ రాష్ట్రానికి బలమైన సంబంధం ఉందని.. 100 శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కేరళ ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. కేరళలో అమలవుతున్న వయోజన విద్యా కార్యక్రమం కూడా అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడుతోందని చెప్పారు. విద్యకున్న ప్రాధాన్యత గురించి తెలంగాణ సమాజానికి కూడా తాను ప్రతి సందర్భంలో చెప్పడమే కాకుండా తెలంగాణలో విద్యాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నామని వివరించారు. తెలంగాణలోని పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించామని చెప్పారు. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అగ్రస్థానంలో నిలుస్తున్న కేరళపట్ల తనకు ఒకింత అసూయ కలుగుతోందని రేవంత్ వ్యాఖ్యానించారు.

**21 ఏళ్లకే ఎమ్మెల్యే ఎందుకు కాకూడదు?**

దేశంలోని యువత వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తిని గుర్తించాలని సీఎం రేవంత్ కోరారు. 'చిన్న వయసులోనే యువత సివిల్స్‌కు ఎంపికై ఐఏఎస్‌లుగా జిల్లా పాలనా వ్యవస్థను సమర్థంగా నడుపుతున్నప్పుడు 21 ఏళ్లకే యువత ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదు? ఆ దిశగా రాజ్యాంగాన్ని సవరించుకోవాలి. దేశ రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు 21 ఏళ్లకు ఓటు హక్కు ఉండేది. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉండగా దాన్ని 18 ఏళ్లకు తగ్గించారు. కానీ ఇప్పటికే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు కనీస వయసు 25 ఏళ్లుగానే ఉంది. ఇకనైనా యువతకు రాజకీయాల్లో అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది'అని రేవంత్ అభిప్రాయపడ్డారు. 2029లో లోక్‌సభ ఎన్నికలు రెండు ప్రధాన శక్తుల మధ్య జరగబోతున్నాయని.. యువత ఈ అంశాన్ని గ్రహించాలని కోరారు. వచ్చే ఏడాది జరిగే కేరళ ఎన్నికలను 2029లో దేశ భవిష్యత్తును నిర్ణయించబోయే ఎన్నికలుగా రేవంత్ అభివర్ణించారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలనే సంకల్పంతో ముందుకెళ్లాలని.. ఆ ఏడాదిని రాహుల్ ప్రధానినామ సంవత్సరంగా అందరికీ చాటాలని చెప్పారు. యువతను ప్రోత్సహించేందుకు కేసీ వేణుగోపాల్ చూపుతున్న చొరవను ప్రతి రాష్ట్రంలో, ప్రతి నియోజకవర్గంలో స్ఫూర్తిగా తీసుకొని నాయకులు ముందుకెళ్లాలని రేవంత్ కోరారు.

# పుస్తక పఠనంతో విజ్ఞానం

**హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా**




చందంపేట: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది జున్ను ఇద్దయ్య మరికొంత మంది గ్రామస్తులు కలసి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని, గ్రామీణ ప్రాంత యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయంలో పుస్తక పఠనం ఉత్తమ మార్గంలో నడిచేందుకు దోహదపడుతుందని అన్నారు. హైకోర్టు పీపీ.. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. తనవంతుగా గ్రంథాయాల అభివృద్ధికి సహకరిస్తానని పేర్కొన్నారు. అనంతరం న్యాయవాదులు జస్టిస్ నందాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, అడిషనల్ పీపీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉద్యోగ జేఏసీ పాత పెన్షన్ పోరాట సభ

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి సోమవారం భారీ సభ నిర్వహిస్తోంది. ఆర్టీసీ కళాభవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సభ ప్రారంభం కానుంది. రాష్ట్రం నలుమూలల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున హాజరై ఈ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

# పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ఏపీకే ఫైల్స్




- వాట్సాప్‌లో లింకులు పంపుతున్న సైబర్ నేరగాళ్లు
- ఒకసారి క్లిక్ చేస్తే ఫోన్‌ను కంట్రోల్‌లోకి తీసుకొని మోసాలు
- అనుమానాస్పద మెసేజ్‌లలో లింక్‌లపై క్లిక్ చేయొద్దంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్ : సైబర్ నేరగాళ్లు ఎవరినీ వదలడం లేదు. మోసం చేయడానికి ఏ చిన్న అవకాశం ఉన్నా..తమదైన స్టయిల్‌లో రెడీ అవుతున్నారు. తాజాగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తమ మోసాలకు అనుగుణంగా మార్చుకున్నారు. రైతులే లక్ష్యంగా ఈ తరహా కొత్త మోసానికి తెరతీశారు. వాట్సాప్‌లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట మెసేజ్‌లు పంపుతూ వాటిలో కొన్ని లింక్‌లు పెట్టి ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ) ఫైల్స్ పంపుతున్నట్టు పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అనుమానాస్పద మెసేజ్‌లలోని లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దని సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సైతం ఈ మేరకు కొన్ని సూచనలు చేసింది. సోషల్ మీడియా, ఇతర ప్లాట్‌ఫామ్‌లలో వ్యాప్తి చెందుతున్న నకిలీ సందేశాలు, లింక్‌ల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

**పీఎం కిసాన్ వాట్సాప్ స్కామ్ అంటే ఏమిటి?**

ఈ స్కామ్‌లో సైబర్‌నేరగాళ్లు పీఎం కిసాన్ శాఖ నుంచి ప్రభుత్వ అధికారులమని చెప్పుకుంటూ వాట్సాప్‌లో సందేశాలు పంపుతారు. పథకంలో కొత్తగా నమోదు చేసుకునేందుకు, మీ ఖాతాలో జమైన డబ్బుల వివరాలు పొందేందుకు ఆ సందేశంలోని లింక్‌పై క్లిక్ చేసి కొన్ని వివరాలు నమోదు చేయాలని సూచిస్తారు. దీనిని నమ్మి లింక్‌పై క్లిక్ చేయగానే మన ఫోన్‌ను హ్యాక్ చేస్తారు. ఆ తర్వాత ఆధార్, పాన్‌కార్డు వంటి వ్యక్తిగత సమాచారాన్ని అడుగుతారు. ఆ తర్వాత ఓటీపీ వస్తుంది. సైబర్ నేరగాళ్లు ఆ సమాచారం, ఓటీపీ పొందిన తర్వాత మన బ్యాంక్ ఖాతాకు యాక్సెస్ పొందుతారు. ఫలితంగా ఆర్థిక మోసం జరుగుతుంది. మన వ్యక్తిగత సమాచారం, ఫోన్ గ్యాలరీలోని ఫొటోలు తీసుకొని డేటా థెఫ్ట్‌తోపాటు మన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి ఆన్‌లైన్ వేధింపులకు గురిచేస్తూ డబ్బు డిమాండ్ చేసే ప్రమాదమూ ఉంది.

**ఈ జాగ్రత్తలు మరవొద్దు**

- ప్రభుత్వ లోగో లేదా సీల్‌తో అవాంఛిత సందేశాలు వచ్చినా..మన వ్యక్తిగత వివరాలు అడుగుతూ ఎస్ఎంఎస్‌లో పేర్కొన్నా, అది సైబర్ నేరగాళ్ల పని అని అనుమానించాలి.
- అనుమానాస్పద మెసేజ్‌లలోని ఏ లింక్‌పై క్లిక్ చేయొద్దు లేదా ఏ అటాచ్‌మెంట్‌ను డౌన్‌లోడ్ చేయొద్దు.
- సందేశం చట్టబద్ధంగా అనిపించినా, మన వ్యక్తిగత సమాచారం లేదా ఓటీపీలను షేర్ చేయొద్దు.
- ఏ సమాచారం కోసమైనా అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి నిర్ధారించుకోవాలి.
- ఇలాంటి అనుమానాస్పద లింక్‌లు మనకు తెలిసిన నంబర్ల నుంచి వచ్చినా వాటిని నమ్మి, లింక్‌లపై క్లిక్ చేయొద్దు.
- నకిలీ లింక్‌లు లేదా ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయడం వల్ల ఫోన్ హ్యాకింగ్ అవడంతోపాటు డేటా దొంగతనం జరిగే ప్రమాదం ఉందని మరవొద్దు.

# రాష్ట్రంలో రెండ్రోజులపాటు వర్షాలు

**రేపు వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం**

సాక్షి, హైదరాబాద్: వాయవ్య బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. దాని ప్రభావంతో పలు ప్రాంతాల్లో వచ్చే రెండ్రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లోని కొన్నిచోట్ల భారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేస్తూ ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**26 మండలాల్లో ఇంకా లోటు...**

జూన్, జూలై, ఆగస్టులలో 57.3 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 72.06 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. జిల్లాలవారీగా చూస్తే 8 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, 10 జిల్లాల్లో అధికం, 15 జిల్లాల్లో సాధారణ వర్షాలు కురిశాయి. అత్యధికంగా మెదక్ జిల్లాలో 90 శాతం అధిక వర్షాలు నమోద య్యాయి.136 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 238 మండలాల్లో అధికం, 221 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా 26 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నట్టు వాతావరణ శాఖ పేర్కొంది.

### నిలకడగా గోదావరి



మేడిగడ్డ బరాజ్ వద్ద వరద ఉధృతి

కాళేశ్వరం: గోదావరినది నిలకడగా ప్రవహిస్తోంది. ఆదివారం కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్లను తాకుతూ 12.500 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహించింది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కాళేశ్వరానికి ఎగువ ఉన్న అన్నారం బరాజ్ నుంచి వద్ద 3.56 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మొత్తం 66 గేట్లు ఎత్తి ఉంచడంతో అక్కడి నుంచి కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహితనదితో కలిసి పరవళ్లు తొక్కుతోంది. మేడిగడ్డ బరాజ్‌కు 8.19 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 85 గేట్లు ఎత్తి నీటిని అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు.

# తడకే అంబులెన్స్

- అస్వస్థతకు లోనైన గిరిజన మహిళ
- రహదారి సౌకర్యం లేక 2 కిలోమీటర్ల దూరం మోసుకొచ్చిన వైనం



సోంబాయిని తడకపై మోసుకొస్తున్న కుటుంబ సభ్యులు, వ్యవసాయ కూలీలు

నార్నూర్: కొలాం గిరిజన తెగకు చెందిన ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు లోనైంది. ఆమె ఉంటున్న ప్రాంతం నుంచి రహదారి సౌకర్యం లేదు. దీంతో రెండు కిలోమీటర్ల దూరం ఓ తడకపై మోసుకొచ్చి 108లో ఆస్పత్రికి తరలించిన ఘటన హృదయాన్ని కదిలించింది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం భీంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బొజ్జుగూడ (కొలాంగూడ)లో మొత్తం 13 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానం. గ్రామానికి చెందిన ఆత్రం సోంబాయికి ఆరుగురు సంతానం. వీరిలో ఎనిమిది నెలల బాబు కూడా ఉన్నాడు. నెలసరితోపాటు ఆమె బలహీనంగా ఉండగా.. ఆదివారం ఇంటి వద్ద తీవ్ర అస్వస్థతకు లోనైంది. భర్త సోనేరావు కూలి పనికి వెళ్లగా.. పిల్లలతో పాటు చుట్టుపక్కల వారు గమనించి ఆయనకు సమాచారం అందించారు. గ్రామానికి కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. ఈ క్రమంలో కుటుంబసభ్యులు, స్థానిక కూలీలు ఆమెను ఓ తడకపై పడుకోబెట్టి నార్నూర్ ప్రభుత్వాస్పత్రికి నడుచుకుంటూ బయ లుదేరారు. దాదాపు రెండు కిలోమీటర్లు ఇలా తీసుకెళ్లగా 108 రావడంతో అందులో ఆస్పత్రికి తరలించారు. వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగ ర్ లెవల్స్ పడిపోవడంతోనే అస్వస్థతకు గురైనట్టు హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ తెలిపారు. ప్రస్తుతం ఆమెకు పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తున్నామని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యురాలు రాజమణి తెలిపారు. కాగా కొలాంగూడకు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రైలు వెనుక రైలు

- అందుబాటులోకి ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్
- రైళ్ల ఆలస్యానికి చెక్ పెడుతున్న రైల్వేశాఖ



ఓదెలలో ఏర్పాటు చేసిన ఏబీఎస్ హట్

ఓదెల (పెద్దపల్లి): మనదేశంలో రైళ్ల గురించి చెప్పేటప్పుడు ఎన్నడూ సమయానికి రావు అనే మాట ముందుగా వచ్చేది. కానీ అది గతం. ప్రస్తుతం రైల్వే శాఖ అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని రైళ్ల రాకపోకల్లో ఆలస్యాన్ని సాధ్యమైనంత వరకు తగ్గిస్తోంది. ముఖ్యంగా ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ (ఏబీఎస్) వ్యవస్థ ద్వారా ఒకే లైనుపై ఒకటికంటే ఎక్కువ రైళ్లు వెంట వెంటనే ప్రయాణించేలా చర్యలు తీసుకుంటోంది దీంతో రైళ్ల రాకపోకల్లో ఆలస్యం తగ్గుతోంది. సికింద్రాబాద్ – కాజీపేట – బల్లార్షా రైల్వే సెక్షన్ల మధ్య ఈ ఏబీఎస్‌ల ఏర్పాటు వేగంగా సాగుతోంది. జమ్మికుంట, ఓదెల, కొత్తపల్లి, రామగుండం, పెద్దంపేట, మంచిర్యాల, మందమర్రి తదితర ప్రాంతాల్లో ఏబీఎస్ హట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి ప్రధానంగా గూడ్స్ రైళ్లకు కూడా మార్గనిర్దేశం చేయగలవు.

**ప్రతి 2 కి.మీ.కు ఒక ఏబీఎస్ హట్**

రైలుపట్టాల వెంట ప్రతి రెండు కిలోమీటర్ల దూరంలో ఒకటి చొప్పున ఏబీఎస్ హట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రెడీమేడ్‌గా తయారు చేసిన వీటిని తక్కువ సమయంలోనే క్రేన్‌ల సాయంతో పట్టాల పక్కన అమర్చుతున్నారు. మానేరుతోపాటు ఇతర వంతెనలు, వాగులపై రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేందుకు ఈ ఏబీఎస్ ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. రైల్వేస్టేషన్ దాటిన సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఏబీఎస్ హట్ సిస్టంతో పట్టాలపై నాలుగు రైళ్లు పరుగులు పెడతాయని అంటున్నారు. సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు ఆగడం కోసం ఆయా స్టేషన్ మాస్టర్ల చేతుల్లోనే ఈ సిగ్నల్స్ సిస్టం ఉంటుందని తెలిపారు. కిలోమీటర్ దూరంలోనే ఒకటి తర్వాత ఒక రైలు వెళ్లేందుకు వీలుగా పట్టాలపై సెన్సార్ సిస్టమ్ అమర్చుతున్నారు. ఈ సిగ్నల్స్ వల్ల ప్రమాదాలు చాలావరకు తగ్గుతాయని అంటున్నారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్ మాస్టర్ల అధీనంలోని సిగ్నల్స్ కేవలం ప్యాసింజర్ రైళ్లకు మాత్రమే పనిచేస్తున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 

సాక్షి ప్లస్
సోమవారం । 1-9-2025



ఆదివారం ఖైరతాబాద్ మహా గణపతి దర్శనం కోసం బారులు తీరిన భక్త జన సందోహం

# గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి

- కుప్పకూలితే లక్షలాది మందిపై ప్రభావం
- ఖమ్మం సహా వివిధ జిల్లాల్లో క్వారీలు, పరిశ్రమలు
- ఇప్పటికే పలుచోట్ల క్వారీల మూత
- ప్రభుత్వం రాయితీలు, సబ్సిడీలు ఇవ్వాలని విన్నపాలు



ఖమ్మంలోని ఓ గ్రానైట్ క్వారీ





గ్రానైట్ పరిశ్రమలో సిద్ధమైన బండలు

**ఖమ్మంఅర్బన్:** తెలంగాణలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ ద్వారా లక్షమంది ఉపాధి పొందుతున్నారు. జిల్లా వాసులే కాక ఇతర రాష్ట్రాల కూలీలు సైతం ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. అయితే, నానాటికీ ఉత్పత్తి వ్యయం పెరగడం, విద్యుత్, డీజిల్ ధరలు, రవాణా చార్జీలు, పన్నులు, రాయల్టీ, పర్మిట్ ఫీజులు భారీగా పెరగడంతో పరిశ్రమల నిర్వహణ భారంగా మారుతోంది. ప్రభుత్వం తక్షణమే రాయితీలు, సబ్సిడీలు ప్రకటించడమేకాక అనుమతుల్లో జాప్యాన్ని నివారించి పరిశ్రమలు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారి బతుకులపై దెబ్బపడకుండా చూడాలని కోరుతున్నారు.

### ఇప్పటికే కొన్ని మూత..

ఖమ్మం జిల్లాలో 450 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉండేవి. ఇందులో 150కి పైగా మూతపడగా.. 200 ఫ్యాక్టరీల్లో ఒకే షిఫ్ట్ పని నడుస్తోంది. మిగతా కొన్నింట్లో మాత్రం రెండు షిఫ్ట్‌లను అష్టకష్టాల నడుమ కొనసాగిస్తున్నట్టు యజమానులు చెబుతున్నారు. వీటిలో కూడా షిఫ్ట్‌లు తగ్గినా, ఇంకొన్ని మూతబడినా యజమానులతోపాటు వేలాది మంది కార్మికులు రోడ్డున పడే ప్రమాదముంది. ప్రతీ ఫ్యాక్టరీ ద్వారా సగటున 115–120 కుటుంబాలు జీవనం సాగిస్తుండగా.. జిల్లాలో సుమారు 35 వేల మంది ప్రత్యక్షంగా, లక్ష మందికి పైగా పరోక్షంగా గ్రానైట్ రంగంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు.

### పెరిగిన రాయల్టీలు, చార్జీల భారం

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాయల్టీ, పర్మిట్, సీనరేజీ చార్జీలు భారీగా పెంచింది. గతంలో ఒక కట్టర్‌కు రూ.14వేలు నిర్ణయిస్తే అందులో 40 శాతం సబ్సిడీ పోగా రూ.8,400 చెల్లించేవారమని, మూడేళ్లలో 115 శాతం పన్నులు పెంచడమే కాక రూ.16వేలు చేశారని గ్రానైట్ యజమానులు చెబుతున్నారు. ఇక ఫ్యాక్టరీ నిలిపివేసినా మినిమమ్ బిల్లు పేరుతో విద్యుత్ బిల్లుల వసూళ్లతో నెలకు రూ.50వేల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీలు పని చేసినప్పుడు బిల్లులు వసూలు చేసి, ఆగినప్పుడు మినహాయింపు ఇవ్వాలనే డిమాండ్ వస్తోంది.

### సబ్సిడీలు, రాయితీలు ఇస్తే..

గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణకు ప్రభుత్వం సబ్సిడీలు, రాయితీలు ఇవ్వడమే కాక పెంచిన రాయల్టీ, పర్మిట్, సీనరేజీ చార్జీలు ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన 40 శాతం సబ్సిడీని పునరుద్ధరించాలని విన్నవిస్తున్నారు. ఇవికాక 12 ఏళ్లుగా ఫ్యాక్టరీలకు రావాల్సిన రూ.20 కోట్ల సబ్సిడీ విడుదల చేసి గ్రానైట్ ఉత్పత్తులపై 18శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని, ఐదు హెక్టార్లలోపు క్వారీలకు షరతులు లేకుండా పర్యావరణ అనుమతులు ఇవ్వడంతోపాటు డీజిల్, రవాణా ఖర్చులపై సబ్సిడీ, లైసెన్స్ అనుమతుల ప్రక్రియ సులభతరం చేయాలని కోరుతున్నారు. పెట్టుబడి రాయితీ 20 శాతం ఇవ్వాలని, ప్రభుత్వ భూముల్లో క్వారీల లీజులు తక్షణమే ఇస్తే ఫలితం ఉంటుందని చెబుతున్నారు.

### వివిధ రూపాల్లో పోటీ

కోవిడ్ ప్రభావం, అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ తగ్గిపోవడంతో గ్రానైట్ ఫ్యాక్టరీలు కుదేలు కాగా.. కృత్రిమ స్టోన్ ఉత్పత్తులు రావడం మరింత సంక్షోభంలో నెట్టినట్టయ్యింది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా గ్రానైట్ హబ్‌గా నిలిచిన రాష్ట్రంలో ఇప్పుడు వరుసగా ఫ్యాక్టరీలు మూతబడుతుండడం లక్ష మంది ఉపాధిపై ప్రభావం చూపుతోంది. కాగా, జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే ఎక్కువగా గ్రానైట్ పరిశ్రమలు ఉన్నందున వారు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని చెబుతుండగా, ఇటీవల ఏర్పాటుచేసిన సమావేశంలో అఖిలపక్షాల నాయకులు నాయకులు గ్రానైట్ యజమానులకు మద్దతు ప్రకటించారు.

### ప్రభుత్వం కల్పించుకుంటేనే..



ప్రభుత్వం రాయితీలు, సబ్సిడీలు అమలు చేయడమే కాక ఇతర చార్జీలు తగ్గించాలి. తద్వారా పరిశ్రమల మనుగడ సాధ్యమై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వారి ఉపాధిని కాపాడొచ్చు. ఇప్పటికే సమస్యలను సీఎం, మంత్రులు దృష్టికి తీసుకెళ్లాం.

– పాటిబండ్ల యుగంధర్, గ్రానైట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

### రెన్యూవల్ లేక మూత



క్వారీలకు ఈసీలు ఇవ్వడంలో జాప్యంతో క్వారీ మూతపడింది. దీంతో మాలాంటి క్వారీల యజమానులు, కూలీల ఉపాధిపై దెబ్బపడుతోంది. అంతేకాక ప్రభుత్వ ఆదాయానికి సైతం నష్టమే. ప్రభుత్వం ఇలాంటి వాటిపై త్వరగా దృష్టి సారించాలి.

– యండపల్లి సత్యం, క్వారీ యజమాని, రఘునాథపాలెం

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ‘ఓట్ చోర్-గద్దీచోడ్’

### గాంధీభవన్‌లో మోదీ దిష్టిబొమ్మ దహనం

**సాక్షి, హైదరాబాద్:** ఏఐసీసీ చేపట్టిన ఓట్ చోర్–గద్దీచోడ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహిళా కాంగ్రెస్ ఆందోళన నిర్వహించింది. ఎన్నికలలో ఓట్లు దొంగతనం చేసి గెలుస్తున్న బీజేపీ వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు నేతృత్వంలో గాంధీభవన్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ.. ఓట్ల చోరీ గురించి రాహుల్ గాంధీ ఆధారాలతో సహా నిరూపించారని, ఆయన చేపట్టిన ఉద్యమం ఇప్పుడు దేశ వ్యాప్తంగా రాజుకుంటోందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ చేపట్టిన ఉద్యమానికి దేశ ప్రజలు మద్దతు పలుకుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇతర నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లాలూతో వీహెచ్ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రీయ జనతాదళ్ అధినేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌తో మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు సమావేశమయ్యారు. రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ అధికార యాత్రలో పాల్గొనేందుకు బిహార్ వెళ్లిన వీహెచ్ ఆదివారం లాలూను ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గతంలో ఐఐఎం, ఎయిమ్స్‌లలో రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టేసినప్పుడు మాజీ ప్రధాని మన్మోహన్ నేతృత్వంలో పార్లమెంటులో బిల్లు ఆమోదించిన సందర్భంగా లాలూ చేసిన కృషిని వీహెచ్ గుర్తు చేశారు. లాలూ ప్రసాద్‌ను కలిసిన వారిలో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ కూడా ఉన్నారు.

## ‘జీవో 99ను తక్షణమే సవరించాలి’

**సాక్షి, హైదరాబాద్:** జీవో 99ని తక్షణమే సవరించాలని, మాలలకు తీవ్ర అన్యాయానికి కారణమవుతున్న రోస్టర్ పాయింట్లను 22 నుంచి 16కు తగ్గించాలని జాతీయ మాల మహానాడు తెలంగాణ అధ్యక్షుడు పల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడించాలని మాలమహానాడు పిలునిచ్చిందన్నారు. అదే విధంగా మాలల ఉనికికి ప్రమాదంగా మారిన జీవో 99 ప్రతులను క్యాంప్ కార్యాలయాల ముందు కాల్చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాలలపట్ల సవతి తల్లి ప్రేమను చూపిస్తూ, అణిచివేస్తున్న తీరు దురదృష్టకరమని అన్నారు.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ప్రకటించిన జితేందర్‌రెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఢిల్లీలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ‘జస్టిస్ సుదర్శన్‌రెడ్డి న్యాయ ప్రయాణం రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధతకు ప్రతీక. ఉపరాష్ట్రపతి పదవికి ఆయన వంటి అనుభవజ్ఞుడు రావడం దేశానికి గౌరవం. తెలుగు రాష్ట్రాల ఎంపీలు ఆయనకు మద్దతు తెలపడం తెలుగు గర్వానికి ప్రతిబింబం’అన్నారు.

## ‘వైద్యం’పై ఉట్టి చర్చలా?

### ప్రభుత్వం బకాయిలు చెల్లించనందున ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నిలిపేశాయి: డాక్టర్ సంజయ్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించనందున ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపేశాయని.. అలాంటి సమస్యలను పరిష్కరించకుండా వైద్యశాఖపై అసెంబ్లీలో ఉట్టిగా చర్చిస్తే ఏం ఉపయోగం ఉంటుందని బీఆర్‌ఎస్ సభ్యుడు డాక్టర్ సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం శాసనసభలో తెలంగాణ అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ చట్టం రద్దుకు సంబంధించి ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చలో భాగంగా ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. మెట్‌పల్లిలో రెండేళ్ల క్రితం నిర్మితమైన 100 పడకల ఆసుపత్రి.. సిబ్బంది కొరతతో ఇప్పటివరకు ప్రారంభం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను తొలిరోజు నుంచి చెబుతున్న సమస్యలు 22 నెలలు గడిచినా కొనసాగుతుండటం దారుణమన్నారు. ఆసుపత్రుల సమస్యలను వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తే చురుగ్గా స్పందిస్తారని.. కానీ నిధులు మాత్రం విడుదల కావట్లేదని సంజయ్ పేర్కొన్నారు. మంత్రిని ఎవరు నియంత్రిస్తున్నారో అర్థంకావట్లేదని.. ఇకనైనా మంత్రి స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి రావాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆశా వర్కర్ల జీతాలను రూ.2,500 నుంచి రూ. 10 వేలకు పెంచిందని, దాన్ని రూ. 18 వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పట్టించుకోలేదని విమర్శించారు.

### త్వరలో సమస్యల పరిష్కారం: మంత్రి దామోదర



ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతుల కల్పన, ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించిందని.. త్వరలో దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సభకు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసిన ప్రైవేటు ఆసుపత్రులతో చర్చిస్తున్నామని.. వారికి బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేసినందున త్వరలో సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. అనంతరం సభ బిల్లుకు ఆమోదం తెలిపింది.

## అసెంబ్లీ మీడియా పాయింట్

### రాజకీయ కక్షతో పీసీ ఘోష్ రిపోర్టుపై చర్చ: వివేకానందగౌడ్



**సాక్షి, మేడ్చల్‌జిల్లా:** రాజకీయ కక్షతోనే అసెంబ్లీలో పీసీ ఘోష్ రిపోర్టుపై చర్చ పెట్టారే తప్ప.. మరేమీ కాదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ కేవలం కాంగ్రెస్ కమిషన్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు బండారు లక్ష్మారెడ్డి, డాక్టర్ సంజయ్, విజేయుడులతో కలిసి మాట్లాడారు. కాళేశ్వరం నీటిని పంట పొలాలకు వాడుకుంటూనే.. కాళేశ్వరం విఫల ప్రయత్నమని పేర్కొనటం విడ్డూరంగా ఉందని వివేకానంద దుయ్యపట్టారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వరదల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారని, ఇలాంటి సమయంలో అసెంబ్లీకి రావటం బాధగా ఉన్నా..వచ్చామన్నారు. ఆదివారం ఉదయం అసెంబ్లీకి వచ్చి బీసీ బిల్లుపై మాట్లాడి..సీఎం రేవంత్‌రెడ్డి కేరళ వెళ్లడాన్ని చూస్తుంటే ఆయనకు తెలంగాణపై, ఇక్కడి ప్రజలపై ఏమాత్రం ప్రేమ లేదని తెలుస్తోందన్నారు.

### రైతులు, వరద బాధితులకు భరోసా ఇవ్వాలి: పాయల్ శంకర్



భారీ వర్షాలు, వరదల కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలలో రూ.వేలకోట్ల పంట నష్టం జరిగిందని, వందలాది కుటుంబాలు తీవ్రంగా నష్ట పోయాయని, వీరందరికి ప్రభుత్వం భరోసా కల్పించే విధంగా ప్రకటన చేయాల్సిన అవసరముందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. బీజేపీ ఎమ్మెల్యేలు రామారావు పవార్, ధన్‌పాల్ సూర్యనారాయణ, హరీశ్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడారు. వేల ఇళ్లు నీట మునిగి 10 నుంచి 15 మంది చనిపోయారని శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయి రైతులు ఆందోళనలో ఉన్నారని, దీనిపై వ్యవసాయశాఖ మంత్రి కానీ, ప్రభుత్వం కూడా సమాధానం ఇవ్వడం లేదన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని చెప్పినా, చేయలేదని, ఆ పథకం తెస్తే రైతుకు భరోసా ఉండేదన్నారు. శాసనసభ సమావేశాల్లోనే ప్రభుత్వం రైతు బీమా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ తరఫున, నష్టపోయిన రైతుల పక్షాన ఆందోళన చేస్తాం.

### కాళేశ్వరంను కామధేనువుగా వాడుకున్న కేసీఆర్: ఆది శ్రీనివాస్



కాళేశ్వరం ప్రాజెక్టును మాజీ సీఎం కేసీఆర్ కామధేనువుగా వాడుకున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. వారి అవినీతి, అక్రమాలతో తెలంగాణ ఆత్మగౌరవం ఎప్పుడో మంటగలిసిందని విమర్శించారు. కోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేసి కాళేశ్వరంపై చర్చ జరగకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చివరకు కమిషన్‌ను కూడా తప్పు పడుతున్నారని చెప్పారు. యూరియా కొరతపై కావాలనే రచ్చ చేస్తున్నారని దుయ్యబట్టారు. యూరియా ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమని, అక్కడ అడగడానికి బీఆర్‌ఎస్ నేతలకు నోరు రావడం లేదన్నారు. రైతాంగంపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్‌ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం మీద ధర్నా చేయాలని కోరారు. కాళేశ్వరం జాతి సంపదని, ప్రాజెక్టు నివేదికలో తప్పు ఎవరు చేశారో తేలితే.. ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

### నివేదికపై భయంతోనే యూరియా లొల్లి: నాయిని రాజేందర్‌రెడ్డి



కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై భయంతోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు యూరియా నినాదం ఎత్తుకొని, లొల్లి చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ఇద్దరు, ముగ్గురు కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.కోట్లు దోచుకు తిన్నారన్నారు. ప్రాజెక్టు అంచనా ఎంత ? ఎంతవరకు తీసుకెళ్లారనే విషయంపై వాస్తవాలు ప్రజలకు తెలవాల్సిన అవసరముందన్నారు. శనివారం వరంగల్‌కు చెందిన బాలునాయక్ అనే రైతుకు యూరియా వచ్చినా, బీఆర్‌ఎస్ దొంగలు కావాలని, రైతులతో ధర్నా చేయించారని విమర్శించారు. ఈ దొంగలు రాష్ట్రాన్ని ఎట్లా దోచుకున్నారన్న వాస్తవాలు ప్రజలకు తెలిపేందుకే అసెంబ్లీ సభలో చర్చ జరుగుతుందన్నారు.

## గత ప్రభుత్వానికి ఎన్నోసార్లు నివేదించాం

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కడియం, యశస్వినిరెడ్డి, నాగరాజు

**సాక్షి, హైదరాబాద్:** దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని గత ప్రభుత్వానికి ఎన్నోసార్లు నివేదించినా స్పందించలేదని, కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయిని అయిన దేవాదుల ఎత్తిపోతల పథకం ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా, గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పూర్తి కాలేదని ధ్వజమెత్తారు. ప్రాధాన్యత క్రమంలో నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని దేవాదుల ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. ప్రధాన కాలువతోపాటు ఉప కాలువల లైనింగ్ పనులకు రూ.140 కోట్లు, దేవాదుల మూడవ దశ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.1,010 కోట్లు కేటాయించారన్నారు. ఇది రైతులకు పండుగ వాతావరణమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయటానికి బీజేపీ, బీఆర్‌ఎస్‌లు చీకటి ఒప్పందంతో డ్రామాలు చేస్తున్నాయన్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు నిత్యానందస్వామి లాంటి వారని, పాలకుర్తి లేదంటే వర్ధన్నపేట నియోజకవర్గం తిరిగి ప్రభుత్వాన్ని బదనాం చేయడం ఆయన పనని ఆరోపించారు.

## బీజేపీ ఎంపీల సాయం హర్షణీయం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు తమ ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున కేటాయించడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు హర్షం వ్యక్తంచేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిన సమయంలో.. బీజేపీ ఎంపీలు ముందుకు వచ్చి సహాయక చర్యల కోసం నిధులను కేటాయించడం అభినందనీయమన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడల్లా బీజేపీ ముందుండి తోడ్పడుతుందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రజాహితం కోసం పనిచేస్తుందన్నారు. ప్రజల పక్షాన నిలబడేది బీజేపీ మాత్రమే అన్నది మరోసారి రుజువైందన్నారు. ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం, సహాయక చర్యల్లో పాల్గొనడం బీజేపీ బాధ్యత అని పేర్కొన్నారు.

## వరద దాటినా దక్కని ప్రాణం



సుబ్బమ్మ మృతదేహాన్ని పడవ ద్వారా వరద దాటించి ఆటోలో స్వగ్రామానికి తీసుకువెళ్తున్న కుటుంబసభ్యులు

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా) : అల్లూరి జిల్లా వీఆర్‌పురం మండలం కుంజ వారిగూడెంకు చెందిన బొడ్డు సుబ్బమ్మ(50) అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు వరద అడ్డంకిగా మారింది. అంతకంతకు ఆమె పరిస్థితి విషమిస్తుండడంతో శనివారం ఆటోలో చింతూరు మండలం నర్సింగపేట తీసుకొచ్చి పడవలో వరదనీటిని దాటించి చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె తీవ్ర రక్తహీనతకు గురైందని, అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం ఎక్కించేందుకు భద్రాచలం తీసుకెళ్లాలని సూచించారు. అంబులెన్సులో భద్రాచలం పంపేందుకు, అక్కడ ఎక్కించేందుకు ఓ పాజిటివ్ రక్తాన్ని కూడా ఏర్పాటుచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. కాగా భద్రాచలం నుండి తాము రక్తం తీసుకువస్తామని, చింతూరు ఆసుపత్రిలోనే రక్తం ఎక్కించాలని రోగి కుటుంబసభ్యులు కోరారని, వారికోసం రాత్రంతా వేచిచూసినా రాలేదని ఈ క్రమంలో సుబ్బమ్మ పరిస్థితి మరింత విషమించి ఆదివారం తెల్లవారుజామున మరణించిందని డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు సుబ్బమ్మ మృతదేహాన్ని తిరిగి పడవలో వరదనీటిని దాటించి స్వగ్రామం తరలించారు.

# చేపా.. చేపా.. ఎందుకు పడలేదు?

**కాలుష్య కాసారాల్లో కలిసిపోతున్న డెల్టా సహజ మత్స్య సంపద**

**ఆక్వా, వరి సాగులో విచ్చలవిడిగా క్రిమిసంహారకాల వినియోగం**

**జాడ లేని బొమ్మిడాయి, మట్టగిడస, కొర్రమీను, చాక రొయ్య, గొరస**

**ఉపాధి కోల్పోయామంటున్న మత్స్యకారులు**

'మా చిన్నతనంలో.. సాయంత్రం పూట పిల్ల కాలువలో పందిరి మావు కట్టి ఉదయం తీసి చూస్తే రకరకాల చేపలు, రొయ్యలు, పీతలు బోలెడు ఉండేవి. ఇప్పుడు చూద్దామంటే కాలువల్లో ఎక్కడా వాటి జాడే ఉండటం లేదు..' ఇది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మండపేటకు చెందిన గంటి మోహనరావు ఆవేదన.

'అప్పట్లో.. కాలువ గుంతల్లో వల వేస్తే బుట్టడు చేపలు పడేవి. వాటిని అమ్ముకుంటే రోజు గడిచిపోయేది. ఇప్పుడు రోజంతా కష్టపడ్డా బుట్ట నిండటం లేదు' అంటూ బాధపడుతున్నాడు పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం రూరల్ గొల్లవానితిప్పకు చెందిన మత్స్యకారుడు నాగరాజు.




సాక్షి, భీమవరం: బొమ్మిడాయిలు, కొర్రమీనులు, పీతలు, పిత్త పరిగెలోయ్.. ఈ మాటలు వినగానే మాంసాహార ప్రియుల నోరూరుతుంది. జలచర వంటకాల్లో వీటికున్న ప్రత్యేకత అలాంటిది. రెండు దశాబ్దాల క్రితం వరకు గోదావరి, కృష్ణా డెల్టాలోని పంట కాలువలు, బోదెలు, వాగులు, డ్రెయిన్లు, కొల్లేరులో పండుగప్ప, కొర్రమీను, బొమ్మిడాయి, మట్టగిడస, కట్టిపరిగె, గొరస, ఇలంబ్రాయి, బెత్తు, ఇసుక దొంతు, సావిడాయ, మలిగ పాము, మార్పు తదితర చేపలు, చాక రొయ్యలు తదితర వందకు పైగా జాతుల మత్స్యసంపద పుష్కలంగా ఉండేది. కాలువల్లో సహజసిద్ధంగా పెరిగే వీటిలో ఎన్నో రోగాలను నయం చేసే గుణముంటుందని పెద్దలు అంటారు. వీటికున్న డిమాండ్‌తో వేల మంది మత్స్యకారులు కాలువల్లో చేపల వేటపై ఆధారపడి జీవించేవారు. వీటిని ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హర్యానా తదితర ప్రాంతాలకూ ఎగుమతి చేసేవారు.

### కాలుష్యభరితం..

ఉభయ గోదావరి, కృష్ణా డెల్టాలో 8.44 లక్షల ఎకరాల్లో వరి, 3.72 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతున్నాయి. అధిక దిగుబడుల కోసం అధికంగా ఎరువులు, క్రిమిసంహారకాలు వాడుతున్నారు. ఈ నీటితోపాటు పరిశ్రమల నుంచి శుద్ధి చేయని జలాలు కాలువల్లోకి చేరి నీటిని తీవ్రంగా కలుషితం చేస్తున్నాయి. అల్యూమినియం హైడ్రాక్సైడ్, అమోనియా, హానికరక రసాయనాలు నీటి అడుగుకు చేరి ఆక్సిజన్‌ను హరిస్తున్నాయి. దీనితో సహజ మత్స్య సంపద నశించి, పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతింటోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమ డెల్టాలోని గోస్తని, బ్యాంక్, వెంకయ్య వయ్యేరు, వేల్పూరు కాలువలు అత్యంత కాలుష్యభరితంగా ఉన్నట్టు భీమవరంలోని నీరు–పర్యావరణ పరిశోధన కేంద్రం చేసిన పరిశోధనలో వెల్లడైంది. ఈ పరిస్థితి కొనసాగితే డెల్టా ప్రాంతంలో సహజసిద్ధమైన చేపలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదముంది.

### జాడ లేకుండా పోతున్నాయి..

తీర ప్రాంతం, డెల్టా కాలువలు, బోదెల్లో పుష్కలంగా దొరికే ఈ చేప జాతుల్లో కొన్ని మార్కెట్లకు అరుదుగా వస్తుండగా మరికొన్ని మచ్చుకైనా కనిపించడం లేదు. చెరువుల్లో పెంచే బొచ్చె, రాగండి, శీలావతి తదితర రకాలు కిలో రూ.100 వరకు ఉంటే కాలువల్లో దొరికే కొర్రమీను రూ.500లు నుంచి రూ.700 వరకు ఉంటుంది. బొమ్మిడాయిలు సైజును బట్టి రూ.300 నుంచి రూ.700 వరకు ఉంటున్నాయి. కాలువల్లో చేపల వేట కోసం గతంలో రూ.10 లక్షలకు పైగా జరిగిన వేలం పాటలు ఇప్పుడు రూ.2 లక్షల లోపే ఉంటున్నాయని మత్స్యకారులు అంటున్నారు. జల కాలుష్యంతో ఉపాధి కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొర్రమీను, పండుగప్ప తదితర చేపలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా కొందరు చెరువుల్లో పెంచుతున్నా, సహజసిద్ధంగా కాలువల్లో దొరికే వాటితో పోలిస్తే చెరువు చేపలకు అంత రుచి ఉండటం లేదంటున్నారు.




గోదావరి పశ్చిమ డెల్టా కాలువల్లో నీటి కాలుష్యంపై గతంలో భీమవరంలోని వెట్ సెంటర్ రూపొందించిన చిత్రం. (ఫైల్)

### ప్రక్షాళన చేయాలి



తీవ్ర నీటి కాలుష్యం వల్ల జల చరాల ఉనికికి ముప్పుతో పాటు వాటిలో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కాలువల్లో కాలుష్యాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. – పీఏ రామకృష్ణంరాజు, రిటైర్డ్ ప్రొఫెసర్, నీరు–పర్యావరణ నిపుణుడు, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా

### ఉపాధి కోల్పోయాం



రెండు దశాబ్దాల క్రితం మా గ్రామంలోని ఎంతోమంది మత్స్యకారులు ఈ వేట ద్వారా ఉపాధి పొందేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. కాలువల్లో గాలిస్తున్నా ఎక్కడా చేపలు పడటం లేదు. – రేవు నరసింహస్వామి, మత్స్యకారుడు, దొంగపిండి, పశ్చిమగోదావరి జిల్లా

---

వర్సిటీలపై ఇక ప్రైవేటు పెత్తనం తప్పదు. విద్యా సంస్థలను బహుళజాతి కంపెనీల చేతిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రక్షాళన పేరుతో వర్సిటీలను ప్రైవేటుకు ధారాదత్తం చేసేందుకు కుటిల యత్నం బహిర్గతమవుతోంది. ఇప్పటికే టెండర్లను పిలిచేందుకు వర్సిటీలను సిద్ధం చేశారు. దీనిపై విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సమాయత్తం అవుతున్నారు. విద్యార్థుల జీవితాలు కార్పొరేట్ గుప్పిట్లోకి వెళ్లనుండడంతో విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.



# వర్సిటీలపై ప్రైవేటు పెత్తనం!

- విద్యార్థుల జీవితం కార్పొరేట్ గుప్పిట్లో..
- వర్సిటీల భవితవ్యం అగమ్య గోచరం
- ప్రశ్నపత్రాల మూల్యాంకన, ఫలితాల వెల్లడిపై టెండర్లు పిలుస్తున్న వర్సిటీలు
- ఎస్వీయూలో కార్పొరేట్ సంస్థలకు ఆహ్వానం పలకనున్న అధికారులు

తిరుపతి సిటీ : యూనివర్సిటీల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్న నేపథ్యంలో వర్సిటీలో ప్రైవేటు సంస్థల ఆధిపత్యాన్ని ప్రోత్సహించేందుకు మరో అడుగు ముందుకేస్తోంది. ఇందులో భాగంగా డిగ్రీ, పీజీ విద్యార్థుల అడ్మిషన్ల వివరాలతో పాటు విద్యార్థులకు నిర్వహించే సెమిస్టర్ పరీక్షలు, ప్రశ్నపత్రాల మూల్యాంకనంతో పాటు, ఫలితాల వెల్లడి ఇక ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు అధికారులు అడుగులు

### మొక్కుబడిగా టెండర్లు

ఎగ్జామినేషన్ సెక్షన్ ప్రక్షాళన చేస్తున్నామంటూ వర్సిటీ అధికారులు ప్రైవేటు సంస్థలకు టెండర్లు ఆహ్వానించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించాలనే ఉద్దేశంతో ఆ సంస్థ సూచించిన ఆదేశాలతో మొక్కుబడిగా టెండర్లు పిలిచి ఇప్పటికే నిర్ణయం తీసుకున్న బహుళ జాతి కంపెనీ చేతుల్లో పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ నుంచి డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల నిర్వహణ, పేపర్ల మూల్యాంకన, ఫలితాల వెల్లడిని ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టేందుకు నిర్ణయం తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలుస్తోంది.

వేస్తున్నారు. ఈ మేరకు ఓ పేరొందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ సూచనల మేరకు ఎస్వీయూ అధికారులు టెండర్లు పిలవనున్నారు. దీంతో ఉన్నత చదువులను అభ్యసించే విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారనుంది. విద్యార్థుల భవితవ్యం పూర్తిగా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల అధీనంలోకి వెళ్లనుంది.

### పేదలకు ఉన్నత విద్య దూరం

వర్సిటీలలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తుంటారు. కానీ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను దూరం చేస్తోంది.

ఇందులో భాగంగానే ఇప్పటికే ఎస్వీయూ లాంటి ప్రధాన వర్సిటీలో పలు కోర్సులను రద్దు చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల ఆర్ట్స్ విభాగంలో పదుల సంఖ్యలో కోర్సులను విలీనం పేరుతో రద్దు చేసిన అధికారులు, అకడమిక్ కన్సల్టెంట్లను సైతం తొలగించారు. దీంతో పెద్ద ఎత్తున తాత్కాలిక అధ్యాపకులు, విద్యార్థుల నిరసన వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎస్వీయూలో పేద విద్యార్థులు చదివే కోర్సులకు చరమగీతం పాడిన వర్సిటీ అధికారులు ప్రస్తుతం వర్సిటీని ప్రైవేటీకరణ చేయడం దారుణమని మేధావులు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నారు.

### ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడితే ఊరుకోం



వర్సిటీని ప్రైవేటు పరం చేసే విధంగా అధికారులు నిర్ణయాలు తీసుకుంటే అడ్డుకుంటాం. పరీక్షల విభాగాన్ని టీసీఎస్ కంపెనీ లాంటి ప్రైవేటు సంస్థల సూచనలు పాటిస్తూ టెండర్లకు ఆహ్వానిస్తే అడ్డుకుని తీరుతాం. పేద బడుగు బలహీన వర్గాల ఉన్నత విద్యను సైతం కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉద్యమిస్తాం. – అశోక్, ఎస్ఎఫ్ఐ వర్సిటీల కోర్డినేటర్, తిరుపతి

### తిరుగుబాటు తప్పదు



ఎస్వీయూ పరీక్షల విభాగాన్ని ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థుల భవితవ్యం అంధకారమే. వర్సిటీ ప్రైవేటు పరం అయినట్టే. ఎంతో ప్రతిష్టాత్మకమైన వర్సిటీని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం దారుణం. పరీక్షల నియంత్రణ, మూల్యాంకన, ఫలితాల వెల్లడిని ప్రైవేటు వ్యక్తులు చేతుల్లోకి పెడితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. –డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, తిరుపతి

### ప్రైవేటుకు అప్పగించేందుకే..



ఎస్వీయూలో పరీక్షల విభాగం అధికారుల పని తీరు దారుణంగా ఉంది. వర్సిటీని ప్రక్షాళన చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ప్రైవేటీకరణపై దృష్టి సారించడం దారుణం. మూల్యాంకనతో పాటు పరీక్షా ఫలితాల వెల్లడి ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు అధికారులు టెండర్లు పిలిచే ప్రయత్నం చేయడాన్ని అడ్డుకుంటాం. – శివశంకర్ నాయక్, జీఎస్ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, తిరుపతి

### విద్యార్థుల ప్రతిఘటన తప్పదు



ఎస్వీయూను ప్రైవేటీకరణ చేస్తే ఐక్య విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ప్రతిఘటిస్తాం. పరీక్షల విభాగాన్ని పటిష్టం చేయాల్సిన అధికారులు చేతులెత్తేయడం దారుణం. పరీక్షల విభాగాన్ని ప్రైవేటీకరణ చేస్తూ ఎస్వీయూ అధికారులు టెండర్లు పిలిచే ప్రక్రియను వ్యతిరేకిస్తున్నాం. పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం. – ఆర్ ఆషా, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి, తిరుపతి

### శ్రీవారి దర్శనానికి 10 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 77,295 మంది స్వామివారిని దర్శించుకోగా 26,779 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.92 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### శేషవాహనంపై 'గణ' విహారం



కాణిపాకం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి స్వర్ణ చిన్న, పెద్ద శేషవాహన సేవల్లో విహరించారు. వాహన సేవల్లో విహరించిన విఘ్నేశ్వరుడుని అశేష భక్తజనం దర్శించి పునీతులయ్యారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం సిద్ధి, బుద్ధి, సమేత వరసిద్ధి వినాయకస్వామి స్వర్ణ చిన్న, పెద్ద శేష వాహనంపై అభయమిచ్చారు. అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత గౌరీసుతుడికి విశేషాలంకరణ చేసి చిన్న శేష వాహనంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పురవీధుల్లో వేడుకగా ఊరేగించారు.

### పెద్దింట్లమ్మా.. పాహిమాం



కై కలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. పాహిమాం.. అంటూ భక్తులు ఆర్తితో వేడుకున్నారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సమీప జిల్లాల నుంచి వేలాది భక్తులు అమ్మను దర్శించుకున్నారు. మేకలు, గొర్రెలను వేడి నైవేద్యాలుగా సమర్పించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. తలనీలాల వద్ద రద్దీ కనిపించింది. భక్తులు కోనేరు స్నానాలు ఆచరించి ప్రదక్షణలు చేశారు. ఆలయ ఈవో మాట్లాడుతూ వివిధ పూజలు, విరాళాల ద్వారా రూ.20,037 ఆదాయం వచ్చిందని తెలిపారు.

### శ్రీవారి క్షేత్రంలో రద్దీ సాధారణం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి దివ్య క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సెలవు దినం కావడంతో ప్రతి వారం వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. ఈ వారం అష్టమి తిథి కావడంతో నామమాత్రంగా భక్తులు ఆలయానికి విచ్చేశారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, కల్యాణకట్ట తదితర విభాగాల్లో భక్తుల రద్దీ స్వల్పంగా కనిపించింది. వచ్చే ఆదివారం చంద్ర గ్రహణం కావడంతో అప్పటి వరకు ఆలయంలో భక్తుల రద్దీ నామమాత్రంగానే ఉండొచ్చని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

---

# మాటలు..బంధానికి బీటలు

అ..అతడు.. ఆ.. ఆమె.. ఇద్దరూ పక్కపక్కనే ఉండే అక్షరాలు. నూరేళ్ల జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించాల్సిన ఆలుమగలు. ఒకరికొకరం అనుకుంటూ ముందుకు నడవాల్సిన వారి మధ్య దూరం పెరుగుతోంది. కలిసి నడవాల్సిన పాదాలు తడబడుతున్నాయి. సర్దుకుపోలేమంటూ విడిపోయేందుకు సిద్ధపడుతున్నారు. మనస్సును మరింతగా మురిపించాల్సిన గిల్లికజ్జాల స్థానంలో అనుమానపు బీజాలు పడుతున్నాయి. చిలిపి చేష్టలు..అల్లరిగా గడపాల్సిన భార్యభర్తలు తమ జీవితాలను అల్లరిపాలు చేసుకుంటున్నారు. పని ఒత్తిడిలో మాటలు దూరమై.. కాపురాలు కాలదన్నుకునేంతవరకు వెళుతున్నారు. సరిదిద్దే పెద్దలు లేక ఎడముఖం..పెడముఖంగా సాగుతున్నారు. చివరకు ఈ కాపురం మావల్ల కాదంటూ విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు.

- మావిడాకులు వాడేలోపే విడాకులు
- వైవాహిక చట్రంలో ఇమడలేకున్న బంధాలు
- విడాకుల వైపు వడివడిగా పెరుగుతున్న అడుగులు
- విడిపోయాక కలిసి జీవించడంపై యువతరం ఆసక్తి


చిత్తూరు అర్బన్: పెళ్లంటే.. ప్రీ వెడ్డింగ్ షూట్. ఎంగేజ్‌మెంట్ షూట్. బ్యాచ్‌లర్ పార్టీ. సంగీత్, మెహందీ.. ఆకాశమంత పందిరి.. మేళ తాళాలు. మూడుముళ్లు. మరి ఆ మూడు ముళ్లు పడిన మూడు నెలల తరువాత..? విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కడం. ఎంత వైభవంగా పెళ్లిళ్లు జరుగుతున్నాయో.. అంతే తొందరగా విడాకులకు సైతం ఉబలాట పడుతున్నారు. విడిపోయాక.. అదే జంట వాళ్లతోనే ప్రేమలో కూడా పడుతున్నారు. ఒకప్పుడు మహానగరాల్లో మాత్రమే కనిపిస్తున్న ఈ పోకడ.. ఇప్పుడు చిత్తూరు లాంటి నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లోనూ ఎక్కువగా కనిపిస్తోంది.

### అర్థం కావడంలేదు

ప్రస్తుతం పెళ్లిళ్లు చేసుకుంటున్న యువతరానికి వైవాహిక బంధం అంత సులువుగా అర్థం కావడంలేదు. ప్రేమ, పెళ్లి వరకు ఉంటున్న ఆసక్తి.. పెళ్లి తరువాత కొనసాగనంటోంది. ప్రేమికులుగా ఉన్నప్పుడు బాధ్యత ఉండదు. మూడు ముళ్లు పడేటప్పుడు వర్ణించడానికి వీలుకాని మధుర క్షణాలు.. అటు తరువాత నిలకడగా ఉండడంలేదు. దీనికి కారణం ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడమేనని మానసిక వైద్య నిపుణులు, మధ్యవర్తిత్వం చేసే కౌన్సెలర్లు స్పష్టం చేస్తున్నారు. పెళ్లయిన కొత్త జంటలో ఒకరు ఉద్యోగం చేస్తుంటే, మరొకరు ఇంట్లో ఒంటరిగా ఉండలేక.. కుటుంబ సభ్యులతో మనస్తత్వం కలవక.. విడాకులవైపు అడుగులు వేస్తున్నారు. ఒకవేళ ఇద్దరూ ఉద్యోగులైతే ఇక్కడ కూడా చాలా జంటల్లో సమస్య తలెత్తుతోంది. ఇంటి పనుల్లో ఇద్దరి మధ్య సమన్వయం కుదరకపోవడం, పనిచేసే ఆఫీసులో ఎదురయ్యే ఒత్తిడి, సమస్యలు భాగస్వామిపై చూపించేసి.. ఇక కలిసి ఉండలేమని నెలల్లోనే నిర్ణయాలు తీసేసుకుంటున్నారు. ఒక్క చిత్తూరు నగరంలోనే గత ఎనిమిది నెలల్లో 183 మంది విడాకుల కోసం కోర్టు మెట్లక్కారు. ఇందులో పెళ్లయిన సంవత్సరంలోపు విడాకుల కోరుకుంటున్న వారి సంఖ్య 32 శాతం ఉండడం వివాహ బంధంపై ఉన్న నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తోంది.

### విడగొడుతున్న 'సెల్' భూతం

దంపతులు విడిపోతుండటానికి ప్రధాన కారణం మాత్రం సెల్‌ఫోన్‌గా తెలుస్తోంది. కొత్తగా పెళ్లయిన జంటలు అర్ధరాత్రి వరకు సోషల్ మీడియాలో గడుపుతుండడం, తన భాగస్వామిని పట్టించుకోకుండా ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం, కొందరు అవధుల్లేని విశృంఖల కోరికలు కోరడం లాంటివి అవతలి వ్యక్తికి జీవితంపై విరక్తి పుట్టిస్తోంది. ఇటీవల చిత్తూరు పోలీసుల వద్దకు కౌన్సెలింగ్‌కు వచ్చిన ఓ జంట 'మాకు పెళ్లయ్యి 38 రోజులయ్యింది. నా భర్త వేకువజామున 3 గంటల వరకు కూడా పబ్జీ ఆడుకుంటున్నాడు. ఒక రోజు, రెండు రోజులు.. కానీ ప్రతిరోజూ ఇదే తంతు. ఇతనితో కలిసి ఉండడం నావల్ల కాదు..' అంటూ 22 ఏళ్ల యువతి తన ఆవేదనను వ్యక్తం చేయడం అక్కడున్న కౌన్సెలర్లను ఆశ్చర్యానికి గురిచేసింది. పడకగదిలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడం తమ ప్రేమానురాగాలు, దాంపత్యజీవితాన్ని మూడో వ్యక్తికి చూపించడమే అవుతుందని చాలా మందికి అర్థం కావడంలేదు.



### విడిపోయి ఒక్కటిగా..!

చిత్తూరు నగరానికి చెందిన శుభ ప్రభుత్వ ఉద్యోగి. భర్త లలిత్ అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్.. రెండేళ్లపాటు సాగిన వీళ్ల దాంపత్యానికి ఇటీవల గుడ్‌బై చెప్పి, విడాకులు తీసుకున్నారు. విడాకులు తీసుకున్న మూడు నెలల తరువాత తరచూ ఈ జంట కలుస్తుండడం, సినిమాలు, షాపింగ్‌లకు వెళ్లడం.. అటు తరువాత ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోవడం. ఇటీవల ట్రెండ్‌లోకి వచ్చిన ఈ పద్ధతులను క్యాజువల్, నాన్-కమిటెడ్ రిలేషన్, వన్‌నైట్ స్టాండ్, షార్ట్‌టెర్మ్, లో-ఇంటిమెసీ రిలేషన్‌షిప్ లాంటి రకరకాల సహ జీవన విధానాలు సామాజిక మాధ్యమాల ద్వారా అందరికీ తెలుస్తున్నాయి. పెళ్లి లాంటి బంధాలకన్నా.. మనసులో ఉన్నది ఉన్నట్టు చెబుతూ, తమకు కావాల్సిన బంధాలను కొనసాగిస్తున్నారు.

### సర్దుకుంటున్న వాళ్లు చాలా తక్కువ..




విడాకుల కోసం న్యాయస్థానం మెట్లెక్కుతున్న జంటలకు మేము కౌన్సెలింగ్ ఇస్తుంటాం. ఈ మధ్య ఒకటి గమనించాం. దంపతులు సర్దుకోవడం, మళ్లీ కలిసి ఉండడం అనే ప్రస్తావనను ఏమాత్రం ఒప్పుకోనంటున్నారు. ఆర్థిక స్థిరత్వం ఉన్నవాళ్లు అస్సలు కలిసి ఉండడానికి ఇష్టపడడంలేదు. మారుతున్న తరాలకు మధ్య స్వేచ్ఛ, ఒంటరితనం, నచ్చినట్టు బతకడం, భర్త–భార్య ఒకరినొకరు ప్రశ్నించకుండా ఉండాలనుకోవడం లాంటివి ఎక్కువగా కోరుకుంటున్నారు. – చక్రవర్తిరెడ్డి, న్యాయవాది, చిత్తూరు

### చట్టపరంగానే..



వివాహ బంధం గొప్పదే. కానీ ఒకరిపై ఒకరికి తప్పకుండా గౌరవం, నమ్మకం ఉండాలి. అవి లేకుండా చాలా మంది విడిపోవడానికి మొగ్గు చూపిస్తున్నా రు. ఇంట్లో గొడవ అని వచ్చే దంపతులకు మంచీ- చెడు చెప్పి కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నాం. ఇక కలిసి ఉండలేము, కేసులు పెట్టండి అని కొందరు వస్తుంటారు. మెయింటెనన్స్, భరణం కోసం వచ్చేవాళ్లకు చట్టపరంగా ముందుకు వెళ్లాలని సూచిస్తున్నాం. – టి.సాయినాథ్, డీఎస్పీ, చిత్తూరు


ఉదయ్‌పూర్ సిటీ ప్యాలెస్



ఉదయ్‌పూర్ లేక్ ప్యాలెస్


# రాజస్థాన్ రాయల్ టూర్



మహారాణా ప్రతాప్

ఇది రాజకోట రహస్యం చిత్రం కాదు.
అచ్చంగా రాజపుత్రులు ఏలిన కోటలు.
దుర్భేధ్యమైన కోటలు... చక్కని ప్యాలెస్‌లు.
ఉదయ్ సింగ్ కట్టించిన సిటీప్యాలెస్.
సజ్జన్‌సింగ్ మాన్‌సూన్ ప్యాలెస్.
మహారాణా పోరుగడ్డ హల్దీఘాటీ.
రాథోడ్ జోధా కట్టిన మెహరాన్‌గఢ్.
యూరోపియన్ స్టైల్ ఉమేద్‌భవన్.
బ్రహ్మకు ఆలయం కట్టిన పుష్కర్.
జయ్‌పూర్ పాలకుల అమేర్ ఫోర్ట్.
సిటీ ప్యాలెస్... హవామహల్... ఇవన్నీ
రాజస్థాన్‌లో సాగే రాయల్ టూర్‌లో.


హల్దీఘాటీలోని మహారాణా ప్రతాప్ మ్యూజియం


హల్దీఘాటీ పాస్


సజ్జన్‌గఢ్ మాన్‌సూన్ ప్యాలెస్


జోధ్‌పూర్‌లోని మెహరాన్‌గఢ్ కోట



పుష్కర్‌లోని బ్రహ్మ మందిరం


జైపూర్‌లోని ఆల్బర్ట్ హాల్ మ్యూజియం

**1వ రోజు:** హైదరాబాద్ నుంచి ఉదయ్‌పూర్‌కి ప్రయాణం. టూర్ నిర్వాహకులు ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో పికప్ చేసుకుంటారు. హోటల్ గదికి వెళ్లి చెక్ ఇన్ కావడం, హోటల్‌లో లంచ్ తర్వాత సిటీ ప్యాలెస్ సందర్శనం, పిచోలా లేక్‌లో విహారం, రాత్రి డిన్నర్, బస ఉదయ్‌పూర్‌లోనే.

## ఉదయ్‌పూర్ రాజమందిరం

సిటీప్యాలెస్‌గా వ్యవహారంలో ఉన్న ఈ భవనం ఉదయ్‌పూర్ రాజుల పాలన, నివాస మందిరం. సిసోడియా రాజవంశం రాజులు అనేక మంది ఈ భవనం నుంచే పాలన సాగించారు. ప్రస్తుతం ప్యాలెస్‌లో కొంత భాగంలో సిసోడియా రాజకుటుంబ వారసుడు లక్ష్యరాజ్ సింగ్ మేవార్ నివసిస్తున్నాడు. కొంత భాగంలో పర్యాటకులను అనుమతిస్తారు. రాణి వంటగది, రాజు యుద్ధ సామగ్రి, యుద్ధం సమయంలో రాజు ధరించే కవచాన్ని పరిశీలనగా చూడాలి. రాజు కవచం సైజును బట్టి రాజు ఎత్తు అంచనాకు వస్తుంది. అలాగే రాణాప్రతాప్ గుర్రం చేతక్ యుద్ధం సమయంలో ధరించే కవచం కూడా ఉంది. చేతక్ నమూనా గుర్రాన్ని తయారు చేయించి ఆ కవచాన్ని ధరింపచేశారు. ఆ గుర్రం తెల్లగా ఎత్తుగా, పొడవుగా ఉంటుంది. ఇక రాణి మందిరం విషయానికి వస్తే మందిరం ముందు రాజు వేచి ఉండే పాలరాతి బల్లను చూడాలి. రాజు ఒక వేళ రాణి అలంకరణ పూర్తయ్యేలోపే వస్తే అలంకరణ పూర్తయ్యే వరకు ఆ పాలరాతి బల్ల మీద కూర్చుని ఎదురు చూసేవాడని చమత్కారంగా చెబుతారు గైడ్‌లు. ఏనుగుల బలప్రదర్శన గోడను చూడాలి. గోడకు అవతల ఒక ఏనుగు, ఇవతల ఒక ఏనుగు ఉంటాయి. తొండాలను మెలి వేసి వెనక్కు లాగుతాయి. తనను తాను ఆపుకోలేక ముందుకు వచ్చి గోడను తాకిన ఏనుగు ఓడిపోయినట్లు. పిచోలా సరస్సు ఒడ్డున ఉంది సిటీప్యాలెస్. సరస్సు మధ్యలో లేక్ ప్యాలెస్, ఒక వైపుగా జగ్ మందిర్, జగ్‌మోహన్ ప్యాలెస్‌లను పడవలో విహరిస్తూ చుట్టిరావచ్చు. లేక్‌కు మరొక ఒడ్డున దర్బార్‌హాల్ ఉంటాయి. దర్బార్ హాల్‌లో నాటి రాజకొలువు బొమ్మలతో కొలువు దీరి ఉంటుంది.

**2వ రోజు:** బ్రేక్‌ఫాస్ట్ తరవాత హోటల్ నుంచి బయలుదేరి సజ్జన్‌గఢ్ ప్యాలెస్‌కు ప్రయాణం. ప్యాలెస్ సందర్శనం తర్వాత ప్రయాణం హల్దీఘాటికి. హల్దీఘాటిలో మహారాణా ప్రతాప్ మ్యూజియం చూసిన తర్వాత సాయంత్రం నథ్‌ద్వారా కోట సందర్శనం. రాత్రి బస ఉదయ్‌పూర్‌లోనే.

## ఎడారి మేఘం

సజ్జన్‌గఢ్ ప్యాలెస్ నిర్మాణాన్ని మహారాణా సజ్జన్ సింగ్ ఓ గొప్ప ఆలోచనతో మొదలుపెట్టాడు. జయ్‌పూర్‌లో జంతర్‌మంతర్‌లాగా ఖగోళ పరిశోధన, అధ్యయన కేంద్రం నిర్మించాలనుకున్నాడు. అలాగే మేవార్ రాజధాని నగరం ఉదయ్‌పూర్ మొత్తం కనిపించే విధంగా ఆరావళి పర్వత శ్రేణుల్లో ఎత్తైన కొండ మీద నిర్మించాడు. ఐదంతస్థుల ఈ ప్యాలెస్ పైనుంచి చూస్తే ఉదయ్‌పూర్‌లోని సరస్సులు కనిపిస్తాయి. వర్షాకాలంలో రాజు ఇక్కడ కొద్దిరోజులు విడిది చేసి రాజ్యంలో నీటి నిల్వలను గమనించేవాడని చెబుతారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే మేవార్ పాలకులు ఉదయ్‌పూర్‌ని రాజధాని చేసుకోక ముందు చిత్తోర్‌గఢ్ నుంచి పాలన సాగించేవారు. సజ్జన్ గఢ్ ప్యాలెస్ నుంచి చిత్తోర్‌గఢ్ కోట కూడా కనిపించే విధంగా డిజైన్ చేసుకున్నారు. కానీ సజ్జన్‌సింగ్ ఆకస్మిక మరణం తర్వాత వచ్చిన పాలకులు ప్యాలెస్ నిర్మాణాన్ని పూర్తి చేయగలిగారు కానీ ఖగోళ అధ్యయనం దిశగా పనులు సాగలేదు. మూడు ప్రధాన ఉద్దేశాల్లో రెండు ఉద్దేశాలు మాత్రమే నెరవేరాయి. ఈ ప్యాలెస్‌లోకి పర్యాటకులు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాహనాల్లో వెళ్లాలి. సజ్జన్‌గఢ్‌ను సూర్యాస్తమయం సమయంలో చూడగలిగితే బంగారు రంగులో మెరుస్తూ అందంగా ఉంటుంది.

## ఆత్మాభిమాన పోరు

హల్దీఘాటీ అనే ప్రదేశం పేరుకు తగ్గట్లే పసుపు రంగులో ఉంటుంది. మట్టి, రాయి, రప్ప అంతా నేలకు పలుచగా పసుపు అద్దినట్లు, పసుపు నీటితో కళ్లాపి చల్లినట్లు ఉంటుంది. ఉదయ్‌పూర్ జిల్లా నుంచి రాజ్‌సమంద్ జిల్లా కేంద్రానికి వెళ్లే దారిలో వస్తుంది. ప్రధాన రహదారి నుంచి డైవర్షన్ తీసుకున్న తర్వాత దాదాపు 30 కిలోమీటర్ల దూరం అటవీ ప్రదేశంలో ప్రయాణించాలి. హల్దీఘాటీలో యుద్ధభూమిని చేరేలోపు చేతక్ స్మారకం కనిపిస్తుంది. రాణాప్రతాప్‌కు ఇష్టమైన గుర్రం చేతక్. యుద్ధంలో రాణా ప్రతాప్ గాయపడడంతో ఆ సంగతి తెలుసుకున్న చేతక్ యజమానిని కాపాడుకోవడానికి యుద్ధరంగం నుంచి పరుగులంఘించుకుంది. మధ్యలో ప్రవహిస్తున్న బాణాస్ నదిని దాటడానికి ఒక్క ఉదుటున దుమికింది. అప్పుడది గాయపడి ఆ తర్వాత కొద్ది దూరం ప్రయాణించి నేలకొరిగింది. చేతక్ జ్ఞాపకార్థం రాణా ప్రతాప్ నిర్మించిన స్మారకం అది. ఇది కాకుండా ఉదయ్‌పూర్ నగరంలో తెల్లటి చేతక్ విగ్రహంతో చేతక్ సర్కిల్ కూడా ఉంది. ఇక హల్దీఘాటీలో మ్యూజియాన్ని చూస్తే రాణాప్రతాప్ జీవితం మొత్తం కళ్లకు కడుతుంది. ఈ యుద్ధంలో మొఘల్ ప్రతినిధిగా మాన్‌సింగ్, మేవార్ పాలకుడిగా మహారాణా ప్రతాప్ తలపడ్డారు. భీకర యుద్ధం జరిగింది కానీ రాణాప్రతాప్ తన మేవార్ రాజ్యాన్ని మొఘలుల ఆధీనంలోకి వెళ్లకుండా కాపాడుకోగలిగాడు.

**3వ రోజు:** ఉదయ్‌పూర్ నుంచి జోధ్‌పూర్‌కి ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి జోధ్‌పూర్ వైపు సాగిపోవాలి. జోధ్‌పూర్‌లో మెహరాన్‌గఢ్ కోట వీక్షణం తర్వాత హోటల్‌లో చెక్ ఇన్. రాత్రి బస జోధ్‌పూర్‌లో.

## సూర్యుడి కోట

మెహరాన్‌గఢ్ అంత పెద్దది ఇంత విశాలమైనది అని చెప్పడం కంటే... పన్నెండు వందల ఎకరాల్లో విస్తరించిన నిర్మాణాల సముదాయం అని ఒక్క మాటలో చెప్పాలి. ఇంగ్లిష్ రచయిత రడ్‌యార్డ్ క్లిప్పింగ్ ఈ కోటను వర్ణిస్తూ 'దిగ్గజ భవన నిర్మాత నిర్మించిన కోటకు ఉదయించే సూర్యుడు రంగులద్దినట్లు ఉంది' అన్నాడు. ఈ భవనం పేరు కూడా సూర్యుడి పేరుతోనే వచ్చింది. మిహిర్‌ఘర్ అంటే సూర్యుని కోట అని, అదే పదాన్ని రాజస్థానీ భాషలో మెహరాన్‌గఢ్ అంటారు. రాథోర్ రాజవంశం నిర్మించిన కోట ఇది. రాథోర్‌లు సూర్యుడి ఆరాధకులు. దాంతో కోటను ఉదయించే సూర్యుని కిరణాలతో ప్రభవించేటట్లు డిజైన్ చేశారు. ఈ కోటను రావు జోధా అనే రాజు నిర్మించాడు. అతడి పేరుతోనే ఈ రాజ్యానికి జోధ్‌పూర్ అనే పేరు వచ్చింది. ఇందులోని బంగారు పల్లకి దగ్గర ఫొటో తీసుకోవడం మరిచిపోవద్దు.

**4వ రోజు:** జోధ్‌పూర్ నుంచి పుష్కర్‌కు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. ఉమేద్ భవన్ ప్యాలెస్ సందర్శనం తర్వాత పుష్కర్‌కు ప్రయాణం. హోటల్‌లో చెక్ ఇన్, రాత్రి బస పుష్కర్‌లో.

## ఇండో-యూరోపియన్ ప్యాలెస్

రాజస్థాన్ రాష్ట్రం కోట తెలుగు వారికి సుపరిచితమైన ప్రదేశం. ఆ రాజ్యాన్ని పాలించిన రాజు మహారావ్ రెండవ ఉమేద్ సింగ్ నిర్మాణం మొదలుపెట్టాడు. అతడి పేరుతోనే ఉమేద్ భవన్ ప్యాలెస్‌గా వాడుకలోకి వచ్చింది. ఇతర రాజస్థాన్ నిర్మాణాలతో పోల్చి చూసినప్పుడు ఇందులో కొంత వైవిధ్యంగా యూరోపియన్ నిర్మాణ శైలి కనిపిస్తుంది. బ్రిటిష్ ఆర్కిటెక్ట్ సామ్యూల్ స్విన్‌టన్ చేత దీనిని డిజైన్ చేయించాడు ఉమేద్ సింగ్. నిర్మాణం ఇరవయ్యవ శతాబ్దం వరకు సాగింది. ఇందులో కోట రాజవంశం నివసిస్తోంది. కొంత భాగంలో పర్యాటకులను అనుమతిస్తారు. ఇది ఇప్పుడు హెరిటేజ్ హోటల్.

## ఆలయాల నిలయం పుష్కర్

పుష్కర్ అనగానే పుష్కర్ సరస్సు గుర్తొస్తుంది. ఈ సరస్సు చుట్టూ విస్తరించిన పట్టణం ఇది. ఈ సరస్సులో స్నానం చేయడాన్ని పవిత్రంగా భావిస్తారు. ఇక్కడ ఆలయాలను లెక్క చెప్పడం సాధ్యం అయ్యే పని కాదు. నాలుగు వందల వరకు ఉంటాయని అంచనా. సిక్కులకు కూడా ఇది పవిత్రస్థలం. పుష్కర్ యాత్రికులు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన సంగతి ఏమిటంటే ఇక్కడ ధూమపానం, మద్యపానం, మాంసాహారాన్ని భుజించడం నిషిద్ధం. ఇక్కడ ఏటా కార్తీక మాసంలో జరిగే కామెల్ ఫెయిర్ ప్రసిద్ధి. ఈ వేడుక కోసం విదేశాల్లో స్థిరపడిన భారతీయులు, విదేశీయులు కూడా వస్తారు.

### తెలుసుకోవాల్సిన మరికొన్ని సంగతులు:

- విమాన ప్రయాణ సమయాల్లో అవసరాన్ని బట్టి కొద్ది మార్పులు జరిగే అవకాశం ఉంది.
- టూర్ ఐటెనరీ ప్లానింగ్‌లో ఆలయ దర్శనానికి తగిన సమయం మాత్రమే కేటాయించడం జరుగుతుంది. పూజాదికాలు నిర్వహించాలంటే సదరు పర్యాటకులు పూజ తర్వాత తమకు తాముగా హోటల్ గదికి చేరాల్సి ఉంటుంది. టూరిస్ట్ ప్యాకేజ్ బస్ పూజ పూర్తయ్యే వరకు ఎదురు చూడడం సాధ్యం కాదు.
- ఆలయాలకు కొన్ని చోట్ల పెద్ద బస్సు వెళ్లే అవకాశం ఉండదు, అలాంటి చోట్ల పర్యాటకులు కొంత మేర నడిచి వెళ్లాల్సి ఉంటుంది. నడవలేని వాళ్లు స్థానికంగా ఆటోలు తమకు తాముగానే పెట్టుకోవాలి.
- పర్యాటకులు తమ ఆరోగ్య కారణాల రీత్యా పార్సిల్ ఫుడ్ వెంట పెట్టుకోవాలి. ఎనర్జీనిచ్చే చాక్లెట్‌లు, బిస్కట్, డ్రైఫ్రూట్స్, వేరుశనగ పప్పు వంటివైనా దగ్గర ఉంచుకోవడం మంచిది.
- ఈ టూర్ ఐటెనరీలో జయ్‌పూర్‌లో జంతర్‌మంతర్, హవామహల్ లేకపోవడం పెద్ద లోటనే చెప్పాలి.

### ప్యాకేజ్‌లో ఇవన్నీ ఉంటాయి:

- హైదరాబాద్ నుంచి ఉదయ్‌పూర్‌కి, జయ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కి విమానం టిక్కెట్లు.
- ఉదయ్‌పూర్‌లో 2 రాత్రులు, జోధ్‌పూర్‌లో ఒక రాత్రి, పుష్కర్‌లో ఒక రాత్రి, జయ్‌పూర్‌లో ఒక రాత్రి హోటల్ బస.
- 5 రోజులు బ్రేక్‌ఫాస్ట్, ఒక లంచ్, 5 రోజులు రాత్రి భోజనం.
- సైట్ సీయింగ్‌కి ఏసీ 35 సీటర్ బస్ ప్రయాణం. ట్రావెల్ ఇన్సూరెన్స్, ఐఆర్‌సీటీసీ టూర్ ఎస్కార్ట్.

- 'రాయల్ రాజస్థాన్' టూర్ ప్యాకేజ్ కోడ్ ఎస్‌హెచ్‌ఏ12. ఈ ఆరు రోజుల పర్యటన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి 14.9.2025న మొదలవుతుంది. ఈ టూర్‌లో ఉదయ్‌పూర్, జోధ్‌పూర్, పుష్కర్, జయ్‌పూర్ కవర్ అవుతాయి. ఈ నెల 14వ తేదీ ఉదయం 7.40 గంటలకు '6 ఈ 6323' విమానం హైదరాబాద్ నుంచి బయలుదేరుతుంది. 9.25 గంటలకు ఉదయ్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణం 19వ తేదీ రాత్రి 8.50 గంటలకు '6ఈ 816' విమానం జయ్‌పూర్ నుంచి బయలుదేరి 10 .55 గంటలకు హైదరాబాద్‌కి చేరుతుంది.
- ప్యాకేజ్ ధరలిలాగ: కంఫర్ట్ కేటగిరీ సింగిల్ ఆక్యుపెన్సీలో 42, 450 రూపాయలు, డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 33,900, ట్రిపుల్ ఆక్యుపెన్సీలో 32,450 రూపాయలు.


జైపూర్ సిటీ ప్యాలెస్‌లోని శోభా నివాస్

**5వ రోజు:** పుష్కర్ నుంచి జయ్‌పూర్‌కు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్, బ్రహ్మ మందిర దర్శనం తర్వాత జయ్‌పూర్‌కి ప్రయాణం. జయ్‌పూర్‌లో సిటీ ప్యాలెస్ వీక్షణం, హవా మహల్ మీదుగా హోటల్‌కు ప్రయాణం. గదిలో చెక్ ఇన్, రాత్రి బస జయ్‌పూర్‌లో.

## బ్రహ్మ మందిరం

భూమ్మీద బ్రహ్మకు ఆలయం లేని లోటును తీరుస్తోంది పుష్కర్. ఇక్కడి బ్రహ్మమందిరాన్ని విశ్వామిత్రుడు నిర్మించాడని చెబుతారు. విశ్వామిత్రుడు బ్రహ్మ కోసం యజ్ఞం చేసిన తర్వాత ఈ ఆలయాన్ని నిర్మించాడనేది స్థల పురాణం. ఆ తర్వాత ఎనిమిదవ శతాబ్దంలో ఆది శంకరాచార్యుడు పునరుద్ధరించాడు. ప్రస్తుతం మనకు కనిపిస్తున్న ఆలయ రూపం 14వ శతాబ్దంలో మహారాజా జవత్‌రాజ్ నిర్మాణం.

## జయ్‌పూర్ సిటీ ప్యాలెస్

మహారాజా సవాయ్ రెండవ జయ్‌సింగ్ నిర్మించిన ప్యాలెస్ ఇది. అమేర్ నుంచి రాజధానిని జయ్‌పూర్‌కు మారుస్తూ ఈ ప్యాలెస్‌ను నిర్మించారు. అప్పటి నుంచి రాజకుటుంబం సిటీ ప్యాలెస్‌లో నివసించేది. రాజకుటుంబ పరివారం ఐదు వందల కుటుంబాలు ప్యాలెస్ కాంప్లెక్స్‌లో ఉన్న ఇతర భవనాల్లో నివసించేవి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజాస్థానాలు దేశంలో విలీనమయ్యే వరకు జయ్‌పూర్ అధికారిక రాజభవనం ఈ సిటీప్యాలెస్. ఇప్పుడిది గొప్ప పర్యాటక ప్రదేశం. ఇందులో సవాయ్ రెండవ మాన్‌సింగ్ మ్యూజియం ఉంది. రాణి పద్మిని ఆధ్వర్యంలో ఏర్పాటైన మహారాజా సవాయ్ మాన్‌సింగ్ మ్యూజియం ట్రస్ట్ ను ప్రస్తుతం యువరాణి దియాకుమారి నిర్వహిస్తోంది. శోభానివాస్‌లో గ్లాస్ వర్క్, ఛావీ నివాస్‌లో నీలిరంగు గదిలో ఉన్న కళాత్మకతకు నాటి ఆర్కిటెక్ట్‌ల నైపుణ్యానికి చేతులెత్తి మొక్కాలనిపిస్తుంది. హవామహల్ మీదుగానే ప్రయాణం సాగుతుంది. శ్రీకృష్ణుడి కిరీటం ఆకారంలో ఉన్న హవామహల్ సౌందర్యాన్ని ఆస్వాదించాలి.


**6వ రోజు:** జయ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసిన తర్వాత బిర్లా టెంపుల్ వీక్షణం, ఆమేర్ ఫోర్ట్‌సందర్శనం తర్వాత టూర్ నిర్వాహకులు సాయంత్రం జయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో డ్రాప్ చేస్తారు. విమానం రాత్రి 8.50 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది.


## అమేర్... మాన్‌సింగ్ మందిరం

జయ్‌పూర్ నగరానికి 11 కిలోమీటర్ల దూరాన ఉంది అమేర్ ఫోర్ట్. ఇది కొండ మీద ఉంది. ఆరావళి పర్వతశ్రేణుల్లో విస్తరించిన రాజపుత్రుల రాజ్యంలో కోటలు, ప్యాలెస్‌లన్నీ నిర్మాణ అద్భుతాలే. రాజధానిని సిటీ ప్యాలెస్‌కు మార్చకముందు ఈ కోట నుంచే పాలన సాగింది. సామాన్య ప్రజలు రాజును కలవడానికి దివానీ ఆమ్, మంత్రివర్గంతోపాటు ఇతర ప్రముఖులు రాజుతో సమావేశమయ్యే దివానీ ఖాస్‌లు నాటి పరిపాలనను చాటి చెప్పే నిదర్శనాలు. రాజా మాన్‌సింగ్ ఇందులోనే నివసించాడు. ఈ నిర్మాణంలో పై అంతస్తులో మాన్‌సింగ్ బెడ్‌రూమ్, అతడి గది నుంచి కింది అంతస్థులో పన్నెండు మంది రాణుల బెడ్‌రూమ్‌లకు వెళ్లే మెట్ల నిర్మాణాన్ని పరిశీలించడం మరిచిపోవద్దు.

**బుకింగ్ కోసం సంప్రదించాల్సిన అడ్రస్:**
ఐఆర్‌సీటీసీ సౌత్ సెంట్రల్ జోన్
9-1-129/1/302,
ఎస్ డీ రోడ్, సికింద్రాబాద్, తెలంగాణ,
ఫోన్ నంబరు: 91 8287932229
ఈ మెయిల్: bsashidhar5605@irctc.com


జైపూర్ అమేర్ ఫోర్ట్‌లోని గణేశ్ పోల్ గేట్


అమేర్ ఫోర్ట్ కోర్ట్ యార్డ్


బిర్లామందిర్


కోటలోని ఉమేద్ భవన్ ప్యాలెస్

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి



మార్కెట్‌లో ప్రతివాళ్లు అమ్ముతున్నపుడు కొనాలి. ప్రతివాళ్లు కొనడం మొదలుపెట్టేవరకు అమ్మకుండావేచి ఉండాలి. ఇది కేవలం ఆకట్టుకునే నినాదం కాదు. విజయవంతమైన పెట్టుబడులకు మార్గం.

- జే.పాల్ గెట్టి, అమెరికన్ చమురు వ్యాపారవేత్త




# జీఎస్‌టీ కౌన్సిల్‌పైనే కళ్లన్నీ

**ఈ నెల 3-4న సమావేశం**
- వన్ను సంస్కరణలపై చర్చ
- నేడు మార్కెట్లకు జీడీపీ జోష్
- ఆటో రంగ విక్రయాలు కీలకం
- ఈ వారం మార్కెట్లపై అంచనా

కొద్ది రోజులుగా అటు దేశీ స్టాక్ మార్కెట్లకు, ఇటు పరిశ్రమ వర్గాలకు కీలకంగా మారిన వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) సంస్కరణలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టారు. మంగళ, బుధ వారాల్లో జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం కానుంది. మరోపక్క విశ్లేషకుల అంచనాలను మించుతూ 2025 ఏప్రిల్-జూన్‌లో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం ఎగసింది. దీంతో నేడు మార్కెట్లు కొంతమేర బలపడే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్



గత వారాంతాన వెలువడిన స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) గణాంకాలు పలువురు విశ్లేషకులను ఆశ్చర్యపరిచాయి. ఆర్థిక వృద్ధి 6.5 శాతం అంచనాలను మించుతూ ఏకంగా 7.8 శాతం బలపడింది. దీంతో దేశీయంగా సెంటిమెంటుకు జోష్‌రానున్నట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అయితే యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ విధించిన అదనపు(25 శాతం) టారిఫ్‌లు సైతం అమల్లోకిరావడంతో గత వారం స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్ల మధ్య కదలవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. విదేశీ ప్రతికూలతలున్నప్పటికీ ప్రభుత్వ వ్యయాలు, పాలసీ విధానాలు వంటి అంశాలు సానుకూలతకు దోహదం చేయవచ్చని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు.

**చర్చలు షురూ**

జీడీపీ జోరుకుతోడు జీఎస్‌టీ సంస్కరణల ప్రతిపాదనలపై పరిశ్రమవర్గాల్లో భారీ ఆశలు నెలకొన్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా తెలియజేశారు. జీఎస్‌టీ కౌన్సిల్ 2, 3 తేదీలలో నిర్వహించనున్న సమావేశాలలో పన్ను సంస్కరణల ప్రతిపాదనలపై చర్చించనుంది. దీంతో వస్తు, సేవల పన్ను సంస్కరణల అమలుపై అంచనాలు అధికమైనట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు. వన్ను రేట్లను భారీగా కుదించడంసహా శ్లాబులను తగ్గించేందుకు చేసిన ప్రతిపాదనలపై కౌన్సిల్ చర్చించనుంది.

**పలు గణాంకాలు**

ఈ వారం దేశీయంగా ఆగస్ట్ నెలకు వాహన విక్రయ గణాంకాలు వెలువడనున్నాయి. గత నెల హెచ్ఎస్‌బీసీ తయారీ, సర్వీసు రంగ పీఎంఐ ఇండెక్సుల తీరు సైతం వెల్లడికానుంది. శుక్రవారం (12న) ఆగస్ట్ రిటైల్ ధరల ద్రవ్యోల్బణ(సీపీఐ) గణాంకాలు వెల్లడికానున్నాయి. జూలైలో సీపీఐ 1.55 శాతానికి నీరసించింది. విదేశీ అంశాలకు వస్తే గత నెలకు చైనా తయారీ, సర్వీసుల రంగ వివరాలు తెలియనున్నాయి. గత నెలకు వ్యవసాయేతర రంగాలలో ఉపాధి కల్పన, నిరుద్యోగ గణాంకాలను యూఎస్ విడుదల చేయనుంది. వెరసి దేశ, విదేశీ గణాంకాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు కీలకంగా నిలవనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేశ్ గౌర్ అభిప్రాయపడ్డారు.

**ఇతర అంశాలు**

ఇటీవల కొద్ది రోజులుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే మొగ్గు చూపుతున్నారు. దీంతో మార్కెట్లపై ఒత్తిడి పడుతున్నట్లు నిపుణులు తెలియజేశారు. మరోవైపు డాలరుతో మారకంలో రూపాయి బలహీనపడటం ప్రతికూలంగా పరిణమించనున్నట్లు అభిప్రాయపడ్డారు. గత వారం డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ 88ను దాటి చరిత్రాత్మక కనిష్టానికి చేరిన సంగతి తెలిసిందే. ఇవేకాకుండా ముడిచమురు ధరల కదలికలకూ ప్రాధాన్యత ఉన్నట్లు నిపుణులు తెలియజేశారు.

**సాంకేతికంగా**

విదేశీ ఇన్వెస్టర్ల నిరంతర అమ్మకాలు, యూఎస్ ప్రెసిడెంట్ విధించిన అదనపు సుంకాలు అమల్లోకిరావడం, రూపాయి సరికొత్త కనిష్టాన్ని చవిచూడటం తదితర ప్రతికూలతలు ఇటీవల సెంటిమెంటును దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిఫ్టీకి 24,300 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభించవచ్చు. ఆపై 24,100, 24,000 స్థాయిలో సపోర్ట్ కనిపించవచ్చు. ఒకవేళ నిఫ్టీ బలాన్ని పుంజుకుంటే 25,000 పాయింట్లను తాకవచ్చు. తదుపరి 25,250 వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. సెన్సెక్స్ 79,150, 79,000 పాయింట్లవరకూ క్షీణించవచ్చు. ఆ స్థాయిలో బౌన్స్అయితే 82,000 వరకూ పుంజుకునే వీలుంది.

**గత వారమిలా**

వినాయక చవితి పండుగ సందర్భంగా నాలుగు రోజులకే పరిమితమైన ట్రేడింగ్‌లో దేశీ స్టాక్ మార్కెట్లు క్షీణపథంలో సాగాయి. గత వారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ నికరంగా 1,497 పాయింట్లు(1.8 శాతం) కోల్పోయింది. 79,810 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 443 పాయింట్లు(1.8 శాతం) క్షీణించి 24,427 వద్ద స్థిరపడింది. ఈ బాటలో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ మరింత అధికంగా 2.7 శాతంపైగా పతనమయ్యాయి.

## ఎఫ్‌పీఐల భారీ అమ్మకాలు

- రూ. 35,000 కోట్లు వెనక్కి
- గత 6 నెలల్లో అత్యధికం

గత నెల(ఆగస్ట్)లో ఎఫ్‌పీఐలు భారీ అమ్మకాలకు తెరతీశారు. దేశీ స్టాక్స్ నుంచి అత్యధిక శాతం పెట్టుబడులు వెనక్కి తీసుకునేందుకే ప్రాధాన్యమిచ్చారు. వెరసి ఆగస్ట్‌లో నికరంగా రూ. 34,993 కోట్ల (సుమారు 4 బిలియన్ డాలర్లు) విలువైన స్టాక్స్ విక్రయించారు. ఇది గత ఆరు నెలల్లోనే అత్యధికంకాగా.. జూలై అమ్మకాల (రూ.17,741 కోట్లు)తో పోలిస్తే రెట్టింపుకావడం గమనార్హం! దీంతో డిపాజిటరీ గణాంకాల ప్రకారం 2025 కేలండర్ ఏడాదిలో దేశీ స్టాక్స్ నుంచి మొత్తం రూ. 1.3 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నట్లయ్యింది. ఇంతక్రితం ఎఫ్‌పీఐలు 2025 ఫిబ్రవరిలో మాత్రమే ఈ స్థాయిలో అంటే రూ.34,574 కోట్ల స్టాక్స్ విక్రయించారు. ఇందుకు దేశ, విదేశీ అంశాలు కారణమవుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. దేశీయంగా కొన్ని రంగాలలో క్యూ1 ఫలితాలు నిరాశపరచడం, యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ అదనపు టారిఫ్‌ల విధింపు వంటి అంశాలను ప్రస్తావించారు.

## ప్యాసివ్ ఫండ్స్‌కి పెరుగుతున్న ఆదరణ

**ఏంజెల్ వన్ ఈడీ హేమేన్ భాటియా**

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా ప్యాసివ్ ఫండ్స్‌కి క్రమంగా ఆదరణ పెరుగుతోందని ఏంజెల్ వన్ ఈడీ హేమేన్ భాటియా తెలిపారు. 2010లో ఫండ్ పరిశ్రమ ఏయూఎంలో (నిర్వహణలోని ఆస్తుల పరిమాణం) 0.5 శాతంగా ఉన్న ప్యాసివ్ ఫండ్ల వాటా ప్రస్తుతం 16–17 శాతానికి చేరిందని ఆయన చెప్పారు. ఈటీఎఫ్‌ల ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల్లో



పెట్టుబడుల ఉపసంహరణ, పెన్షన్ ఫండ్ నిబంధనల సడలింపు, స్కీముల వర్గీకరణ, టోటల్ రిటర్న్ సూచీలతో పోల్చి చూసే ధోరణి పెరగటం మొదలైన అంశాలు ప్యాసివ్ ఫండ్స్ వృద్ధికి దోహదపడినట్లు భాటియా చెప్పారు. సాధారణంగా ఆయా విభాగాల ప్రామాణిక బెంచ్‌మార్క్‌లతో 3–10 ఏళ్ల వ్యవధికి పోల్చి చూసినప్పుడు దేశీయంగా 70–80 శాతం యాక్టివ్ ఫండ్స్ పనితీరు అంతంత మాత్రంగానే ఉంటోందని వివరించారు. అమెరికాలోనూ ఇలాంటి ధోరణే నెలకొన్న నేపథ్యంలో 2010లో 15 శాతంగా ఉన్న ప్యాసివ్ ఫండ్స్ వాటా ఇప్పుడు 41%కి చేరిందని భాటియా చెప్పారు. తాము ప్రస్తుతం అయిదు స్కీములు అందిస్తున్నామని చెప్పారు. ప్యాసివ్ పోర్ట్‌ఫోలియోకి అనుబంధంగా స్మార్ట్ బీటా ఫండ్స్‌ను కూడా త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు.

## టారిఫ్‌ల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పరిష్కారం

**ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఠాకూర్**

న్యూఢిల్లీ: అమెరికా విధించిన 50% టారిఫ్‌ల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళికపై ప్రభుత్వం పనిచేస్తున్నట్టు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అనురాధ ఠాకూర్ తెలిపారు. 'అధిక ఉపాధి కల్పిస్తున్న కొన్ని పరిశ్రమలు అమెరికాపై ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. అలాంటి పరిశ్రమలపై ఎక్కువ ప్రభావం పడొచ్చు. ఈ ప్రభావం ఎంతన్నది ప్రభుత్వం మదిస్తోంది. తగిన పరిష్కారాల కోసం కృషి చేస్తోంది' అని చెప్పారు.

# పోర్ట్‌ఫోలియోకు 'ప్యాసివ్' దన్ను

**వికాష్ వాడేకర్**



హెడ్ (ప్యాసివ్ బిజినెస్), యాక్సిస్ ఏఎంసీ

మార్కెట్ల పరిస్థితి ఒక్కో రోజు ఒక్కో రకంగా ఉంటుంది. ఒకరోజేమో అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు, మారిపోతున్న సమీకరణాల వల్ల కార్పొరేట్లపై ఎలాంటి ప్రభావం ఉంటుందోనని ఆందోళనగా ఉంటుంది. మరుసటి రోజు కార్పొరేట్ల ఆదాయాలు, వృద్ధి అంచనాలు సానుకూలంగా కనిపించడంతో చాలా ఉత్సాహంగా అనిపిస్తుంది. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు కొత్త ధోరణుల వెంటబడటం కాకుండా ఒక స్పష్టమైన, దీర్ఘకాలిక ప్రణాళిక ఉండటం మంచిది. ఇది గుర్తించే చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లు ప్రస్తుతం ప్యాసివ్ వ్యూహాల వైపు మళ్లుతున్నారు. తక్కువ వ్యయాలతో, పారదర్శకంగా, అందుబాటులో ఉండే ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌లు మెరుగ్గా రాణిస్తుండటంతో ఈ వ్యూహాన్ని ఎంచుకునే రిటైల్ ఇన్వెస్టర్లు కూడా పెరుగుతున్నారు. సులభతరంగా ఇన్వెస్ట్ చేసేందుకు, పెట్టుబడులను ట్రాక్ చేసుకునేందుకు డిజిటల్ ప్లాట్‌ఫాంలు వీలు కల్పిస్తుండటం, నియంత్రణ సంస్థలపరమైన మద్దతు, కొత్త ఆవిష్కరణలు కూడా ప్యాసివ్ ఫండ్స్ మరింత ప్రాచుర్యంలోకి రావడానికి దోహదపడుతున్నాయి.




**పలు ప్రయోజనాలు ..**

**తక్కువ వ్యయాలు:** ప్యాసివ్ ఇన్వెస్టింగ్‌లో అత్యంత ప్రయోజనకరమైన అంశమేమిటంటే, వీటిలో వ్యయాలు చాలా తక్కువగా ఉంటాయి. సాధారణంగా తరచుగా ట్రేడింగ్ చేయడం లేదా క్రియాశీలకమైన నిర్వహణ అవసరం ఉండదు కాబట్టి ఈ ఫండ్స్ వ్యయ నిష్పత్తులు చాలా తక్కువగా ఉంటాయి. ఈ వ్యత్యాసం తొలినాళ్లలో పెద్దగా తెలియకపోయినప్పటికీ, కాలక్రమేణా పోర్ట్‌ఫోలియో విలువ గణనీయంగా పెరిగినప్పుడు తెలుస్తుంది. ముఖ్యంగా దీర్ఘకాలిక ప్రణాళికలున్న వారికి, కెరియర్ ప్రారంభ దశలోని ఇన్వెస్టర్లకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. కాంపౌండింగ్ కారణంగా, ఫీజుల భారం కొంచెం తగ్గినా కూడా, దీర్ఘకాలిక రాబడులు పెరిగేందుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

**వైవిధ్యం:** వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోను రూపొందించుకోవడం చాలా సవాళ్లతో కూడుకున్నదై ఉంటుంది. ముఖ్యంగా కొత్త ఇన్వెస్టర్లకు ఇది ఇంకా కష్టంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఒకే ఇన్వెస్ట్‌మెంట్‌తో విస్తృత పెట్టుబడుల అవకాశాలను ప్యాసివ్ ఫండ్స్ కల్పిస్తాయి. ఇండెక్స్ ఫండ్స్ లేదా ఈటీఎఫ్‌లనేవి వివిధ రంగాల్లోను, భౌగోళికంగా వివిధ ప్రాంతాలవ్యాప్తంగా కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా, పెట్టుబడులపరమైన రిస్కులను తగ్గించుకునేందుకు తోడ్పడతాయి. అంతగా సమయం కేటాయించలేనివారు, కొత్తగా ఇన్వెస్ట్ చేస్తున్నవారు ఒక్కొక్క సెక్యూరిటీని విడివిడిగా ఎంచుకోవాల్సిన అవసరం లేకుండానే డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోను నిర్మించుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి.

**పారదర్శకత:** బెంచ్‌మార్క్ సూచీలను ప్రతిబింబించడం ద్వారా ప్యాసివ్ ఫండ్స్ ఒక సిస్టమాటిక్ విధానాన్ని పాటిస్తాయి. భావోద్వేగాలతో, మార్కెట్ ఊహాగానాలతో నిర్ణయాలు తీసుకోవడం లేదా వ్యూహాల్లో స్వల్పకాలిక మార్పులు, చేర్పులు చేయడంలాంటి ధోరణులు వీటిలో ఉండవు. క్రమశిక్షణకు విలువనిస్తూ, దీర్ఘకాలిక లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టే ఇన్వెస్టర్లకు ఈ పారదర్శకత ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. రాబడులపై ప్రతికూల ప్రభావం చూపే భావోద్వేగాలపరమైన నిర్ణయాలు తీసుకోకుండా, మార్కెట్ పరిస్థితులకు అతీతంగా పెట్టుబడులను కొనసాగించేందుకు ఇన్వెస్టర్లకు ఇవి తోడ్పడతాయి.

**పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వం**

ఎలాంటి పెట్టుబడి వ్యూహానికైనా ప్యాసివ్ ఫండ్స్ అనేవి పటిష్టమైన పునాదిగా నిలుస్తాయి. రిటైర్మెంట్, గృహం, పిల్లల చదువు లేదా సంపద సృష్టి ఇలా ఏ లక్ష్యం కోసం ఇన్వెస్ట్ చేస్తున్నా సరే, దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు అవసరమైన స్థిరత్వం, క్రమశిక్షణను ప్యాసివ్ ఫండ్స్ అందిస్తాయి. కొత్త ఇన్వెస్టర్ల విషయానికొస్తే చాలా సరళంగా, చాలా తక్కువ వ్యయాలతో పెట్టుబడులు ప్రారంభించేందుకు సహాయకరంగా ఉంటాయి. అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్ల విషయాన్ని తీసుకుంటే యాక్టివ్ వ్యూహాలతో సమతూకం పాటించేందుకు, ఓవరాల్ ఖర్చులను తగ్గించుకునేందుకు ఉపయోగపడతాయి.

ప్యాసివ్ ఇన్వెస్టింగ్ పరిధి మరింత విస్తృతమవుతోంది. కేవలం లార్జ్ క్యాప్ ఈక్విటీ సూచీలకే పరిమితం కాకుండా డెట్ మార్కెట్లు, అంతర్జాతీయంగా పెట్టుబడులు, సెక్టార్ ఆధారిత సూచీలు, ఫ్యాక్టర్ స్ట్రాటజీల్లో అంతర్జాతీయంగా ప్యాసివ్ ఆప్షన్స్‌కి ఆదరణ పెరుగుతోంది. ఇంతటి వైవిధ్యం వల్లే మీ లక్ష్యాలకు అనుగుణంగా పోర్ట్‌ఫోలియోను తీర్చిదిద్దుకునేందుకు, ఎలాంటి మార్కెట్ పరిస్థితుల్లోనైనా అది పటిష్టంగా ఉండేలా చూసుకునేందుకు ప్యాసివ్ వ్యూహం తోడ్పడుతుంది.

ఊహాగానాలు, అంచనాలు, వేగవంతమైన ట్రేడింగ్‌లతో హడావిడిగా ఉండే ప్రపంచంలో, ప్యాసివ్ ఇన్వెస్టింగ్ అనేది ఒక స్పష్టతనిస్తుంది. దీర్ఘకాలిక లక్ష్యాలపై ఫోకస్ పెట్టేందుకు, కాంపౌండింగ్ ప్రయోజనాలు పొందేందుకు, నిరంతరం మార్కెట్‌ను ట్రాక్ చేయాల్సిన ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఇవి తోడ్పడతాయి. ఇప్పుడిప్పుడే పెట్టుబడుల ప్రస్థానం ప్రారంభిస్తున్నా లేక రిటైర్మెంట్ నిధిని ఏర్పర్చుకోవాలనుకుంటున్నా అందుకు తగిన స్థిరత్వాన్ని, నిలకడను ప్యాసివ్ ఫండ్స్ అందిస్తాయి. నిఫ్టీ 100 లేదా నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్ లాంటి సరళమైన ప్యాసివ్ ఫండ్‌ను ప్రధాన సాధనంగా తీసుకుని ఇన్వెస్టర్లు, పెట్టుబడులను ప్రారంభించవచ్చు. ఇన్వెస్ట్‌మెంట్లను కొనసాగిస్తూ వెళ్తే కాలక్రమేణా సత్ఫలితాలు వాటంతటవే వస్తాయి.

## టాటా క్యాపిటల్ ఐపీవో 22న

- రూ. 17,200 కోట్ల సమీకరణకు రెడీ
- 11 బిలియన్ డాలర్ల విలువపై కన్ను




న్యూఢిల్లీ: టాటా గ్రూప్ ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 22న ప్రారంభంకానున్నట్లు తెలుస్తోంది. ఐపీవోలో భాగంగా మొత్తం 47.58 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిలో 21 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనుంది. మరో 26.58 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. టాటా సన్స్ 23 కోట్ల షేర్లు, ఐఎఫ్‌సీ 3.58 కోట్ల షేర్లు విక్రయానికి ఉంచనున్నాయి. తద్వారా 2 బిలియన్ డాలర్లు(రూ. 17,200 కోట్లు) సమీకరించే యోచనలో ఉంది. వెరసి కంపెనీ విలువ 11 బిలియన్ డాలర్లుగా నమోదుకానున్నట్లు సంబంధిత వర్గాలు అంచనా వేశాయి. నెలాఖరు(30)కల్లా కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకానున్నట్లు అంచనా. కంపెనీలో ప్రస్తుతం టాటా సన్స్ వాటా 88.6 శాతంకాగా.. ఐఎఫ్‌సీ 1.8 శాతం వాటా కలిగి ఉంది. ఈక్విటీ జారీ నిధులను భవిష్యత్ పెట్టుబడి అవసరాలకుగాను టైర్-1 మూలధన పటిష్టతకు వినియోగించనుంది. లిస్టింగ్ విజయవంతమైతే దేశీ ఫైనాన్షియల్ రంగంలో అతిపెద్ద ఐపీవోగా రికార్డ్ నెలకొల్పనుంది. 2023 నవంబర్‌లో టాటా టెక్నాలజీస్ లిస్టయ్యాక, తిరిగి టాటా గ్రూప్ నుంచి మరో దిగ్గజం ఐపీవోకు రానుండటం ప్రస్తావించదగ్గ అంశం! 2022 సెప్టెంబర్‌లో అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందిన టాటా క్యాపిటల్ ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం 2025 సెప్టెంబర్‌లోగా ఐపీవో చేపట్టవలసి ఉంది. ఇప్పటికే అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలు.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్(హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంస్థ), బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన సంగతి తెలిసిందే.

## ఐటీ ఫైలింగ్‌కి ఉపక్రమించండి... మహాశయా..!

**కె.సీహెచ్. ఏ.వి.ఎస్.ఎన్ మూర్తి** **కె.వి.ఎన్ లావణ్య**



ట్యాక్సేషన్ నిపుణులు

గత ఆర్థిక సంవత్సరంలో అంటే 2023-24 గానూ సుమారు 9 కోట్ల రిటర్నులు వేసినట్లు ఒక లెక్క ఉంది. ఇక 2024-25కి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 25.8.2025 నాటికి 3,67,94,801 రిటర్నులు పడ్డాయి. అంటే ఫైల్ చేసినట్లు. ఇందులో 3.54 కోట్ల మంది సక్రమంగా వెరిఫై చేశారు. గొప్ప విషయం ఏమిటంటే 2.29 కోట్ల మంది రిటర్నులు ప్రాసెస్ అయ్యాయి. అంటే అస్సెస్‌మెంట్ అయినట్లే. 13 లక్షల మంది వెరిఫై చేయలేదట. మీరు ఒకసారి చెక్ చేసుకోండి. వెరిఫై చేసుకోపోతే వెంటనే వెరిఫై చేయండి. వైరిఫై జరిగితే కానీ అసెస్‌మెంట్ మొదలుపెట్టరు. గతవారం అయితే రిటర్నులు వేసిన కొంతమంది అసెస్‌మెంట్ పూర్తి చేసి రీఫండ్ మొత్తాన్ని వారి వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం జరిగింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ వారి కృషి, కష్టాన్ని, సామర్థ్యాన్ని మెచ్చుకోవాలి. శెహబాష్...

ట్యాక్స్ ఆడిట్ అవసరం లేని వారికి జూలై 31 నుంచి సెప్టెంబర్ 15 వరకు గడువు తేది ముందుగానే పొడిగించారు. గతంలో పొడిగింపుల పర్వం లేదా వాయిదాల పద్ధతి ఉండేది. దానిని పక్కన పెట్టి గత 2 ఏళ్లుగా ఎటువంటి పొడిగింపు చేయకుండా నిలకడగా ఉన్నారు. కానీ ఏడాది ఆరంభంలో ఈసారి పెద్ద పొడిగింపు చేశారు. ఇప్పుడు అన్‌లైన్‌లో పనులు చకచకా జరుగుతున్నాయి. ఎటువంటి ఇబ్బందులు లేవు. ఫాస్ట్‌గా, మృదువు గా బండి నడుస్తోంది. ఈ కాలమ్ చదివే సమయానికి ఫైలర్ల సంఖ్య 4 కోట్లు దాటిందన్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇంకో 5 కోట్లకు పైచిలుకు రిటర్నులు వేయాలి. మీరు వేసిన 4 కోట్ల మందిలో ఉన్నారా..? వేయాల్సిన 5 కోట్ల మందిలో ఉన్నారా..?

**వెంటనే ఏం చేయాలంటే...**

- పాన్ కార్డుని తీయండి
- ఆధార్‌తో పాన్ అనుసంధానం చేసుకోండి.
- మీకు ఎన్ని బ్యాంకు అకౌంట్లు ఉన్నాయో ఆరా తీయండి. చాలా మందికి ఒక అకౌంటు లేదా రెండు అకౌంట్లు గుర్తుంటాయి. నిత్యం వాడే అకౌంట్లు గుర్తుంటాయి. ఎన్ని ఉన్నాయో మరిచి పోతుంటాము. ఎవరో తెలిసిన వ్యక్తి లోన్ ఇప్పిస్తాడు. అప్పుడు బ్యాంకులో అకౌంటు ఓపెన్ చేస్తాము. లోన్ క్లియర్ అయ్యాక ఈ సంగతి మరిచిపోతాము. ఉద్యోగాల బదిలీ వలన, ఇంటికి దగ్గరగా ఉందనో.. దగ్గర బంధువు ఉన్నాడని తెరిచిన అకౌంటు... ఇలా ఒక జాబితా చేసుకోండి. అన్నీ బ్యాంకు అకౌంటు వివరాలు సేకరించండి. వాటిలో వ్యవహారాలకు వివరాలు రాసుకోండి. ఇన్ని ఉన్నా ఏదో ఒకదాన్ని మాత్రమే రిఫండ్ కోసం ఎంచుకోండి. అలా ఎంచుకోకపోతే రీఫండ్ రానే రాదు.
- వివిధ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు... వాటి విషయంలో అశ్రద్ధ వహిస్తాము. గుర్తు తెచ్చుకోండి. పుట్టింటి నుంచి వచ్చిన డబ్బును అదే ఊరిలో ఫిక్స్‌డ్ వేసి మరిచిపోయే నారీమణులు ఎందరో.... అన్ని వివరాలు సేకరించండి.
- మీరు ఉద్యోగస్తులు అయితే ఫారమ్ 16 అడగండి. అందులో అన్నీ వివరాలు చెక్ చేసుకోండి.
- ప్రతి నెలా తయారయ్యే శాలరీ స్లిప్‌ను జాగ్రతగా ఉంచండి.
- ఫారమ్ 16 అ లో కరెక్ట్ చేసి భద్రపరచండి.
- డివిడెండ్ల మీద ఆదాయం బ్రోకర్‌ని అడిగి తెలుసుకోండి. స్టేట్‌మెంట్ తీసుకోండి.
- మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలు అమ్మకాలు స్టేట్‌మెంట్ తీసుకోండి. పూర్తి స్టేట్‌మెంట్ అడగండి
- అద్దె మీద ఆదాయం ఆదాయం ఉంటే ఇంటి అడ్రెస్సు, కిరాయిదారు పాన్/ఆధార్ తీసుకోండి. ప్రాపర్టీ టాక్సు రశీదులు తీసుకోండి.
- విదేశాల్లో ఉండే కుటుంబ సభ్యుల నుంచి వచ్చే మొత్తం వివరాలు తెలుసుకోండి
- అలాగే విదేశీ ఆస్తుల మీద ఆదాయం కూడా
- పాత పద్ధతిలో డిడక్షన్లకు అయితే అన్ని కాగితాలు, వివరాలు కావాలి. అద్దె రశీదులు... విరాళాల వివరాలు ఉండాలి.
- అఐ, ఫారమ్ 26 అ డౌన్‌లోడ్ చేసుకోండి.
- కరెక్ట్ ఫారాన్ని సెలెక్ట్ చేసుకోండి. డిపార్ట్‌మెంట్ వారి ఉపకరణాలు ఉపయోగపడుతాయి.
- ఇప్పుడు ఫైలింగ్‌కు ఉపక్రమించండి.

ఆల్ ద బెస్ట్.....



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

# పెట్టుబడుల్లో వైవిధ్యం..

**పీజీఐఎం ఇండియా ఫ్లెక్సీక్యాప్ ఫండ్**




పెట్టుబడుల్లో వైవిధ్యం, వివిధ మార్కెట్ క్యాప్ విభాగాల్లో పెట్టుబడులకు వీలు కల్పించేవే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్. మొదటిసారి ఇన్వెస్టర్ల నుంచి అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్ల వరకు ప్రతి ఒక్కరి పోర్ట్‌ఫోలియోలో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఉండాలన్నది నిపుణుల సూచన. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్టర్లు తమ ఈక్విటీ పెట్టుబడుల్లో 25–50 శాతం మధ్య వీటికి కేటాయించుకోవచ్చు. ఈ విభాగంలో మంచి పనితీరు చూపిస్తున్న పథకాల్లో పీజీఐఎం ఇండియా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కూడా ఒకటి.

**రాబడులు**




ఈ పథకం గత మూడు నెలల్లో సగటున 5 శాతం, ఆరు నెలల్లో 16 శాతం, ఏడాది కాలంలో 4.36 శాతం చొప్పున పెట్టుబడులపై రాబడిని అందించింది. మూడేళ్లలో చూస్తే వార్షిక రాబడి 15 శాతం చొప్పున ఉంది. ఐదేళ్లలో 21 శాతం, ఏడేళ్లలో 17 శాతం, పదేళ్లలో 15.71 శాతం చొప్పున వార్షిక ప్రతిఫలం పెట్టుబడిదారులకు అందించింది. మూడేళ్ల మినహా, ఏడాది, ఐదేళ్లు, ఏడేళ్లు, పదేళ్ల కాలంలో బెంచ్‌మార్క్ బీఎస్ఈ 500 టీఆర్ఐ కంటే ఈ పథకంలోనే అదనపు రాబడి ఉంది. మూడేళ్ల కాలంలో అయితే ఈ పథకం కంటే బీఎస్ఈ 500 టీఆర్ఐ ఒక శాతం మెరుగైన పనితీరు చూపించింది. ఈ పథకం 2015 మార్చి 4న ప్రారంభమైంది.

**పెట్టుబడుల విధానం**

మార్కెట్ విలువలతో సంబంధం లేకుండా ఎక్కడైనా ఇన్వెస్ట్ చేయగలిగిన స్వేచ్ఛ ఫ్లెక్సీక్యాప్ పథకాలకు ఉంటుంది. దీంతో ఫండ్ మేనేజర్లు స్వేచ్ఛగా తాము గుర్తించిన అవకాశాలపై పెట్టుబడులు పెట్టగలరు. దీర్ఘకాలంలో ఇది అదనపు రాబడులకు సాయపడుతుంది. పరిస్థితులకు అనుగుణంగా వేగంగా పెట్టుబడుల్లో మార్పులు చేర్పులు చేయగలరు. ఈ పథకం పెట్టుబడుల్లో కనీసం 65 శాతం తగ్గకుండా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్‌నకు కేటాయింపులను అవసరాలకు అనుగుణంగా మారుస్తుంటుంది. దీర్ఘకాలం పాటు స్థిరంగా రాణించే, మెరుగైన వృద్ధిని చూపించే కంపెనీలను గుర్తించి పెట్టుబడులు పెడుతుంది. రంగాల వారీ కాకుండా, కంపెనీల వారీగా సామర్థ్యాలను విశ్లేషిస్తుంది. ఆర్‌వోఈ, ఆర్‌వోసీఈలకు ప్రాధాన్యం ఇస్తుంది. ప్రైస్ టు బుక్ వ్యాల్యూ, ప్రైస్ టు సేల్స్ రేషియో, మార్జిన్లు, నికర నగదు మిగులు తదితర అంశాల ఆధారంగా కంపెనీ వ్యాపార సామర్థ్యాలు, బలాలను గుర్తిస్తుంది. ఆకర్షణీయం అనిపించినప్పుడు స్వల్పకాల అవకాశాలపైనా పెట్టుబడులు పెడుతుంటుంది.

**పోర్ట్‌ఫోలియో**

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.6,271 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.31 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సాధనాల్లో 2.57 శాతం పెట్టుబడులు ఉన్నాయి. నగదు నిల్వలు కేవలం 0.12 శాతమే ఉన్నాయి. పెట్టుబడులను గమనిస్తే.. లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే 79 శాతం వరకు ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 20.74 శాతం ఇన్వెస్ట్ చేసింది. స్మాల్‌క్యాప్ కంపెనీల్లో కేవలం 0.43 శాతం పెట్టుబడులు ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 57 స్టాక్స్ ఉన్నాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో అత్యధికంగా 28.57 శాతం ఇన్వెస్ట్ చేసింది. ఇండస్ట్రియల్స్ కంపెనీల్లో 13.36 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషినరీ కంపెనీల్లో 13.13 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి. టెక్నాలజీ రంగ కంపెనీలకు 12.32 శాతం, హెల్త్ కేర్ కంపెనీలకు 10.67 శాతం పెట్టుబడులను కేటాయించింది. రిస్క్ ఉన్నా కానీ, దీర్ఘకాలంలో (పదేళ్లు అంతకుమించిన) మంచి రాబడి కోరుకునే ఇన్వెస్టర్లు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులకు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు.

**టాప్ ఈక్విటీ హోల్డింగ్స్**

| కంపెనీ | పెట్టుబడులు శాతం |
|---|---|
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 9.26 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 8.92 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 5.46 |
| భారతీ ఎయిర్‌టెల్ | 3.20 |
| ఎటర్నల్ | 3.17 |
| టీసీఎస్ | 3.13 |
| వరుణ్ బెవరేజెస్ | 2.94 |
| ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ | 2.68 |
| డిక్సన్ టెక్నాలజీస్ | 2.54 |
| టీవీఎస్ మోటార్ | 2.45 |



# చాంపియన్ భారత్

థింపూ (భూటాన్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌గా భారత జట్టు అవతరించింది. నాలుగు దేశాల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో భారత్ 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 3-4 గోల్స్ తేడాతో బంగ్లాదేశ్ జట్టు చేతిలో ఓడిపోయినా... ఈ ఓటమి ప్రభావం భారత టైటిల్ అవకాశాలను దెబ్బ తీయలేదు. వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో నెగ్గి టైటిల్‌ను ఖరారు చేసుకున్న భారత్ ఆఖరి మ్యాచ్‌లో ఓటమి పాలైంది. చివరి మ్యాచ్‌లో భారత్ తరఫున అనుష్క కుమారి (9వ నిమిషంలో), ప్రీతిక బర్మన్ (65వ నిమిషంలో), జులాన్ (89వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. బంగ్లాదేశ్ తరఫున పూర్ణిమ మర్మా (1వ నిమిషంలో), ఆల్పీ అక్తర్ (34వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించగా... సౌరవీ ప్రీతి (48వ నిమిషంలో, 90+3వ నిమిషంలో) రెండు గోల్స్ అందించింది. భారత్, బంగ్లాదేశ్‌తోపాటు భూటాన్, నేపాల్ జట్లు కూడా ఈ టోర్నీలో పాల్గొన్నాయి.




# వైదొలిగిన విజేత జట్టు

## వచ్చే సీజన్ హాకీ ఇండియా లీగ్ నుంచి తప్పుకున్న ఒడిశా వారియర్స్

రాజ్‌గిర్ (బిహార్): హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) తదుపరి సీజన్‌ను వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించేందుకు హాకీ ఇండియా (హెచ్ఐ) ఏర్పాట్లు చేస్తోంది. లీగ్ నుంచి పురుషుల ఈవెంట్‌లో గోనాసిక జట్టు, మహిళల ఈవెంట్‌లో ప్రస్తుత చాంపియన్ ఒడిశా వారియర్స్ వైదొలిగాయి. వ్యక్తిగత కారణాలతోనే టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు రెండు ఫ్రాంచైజీలు వెల్లడించాయి. కొన్నేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది జరిగిన టోర్నీలోనే ఈ రెండు ఫ్రాంచైజీలు పాల్గొన్నారు. ఒక సీజన్‌కే అంతరించాయి. అయితే హెచ్ఐఎల్ మాత్రం యథాతథంగా జరుగుతుందని హెచ్ఐ అధ్యక్షుడు దిలీప్ టిర్కీ స్పష్టం చేశారు. ఎనిమిది జట్లతో పురుషుల ఈవెంట్‌ను నిర్వస్తామని చెప్పారు. నాలుగు జట్లతో జరిగిన మహిళల ఈవెంట్‌ను ఆరు జట్లకు విస్తరిస్తామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా కప్ ఈవెంట్‌ను పర్యవేక్షిస్తున్న హెచ్ఐ చీఫ్ టిర్కీ మీడియాతో మాట్లాడుతూ 'హాకీ లీగ్ ఎప్పటిలాగే జరుగుతుంది. గోనాసిక వైదొలగినప్పటికీ మునుపటిలా 8 ఫ్రాంచైజీలతో పురుషుల టోర్నీ జరుగుతుంది. మహిళల్లో మరో రెండు కొత్త జట్లను చేరుస్తాం. మొత్తం ఆరు జట్లు పాల్గొంటాయి. ఈ కొత్త జట్ల వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం' అని హెచ్ఐ చీఫ్ టిర్కీ అన్నారు. రూర్కెలా, భువనేశ్వర్, చండీగఢ్, మొహాలీ ఫ్రాంచైజీల పేర్లను పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ఈ సీజన్‌లో పాల్గొన్న ఆటగాళ్ల బకాయిల్ని కూడా చెల్లించినట్లు ఆయన వెల్లడించారు. 'ఒడిశా వారియర్స్ అందరికంటే ఆలస్యంగా ఆటగాళ్లకు చెల్లింపులు చేసింది. మహిళల్లో చాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు బకాయిల్ని వారి తరఫున హెచ్ఐ చెల్లించింది. ప్రైజ్‌మనీ హెచ్ఐ వద్దే ఉండటంతో యాజమాన్యాన్ని సంప్రదించిన మీదట చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేశాం. త్వరలోనే ఆటగాళ్లకు సంబంధించిన మినీ వేలం కూడా నిర్వహిస్తాం. ఈ నెల ఆఖరి వారమా లేదంటే వచ్చే నెల మొదటి వారమా అనేది త్వరలోనే ప్రకటిస్తాం' అని దిలీప్ టిర్కీ చెప్పారు. గోనాసిక, ఒడిశా వారియర్స్ ప్లేయర్లు వేలానికి వస్తారని అన్నారు. దీంతో పాటు ప్రపంచకప్ కోసం మేటి జట్టును తయారు చేస్తామని చెప్పారు. ప్రస్తుత ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన జట్టు వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది.

# పారిస్‌లో పతకాన్ని గెలిచి ఉంటే...

## అప్పుడే వీడ్కోలు పలికేదాన్ని! ● భారత స్టార్ మహిళా బాక్సర్ లవ్లీనా

న్యూఢిల్లీ: గత ఏడాది పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో పతకం గెలిచి ఉంటే అప్పుడే ఆటకు టాటా చేప్పేదాన్నని భారత స్టార్ మహిళా బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ పేర్కొంది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అయిన ఈ అస్సాం బాక్సర్ 'పారిస్'లో పతకాన్ని నిలబెట్టుకోవడంలో విఫలమైంది. అప్పటి నుంచి అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలకు దూరంగా ఉన్న ఆమె గువాహటిలో అన్ని సదుపాయాలతో అకాడమీని నెలకొల్పింది. ఈ జూన్‌లో ఈ అకాడమీని ప్రారంభించిన ఆమె దీని బాధ్యతలతో పాటు పోటీల కోసం కూడా సన్నద్ధమవుతోంది. త్వరలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌తో మళ్లీ రింగ్‌లో దిగాలని ఆమె ఆశిస్తోంది. 'అకాడమీ నిర్మించే సమయంలోనే నేను పారిస్ ఒలింపిక్స్ వరకు ఆడాలని అనుకున్నాను. పతకంతోనే రిటైర్మెంట్ పలకాలని తొలుత భావించాను. కానీ పారిస్‌లో ఫలితం నేను ఆశించినట్లుగా రాలేదు. అందువల్లే గుడ్‌బై చెప్పలేదు' అని లవ్లీనా వివరించింది. పారిస్ విశ్వక్రీడల్లో వరుస పతకాలు సాధించాలనే జోరుమీదున్న ఆమెకు క్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. 75 కేజీల మిడిల్‌వెయిట్ కేటగిరీలో భారత బాక్సర్‌ను ఓడించిన లి క్వియాన్ (చైనా) తదనంతరం ఒలింపిక్స్ చాంపియన్‌గానూ నిలిచింది. తదుపరి లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్-2028 పతకంతో కెరీర్‌కు బైబై చెబుతారా అన్న ప్రశ్నకు సమాధానంగా... 'అదే జరగొచ్చు. నిజానికి నేను పారిస్‌లోనే స్వర్ణం గెలవాల్సింది. ఎందుకంటే పోడియంలో నిలిచిన స్వర్ణ, రజత, కాంస్య పతక విజేతలందర్నీ నేను గతంలో ఓడించాను' అని లవ్లీనా చెప్పుకొచ్చింది. 75 కేజీల కేటగిరీలో ప్రపంచ చాంపియన్



అయిన లవ్లీనా ఖాతాలో మూడు ప్రపంచ పతకాలు, ఆసియా క్రీడలు, ఆసియా చాంపియన్‌షిప్ పతకాలెన్నో ఉన్నాయి. సుదీర్ఘ విరామం అనంతరం ఆమె ప్రపంచ చాంపియన్‌షిప్ కోసం సిద్ధమవుతోంది. ఈ టోర్నీలో సవాళ్లు తప్పవని, విజయం కోసం ఎంతగానో శ్రమించాల్సి ఉంటుందని చెప్పింది. ఈ నెల 4 నుంచి లివర్‌పూల్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ జరుగుతుంది. ఆసియా, ప్రపంచ స్థాయి పతకాలెన్ని వున్నా తనలో గెలవాలనే కసి తగ్గలేదని పతకాల ఆకలి ఇంకా తీరలేదని చెప్పింది. దేశానికి మరిన్ని పతకాలు గెలిచేందుకు ఎల్లప్పుడు కృషి చేస్తూనే ఉంటానని లవ్లీనా పేర్కొంది.

# బదోనీ డబుల్ సెంచరీ



## సెమీస్‌కు చేరిన నార్త్ జోన్, సెంట్రల్ జోన్

'డ్రా'గా ముగిసిన రెండు క్వార్టర్ ఫైనల్స్ ● దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ

బెంగళూరు: దేశవాళీ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. ఆదివారం ముగిసిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఈ రెండు జట్లు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముందంజ వేశాయి. ఈస్ట్ జోన్‌తో జరిగిన మ్యాచ్‌లో నార్త్‌జోన్ ప్లేయర్ ఆయుశ్ బదోనీ (223 బంతుల్లో 204 నాటౌట్; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ డబుల్ సెంచరీతో కదంతొక్కాడు. ఫలితంగా ఓవర్‌నైట్ స్కోరు 388/2తో ఆదివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన నార్త్ జోన్... చివరకు 146.2 ఓవర్లలో 658/4 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. బదోనీ దంచికొట్టగా... కెప్టెన్ అంకిత్ కుమార్ (321 బంతుల్లో 198; 19 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో ద్విశతకం చేజార్చుకున్నాడు. నిశాంత్ సింధు (91 బంతుల్లో 68; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో బదోనీ తన రెండో డబుల్ సెంచరీ నమోదు చేసుకోవడంతో నార్త్ జోన్ భారీ స్కోరు చేయగలిగింది. 123 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న అతడు... చూస్తుండగానే 222 బంతుల్లో ద్విశతకం తన పేరిట రాసుకున్నాడు. అంతకుముందు నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 405 పరుగులు చేయగా... ఈస్ట్ జోన్ 230 పరుగులకే ఆలౌటైంది. చివరి రోజు 56 ఓవర్లకు పైగా బ్యాటింగ్ చేసింది. బదోనీ డబుల్ సెంచరీ పూర్తి కాగానే కెప్టెన్ అంకిత్ కుమార్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండానే మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో నార్త్ జోన్ దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో అడుగు పెట్టింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ప్రకారం నార్త్ జోన్ జట్టు సెమీస్‌కు చేరడం ఖాయమైపోగా... చివరి రోజు భారత బౌలర్లు మొహమ్మద్ షమీ, ముకేశ్ కుమార్ ఈస్ట్‌జోన్ తరఫున బౌలింగ్ చేయలేదు. చిన్న చిన్న గాయాల కారణంగానే ఆ ఇద్దరు బౌలింగ్ చేయలేదని ఈస్ట్ జోన్ కెప్టెన్ రియాన్ పరాగ్ వెల్లడించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 'హ్యాట్రిక్' తీసిన నార్త్ జోన్ బౌలర్ ఆఖీబ్ నబీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

సెంట్రల్ జోన్‌తో జరిగిన దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో 679 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన నార్త్ ఈస్ట్ జట్టు... చివరకు మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించింది. ఆదివారం ఆఖరిరోజు ఆట నిలిచిపోయే సమయానికి 58 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. కెప్టెన్ రాంగ్‌సెన్ జొనాథన్ (97 బంతుల్లో 60; 9 ఫోర్లు), జెహు అండర్సన్ (96 బంతుల్లో 64; 11 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీలతో రాణించారు. సెంట్రల్ జోన్ బౌలర్లలో హర్ష్ దూబే, ఆదిత్య థాక్రే, శుభమ్ శర్మ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు సెంట్రల్ జోన్ 532/4 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... నార్త్ ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. ఇక నార్త్‌జోన్ 331/7 వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి ప్రత్యర్థికి 679 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆదివారం రెండు సెషన్‌ల అనంతరం ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్‌లు 'డ్రా'కు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో సెంట్రల్ జోన్ సెమీస్‌కు అర్హత సాధించింది. గురువారం నుంచి ప్రారంభం కానున్న సెమీఫైనల్స్‌లో సౌత్ జోన్‌తో నార్త్‌జోన్, సెంట్రల్ జోన్‌తో వెస్ట్ జోన్ తలపడనున్నాయి.

### సౌత్ జోన్ సారథిగా అజహరుద్దీన్

**తిలక్ వర్మ అందుబాటులో లేకపోవడంతో కేరళ ప్లేయర్‌కు జట్టు పగ్గాలు**

బెంగళూరు: దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సౌత్ జోన్ జట్టుకు కేరళ బ్యాటర్ మొహమ్మద్ అజహరుద్దీన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. హైదరాబాదీ ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మ ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌కు ఎంపిక కావడంతో... అతడి స్థానంలో సౌత్ జోన్ జట్టుకు అజహరుద్దీన్ సారథ్యం వహించనున్నాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో గురువారం నుంచి ప్రారంభం కానున్న సెమీఫైనల్లో నార్త్‌జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. మొదట ప్రకటించిన జట్టుకు వైస్‌కెప్టెన్‌గా ఉన్న అజహరుద్దీన్ ఇప్పుడు జట్టు పగ్గాలు అందుకోగా... తమిళనాడు బ్యాటర్ జగదీశన్ తాజా వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. తమిళనాడుకు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్ సాయికిశోర్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో... సెమీఫైనల్ మ్యాచ్‌కు దూరం కాగా... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ రషీద్, పుదుచ్చేరికి చెందిన అంకిత్ శర్మకు జట్టులో చోటు దక్కింది. గతంలో ఈ ఇద్దరు స్టాండ్‌బై ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. ఐపీఎల్లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 20 ఏళ్ల రషీద్... ఇప్పటి వరకు 19 రంజీ మ్యాచ్‌లు ఆడి 1204 పరుగులు చేశాడు.



# మెరిసిన అయూబ్

● యూఏఈపై పాకిస్తాన్ విజయం

షార్జా: ఆసియా కప్ టి20 టోర్నమెంట్ ప్రారంభానికి ముందు జరుగుతున్న ముక్కోణపు టోర్నీలో పాకిస్తాన్ వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై గెలిచిన పాకిస్తాన్... రెండో మ్యాచ్‌లో యూఏఈని చిత్తు చేసింది. శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ 31 పరుగుల తేడాతో యూఏఈపై గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సయీమ్ అయూబ్ (38 బంతుల్లో 69; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), హసన్ నవాజ్ (26 బంతుల్లో 56; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో రాణించారు. యూఏఈ బౌలర్లలో జునైద్, సాఘిర్ ఖాన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం యూఏఈ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 176 పరుగులకు పరిమితమైంది. ఆసిఫ్ ఖాన్ (35 బంతుల్లో 77; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) భారీ షాట్లతో విజృంభించగా... కెప్టెన్ వసీమ్ (18 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. పాక్ బౌలర్లలో హసన్ అలీ 3, నవాజ్ 2 వికెట్లు పడగొట్టారు. నేడు జరిగే మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌తో యూఏఈ తలపడనుంది.

# ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ షెవ్‌చెంకోపై నిషేధం

## మూడేళ్ల పాటు 'ఫిడే' టోర్నీలకు నో ఎంట్రీ

గ్రాండ్‌మాస్టర్ టైటిల్ కూడా రద్దు ● అంతర్జాతీయ చెస్ చరిత్రలో ఇదే తొలిసారి




లుసానే (స్విట్జర్లాండ్): ఆటల్లో కొందరు ఘనతలతో పుటలకెక్కుతారు. ఇంకొందరు చెత్త రికార్డులతోనూ చరిత్రలో నిలుస్తారు. ఈ రెండు పక్కనబెట్టి కొందరు నీతిమాలిన క్రీనీడలతో వెలుగులోకి వస్తారు. ఇలా మూడో కోవకే చెందిన ఉక్రెయిన్ చెస్ ప్లేయర్ వ్యవహారమిది. కిరిల్ షెవ్‌చెంకో అనే ఉక్రెయిన్ ఆటగాడు చెస్‌లో గ్రాండ్‌మాస్టర్. ఎన్నో మెట్లు ఎక్కితేగానీ జీఎం (గ్రాండ్‌మాస్టర్) నార్మ్‌లు రావు. అలా జీఎం నార్మ్‌లను దక్కించుకుంటేనే గ్రాండ్‌మాస్టర్‌గా అవతరిస్తారు. అయితే షెవ్‌చెంకో మాత్రం ఓ తప్పుడు పనితో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్ హోదా కోల్పోయాడు. అంతేకాదు... మూడేళ్ల నిషేధానికి కూడా గురయ్యాడు. ఇలా అంతర్జాతీయ చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ టైటిల్ కోల్పోయిన తొలి ప్లేయర్‌గా కిరిల్ షెవ్‌చెంకో చరిత్రలో నిలిచాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) నిబంధనలను అతిక్రమించిన అతనిపై గట్టి శిక్షలే విధించారు. ఫిడే చేపట్టిన విచారణలో అతను తన నేరాన్ని అంగీకరించక తప్పలేదు.

### ఇంతకీ అతనేం చేశాడంటే?

కిరిల్ షెవ్‌చెంకో అంతర్జాతీయ చెస్‌లో ఒక్కో విజయం సాధించి 2017లో గ్రాండ్‌మాస్టర్ హోదా తెచ్చుకున్నాడు. అంతవరకు బాగానే ఉన్నా గతేడాది అతని బుద్ధి తప్పుదోవ పట్టింది. స్పెయిన్‌లో 2024లో జరిగిన 'స్పానిష్ టీమ్ చాంపియన్‌షిప్'లో పాల్గొన్న అతను నిర్వాహకుల కళ్లుగప్పి స్మార్ట్‌ఫోన్‌తో చొరబడి మోసపూరిత ఆటకు తెరతీశాడు. 'ఫిడే' నియమావళి ప్రకారం టోర్నీ జరిగే వేదికలోకి ప్రవేశించే ముందే తమ స్మార్ట్ ఉపకరణాలన్నీ (బ్లూ టూత్, ఇయర్ బడ్స్, మైక్రో ఫోన్, వైర్‌లెస్ ఇయర్ ఫోన్, స్మార్ట్ గ్లాస్, స్మార్ట్ వాచెస్, స్మార్ట్ కీచైన్, స్మార్ట్ కెమెరా, స్మార్ట్ ఫిట్‌నెస్ బ్యాండ్స్, వైర్‌లెస్ పరికరాలు) సెక్యూరిటీ వద్దే అప్పగించాలి. పొరపాటున కూడా వెంట తీసుకు రాకూడదు. జాకెట్స్‌లో మరిచామన్న నిర్వాహకులు ఉపేక్షించరు. ఇలాంటి కఠిన ని'బంధనాలను' తెంచుతూ ఏకంగా రెండు స్మార్ట్‌ఫోన్‌లతో ప్రవేశించిన షెవ్‌చెంకో ఒకటి అందుబాటులో... మరొకటి మరుగుదొడ్డిలో పెట్టాడు. ఇది ఓ హౌస్‌కీపింగ్ సిబ్బంది కంటబడటంతో ఉక్రెయిన్ ఆటగాడి బాగోతం బయటికొచ్చింది. తదుపరి విచారణ అనంతరం ఫిడే ఎథిక్స్-క్రమశిక్షణ కమిటీ తాజాగా కఠిన శిక్షలు విధించింది. 2017లో అతను సంపాదించిన గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదాను రద్దు చేసింది. 2024 అక్టోబర్ 19 నుంచి 2027 అక్టోబర్ 18 వరకు 'ఫిడే' టోర్నీల్లో పాల్గొనకుండా నిషేధాన్ని విధించింది.

# పియాస్త్రి ఏడోసారి

● డచ్ గ్రాండ్ ప్రి టైటిల్ గెలిచిన మెక్‌లారెన్ డ్రైవర్



జాండ్‌వోర్ట్ (నెదర్లాండ్స్): ఫార్ములావన్ తాజా సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్త్రి జోరు సాగిస్తూ ఏడో రేసులో విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ప్రధాన రేసును పోల్ పొజిషన్ నుంచి ప్రారంభించిన పియాస్త్రి... 72 ల్యాప్‌ల రేసును 1 గంట 38 నిమిషాల 29.849 సెకన్లలో పూర్తి చేసి టైటిల్ చేజిక్కించుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ వెర్‌స్టాపెన్ 1 గంట 38 నిమిషాల 31.120 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానం దక్కించుకున్నాడు. రేసింగ్ బుల్స్‌కు చెందిన హాడ్జర్ 1 గంట 38 నిమిషాల 33.082 సెకన్లలో లక్ష్యాన్ని చేరి మూడోస్థానంతో కెరీర్‌లో తొలిసారి పోడియంపై నిలిచాడు. 24 రేసుల సీజన్‌లో 15 రేసులు ముగిసేసరికి పియాస్త్రి 309 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. తదుపరి రేసు ఇటాలియన్ గ్రాండ్‌ప్రి 7న జరుగనుంది.

**డచ్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)**

| స్థానం | డ్రైవర్ | జట్టు | ల్యాప్‌లు | సమయం | వ్యత్యాసం | పాయింట్లు |
|---|---|---|---|---|---|---|
| 1 | పియాస్త్రి | మెక్‌లారెన్ | 72 | 1:38:29.849 సెకన్లు | - | 25 |
| 2 | వెర్‌స్టాపెన్ | రెడ్‌బుల్ | 72 | 1:38:31.120 సెకన్లు | 1.271 సెకన్లు | 18 |
| 3 | హాడ్జర్ | రేసింగ్ బుల్స్ | 72 | 1:38:33.082 సెకన్లు | 3.233 సెకన్లు | 15 |
| 4 | రసెల్ | మెర్సిడెస్ | 72 | 1:38:35.503 సెకన్లు | 5.654 సెకన్లు | 12 |
| 5 | అల్బోన్ | విలియమ్స్ రేసింగ్ | 72 | 1:38:36.176 సెకన్లు | 6.327 సెకన్లు | 10 |
| 6 | బేర్‌మన్ | మనీగ్రామ్ టీమ్ | 72 | 1:38:38.893 సెకన్లు | 9.044 సెకన్లు | 8 |
| 7 | లాన్స్ స్ట్రోల్ | ఆస్టన్ మార్టిన్ | 72 | 1:38:39.346 సెకన్లు | 9.497 సెకన్లు | 6 |
| 8 | అలోన్సో | ఆస్టన్ మార్టిన్ | 72 | 1:38:41.558 సెకన్లు | 11.709 సెకన్లు | 4 |
| 9 | సునోడా | రెడ్‌బుల్ | 72 | 1:38:43.446 సెకన్లు | 13.597 సెకన్లు | 2 |
| 10 | ఒకాన్ | మనీగ్రామ్ టీమ్ | 72 | 1:38:43.912 సెకన్లు | 14.063 సెకన్లు | 1 |



ఆదివారం తియాంజిన్ సిటీలోని మీజియాంగ్ కన్వెన్షన్‌సెంటర్‌లో ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సులో గ్రూప్ ఫొటోకు పోజిస్తున్న జిన్‌పింగ్ దంపతులు, మోదీ, పుతిన్, ఎర్డోగన్, షెహబాజ్ షరీఫ్, మొయిజ్జు తదితరులు

# ఈసారి వరి మరింత సాగు

**సగటు సాగు 4.03కోట్ల హెక్టార్లు**

| ఈ దఫా 4.20కోట్ల హెక్టార్లలో వరి నాట్లు | గతేడాది కంటే 29.60లక్షల హెక్టార్లు అధికం | పప్పు ధాన్యాల సాగులో గణనీయ పెరుగుదల |
|---|---|---|

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో ప్రధాన ఆహార పంట వరి ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణానికి మించి సాగైంది. ఖరీఫ్‌లో వరి సాగు సగటు విస్తీర్ణం 4.03 కోట్ల హెక్టార్లుగా ఉండగా, ఈ సీజన్‌లో ఇప్పటివరకు 4.20కోట్ల హెక్టార్లలో సాగైంది. గత ఏడాది ఇదే సమయంలో 3.90 కోట్ల హెక్టార్లలో మాత్రమే వరి సాగయ్యింది. అంటే దాదాపు 8 శాతం పెరుగుదల నమోదయిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వర్షపాతం అనుకూలంగా ఉండటం, కనీస మద్దతు ధర హామీ, ప్రభుత్వ కొనుగోలు విధానాలు రైతుల ఉత్సాహానికి కారణమయ్యాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు. మరోవైపు ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా పెరిగింది. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. ఇప్పటివరకు 10.74కోట్ల హెక్టార్లలో పంటలు వేశారు. ఇది గతేడాది ఇదే సమయంలో ఉన్న 10.38కోట్ల హెక్టార్ల కంటే ఎక్కువ. అంటే మొత్తమ్మీద 3% పెరుగుదలతో 0.35 కోట్ల హెక్టార్ల పెరుగుదల నమోదైంది. పంటల వారీగా చూస్తే వరి, మొక్కజొన్న పంటలు విస్తీర్ణం పెరగ్గా, సోయా, పత్తి సాగు తగ్గుదలను నమోదు చేసుకున్నాయి.

### పెరిగిన మొక్కజొన్న.. తగ్గిన సోయాబీన్

ఈ ఏడాది మొక్కజొన్న సాగు గతేడాదితో పోలిస్తే 12 శాతం పెరిగి 93.34 లక్షల హెక్టార్లకు చేరింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మొక్కజొన్న విస్తీర్ణం పెరుగుదల గణనీయంగా నమోదైంది. తక్కువ పెట్టుబడి ఖర్చులు, వర్షాభావానికి తట్టుకునే లక్షణం, పశుగ్రాసం, స్టార్చ్, బయోఫ్యూయెల్స్ పరిశ్రమల్లో పెరుగుతున్న డిమాండ్ ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొన్నారు. రాగి, ఇతర చిరు ధాన్యాల సాగు కూడా 10% పైగా పెరుగుదల చూపించాయి. అదే సమయంలో సోయాబీన్ సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది 1.24కోట్ల హెక్టార్లలో సాగవగా, ఈసారి 1.20 కోట్ల హెక్టార్లకు మాత్రమే పరిమితమైంది. అంటే 4.77 లక్షల హెక్టార్లలో సాగు తగ్గింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో రైతులు స్థిరమైన ఆదాయం కోసం సోయా నుంచి మొక్కజొన్నకు మారినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు. దీనివల్ల దేశీయ ఆయిల్ సీడ్స్ ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాగా పప్పుధాన్యాల విస్తీర్ణంలో స్వల్ప వృద్ధి కనిపించింది. ఈ ఏడాది 1.12 కోట్ల హెక్టార్లలో సాగవగా, గత ఏడాది ఇది 1.11 కోట్ల హెక్టార్లలో సాగింది. అందులో మినుము 7% పెరిగి 0.21 కోట్ల హెక్టార్లు చేరుకుంది. అయితే కందుల సాగు 2% మేరకు తగ్గింది.



### పత్తి సాగుకు వెనుకడుగు

కీలక వాణిజ్య పంట అయిన పత్తి ఈ సీజన్‌లో క్షీణతను చవిచూసింది. 2024లో 1.11కోట్ల హెక్టార్లలో సాగవగా, ఈసారి 1.08 కోట్ల హెక్టార్లలో మాత్రమే రైతులు వేశారు. అంటే 2.92 లక్షల హెక్టార్లు తగ్గింది. గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. వర్షపాతం లోటు, అధిక ఇన్పుట్ ఖర్చులు, పురుగుల బెడద, అలాగే బియ్యం, మొక్కజొన్న వంటి పంటల నుంచి వచ్చే మెరుగైన ఆదాయం దీనికి కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు. పత్తి తగ్గుదల వల్ల దేశీయ వస్త్ర పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని నిపుణుల అభిప్రాయం.

### నూనెగింజలు తగ్గుదల

నూనెగింజల విస్తీర్ణం మాత్రం తగ్గింది. గతేడాది 1.87 కోట్ల హెక్టార్లలో సాగవగా, ఈసారి అది 1.82కోట్ల హెక్టార్లకు పడిపోయింది. ముఖ్యంగా సోయా 4% తగ్గగా, నువ్వులు 6%, సన్‌ఫ్లవర్ 9% తగ్గుముఖం పట్టాయి. అయితే ఆముదాల సాగు మాత్రం 30% మేర పెరగడం గమనార్హం. అదే సమయంలో చెరుకు సాగు వృద్ధి సాధించింది. గత ఏడాది 0.55 కోట్ల హెక్టార్లలో సాగగా, ఈ సీజన్‌లో అది 0.57 కోట్ల హెక్టార్లకు పెరిగింది. ఖరీఫ్ 2025 గణాంకాలు మిశ్రమ సంకేతాలు ఇస్తున్నాయి. బియ్యం, మొక్కజొన్న విస్తీర్ణం పెరగడం దేశ ఆహార భద్రతకు సానుకూలంగా ఉన్నప్పటికీ సోయా, పత్తి సాగు విస్తీర్ణం తగ్గుదల దేశ ఆర్థిక, పారిశ్రామిక రంగాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో వర్షపాతం, ప్రభుత్వ కొనుగోలు వ్యూహాలు, అంతర్జాతీయ మార్కెట్ ధరలు రైతుల భవిష్యత్ లాభనష్టాలను నిర్ణయించనున్నాయి.

**గణాంకాలు**

ప్రధాన పంటల విస్తీర్ణం - ఈ సీజన్ వర్సెస్ గత ఏడాది (కోట్ల హెక్టార్లు)

| పంట | 2025-26 సీజన్ | 2024-25 సీజన్ | వ్యత్యాసం |
|---|---|---|---|
| వరి | 4.20 | 3.90 | 8% |
| పప్పుధాన్యాలు | 1.12 | 1.11 | 1% |
| మొక్కజొన్న | 0.93 | 0.83 | 12% |
| నూనెగింజలు | 1.82 | 1.87 | -3% |
| పత్తి | 1.08 | 1.11 | -3% |
| చెరుకు | 0.57 | 0.55 | 3% |

## ఇంజన్‌లో మంటలు..

### ఢిల్లీకి తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం

**న్యూఢిల్లీ:** ఎయిరిండియాలో సమస్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం ఇండోర్‌కు బయలుదేరిన విమానంలో మంటలు తలెత్తడంతో ఢిల్లీకి తిరిగొచ్చింది. టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజన్‌లో మంటలు చెలరేగాయని సూచన అందుకున్న పైలట్ వెంటనే విమానాన్ని ఢిల్లీకి మళ్లించారు. ల్యాండింగ్ అనంతరం విమానాన్ని తనిఖీల కోసం నిలిపేశారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో ఇండోర్‌కు తరలించారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని ఎయిరిండియా ప్రకటించింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమ ప్రాధాన్యతని ఎయిర్‌లైన్ తెలిపింది. 'ఇండోర్ వెళ్తున్న ఏ320 నియో విమానం టేకాఫ్ అయిన 30 నిమిషాల తరువాత కుడి ఇంజన్‌లో మంటలు చెలరేగినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే ఒక ఇంజన్‌ను ఆపేసి.. మరో ఇంజన్ సహాయంతో ఢిల్లీ విమానాశ్రమయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఉదయం 6:15 గంటల ప్రాంతంలో విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో విమానంలో 90 మందికి పైగా ఉన్నారు. ఈ సంఘటన గురించి ఎయిర్ సేఫ్టీ రెగ్యులేటర్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)కు సమాచారం అందించాం' అని ప్రకటనలో పేర్కొంది.

## విరిగిపడిన కొండ చరియలు

### ఉత్తరాఖండ్‌లో విద్యుత్ ప్రాజెక్టు సిబ్బందిని రక్షించిన సహాయ సిబ్బంది

**పిథోరాగఢ్:** ఉత్తరాఖండ్‌లో మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. పిథోరాగఢ్ జిల్లాలో ధౌలిగంగ విద్యుత్ ప్రాజెక్టు దగ్గర ప్రమాదం జరిగింది. కొండ చరియలు విరిగి పడటంతో నేషనల్ హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌పీసీ) సాధారణ, అత్యవసర సొరంగాల ప్రవేశ ద్వారాలు మూసుకుపోయాయి. ఎన్‌హెచ్‌పీసీకి చెందిన 19 మంది ఉద్యోగులు విద్యుత్ కేంద్రంలోని చిక్కుకుపోయారు. వెంటనే సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), సరిహద్దు రోడ్ల సంస్థ (బీఆర్‌ఓ) సంయుక్తంగా సహాయక చర్యలు ప్రారంభించాయి. లోపల చిక్కుకున్న అధికారులు, ఉద్యోగులు 19 మందిని సాయంత్రానికి సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. పిథోరాగఢ్ జిల్లాలోని ఈలాగఢ్ ప్రాంతంలో ఈ 280 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు ఉంది. కొండచరియలు విరిగిపడటం వల్ల విద్యుత్ ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం పడలేదు.

## ఎన్‌ఆర్‌ఈజీఎస్ 'అధిక ఖర్చులపై' విచారణకు కేంద్రం ఆదేశాలు

- ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారించాలని రాష్ట్రాలకు సూచన
- ఇప్పటికే తాత్కాలిక విచారణ నివేదికలు సమర్పించిన నాలుగు రాష్ట్రాలు

**సాక్షి, న్యూఢిల్లీ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్)లో 'అధిక ఖర్చు'గా గుర్తించిన పనులపై రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ జరపాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటివరకు జాతీయ స్థాయిలో ఆడిట్లు, ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించిన కేంద్రం, తొలిసారి రాష్ట్రాలే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ చేయాలని సూచించింది. ఈ మేరకు ఏప్రిల్‌లోనే రాష్ట్రాలకు ఒక సలహా జారీ చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, కొన్ని పనుల్లో ఖర్చులు ఎందుకు ఎక్కువయ్యాయనే విషయంపై విశ్లేషణను కూడా పంపింది. దీనిపై సాంకేతిక, పరిపాలనా అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నివేదికలు సమర్పించాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ అంశంపై ఇప్పటికే త్రిపుర, జార్ఖండ్, మిజోరం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు తాత్కాలిక నివేదికలు సమర్పించగా, మిగతా రాష్ట్రాలు స్పందించలేదు. దీంతో జూలై 14, 15 తేదీల్లో జరిగిన 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి పనితీరు సమీక్ష కమిటీ (పీఆర్‌సీ) సమావేశంలో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. నివేదికల సమర్పణలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించిన కేంద్ర అధికారులు, వెంటనే పూర్తి వివరాలతో నివేదికలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు.

**2030 వరకు పథకాన్ని కొనసాగించేలా..**

ప్రతీ ఏడాది సుమారు రూ.1 లక్ష కోట్ల వరకు వ్యయం అయ్యే ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.86 వేల కోట్ల కేటాయింపులు చేసింది. ఇప్పటివరకు ఈ పథకంపై మొత్తం రూ.11.57 లక్షల కోట్ల వ్యయం చేశారు. కాగా 2006లో యూపీఏ-1 ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించగా, 2008–09 నాటికి దేశవ్యాప్తంగా అమలు చేశారు. కరోనా సమయంలో (2020–21) 7.55 కోట్ల గ్రామీణ కుటుంబాలు ఈ పథకంలో పనిచేసి రికార్డు సృష్టించాయి. ఆ తరువాత డిమాండ్ క్రమంగా తగ్గుతూ 2024–25 నాటికి 5.79 కోట్ల కుటుంబాలకు పడిపోయింది. ఇక, ఈ పథకాన్ని 2029–30 వరకు కొనసాగించేందుకు రూ.5.23 లక్షల కోట్ల వ్యయంతో కొత్త ప్రతిపాదనను కేంద్రం వ్యయ ఆర్థిక కమిటీ (ఈఎఫ్‌సీ)కు పంపింది. అయితే.. పశ్చిమ బెంగాల్‌లో 2022 మార్చి నుంచి ఈ పథకం నిలిపివేశారు.

## సెప్టెంబర్‌లోనూ భారీ వర్షాలు

- ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం
- ఐఎండీ డైరెక్టర్ జనరల్ హెచ్చరిక

**న్యూఢిల్లీ:** సెప్టెంబరు నెలలోనూ దేశంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఏటా సెప్టెంబరులో 167.9 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుందని, అయితే ఈ ఏడాది ఈ నెలలో సాధారణం కంటే 109 శాతం అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ వర్షాల వల్ల ఆకస్మిక వరదలు సంభవించి, కొండచరియలు విరిగిపడి జనజీవనం స్తంభించే ముప్పు ఉంటుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్రా హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాల వల్ల ఉత్తరాఖండ్‌లో నదులు ఉప్పొంగి కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలకు దారితీయవచ్చని, దక్షిణ హర్యానా, ఢిల్లీ, ఉత్తర రాజస్థాన్‌లలో సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగిస్తాయని హెచ్చరించారు. 1980 నుంచి ఏటా సెప్టెంబరులో భారత్‌లో వర్షపాతం పెరుగుతోందని ఆయన తెలిపారు. అయితే 1986, 1991, 2001, 2004, 2010, 2015, 2019 సంవత్సరాల్లో సెప్టెంబరు నెలల్లో తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. సెప్టెంబరులో పశ్చిమ మధ్య, వాయవ్య, దక్షిణ భారత్‌లోని చాలా ప్రాంతాల్లో నెలవారీ సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో, సాధారణం కంటే తక్కువ స్థాయిలో ఉండొచ్చని మోహపాత్రా తెలిపారు. ఇక, తూర్పు మధ్య భారత్, తూర్పు, ఈశాన్య, వాయవ్య భారత్‌లోని పలు ప్రాంతాలు, పశ్చిమ తీర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువ స్థాయిల్లో ఉండొచ్చని వెల్లడించారు.

**3నెలలూ సాధారణం కంటే అధిక వర్షపాతం**

'జూన్ 1 నుంచి ఆగస్టు 31 మధ్య దేశంలో 743.1 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది దీర్ఘకాలిక సగటు 700.7 మి.మీ కంటే దాదాపు 6 శాతం ఎక్కువ. జూన్ నెలలో సాధారణం కంటే దాదాపు 9 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూలై నెలలో 294.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే దాదాపు 5 శాతం ఎక్కువ. ఆగస్టులో 268.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 5.2 శాతం ఎక్కువ. ఇప్పటివరకు వర్షాకాలం మూడు నెలల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది' అని మోహపాత్రా వివరించారు.

## ఇరాన్, చైనాలకు ప్రపంచాన్ని మార్చే శక్తి ఉంది: ఖమేనీ

**టెహ్రాన్:** ప్రపంచాన్ని మార్చే శక్తి ఇరాన్, చైనాలకు ఉందని, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరమని ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ అన్నారు. చైనాలోని టియాంజిన్‌లో 25వ వార్షిక షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న నేపథ్యంలో ఖమేనీ ఎక్స్ వేదికగా ఈ ప్రకటన చేశారు. ఇరాన్ కూడా ఈ సమావేశంలో పాల్గొననుంది. భౌగోళిక రాజకీయ అంశాలు, ద్వైపాక్షిక సంబంధాలు, రక్షణ సహకారం వంటి అంశాలను ఆతిథ్య దేశం, ఇతర సభ్య దేశాలతో చర్చించనుంది. 'ఇరాన్, చైనా ఆసియాకు రెండు వైపులా పురాతన నాగరికతలు కలిగిన రెండు దేశాలు. ఈ ప్రాంతంలో, ప్రపంచంలో మార్పు తీసుకురాగలిగే శక్తి వీటికి ఉంది'అని ఖమేనీ పోస్టులో పేర్కొన్నారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన నాటినుంచే ఇరాన్‌పై దృష్టి కేంద్రీకరించారు. ఫిబ్రవరిలోనే ఇరాన్‌పై ఒత్తిడిని పెంచారు. చమురు ఎగుమతులు తగ్గించడం, ఆంక్షల మినహాయింపులను రద్దు చేయడంపై దృష్టి పెట్టారు. అందులో భాగంగానే ఇరాన్ చమురు లేదా పెట్రో కెమికల్ ఉత్పత్తులను కొనుగోలు చేసే దేశాలు, సంస్థలపై ద్వితీయ ఆంక్షలు విధిస్తామని ట్రంప్ మే1న ప్రకటించారు. వీటితో పాటు రష్యాతో వాణిజ్యం చేసే దేశాలపై ట్రంప్ సుంకాలను ప్రకటించిన నేపథ్యంలో ఖమేనీ ఇచ్చిన పిలుపు ప్రాముఖ్యతను సంతరించుకుంది.

## నేటితో రాహుల్ ఓటర్ అధికార్ యాత్ర పూర్తి

**పట్నా:** బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్) పేరిట కేంద్ర ఎన్నికల సంఘం అన్యాయంగా నిజమైన ఓటర్ల ఓట్లను తొలగిస్తోందని, తప్పుల తడకగా ఓటర్ జాబితాను మార్చేసిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మొదలెట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపుకొచ్చింది. బిహార్ వ్యాప్తంగా 110 శాసనసభ నియోజకవర్గాల గుండా 16 రోజులపాటు 1,300 కిలోమీటర్ల పొడవునా సాగిన ఈ యాత్ర సోమవారంతో పూర్తికానుంది. సోమవారం చివరిసారిగా రాహుల్‌గాంధీ, ఆర్జేడీ చీఫ్ తేజస్వీ యాదవ్ పాదయాత్ర చేసి యాత్రను పరిసమాప్తి చేయనున్నారు. ఓట్లను దండుకునేందుకే రాహుల్ యాత్ర మొదలెట్టాడని బీజేపీ విమర్శించడం విదితమే.

## చాట్ జీపీటీ చెప్పిందని తల్లిని చంపాడు

**కనెక్టికట్:** చాట్‌జీపీటీ చెప్పిందని తల్లిని చంపిన ఓ వ్యక్తి, ఆ తరువాత తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అమెరికాలోని కనెక్టికట్‌లో జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రమేయంతో జరిగిన తొలి హత్యగా దీన్ని భావిస్తున్నారు. ఆ వ్యక్తిని 56 ఏళ్ల స్టెయిన్ ఎరిక్ సోయెల్‌బర్గ్‌గా గుర్తించారు. గతంలో యాహూలో మేనేజర్‌గా పనిచేసిన సోయెల్.. ఏఐ చాట్‌బాట్ నిరంతరం మాట్లాడుతూ ఉండేవాడు. దానికి బాబీ అని పేరు పెట్టుకున్నాడు. బాబీతో చేసిన సంభాషణలను యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేవాడు. అప్పటికే మానసిక అనారోగ్యంతో ఉన్న సోయెల్.. తల్లి సుజాన్ ఎబెర్సన్ ఆడమ్స్ తనను చంపేందుకు కుట్ర చేస్తోందని భావించాడు. ఈ విషయంపై ఏఐతో మాట్లాడాడు. అది అతని అనుమానాన్ని పెంచింది. మానసిక అనారోగ్యానికి వాడే మందుల్లో విషం కలిపి ఇవ్వొచ్చని చెప్పింది. దీంతో సోయెల్ తల్లిపై దాడి చేశాడు. తలకు, మెడకు బలమైన గాయాలవ్వడంతో ఆమె మరణించింది. అనంతరం తాను ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మెడ, ఛాతీపై బలమైన గాయాలవ్వడంతో ఆయన చనిపోయాడు. 2.7 మిలియన్ డాలర్ల విలువైన వారి ఇంట్లో ఇద్దరి మృతదేహాలు ఆగస్టు 5న దొరికాయి. పదునైన ఆయుధంతో దాడిచేయడంతోపాటు, తనను తాను కోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు.

## బిహార్‌లో కొత్త ఓటరు గుర్తింపు కార్డులు

**న్యూఢిల్లీ:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పూర్తికాగానే బిహార్‌లోని ఓటర్లందరికీ కొత్త ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేయాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. అయితే.. కొత్త కార్డులను ఎప్పుడు, ఎలా జారీ చేస్తారనే విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. ఓటర్లకు గణన ఫామ్‌లో దరఖాస్తుదారుల తాజా ఫొటోను జత చేయాలని సూచించారు. వాటిని కొత్త ఓటరు కార్డులను జారీకి ఉపయోగించనున్నారు. ఆగస్టు 1న బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. సెప్టెంబర్ 30న తుది జాబితా ప్రచురించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 7.24 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం నవంబర్ 22తో ముగుస్తుంది.

## మైసూరు దసరా 'లౌకిక', 'సాంస్కృతిక' వేడుక

**బాను ముష్తాక్ ఆహ్వానించడాన్ని సమర్థించిన సీఎం సిద్ధరామయ్య**

**మైసూరు:** మైసూరు దసరా వేడుకలను ప్రారంభించడానికి అంతర్జాతీయ బుకర్ బహుమతి గ్రహీత బాను ముష్తాక్‌ను ఆహ్వానించాలనే నిర్ణయాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమర్థించారు. మైసూరు దసరా అన్ని వర్గాలకు లౌకిక, సాంస్కృతిక వేడుకగా ఆయన అభివర్ణించారు. 'దసరా ఒక సాంస్కృతిక వేడుక. రాష్ట్ర పండుగ. దీనిని ఒక నిర్దిష్ట మతానికి చెందిన వ్యక్తులు మాత్రమే ప్రారంభించాలని ఏమీ లేదు. రాష్ట్ర పండుగ అంటే.. హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, బౌద్ధులు, జైనులు అందరికీ పండుగ.' అని ఆయన అన్నారు. 'దసరా వేడుకలపై ఉన్నత స్థాయి కమిటీ నాకు అధికారం ఇచ్చింది. అంతర్జాతీయ బుకర్ బహుమతి గ్రహీత బాను ముష్తాక్ దీనిని ప్రారంభించాలని నేను నిర్ణయించాను. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించేవారు చరిత్ర తెలియని మతతత్వవాదులు. గతంలోనూ ముస్లిం సమాజానికి చెందిన కవి కె.ఎస్. నిస్సార్ అహ్మద్ దసరాను ప్రారంభించారు. హైదర్ అలీ, టిప్పు సుల్తాన్, దివాన్ మీర్జా ఇస్మాయిల్ ఈ పండుగను జరుపుకొన్నారు' అని సిద్ధరామయ్య గుర్తు చేశారు. బీజేపీ కావాలనే ఈ అంశాన్ని రాజకీయం చేస్తోందని ముఖ్యమంత్రి ఆరోపించారు. దసరా వేడుకలను ప్రారంభించడానికి బాను ముష్తాక్‌ను ఆహ్వానించడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ముష్తాక్‌తో బహుమతిని పంచుకున్న అనువాదకురాలు దీపా భస్తిని ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించింది. దీనిపై స్పందించిన సిద్ధరామయ్య.. ఇద్దరు వ్యక్తులు ప్రారంభోత్సవం చేయలేరన్నారు. బాను ముష్తాక్ కన్నడలో రాస్తున్నారంటేనే కన్నడ తాయిని గౌరవించినట్లని స్పష్టం చేశారు.

## టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై కేసు

**రాయ్‌పూర్:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై కేసు నమోదైంది. స్థానికుడు, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకుడు గోపాల్ సమంతో ఫిర్యాదు మేరకు శనివారం మానా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. బీఎన్ఎస్ సెక్షన్లు 196, 197 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసు అధికారులు నిర్ధారించారు. మొయిత్రా వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవని, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని గోపాల్ ఆరోపించారు. 1971లో రాయ్‌పూర్‌లోని మానా క్యాంప్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో బంగ్లాదేశ్ శరణార్థులు స్థిరపడ్డారని, మొయిత్రా ప్రకటన వారిలో భయాన్ని సృష్టించిందని, అలాంటి వ్యాఖ్యలు వారిపై ఇతర వర్గాల నుంచి ఆగ్రహాన్ని రేకెత్తించే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# రాజ్యాంగంలో అస్పృశ్యత నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

## స్థానిక ప్రభుత్వాలు

### మండల పరిషత్

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ మధ్యస్థ అంచె. 1986లో ఎన్టీ రామారావు హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 330 పంచాయతీ సమితిల స్థానంలో 1104 మండలాలను ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌లో సుమారు 15 నుంచి 18 గ్రామ పంచాయతీలు, 35 వేల నుంచి 55 వేల జనాభా ఉంటుంది. మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో తాలుకా పంచాయతీ అని, మధ్యప్రదేశ్‌లో జన్‌పథ్ పంచాయతీ, తమిళనాడులో పంచాయతీ సంఘం, అరుణాచల్ ప్రదేశ్‌లో అంచల్ కమిటీ, ఉత్తరప్రదేశ్‌లో క్షేత్ర పంచాయతీ , ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మండల పరిషత్ అని వ్యవహరిస్తారు.

#### మండల పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఓటర్లతో ప్రత్యక్షంగా ఎన్నికైన సభ్యులు(ఎంపీటీసీ).
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఆ ప్రాంతంలో రిజిస్టర్ అయిన ఎమ్మెల్సీ, రాజ్యసభ మెంబర్ సభ్యులుగా ఉంటారు.
- ఎంపీటీసీ సభ్యులు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఒకరిని కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకుంటారు.
- మండల పరిషత్ సమావేశాలకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. వీరికి ఓటు హక్కు ఉండదు.
- 3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక ప్రాదేశిక నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తారు.
- ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీ కాలం అయిదేళ్లు.
- కలెక్టర్, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు మండల పరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులు. వీరికి ఓటు వేసే అధికారం లేదు.
- ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986 జూన్‌లో ఏర్పాటు చేశారు. 1987 జనవరి 7న నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

#### విధులు

గ్రామ పంచాయతీ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో మండల పరిషత్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం విత్తనాలు, ఎరువుల సరఫరా,నీటి సౌకర్యం కల్పించి బీడు భూములను సాగులోకి తేవడం,అడవుల పెంపకం, పశుగణాభివృద్ధి, ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణ, ప్రసూతి కేంద్రాలు, టీకాలు, అంటు రోగాల నివారణ,ప్రాథమిక విద్యా సౌకర్యాల కల్పన, పర్యవేక్షణ.

#### ఆర్థిక వనరులు

- భూమి శిస్తు, రాష్ట్రం విధించే పన్నులు, ఫీజుల నుంచి వచ్చే వాటా.
- సామాజిక అభివృద్ధికి సంబంధించిన నిధులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అఖిల భారత సంస్థలు ఇచ్చే గ్రాంట్లు.
- మండల పరిషత్ విధించే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం
- దాతలు ఇచ్చే విరాళాలు
- మండల పరిషత్ కార్యనిర్వహణాధికారిగా మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది.

### జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌ను ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. హైదరాబాద్‌కు జిల్లా పరిషత్ లేదు.

#### జిల్లా పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ఓటర్లతో ఎన్నికైన సభ్యులు (జెడ్పీటీసీలు)
- జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు.
- అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు.
- జెడ్పీటీసీ సభ్యుల నుంచి ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ప్రతి జిల్లా పరిషత్‌లో జిల్లా మహాసభ ఉంటుంది. ఇందులో జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు.
- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతడు జిల్లా పరిషత్‌కు పాలనా పరమైన అధికారిగా విధులు నిర్వహిస్తాడు.

#### జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు

1. ప్రణాళికా, ఆర్థిక స్టాండింగ్ కమిటీ
2. గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ
3. వ్యవసాయ స్టాండింగ్ కమిటీ
4. విద్య, వైద్య సేవల స్టాండింగ్ కమిటీ
5. స్త్రీ, సంక్షేమ స్టాండింగ్ కమిటీ
6. సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ
7. పన్నుల స్టాండింగ్ కమిటీ

- ప్రతి స్థాయి కమిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవీరీత్యా సభ్యుడిగా ఉంటాడు. కానీ అతడికి ఓటు వేసే అధికారం ఉండదు. ఇతర సభ్యులను నామినేట్ చేస్తాడు.
- జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాలకు జిల్లా కలెక్టర్ హాజరు కావొచ్చు. కానీ ఓటు హక్కు ఉండదు.

#### జిల్లా పరిషత్ విధులు

- జిల్లా పరిషత్ జిల్లాలోని మండల పరిషత్‌ల వార్షిక బడ్జెట్లను ఆమోదిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను మండల పరిషత్‌లకు పంపిణీ చేస్తుంది.



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల అమలు.
- గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల ఆర్థిక విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమయ్యే గణాంక సమాచారాన్ని అందిస్తుంది.
- జిల్లాలో సెకండరీ పాఠశాలలు, వృత్తి విద్యా పాఠశాలలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుంది.
- జిల్లాలో వైద్య సౌకర్యాల నిర్వహణ.

#### ఆర్థిక వనరులు

1. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు.
2. అఖిల భారత సంస్థలు అందించే గ్రాంట్లు
3. భూమి పన్ను.
4. ఎండోమెంట్స్,ట్రస్టుల ద్వారా వచ్చే ఆదాయం.
5. ఫీజులు.
6. ప్రజలు, సంస్థలు ఇచ్చే విరాళాలు.
7. మండల పరిషత్‌ల నుంచి వచ్చే కంట్రి బ్యూషన్లు.
8. లాభసాటి సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం.

- 243 (జె) అధికరణం ద్వారా పంచాయతీల ఖర్చులను రికార్డ్ చేయడం. ఆడిటింగ్‌కు సంబంధించి తగిన శాసనాన్ని శాసనసభ చేయాలి.
- 243 (జెడ్‌డీ) అధికరణం ప్రకారం జిల్లా ప్రణాళికా అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలి.
- ఎస్సీ, ఎస్టీలు నివసించే ప్రదేశాల్లో పంచాయతీరాజ్ విధానం అమలు కోసం 1994 లో 'దిలీప్‌సింగ్ బురియా' కమిటీని ఏర్పాటు చేశారు.
- దిలీప్‌సింగ్ బురియా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం 1996 డిసెంబర్ 24న ఆమోదించింది.

#### ఈ కమిటీ ప్రతిపాదించిన మూడంచెలు

1. గ్రామసభ
2. గ్రామ పంచాయతీ
3. పంచాయతీ సమితి/ తాలుకా పంచాయతీ.

### మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ పీఠికలోని 'భారత ప్రజలమైన మేము' అనే పదాలు ఏ విషయాన్ని తెలియజేస్తాయి?
ఎ) ప్రజలు స్వార్థపరులు
బి) ప్రజలే సార్వభౌములు
సి) ప్రజలు చేతకాని వారు
డి) ఏదీకాదు
2. సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెబుతూ రాజ్యాంగంలో 'మౌలిక లక్షణాలు' అనే అంశాన్ని స్పష్టీకరించింది?
ఎ) గోలక్‌నాథ్ కేసు
బి) మినర్వా మిల్స్ కేసు
సి) ఇందిరా సహానీ కేసు
డి) కేశవానంద భారతి కేసు
3. భారత రాజ్యాంగం మొదట కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
ఎ) అయిదు బి) ఏడు
సి) ఆరు డి) తొమ్మిది
4. ఏ తరహా ప్రభుత్వ విధానాన్ని భారత రాజ్యాంగం అవలంబించింది?
ఎ) ఏక కేంద్ర ప్రభుత్వం
బి) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
సి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
డి) నియంతృత్వ ప్రభుత్వం
5. రాజ్యాంగంలో అస్పృశ్యత నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
ఎ) 14 బి) 15
సి) 16 డి) 17
6. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించిన ఆర్టికల్?
ఎ) 17 బి) 16 (4)
సి) 18 డి) 18 (2)
7. భారత రాజ్యాంగం పౌరులకు ఎన్ని రకాల స్వేచ్ఛలను కల్పించింది?
ఎ) అయిదు బి) ఏడు
సి) ఆరు డి) ఎనిమిది
8. ప్రస్తుతం ఆస్తి హక్కు 300–ఎ ఆర్టికల్ కింద ఏ హక్కుగా మారింది?
ఎ) రాజకీయ హక్కు బి) ఆర్థిక హక్కు
సి) పౌర హక్కు డి) నైతిక హక్కు
9. 2002లో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యను 21 (ఎ) ఆర్టికల్ కింద చేర్చారు?
ఎ) 80 బి) 81
సి) 87 డి) 86
10. భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా లభించిన పౌరసత్వం?
ఎ) ద్వి పౌరసత్వం బి) ఏక పౌరసత్వం
సి) త్రి పౌరసత్వం డి) ఏదీకాదు
11. భారత రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులు ఎన్ని?
ఎ) 9 బి) 10 సి) 11 డి) 12
12. ఒక వ్యక్తిని 24 గంటలకు మించి కస్టడీలో ఉంచడానికి వీలు లేదని తెలిపే ఆర్టికల్?
ఎ) 20 బి) 21
సి) 22 డి) 23
13. ప్రాథమిక విధులపై పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీ?
ఎ) స్వరణ్‌సింగ్ కమిటీ
బి) సైమన్ కమిటీ
సి) సర్కారియా కమిటీ
డి) వెంకటాచలయ్య కమిటీ
14. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తున్న రాష్ట్రం?
ఎ) సిక్కిం బి) తమిళనాడు
సి) గోవా డి) హర్యానా
15. ఏ ప్రధానమంత్రి హయాంలో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు?
ఎ) రాజీవ్‌గాంధీ బి) ఇందిరాగాంధీ
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
16. ప్రపంచంలో ఆదేశిక సూత్రాలను మొదటిసారిగా ఏ దేశంలో రూపొందించారు?
ఎ) న్యూజిలాండ్ బి) స్పెయిన్
సి) ఐర్లాండ్ డి) రష్యా
17. న్యాయవ్యవస్థ నుంచి కార్యనిర్వాహక వర్గాన్ని వేరు చేయాలని సూచించే ఆర్టికల్?
ఎ) 49 బి) 50
సి) 51 డి) 52
18. ఆదేశిక సూత్రాల ప్రధాన లక్ష్యం 'ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటం' అని పేర్కొన్నది ఎవరు?
ఎ) ఎం.ఎన్.రాయ్
బి) రాజేంద్రప్రసాద్
సి) బి.ఆర్.అంబేద్కర్
డి) హెచ్.జె. లాస్కీ
19. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను ఎన్నో భాగంలో పొందుపర్చారు?
ఎ) 4 బి) 5
సి) 6 డి) 4(ఎ)
20. ప్రపంచంలో మొదటిసారిగా సమాచార స్వేచ్ఛను చట్టం చేసిన దేశం?
ఎ) ఫ్రాన్స్ బి) స్వీడన్
సి) అమెరికా డి) చైనా

#### సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) బి; 5) డి; 6) బి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) సి; 12) సి; 13) ఎ; 14) సి; 15) బి; 16) బి; 17) బి; 18) సి; 19) డి; 20) బి.

# 'రక్షాదక్ష! విపక్ష శిక్షా' ఏ అలంకారం?

**కావ్య సరస్వతికి శోభను చేకూర్చేవి అలంకారాలు. 'అలం' శబ్దానికి 'కృ' ధాతువు చేరి 'అలంకారం' అనే రూపం సిద్ధించింది. అలంకారమంటే భూషణం అని అర్థం. ఇవి కావ్య సౌందర్యాన్ని పెంపొందించి, శోభను కలిగిస్తాయి. అలంకారకులు వీటిని ప్రధానంగా శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని రెండు రకాలుగా విభజించారు. భోజుడు 'సరస్వతీ కంఠాభరణం'లో మూడు విధాలుగా పేర్కొన్నాడు. శబ్ద, అర్థాలంకాలతో పాటు ఉభయాలంకారాలను (శబ్దార్థ మిశ్రమాలు) వివరించాడు. ఆ తర్వాత మమ్మటుడు, రుయ్యకుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు లాంటివారు మిశ్రాలంకారాల గురించి ప్రస్తావించారు.**



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

## అలంకారాలు

అలంకారాల్లో ప్రధానమైనవి శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు.

### శబ్దాలంకారాలు

శబ్ద వైచిత్రీ రామణీయకత వల్ల కావ్యానికి సౌందర్యాన్ని చేకూర్చేవి శబ్దాలంకారాలు. సంగీతానుగుణ్యమైన శ్రవణ పేయతతో పాఠకులకు ఆహ్లాదం కలిగించేవి శబ్దాలంకారాలు. ఇవి ఆరు రకాలు.

1. వృత్త్యనుప్రాసం 2. ఛేకానుప్రాసం
3. లాటాను ప్రాసం 4. యమకం
5. ముక్తపదగ్రస్తం 6. అంత్యానుప్రాసం

1. **వృత్త్యనుప్రాసం:** ఒకటి లేదా రెండు మూడు వర్ణాలు పునరుక్తాలై ఆహ్లాదం కలిగిస్తే అది వృత్త్యనుప్రాసం.
**ఉదా:** 'హరిహరి సిరియురమున గలహరి'
ఇందులో 'ర' కారం పునరుక్తమై ఆహ్లాదం కలిగిస్తోంది. అందువల్ల ఇది వృత్త్యనుప్రాసం.
2. **ఛేకానుప్రాసం:** అర్థ భేదం ఉన్న రెండేసి హల్లులు అవ్యవధానంగా పునరుక్తమై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది ఛేకానుప్రాసం. ఛేకులంటే పండితులు అని అర్థం. ఛేకులకు ఆహ్లాదం కలిగించే అనుప్రాసం ఛేకానుప్రాసం.
**ఉదా:** 'కందర్పదర్పములగు సందర దరహాస రుచులు'. ఈ లక్ష్యంలో దర్ప–దర అనే రెండేసి హల్లులు అర్థభేదంతో పునరుక్తమయ్యాయి. కాబట్టి ఇది ఛేకానుప్రాసం.
3. **లాటాను ప్రాసం:** తాత్పర్య భేదం ఉన్న శబ్దాలు పునరుక్తాలై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది లాటానుప్రాసం.
**ఉదా:** 'కమలాక్షునర్చించు **కరములు కరములు** శ్రీనాథు వర్ణించు **జిహ్వ జిహ్వ**'
'కరములు', 'జిహ్వ' శబ్దాలు తాత్పర్య భేదంతో పునరుక్తాలైనందువల్ల ఇది లాటానుప్రాసం.
4. **యమకం:** సమాన స్వరసహితాలైన వ్యంజనాలు అర్థభేదంతో అవ్యవహితంగా పునరుక్తాలైతే అది యమకం.
**ఉదా:** 'మన **సుభద్ర** మనసు**భద్ర**మయ్యె' సుభద్ర అనే అక్షరాలు అర్థభేదంతో అవ్యవహితంగా వచ్చాయి. కాబట్టి ఇది యమకం.
5. **ముక్తపదగ్రస్తం:** మొదటి పాదం చివరి పదం రెండో పాదంలో మొదటి పదంగా రావడాన్ని ముక్తపదగ్రస్తం అంటారు. అంటే విడిచిన పదాన్ని గ్రహించడం అని అర్థం.
**ఉదా:** 'సుదతీ నూతన **మదనా**
**మదనా** గతురంగ పూర్ణ మణిమయసదనా'
మొదటి పాదం చివర ఉన్న 'మదనా' పదం రెండోపాదం మొదటిపదంగా వచ్చింది. అందువల్ల ఇది ముక్తపదగ్రస్తం.
6. **అంత్యానుప్రాసం:** ప్రతి పాదం చివరన ఒకే అక్షరం లేదా పదం రావడాన్ని అంత్యాను ప్రాసం అంటారు.
**ఉదా:** కమనీయశుభగా**త్రు** – కంజాతదళనే**త్రు**
వసుధాకళ**త్రు** – పావన చరి**త్రు** 'త్రు' అనే అక్షరం పాదాల చివర వచ్చినందువల్ల ఇది అంత్యానుప్రాసం.

### అర్థాలంకారాలు

అర్థ సౌందర్యం వల్ల కావ్య శోభను ద్విగుణీకృతం చేసేవి అర్థాలంకారాలు. అర్థం లేని శబ్ద సౌందర్యం ఆహ్లాదకరం కాదు. అర్థ ప్రధానమైన అలంకారాలు అర్థాలం కారాలు. వీటిలో ప్రధానమైనవి..

1. **ఉపమాలంకారం:** ఉపమాన, ఉపమేయా లకు మనోహరమైన సాదృశ్యాన్ని చెప్పడాన్ని ఉపమాలంకారం అంటారు. ఇందులో ఉపమేయం (ప్రస్తుతం), ఉపమానం (అప్రస్తుతం), సమాన ధర్మం (ఉపమేయ, ఉపమానాల్లో సమానంగా ఉండేది), ఉపమావాచకం (ఉపమేయ, ఉపమానాలకు సమాన ధర్మాన్ని సూచించేది) ఉంటాయి. వలెన్, పోలెన్, ఎంతయున్, కైవడి, భంగి, అట్లు, అనంగ మొదలైనవి ఉపమావాచకాలు. పైన పేర్కొన్న నాలుగు అంశాలుంటే దాన్ని పూర్ణోపమాలంకారం అంటారు. ఏదైనా ఒక అంశం లోపిస్తే దాన్ని లుప్తోపమాలంకారం అంటారు.
భరతుడు ఉపమాలంకారంలో ఐదు భేదాలను చెప్పాడు. మమ్మటుడు లాంటి ఆలంకారకులు 25 భేదాలను పేర్కొన్నారు. దండి 32 భేదాలను చెప్పాడు. చంద్రాలోకకర్త చెప్పిన ఏడు భేదాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.
అలంకారాల్లో ప్రసిద్ధమైంది, ప్రాచీన మైంది ఉపమాలంకారం. దీన్ని ప్రయోగించని కవులు లేరు. కాళిదాసు లాంటి సంస్కృత కవులు విరివిగా ఉపయోగించారు. అందుకే 'ఉపమా కాళిదాసస్య' అనే నానుడి ప్రసిద్ధమైంది.
**లక్ష్యం:**
ఓ కృష్ణా! నీ కీర్తి హంసవలె ఆకాశ
గంగయందు మునుగుచున్నది
ఉపమేయం = కీర్తి, ఉపమానం = హంస,
'ఆకాశగంగయందు మునుగుట' ఉపమేయ ఉపమానాలు రెండింటిలో ఉన్నందువల్ల ఇది సమాన ధర్మం. ఉపమావాచకంలా ఇందులో నాలుగు అంశాలున్నందువల్ల ఇది 'పూర్ణోపమ అలంకారం'.
2. **ఉత్ప్రేక్షాలంకారం:** జాతి, గుణ, ధర్మ సామ్యం వల్ల ఉపమేయాన్ని ఉపమానంగా ఊహిస్తే అది ఉత్ప్రేక్షాలంకారం. ఇందులో ఉపమేయ ఉపమానాలతోపాటు ఉత్ప్రేక్షా వాచకం ఉంటుంది. తలంచెదన్, ఎంచెదన్, భావించెదన్, ఊహించెదన్, అనన్ మొదలైనవి ఉత్ప్రేక్షా వాచకాలు.
**లక్ష్యం:** "ఈ చీకటిని చక్రవాక విరహాగ్ని నుండి పుట్టిన ధూమమో అని తలంతును"
ఇందులో చీకటి ఉపమేయం, ధూమం ఉపమానం. ధూమం నల్లనిది, దృష్టిని ఆపుచేసేది. ఈ గుణసామ్యం వల్ల ఉపమేయమైన చీకటిని ఉపమానమైన ధూమంగా ఊహించారు. కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం.
**రూపకాలంకారం:** ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపించడం లేదా ఉపమేయ ఉపమానాలకు భేదం లేనట్లుగా వర్ణించడం రూపకాలంకారం. ఇందులో రూపక సమాసం కూడా ఉంటుంది.
**లక్ష్యం:** రాజుపై **లతాలలనలు కుసుమాక్షతలు** చల్లిరి. ఇందులో ఉపమేయమైన లతల్లో ఉపమానమైన లలనల ధర్మం ఆరోపించారు. ఉపమేయమైన కుసుమాల్లో ఉపమానమైన అక్షతల ధర్మాన్ని ఆరోపించారు. కాబట్టి ఇది రూపకాలంకారం.
4. **అనన్వయాలంకారం:** ఒక వస్తువు సాటి లేనిది అని చెప్పడానికి అదే వస్తువుతో పోల్చడాన్ని అనన్వయాలంకారం అంటారు. ఇందులో ఉపమేయమే ఉపమానంగా ఉంటుంది.
**లక్ష్యం:**
'మేరునగానికి సాటి మేరునగమే
సముద్రానికి సాటి సముద్రమే'
ఇందులో ఉపమేయమైన మేరునగమే ఉపమానంగా ఉంది. ఉపమేయమైన సముద్రమే ఉపమానంగా ఉంది. అందువల్ల ఇది అనన్వయాలంకారం.
5. **స్వభావోక్తి:** జాతి, గుణక్రియాదులను సహజసిద్ధంగా, మనోహరంగా వర్ణించడాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు.
**లక్ష్యం:** "ఉద్యానవనంలో జింకలు చెవులు రిక్కించి చంచల నేత్రాలతో సరోవరంలో నీళ్లు త్రాగుచున్నవి" ఇందులో జింకల స్థితిని మనోహరంగా, సహజసిద్ధంగా వర్ణించారు. అందువల్ల ఇది స్వభావోక్తి.
6. **అర్థాంతరన్యాసాలంకారం:**
విశేషాన్ని సామాన్యంతో లేదా సామాన్యాన్ని విశేషంతో సమర్థించి వర్ణిస్తే.. అది అర్థాంతరన్యాసాలంకారం.
**లక్ష్యం: 1**
"ఆంజనేయుడు సముద్రాన్ని దాటాడు
మహాత్ములకు అసాధ్యమైంది లేదు కదా!"
ఆంజనేయుడు సముద్రాన్ని దాటడం విశేష విషయం. మహాత్ములకు సాధ్యం కానిది లేదు అనే సామాన్య విషయంతో సమర్థించినందువల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.
**లక్ష్యం: 2**
పూలతో కూడిన నారకు వాసన కలిగినట్లు
సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి.
పూలతో కూడిన నారకు వాసన కలగడం సామాన్య విషయం. సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి అనే విశేష విషయంతో దీన్ని సమర్థించడం వల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.
7. **అతిశయోక్తి అలంకారం:** లోకస్థితిని మించి అతిశయించి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం.
**లక్ష్యం:** ఆ పట్టణమందలి సౌధాలు చంద్ర మండలాన్ని తాకుచున్నవి. సహజస్థితిని మించి వర్ణించడం వల్ల ఇది అతిశయోక్తి.
8. **శ్లేషాలంకారం:** అనేక అర్థాలకు ఆశ్రయ మైంది శ్లేషాలంకారం. చమత్కారమైన పదాల విరుపులతో అనేక అర్థాల వల్ల అహ్లాదం కలిగించేది శ్లేష.
**లక్ష్యం:** 'రాజు కువల యానందకరుడు'
ఇందులో రాజు శబ్దానికి పాలకుడు, చంద్రుడు అని; 'కువలయం' పదానికి భూమి, కలువ అనే అర్థాలున్నాయి. రాజు భూ ప్రజలకు సుపరిపాలనతో ఆనందం కలిగించేవాడని ఒక అర్థం. చంద్రుడు కలువలను వికసింపజేసి ఆనందం కలిగించే వాడని మరో అర్థం ఉన్నందువల్ల ఇది శ్లేషాలంకారం.
9. **సమాసోక్తి అలంకారం:** ప్రస్తుత వర్ణన వల్ల అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి అలంకారం.
**లక్ష్యం:** చంద్రుడు రక్తుడై ఐంద్రీముఖమును ముద్దిడుచున్నాడు. ప్రస్తుత వర్ణన వల్ల పరకాంతా చుంబనాభిలాషియైన కాముకుడు స్ఫురిస్తున్నందువల్ల ఇది సమాసోక్తి అలంకారం.
10. **దీపకాలంకారం:** ఉపమేయ ఉపమా నాలకు (ప్రకృత, అప్రకృతాలకు) సాధారణ ధర్మంతో ఒకే అన్వయాన్ని కలిగిస్తే అది దీపకాలంకారం.
**లక్ష్యం:** "బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం, పండిత వాక్యం వ్యర్థం కాబోవు"
పండిత వాక్యం వ్యర్థం కాదు అనే ఉపమేయంతో బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం లాంటి ఉపమే యాలను అన్వయించి చెప్పారు. అందువల్ల ఇది దీపకాలంకారం.

### మాదిరి ప్రశ్నలు

1. 'రక్షాదక్ష! విపక్ష శిక్షా' ఏ అలంకారం?
1) ఛేకానుప్రాసం 2) వృత్త్యనుప్రాసం
3) లాటానుప్రాసం 4) యమకం
2. 'మన సుభద్ర మనసుభద్రమయ్యె' ఇందులోని అలంకారం?
1) ముక్తపదగ్రస్తం 2) లాటానుప్రాసం
3) యమకం 4) అంత్యానుప్రాసం
3. 'శేషశాయికి మ్రొక్కు శిరముశిరము'లోని అలంకారం?
1) లాటానుప్రాసం 2) యమకం
3) ఛేకానుప్రాసం 4) వృత్త్యనుప్రాసం
4. 'కమనీయ శుభగాత్రు – కంజాత దళనేత్రు వసుధాకళత్రు – పావన చరిత్రు' లోని అలంకారం?
1) వృత్త్యనుప్రాసం 2) లాటానుప్రాసం
3) అంత్యానుప్రాసం 4) యమకం
5. యమకాలంకార లక్షణం?
1) అచ్చులు మారతాయి, హల్లులు మారవు
2) అచ్చులు మారవు, హల్లులు మారవు
3) అచ్చులు మారకూడదు, హల్లులు మారతాయి
4) అచ్చులు మారవచ్చు, హల్లులు మారవచ్చు
6. ఉభయాలంకారాలను మొదటగా పేర్కొన్న లాక్షణికుడు?
1) మమ్మటుడు 2) విశ్వనాథుడు
3) భోజుడు 4) విద్యానాథుడు

#### సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 3; 5) 2; 6) 3.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. విశేషాంశం–సామాన్యం అనే రెండింటితో ప్రవర్తించే అలంకారం?
1) రూపకం 2) వ్యాజస్తుతి
3) ఉత్ప్రేక్ష 4) అర్థాంతరన్యాసం
2. 'రాజ బింబాస్య రుక్మిణి తేజరిల్లె సానబట్టిన మకరాంకు శస్త్రమనగ'లోని అలంకారం?
1) ఉపమ 2) ఉత్ప్రేక్ష
3) రూపకం 4) అర్థాంతరన్యాసం
3. 'కనుల కొలనులో దాగిన నీ రూపం' అనేది?
1) యమకాలంకారం 2) అతిశయోక్తి
3) రూపకాలంకారం 4) ఉత్ప్రేక్ష

సమాధానాలు: 1) 4; 2) 1; 3) 3.

# గణపతి దేవుడికి శైవమతం ఇప్పించిన గురువు?

తెలంగాణలో శైవంతోపాటు వైష్ణవ మతం కూడా అభివృద్ధి చెందింది. కాకతీయులు శైవ మతాన్నే అనుసరించినప్పటికీ వారి రాజచిహ్నాలైన వరాహం, గరుడ.. రెండూ వైష్ణవ చిహ్నాలే. ప్రతాపరుద్రుడి భార్య లకుమాదేవి కరీంనగర్‌లో రామనాథ ఆలయం నిర్మించారు. ప్రజలు వైష్ణవానికి సంబంధించిన వ్రతాలను జరుపుకున్నారు. రామాయణం, మహాభారతం ఎక్కువగా ప్రచారంలోకి వచ్చాయి. భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం, కృష్ణ చరిత్ర, బాలభారతం లాంటి రచనలు చేశారు.

## తెలంగాణలో శైవమతం

### కాలాముఖ శాఖ

తెలంగాణలో మొదట 'కాలాముఖ' శైవం వ్యాప్తిలో ఉంది. వీరు శ్రీశైలాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకున్నారు. కల్యాణి చాళుక్యరాజైన సోమేశ్వరుడు, కాకతీయులు ఈ మతశాఖను ఆదరించారు. ఆ తర్వాత వేములవాడ (కరీంనగర్ జిల్లా), అలంపూర్(మహబూబ్‌నగర్ జిల్లా) ప్రాంతాల్లో కాలాముఖ శైవం విస్తరించింది. ఇక్కడ వీరి మఠాలున్నాయి. వీరి క్షేత్రాల్లో 'సింహపరిషత్', 'శక్తి పరిషత్'లను ఏర్పాటు చేసి విద్య నేర్పించేవారు. వీటిని వీరశైవుల అనుభవ మండపాలు, గోళకీ మఠస్థుల విద్యా మండపాలతో పోల్చవచ్చు. వీరు మఠాలతో పాటు సత్రాలను కూడా నెలకొల్పి చదువులు చెప్పారు. అన్నదానం చేశారు. వీరి పాండిత్యం, తపఃసిద్ధి కాకతీయులను ఆకర్షించింది. వీరు కాకతీయ రాజులకు గురువులుగా శైవదీక్షలను ఇచ్చారు. శ్రీశైలంలోని మల్లికార్జున మఠాధిపతి రామేశ్వర పండితులు.. బేతరాజు దుగ్గరాజు, రెండో ప్రోలరాజుకు శివదీక్ష ఇచ్చారు. కాలాముఖాచార్యులు కూడా అనేక మందికి శివదీక్ష ఇచ్చారు. కాకతీయులు మొదట జైన మతాన్ని అనుసరించారని ప్రతీతి. ఆ తర్వాత కాలాముఖ శైవమతాన్ని ఆదరించారు.

ప్రతి కాలాముఖ మఠం ఒక గొప్ప విద్యాకేంద్రంగా వర్ధిల్లింది. ఇందులో తర్కం, వ్యాకరణం, జ్యోతిషం, మీమాంస శాస్త్రాలను బోధించేవారు. అలంపూర్‌లో 'బ్రహ్మపురి' అనే ఘటిక (వైదిక పాఠశాల) ఉన్నట్లు అక్కడ వేయించిన శాసనం ద్వారా తెలుస్తోంది. ఇది కాలాముఖ శాఖకు చెందిన ఘటికగా నిర్ధారించారు. ఈ శాసనంలో 'ఘటిక అధిపతి' అనే అర్థంతో 'గదాశశి' పదాన్ని ఉపయోగించారు. 1119 కాలం నాటి పేరూర్ శాసనంలో ప్రజలందరూ సమావేశమై చదువుకునే వారని, ప్రతి పిల్లవాడికి హెర్జుంక (నాణెం) చొప్పున దానం చేయాలని, ఆ ధనాన్ని కుప్పన భట్టోపాధ్యాయునికి



చెల్లించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు.

ఘటికలో 14 రకాల విద్యలు నేర్పేవారు. వీటిలో వేద వేదాంగాలు, ధర్మసూత్రాలు, న్యాయ, వైశేషికాలు, పురాణాలు ముఖ్యమైనవి. ఈ కాలానికి చెందిన పండితులందరూ చతుర్థ కులస్థులు (శూద్రులు)గా తెలుస్తోంది. కల్యాణి చాళుక్య రాజైన మూడో సోమేశ్వరుడు, కాకతీరుద్రుడు రాజనీతి గ్రంథాలు రాశారు. బద్వేల్ ప్రాంతానికి చెందిన కాకతీయ సామంతుడు బద్దెన కూడా రాజనీతి గ్రంథం, సుమతీ శతకం రాశాడు. గోన బుద్ధారెడ్డి, భాస్కరుడు, నన్నెచోడుడు మొదలైన వారందరూ చతుర్థ కులస్థులేనని తెలుస్తోంది. భీమయ పాండ్య 'మార్గదేశి' కవితలు రాశాడు. కాలాముఖులు తెలంగాణా ప్రాంతంలో అనేక చోట్ల 'బ్రహ్మపురి' పేరుతో ఘటికలు నడిపినట్లుగా ఆధారాలున్నాయి.

కర్ణాటకలో కల్యాణి చాళుక్యుల పతనం తర్వాత కాలాముఖ శైవం ప్రాభవం కోల్పోయింది. దీని స్థానంలో బసవేశ్వరుడు వీరశైవాన్ని అభివృద్ధి చేశాడు. తెలంగాణలో కాకతీయులు బలపడిన తర్వాత గణపతి దేవుడి కాలం నుంచి 'గోళకీ మఠం' ప్రాచుర్యంలోకి వచ్చింది. 13వ శతాబ్దంలో కాలాముఖ మతం క్షీణించింది.

## పాశుపత శైవం

గణపతి దేవుడి కాలంలో పాశుపతం ప్రాచుర్యంలోకి వచ్చింది. దాహాల దేశానికి చెందిన గోళకీ మఠ శైవాచార్యులు కాకతీయుల కాలంలో పాశుపత శైవం (శైవ మతంలోని ప్రాచీన శాఖ) వ్యాప్తికి పాటుపడ్డారు. ఈ మఠాధిపతి 'విశ్వేశ్వర శంభు' మొదట గణపతి దేవుడికి శివదీక్ష ఇచ్చారు. ఆ తర్వాత రుద్రమదేవి, రెండో ప్రతాపరుద్రుడు కూడా ఈయన ద్వారా శివదీక్ష తీసుకున్నారు. కాకతీయుల ఆదరణతో విశ్వేశ్వరుడు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో గోళకీ మఠాలు స్థాపించాడు. అనేక శివాలయాలు నిర్మించాడు. వీటికి అనుబంధంగా విద్యాలయాలు, సత్రాలను ఏర్పాటు చేసి పాశుపత మతాన్ని ప్రచారం చేశాడు. ఏలేశ్వరం (నల్గొండ), వేములవాడ (కరీంనగర్), కాళేశ్వరం (కరీంనగర్), శ్రీశైలం (కర్నూలు), భట్టిప్రోలు (గుంటూరు) తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

**గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం**

**జనరల్ స్టడీస్**

**తెలంగాణ హిస్టరీ**

రుద్రమదేవి వేయించిన 'మల్కాపురం' శాసనంలో గోళకీ మఠాల చరిత్ర, ఏడు తరాల పీఠాధిపతుల గురించి పేర్కొన్నారు.

**గోళకీ మఠ చరిత్ర:** 'మల్కాపురం' శాసనం ప్రకారం గోళకీ మఠాధిపతులు భగీరథి, నర్మదా నదుల మధ్య ఉన్న దాహాల దేశానికి చెందినవారు. ఈ వంశానికి చెందిన సద్భావన శంభు 'శైవ సిద్ధాంతాన్ని' ప్రతిపాదించి గోళకీ మఠాన్ని స్థాపించాడు. ఇతడికి కాలాచూరి యువరాజు 'దేవుడు' మూడు లక్షల గ్రామాలున్న ఒక రాష్ట్రాన్ని బహూకరించాడు. సద్భావన శంభు గోళకీ వంశస్థుడనీ, భిక్షు మఠ సంతతికి చెందినవాడని శాసనాల ద్వారా తెలుస్తోంది. అందువల్ల ఈ మఠానికి 'గోళకీ మఠం'గా పేరు వచ్చింది. సోమ శంభు, నామ శంభు, ధర్మ శంభు అనేవారు గురువులుగా మారారు. ధర్మ శంభు కుమారుడే విశ్వేశ్వరశంభు. ఇతడు గొప్ప వేద పండితుడు. ఈ గురువులందరూ లక్ష గ్రామాలను భిక్షగా పొందిన గురువుల వారసులుగా ప్రసిద్ధి చెందారు. వీరు కాకతీయులతో పాటు చేది (ఒడిశా), మాళ్వా (మధ్యప్రదేశ్), చోళ (తమిళనాడు) వంశ రాజులకు కూడా రాజగురువులుగా ఉన్నట్లు ఆధారాలున్నాయి.

గణపతి దేవుడి కుమార్తె రుద్రమదేవి 1261 మార్చి 25న విశ్వేశ్వర శంభుకు గుంటూరు జిల్లాలోని మందడంతో పాటు కృష్ణలంకను దానం చేసి మల్కాపురం శాసనం వేయించారు. అక్కడ విశ్వేశ్వర శంభు శుద్ధ శైవ మఠం స్థాపించి శివాలయాన్ని నిర్మించాడు. దీనికి అనుబంధంగా వేద శాస్త్ర ఆగమ విద్యాలయం, సత్రం, ప్రసూతి వైద్యశాల (దేశంలోనే తొలి ప్రసూతి వైద్యకేంద్రం)ను ఏర్పాటు చేశాడు. ఇతడు గొప్ప ప్రజ్ఞాశాలి అని, పాశుపత శాఖకు చెందినవాడని 'త్రిపురాంతక శాసనం'లో పేర్కొన్నారు. ఈ మఠానికి చెందిన శైవాచార్యులు గొప్ప పండితులనీ, పవిత్ర జీవితం గడిపేవారనీ ఈ శాసనం ద్వారా తెలుస్తోంది.

**గోళకీ మఠ శాఖలు:** కాళేశ్వరం, త్రిపురాంతకం, శ్రీశైలం, వేములవాడ, ఏలేశ్వరం మొదలైన ప్రదేశాల్లో గోళకీ మఠ శాఖలు ఉండేవి. వీటి పోషణకు కాకతీయులు 'పొన్న' గ్రామాన్ని దానం చేశారు. గణపతి దేవుడు విశ్వేశ్వర శంభుకు గురుదక్షిణగా 'తాండ్రకోట' గ్రామాన్ని ఇచ్చాడు. కాకతీయుల పతనానంతరం తెలంగాణ తురుష్కుల వశమైంది. దీంతో గోళకీ మఠాలు పోషణకర్తలు లేక అంతరించి పోయాయి.

## ఆరాధ్యశైవం

పాశుపతంతోపాటు కాకతీయుల కాలంలో తెలంగాణలో ఆరాధ్యశైవం కూడా ప్రాచుర్యంలో ఉంది. ఈ మతం అతి ప్రాచీన కాలం నుంచే ప్రచారంలో ఉన్నట్లు ఆరాధ్య శైవుల నమ్మకం. ఈ మత స్థాపకులుగా ద్వాదశాచార్యులను పేర్కొంటారు.

### ద్వాదశాచార్యులు:

**సిద్ధత్రయం:** మరళ, ఏకోరామ, రేవణను 'సిద్ధత్రయం' అని పిలుస్తారు.

**ఆరాధ్యత్రయం:** ఉద్దటారాధ్య, వేమారాధ్య, విశ్వ ఆరాధ్య అనే ముగ్గుర్ని 'ఆరాధ్య త్రయం'గా పేర్కొంటారు.**ఆచార్యత్రయం:** నీలకంఠ, హరదత్త, భాస్కరాచార్యను 'ఆచార్యత్రయం' అంటారు.

**పండితత్రయం:** శ్రీపతి పండితుడు, మల్లికార్జున పండితుడు, మంచెన పండితుడు 'పండిత త్రయం'గా ప్రసిద్ధి.పైన పేర్కొన్న 12 మంది 'ద్వాదశ ఆచార్యులు' అని, ఆరాధ్య శైవాన్ని వీరే అభివృద్ధి చేశారని ఆరాధ్యశైవుల నమ్మకం.

## వీరశైవం

వీరశైవాన్ని కన్నడ దేశంలో బసవేశ్వరుడు స్థాపించాడు. గణపతి దేవుడు వీరశైవులను అదుపులో పెట్టాడు. ప్రతాపరుద్రుడి కాలంలో ఇది కొద్దిగా ప్రాచుర్యం పొందింది. దీనికి కారణం ప్రతాపరుద్రుడి మంత్రి ఇందులూరి అన్నయ. ఇతడు వరంగల్‌లోని పాలకుర్తి గ్రామానికి చెందినవాడిగా తెలుస్తోంది.

వీరశైవులు అవైదికులు. అంటే కర్మకాండలు, వర్ణ వ్యవస్థ, ఉపనయనం, బ్రాహ్మణ ఆధిక్యత లాంటివాటిని అంగీకరించరు. కానీ పండితారాధ్యుడు భక్తితోపాటు బ్రాహ్మణాన్ని అంగీకరించాడు. ఇతడు 'భక్తి మీద వలపు, బ్రాహ్మణ్యంబుతో పొత్తు వదలలేను బసవలింగా' అని చెప్పుకున్నాడు. పండితారాధ్యుడు శైవ మతాన్ని వీరశైవానికి భిన్నంగా తీర్చిదిద్దాడు. కాబట్టి దీన్ని 'స్మార్త శైవం'గా పేర్కొంటారు. బసవేశ్వరుని వీరశైవ మతాన్ని జంగాలు, సాలె, వీరబలిజ కులస్థులు ఆదరించారు.

## స్మార్తశైవం

రామానుజాచార్యులు, బ్రహ్మనాయుడు వల్ల తెలంగాణలో వైష్ణవ మతం అభివృద్ధి చెందిన తర్వాత శైవ, వైష్ణవుల మధ్య సంఘర్షణ ఏర్పడింది. కానీ తిక్కన సోమయాజీ హరిహరనాథుని ఆరాధనను ప్రచారం చేసి మతసామరస్యానికి పాటుపడటం వల్ల వీరి మధ్య వైషమ్యాలు తగ్గి అద్వైత సిద్ధాంతం, స్మార్త విధానం ప్రాచుర్యంలోకి వచ్చాయి.కాలక్రమంలో బసవేశ్వరుడి వీరశైవం, బ్రహ్మనాయుడి వీరవైష్ణం, పండితారాధ్యుడి వీర శైవ (స్మార్త) ఉద్యమం.. మూడూ పూర్తిగా అంతరించాయి. ఈ ఉద్యమాల పర్యవసానాన్ని గ్రహించిన గణపతిదేవుడు వీరశైవులనుగానీ, వీర వైష్ణవులనుగానీ ప్రత్యేకంగా ఆదరించలేదు. దీంతో తెలంగాణలో మతసామరస్యం నెలకొంది. ప్రజలు అన్ని మతాలను ఆదరిస్తూ, అన్ని క్షేత్రాలను దర్శించారు. అలంపురం, కొల్లాపురం, వేములవాడ, కొలనుపాక, హన్మకొండ గొప్ప పుణ్యక్షేత్రాలుగా వర్ధిల్లాయి. ఈ క్షేత్రాలను లక్షలాది భక్తులు దర్శించేవారు.

## జైనమత పతనం..

తెలంగాణలో జైనమతం పతనం కావడానికి అనేక కారణాలున్నాయి. శైవులతో వీరికి వైషమ్యాలు పెరిగాయి. 'కాలముఖులు' కాళేశ్వరాన్ని కేంద్రంగా చేసుకున్నారు. శైవులు జైనులతో వాదన చేసి వారిని ఓడించారు. తమ మహిమలతో శైవులు సామాన్య ప్రజలను ఆకర్షించారు. వీరశైవ స్థాపకుడైన బసవేశ్వరుడు జైనమతాన్ని బాగా దెబ్బతీశాడు. జైన, శైవ సంఘర్షణల వల్ల జైనులు పతనమయ్యారు. ఈ సంఘర్షణ ఎక్కువగా కాకతీయుల కాలంలోనే జరిగింది. దేవదాసయ్య అనే శైవ నాయకుడు తన మహిమలతో పొట్ల చెరువు (పటాన్ చెరువు)లో 500 జైన కేంద్రాలను నాశనం చేసినట్లుగా కథనం ప్రచారంలో ఉంది. కాకతీయ రాజైన 'గణపతిదేవుడు' అనేక జైనపండితులను శిక్షించి వారి గ్రామాలను తగులబెట్టినట్లు గద్వాలలోని పూడూరు శాసనంలో పేర్కొన్నారు.

**జైన శిల్పకళ:** జైనమతం వాస్తుకళాభివృద్ధిలో ప్రముఖపాత్ర పోషించింది. వాస్తు, శిల్ప కళలకు సంబంధించి జైనమతం తెలంగాణ ప్రజలకు అమోఘమైన సేవలందించింది.

**జైనమత ప్రాధాన్యం:** భారత ప్రభుత్వం జైనమతానికి మైనార్టీ హోదా కల్పించింది. ప్రస్తుతం దేశంలో మైనార్టీ గుర్తింపు పొందిన మతాలు ఆరు ఉన్నాయి. అవి.. ఇస్లాం, క్రైస్తవం, పార్శీ, సిక్కు, బౌద్ధం, జైనం. జైనమతం రాకతో సామాన్యులందరికీ విద్యావకాశాలు లభించాయి. వీరి ఆరాధ్య విద్యాదేవతనే హిందువులు సరస్వతీదేవిగా పూజిస్తున్నారు. అంటే విద్యాదేవతను గుర్తించింది మొదట జైనులేనని గమనించవచ్చు. ప్రతి సమావేశంలో దీపారాధన లేదా జ్యోతి ప్రజ్వలన చేయడం వీరి ఆచారం. ఇప్పటికీ భారతీయ సమాజంలో ఈ విధానం సజీవంగానే ఉంది. ప్రస్తుతం దీన్ని అనేక దేశాల్లో చూడవచ్చు.

జైనులు విదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించడం ద్వారా వైశ్యులను తమవైపు తిప్పుకున్నారు. జంతు బలులు, జీవహింసను నిషేధించారు. శూద్రులకు యజ్ఞయాగాదులు నిష్ప్రయోజనం అని చెప్పారు. బ్రాహ్మణులకు వ్యతిరేకులయ్యారు.

### మాదిరి ప్రశ్నలు

1. కింద పేర్కొన్నవారిలో 'ఆరాధ్యత్రయం' లోని వారెవరు?
   1. ఉద్దట 2. వేమా
   3. విశ్వ 4. హరదత్త
   ఎ) 1, 2, 3 బి) 1, 3, 4
   సి) 2, 3, 4 డి) 3, 4
2. హరిహరనాథుని ఆరాధనను ప్రచారం చేసి మతసామరస్యానికి పాటుపడ్డవారెవరు?
   ఎ) తిక్కన సోమయాజీ
   బి) బసవేశ్వరుడు
   సి) బ్రహ్మనాయుడు
   డి) పాల్కురికి సోమనాథుడు
3. కిందివాటిలో సరైన జత ఏది?
   1. లకులీస – శైవమత స్థాపకుడు
   2. కౌండిన్య – పాంచరాత్ర స్థాపకుడు
   3. బ్రహ్మనాయుడు – వీరవైష్ణవ స్థాపకుడు
   ఎ) 1 మాత్రమే బి) 1, 2
   సి) 1, 3 డి) 1, 2, 3
4. గణపతి దేవుడికి శైవమతం ఇప్పించిన గురువు?
   ఎ) గంగభట్టు బి) విశ్వేశ్వర శంభు
   సి) మల్లికార్జునుడు
   డి) పైన పేర్కొన్న వారందరూ

**సమాధానాలు**

1) ఎ; 2) ఎ; 3) డి; 4) బి.

# A minor is admitted to the partnership firm as?

## Model Questions

1. The payment of a lost demand draft is made to the ______?
   a) Purchaser b) Payee
   c) Nominee d) Any of the above
   e) None of these
2. In the case of granting loan against a life insurance policy, the banker should see ______?
   a) The existence of insurable interest
   b) The surrender value
   c) The admission of age
   d) All of the above
   e) None of the above
3. When a debtor owes several debts to a banker and makes a payment, the right to appropriation lies with ______?
   a) The banker b) The debtor
   c) The court
   d) All of the above
   e) None of the above
4. In terms of Section 31 of the Reserve Bank of India Act, 1934 a demand draft payable to bearer may be issued only by ______?
   a) Nationalized Banks
   b) Scheduled Commercial Banks
   c) Reserve Bank of India
   d) Foreign Banks
   e) None of the Above
5. Unsigned demand draft is presented for payment, the drawee branch will ______?
   a) Honour it
   b) Dishonour it since it does not have a mandate of the drawer bank to pay it.
   c) Honour it after seeking confirmation from the collecting bank
   d) Honour it if it is for small amount
   e) None of the above
6. When was SBI established?
   a) 1st April 1935
   b) 31st July 1969
   c) 5th May 1955
   d) 1st July 1955
   e) None of the above
7. The maximum number of partners in a non-banking partnership firm is ______?
   a) 20 b) 10 c) 25 d) 11
   e) None of the above
8. Which of the following agencies /organizations has recently decided that all the Stock Exchanges would introduce physical settlement of Equity Derivatives?
   a) Reserve Bank of India
   b) Bombay Stock Exchange
   c) Registrar of Companies
   d) Securities & Exchange Board of India
   e) All of the above
9. How much bad loans was accumulated with the public sector banks as on 31st March 2015 as disclosed by the Finance Ministry on 21st July 2015?
   a) Rs. 2.76 lakh crore
   b) Rs. 2.54 lakh crore
   c) Rs. 2.67 lakh crore
   d) Rs. 2.27 lakh crore
   e) None of the above
10. In Mutual Funds, NAV is the price of ______?
    a) Entire fund value
    b) One unit of a fund
    c) Surrender value
    d) Average value of shares
    e) Dividends paid in a year
11. Presently which Indian Bank has the largest number of foreign branches?
    a) SBI
    b) Canara Bank
    c) Bank of Baroda
    d) Bank of India
    e) None of the above
12. Cash deposit ratio means____?
    a) The percentage of cash-in-hand-balance with the Central Bank to the aggregate deposits
    b) The percentage of total deposits received by Banks
    c) The percentage of total cash money received as deposits by banks
    d) All the above
    e) None of the above
13. Central Government has appointed Sriram Kalyanaraman as the Managing Director (MD) and Chief Executive Officer (CEO) of which of the following organisations:
    a) NABARD
    b) National Housing Bank (NHB)
    c) I.F.C d) IDRBT e) B.I.R.D
14. In case of a usance bill a grace period of........ Will be allowed to calculate due date of payment.
    a) 3 days b) 2 days
    c) 1 day d) 4 days
    e) None of the above
15. In the case of FCNR accounts the payment of interest is effected in ____?
    a) Indian Rupee
    b) Only in Pound (£)
    c) Same currency in which deposit stands
    d) Yen
    e) None
16. Working capital requirement depends upon ______?
    a) Level of activity
    b) Types of business carried
    c) Nature of Production cycle
    d) All the above
    e) None
17. In which of the Acts, specimen of the cheque, bill, promissory note is given?
    a) Negotiable Instruments Act
    b) Banking Regulation Act
    c) Mercantile Law
    d) All of the above e) None
18. RBI permitted CBS-enabled Co-operative Banks to issue ATM cards in tie-up with:
    a) State Bank of India
    b) Any Nationalised Bank
    c) a sponsor bank.
    d) NABARD e) b &c
19. Who headed the RBI panel that has submitted its report titled 'Data Format for Furnishing of Credit Information to Credit Information Companies'.
    a) Urjit Patel b) A.K.Sharma
    c) Aditya Puri d) R.Gandhi
    e) None of these



**BANK EXAMS**

**BANKING AWARENESS**

20. India's first post office savings bank ATM facility has been recently inaugurated in which of the following places?
    a) Chennai
    b) Bengaluru
    c) Mumbai
    d) Delhi
    e) None of these
21. The main function of an Asset Management Company is to:
    a) hold the securities of various schemes
    b) manage the funds by making investments in various types of securities
    c) hold its property for the benefit of the unit holders
    d) act on behalf of SEBI
    e) All the above
22. Which country on 30 June 2015 became the first-ever developed economy to default on a loan with the International Monetary Fund (IMF)?
    a) Afganisthan b) Australia
    c) Bangaladesh d) Greece
    e) Canada
23. The minimum period under which a term deposit under Reinvestment Plan can be issued is____?
    a) 24 months
    b) 12 months
    c) 6 months
    d) 9 months
    e) None
24. A minor is admitted to the partnership firm as ______?
    a) Agent
    b) Partner
    c) Minor
    d) Beneficiary
    e) None
25. Which bank on 4th July 2015 became the first in the country to launch the MUDRA Card, under the Pradhan Mantri MUDRA Yojana (PMMY) scheme?
    a) Andhra Bank
    b) Bank of Baroda
    c) Central Bank
    d) Corporation Bank
    e) Union Bank of India
26. Who was named as the first Chairman of the to be opened Bandhan Bank, which announced its Board of Directors on 9th July 2015?
    a) Ashok K. Lahiri
    b) Subir Gokaran
    c) S.S.Mundra
    d) Pratik Choudhary
    e) T.S.Vijayan
27. What is the limitation of the number of persons in a joint savings bank account?
    a) Two b) Four c) Five
    d) Twenty e) No limit
28. After acceptance of a bill, the primary liability on a Bill of Exchange is that of ______?
    a) Payee
    b) Acceptor
    c) Drawee
    d) Endorsee
    e) All of the above
29. The full form of SREP used in Basel framework is :
    a) Standard Review and Evaluation Process
    b) Supervisory Review and evaluation Process
    c) Standardised Revision and Evaluation Practice
    d) Supervisory Review and Electronic Process e) None
30. In order to enable private sector banks to attract and retain professional directors, the Reserve Bank has issued guidelines on compensation for non-executive Directors for implementation by private sector banks, that will reflect market realities and will be within the parameters specified in the:
    a) Banking Regulation Act, 1949
    b) The Indian Companies Act, 2013 (Amended)
    c) RBI Act 1934
    d) As per the directives of Indian Banks Association
    e) Both a&b
31. An executor of deceased account is appointed under ______?
    a) Trust b) Court c) Will
    d) Family tradition
    e) None of the above
32. Relationship between the RBI and the bank maintaining currency chest will be of ______?
    a) Trustee and beneficiary
    b) Principal and agent
    c) Licensor and licensee
    d) Creditor and debtor
    e) None of the above
33. The Reserve Bank has advised all public sector banks and select private sector and foreign banks to appoint an internal Ombudsman. The internal Ombudsman would be designated as ______:
    a) Chief Ombudsman Service Officer
    b) Chief Customer Ombudsman Officer
    c) Internal Ombudsman Customer Service Officer
    d) Chief Customer Service Officer
    e) Chief Transaction Audit Officer

### Answers

1) a; 2) d; 3) b; 4) c; 5) b; 6) d; 7) a; 8) d; 9) c; 10) b; 11) a; 12) a; 13) b; 14) a; 15) c; 16) d; 17) e; 18) c; 19) c; 20) a; 21) b; 22) d; 23) c; 24) d; 25) d; 26) a; 27) e; 28) b; 29) b; 30) e; 31) c; 32) b; 33) d.